గురువారం 7-11-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 226

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



రిత్విక్ జోడీ సంచలనం

మోజెల్లి ఓపెన్ ఏటీపీ టోర్నీ క్వార్టర్స్‌లో టాప్ సీడ్ జంటపై గెలుపు

-16లో



మార్కెట్ 'ట్రంపె'ట్!

ఫార్మా, ఐటీ షేర్లకు భారీ డిమాండ్. సెన్సెక్స్ 901 పాయింట్లు ప్లస్

-17లో

ట్రంప్ 2.0

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయభేరి

దేశ 47వ అధ్యక్షుడిగా ఎన్నిక.. హారిస్‌పై ఘనవిజయం

రిపబ్లికన్ పార్టీ	డెమొక్రటిక్ పార్టీ
292	223

స్వింగ్ స్టేట్స్ అన్నీ ట్రంప్ పరమే

జనవరి 6న అధికారిక ప్రకటన

20వ తేదీన ప్రమాణస్వీకారం

స్వర్ణయుగం తెస్తా: ట్రంప్



ఫ్లోరిడాలో నిర్వహించిన విజయోత్సవంలో అభివాదం చేస్తున్న డొనాల్డ్ ట్రంప్. చిత్రంలో ఆయన భార్య మెలానియా ట్రంప్.

వాషింగ్టన్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ దుమ్ము రేపారు. హోరాహోరీ పోరు తదితర విశ్లేషణలన్నింటినీ తోసిరాజంటూ డెమొక్రాట్ల అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై ఘనవిజయం సాధించారు. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి వెల్లడైన ఫలితాల్లో విజయానికి కావాల్సిన 270 ఎలక్టోరల్ కాలేజీ ఓట్ల మార్కును ట్రంప్ అలవోకగా దాటేశారు. తద్వారా నాలుగేళ్ల విరామం తర్వాత రెండోసారి అధ్యక్ష పీఠాన్ని చేజిక్కించుకున్నారు. గ్రోవర్ క్లీవ్‌లాండ్ తర్వాత అమెరికా చరిత్రలో ఈ ఘనత సాధించిన ఏకైక నేతగా నిలిచారు. ఆ క్రమంలో పలు ఇతర రికార్డులూ సొంతం చేసుకున్నారు. అత్యంత ఎక్కువ వయసులో అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన వ్యక్తిగా కూడా 78 ఏళ్ల ట్రంప్ నిలిచారు. క్రిమినల్ అభియోగాల్లో దోషిగా తేలిన ఏకైక మాజీ అధ్యక్షునిగా ట్రంప్ ఇప్పటికే చెత్త రికార్డును మూటగట్టుకోవడం తెలిసిందే. తాజా విజయంతో అలాంటి చరిత్రతో అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గిన తొలి నేతగా కూడా నిలిచారు. పైగా పాపులర్ ఓటు కూడా గెలుచుకోవడంతో ట్రంప్ విజయానికి పరిపూర్ణత చేకూరినట్టయింది. 2016లో ట్రంప్ తొలిసారి అధ్యక్షునిగా నెగ్గినప్పుడు ఆయన కంటే ప్రత్యర్థి హిల్లరీ క్లింటన్‌కు 28 లక్షల ఓట్లు ఎక్కువగా రావడం తెలిసిందే. ఈసారి మాత్రం దేశవ్యాప్తంగా పోలైన ఓట్లలో ట్రంప్ ఇప్పటికే హారిస్ కంటే ఏకంగా 50 లక్షలకు పై చిలుకు ఓట్ల మెజారిటీ సాధించారు. 20 ఏళ్ల తర్వాత ఈ ఘనత సాధించిన

మిగతా 2వ పేజీలో ▶

1
2
3
4

5 ట్రంప్.. విజయానికి 5 మెట్లు



హారిస్.. ఐదు వైఫల్యాలు

ఉపాధ్యక్షుడు తెలుగువారి అల్లుడే



ఆయన భార్య ఉషకు తూ.గో. జిల్లాతో అనుబంధం

- వివరాలు 6,7,8 పేజీల్లో ▶


రాజ్యాంగ సంస్థలు పరిధి దాటొద్దు

స్పీకర్ పరిధిలోని అంశాల్లో న్యాయ సమీక్ష సాధ్యం కాదు

'అనర్హత'పై హైకోర్టులో ఫిరాయింపు ఎమ్మెల్యేల వాదనలు

తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: చట్టసభలు, న్యాయస్థానాల లాంటి రాజ్యాంగ సంస్థలు తమ పరిధి దాటి ఇతర వ్యవస్థల పరిధిలో జోక్యం చేసుకోవద్దని రాజ్యాంగం పేర్కొంటోందంటూ పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, న్యాయశాఖ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. దేనికదే హుందాతనాన్ని పాటించాలని, స్పీకర్ పరిధిలోని అంశాల్లో న్యాయ సమీక్ష సాధ్యం కాదని పేర్కొన్నారు. స్పీకర్ తుది నిర్ణయం తీసుకున్న తర్వాత న్యాయస్థానాలు జోక్యం చేసుకునేందుకు కొంత వీలుంటుందని అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాలకు గడువిస్తున్నామని.. ఆలోగా దీనికి సంబంధించిన వివరాలు అందజేయకుంటే తామే ఆదేశాలు జారీ చేయాల్సి వస్తుందని సెప్టెంబర్ 9న స్పీకర్ కార్యదర్శికి హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ మేరకు సింగిల్ జడ్జి ఇచ్చిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి గత నెల హైకోర్టు ద్విసభ్య



మిగతా 3వ పేజీలో ▶

సమగ్ర సర్వే షురూ

తొలిరోజు ఇళ్లకు స్టిక్కర్లు..

నేడు, రేపు కూడా కొనసాగింపు

9 నుంచి వివరాల సేకరణ

మండల, జిల్లా స్థాయిలో సమాచారం కంప్యూటరీకరణ

రాష్ట్రంలోని 1.17 కోట్ల కుటుంబాల సర్వేకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు ఇళ్లకు స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని రాష్ట్రమంతటా నిర్వహించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో మంత్రి శ్రీధర్‌బాబు స్టిక్కర్లు వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు జిల్లాల్లో కలెక్టర్లు సర్వే పనుల్లో పాల్గొన్నారు. గురు, శుక్రవారాల్లో కూడా

మిగతా 2వ పేజీలో ▶



సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి స్టిక్కర్ అతికించిన ఎన్యుమరేటర్లు

కొడంగల్ ఎత్తిపోతల్లో

సీఎం వాటా ఎంత ఢిల్లీ వాటా ఎంత?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- రెండు సంస్థలకు పనులు పంచి పెట్టి డబ్బులు దండుకునేందుకు కుట్ర.. పొంగులేటి కంపెనీకి మూసీ ప్రాజెక్టు పనులు
- సుంకిశాల ఘటనపై నివేదికను సీఎం తారుమారు చేసే చాన్స్

సాక్షి, హైదరాబాద్: 'బ్లాక్‌లిస్టులో పెట్టాల్సిన మేఘా కంపెనీతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ సంస్థకు రూ.4,350 కోట్ల కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు కట్టబెడుతున్నారు. అనుభవం కలిగిన కంపెనీలను టెక్నికల్ బిడ్‌లో అనర్హులుగా ప్రకటించి రెండు సంస్థలకు కేక్ ముక్కల్లా పనులు పంచి పెట్టి డబ్బులు దండుకునే కుట్ర చేస్తున్నారు. రూ.4,350 కోట్లలో సీఎం వాటా, ఢిల్లీ వాటా ఎంతో చెప్పాలి..'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్ లో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

గతంలో అరాచక కంపెనీ, ఆంధ్రా కంపెనీ అన్నారుగా..

'రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో 'ఈస్ట్ ఇండియా కంపెనీ'అని పేర్కొన్న మేఘా సంస్థకే

మిగతా 3వ పేజీలో ▶





సిద్ధరామయ్యను ప్రశ్నించిన లోకాయుక్త పోలీసులు



ముడా ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే కేసులో లోకాయుక్త పోలీసులు బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రెండు గంటల పాటు ప్రశ్నించారు. లోకాయుక్త ఎస్పీ టి.జె.ఉదేష్ తన ముందుంచిన ప్రశ్నావళికి సిద్ధరామయ్య సమాధానాలు ఇచ్చారు. రెండు గంటల పాటు సీఎంను ప్రశ్నించినట్లు లోకాయుక్త వర్గాలు వెల్లడించాయి.

ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలి

జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో బుధవారం తీవ్ర గందరగోళం చెలరేగింది. ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ అధికార పక్షం తీర్మానం ప్రవేశపెట్టింది. బీజేపీ సభ్యుల నిరసన ధ్వనుల మధ్య సభ ఈ తీర్మానంపై ఎలాంటి చర్చ చేపట్టకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

- వివరాలు 8లో

ఎయిర్‌బస్ @ ఓరుగల్లు

మామునూరులో పెద్ద విమానాలు దిగేలా సొంతంగా ఎయిర్‌పోర్టు నిర్మించనున్న ఏఏఐ

ఆరు నెలల్లో టెండర్ల ప్రక్రియ.. రూ.800 కోట్ల వ్యయం!

ఉడాన్ రీజినల్ కనెక్టివిటీ స్కీంలో భాగంగా మూడేళ్లపాటు వయబిలిటీ గ్యాప్ ఫండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండో విమానాశ్రయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. వరంగల్ శివారులోని మామునూరులో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఎయిర్‌పోర్ట్ రూపొందబోతోంది. ఐదారేళ్ల తర్వాత ఎట్టకేలకు అవరోధాలు పరిష్కారం కావటంతో విమానాశ్రయ నిర్మాణం చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) సంసిద్ధత ప్రకటించింది. దీనిని సొంతంగానే నిర్మించాలని నిర్ణయించగా, అనుమతులు, ఇతర అధికారిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేసి టెండర్లు పిలవబోతోంది.

ఎయిర్‌బస్ దిగేలా..

నాలుగేళ్ల క్రితం ఏఏఐ ఆధ్వర్యంలో జరిగిన టెక్నో ఎకనమిక్ ఫీజిబిలిటీ సర్వే రెండు రకాల నివేదికలు సమర్పించింది. చిన్న విమానాశ్రయం నిర్మించేందుకు 724 ఎకరాల భూమి, రూ.248 కోట్ల వ్యయం అవుతుందని, పెద్ద విమానాలను ఆపరేట్ చేసే స్థాయిలో నిర్మించాలంటే 1053 ఎకరాల భూమి, రూ. 345 కోట్ల వ్యయం అవుతుందని పేర్కొంది. తొలుత చిన్న విమానాశ్రయంగానే నిర్మించాలని నాటి ప్రభుత్వం సూచించింది. కానీ భవిష్యత్‌లో విస్తరణ ఇబ్బందిగా ఉంటుందని, కనీసం 30 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా ఒకేసారి పెద్ద విమానాశ్రయమే నిర్మించాలని గతేడాది చివరలో ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వానికి

మిగతా 14వ పేజీలో ▶



వేయి ఎకరాలు అవసరం

కొత్త విమానాశ్రయానికి వేయి ఎకరాలు కావాలి. నిజాం కాలం నాటి పాత విమానాశ్రయానికి చెందిన 696 ఎకరాలు ప్రస్తుతం ఏఏఐ అధీనంలోనే ఉన్నాయి. మిగతా భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించాల్సి ఉంది. విమానాశ్రయం నిర్మించేందుకు రూ. 800 కోట్లు ఖర్చవుతాయని అంచనా. త్వరలో ఏఏఐ డీపీఆర్ సిద్ధం చేయనుంది.

ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్

అక్కర్లేదు



- ఎల్ఎంవీ లైసెన్స్‌తో రవాణా వాహనం నడపొచ్చు
- 7,500 కిలోలలోపు బరువున్న వాహనం నడపడానికి అర్హులే
- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు

8లో

కేశవాపురం రిజర్వాయర్

కాంట్రాక్టు రద్దు

- కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపు ప్రతిపాదనకు బ్రేక్
- మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టు రద్దు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు

3లో

క్లుప్తంగా...

అంబికకు ఎంఎస్ స్వామినాథన్ అవార్డు

గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): భారతరత్న ఎం.ఎస్.స్వామినాథన్ అవార్డును.. సామాజిక కార్యకర్త డాక్టర్ జీ.సి.అంబిక బుధవారం అందుకున్నారు. 'పత్తి మనదే.. ప్రతిఫలం మనదే'అనే అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తూ నిర్వహించిన కార్యక్రమాలకు ఢిల్లీ విశ్వవిద్యాలయం ఈ అవార్డును ఆమెకు అందజేసింది. ఈ సందర్భంగా అంబిక మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా పర్యావరణం, వ్యవసాయంపై చేస్తున్న కార్యక్రమాలకు గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలను చైతన్యపరుస్తూ.. మరెన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుడతానని అంబిక తెలిపారు.

నవోదయ ప్రవేశాల గడువు పొడిగింపు

రాయదుర్గం: నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశాల దరఖాస్తు తేదీని పొడిగించినట్లు నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ వెల్లడించారు. ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరానికి 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈనెల 9 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. ఇందుకు ప్రవేశ పరీక్షను 2025 ఫిబ్రవరి 8న నిర్వహిస్తామన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి 2010 మే 1 నుంచి 2012 జూలై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు.. ప్రస్తుతం 10వ తరగతి చదువుతూ 2008 జూన్ 1 నుంచి 2010 జూలై 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

స్వల్పకాలిక కోర్సులకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: తక్షణ ఉపాధి లభించే స్వల్పకాలిక ఒకేషనల్ సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించే కాలేజీలు, సంస్థలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ యాజమాన్యాలను కోరారు. ఇంటర్ చదువుతున్న, మధ్యలో మానేసిన, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మొత్తం 34 కోర్సులను అందిస్తున్నారు. ఆరు నెలలు, ఏడాది కాలపరిమితి గల ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి వివిధ పరిశ్రమలు ఉపాధి కల్పిస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరి నుంచి జూన్ వరకూ నిర్వహించే కోర్సులకు అవసరమైన అర్హతలతో దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్ విద్య కమిషనర్ సూచించారు. కనిష్టంగా రెండు కోర్సులు, గరిష్టంగా తొమ్మిది కోర్సుల నిర్వహణకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి ఫీజుల వివరాలను కూడా అధికారులు వెబ్‌సైట్‌లో ఉంచారు.

శ్రీచైతన్య సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్



సాక్షి, హైదరాబాద్: నవంబర్ 6న ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో 20 రాష్ట్రాల నుంచి పాల్గొన్న పదివేల మంది శ్రీచైతన్య విద్యార్థులు.. 3 గంటల్లో 600 మ్యాథ్స్ ఫార్ములాలను ఏకకాలంలో పఠించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులు 3–10 ఏళ్లలోపు చిన్నారులే కావడం విశేషం. కార్యక్రమానికి హాజరైన యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు.. ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థకు సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించిన సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్ ఘనత విద్యారంగ చరిత్రలో అద్భుతఘట్టమని అభివర్ణించారు.

నిషేధం.. నట్టింట్లో అపహాస్యం!



పల్లెల్లో ఇళ్లలోనే లింగనిర్ధారణ పరీక్షలు

మొబైల్ స్కానింగ్ మెషిన్లతో చేస్తున్న ముఠా | ప్రేక్షక పాత్రలో వైద్యారోగ్యశాఖ

సాక్షి, మహబూబాబాద్: ఇప్పటి వరకు కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రత్యేకంగా స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి.. నిబంధనల మేరకు పరీక్షలు చేయించుకునేవారు. కానీ ఇప్పుడు కొనిచోట్ల పరిస్థితులు వేరుగా ఉన్నాయి. కొత్తగా వచ్చిన మొబైల్ స్కానింగ్ మెషిన్లు.. అదీ కూడా ల్యాప్‌టాప్ అంత సైజులో ఉన్నవి మార్కెట్‌లోకి రావడంతో అక్రమార్కుల పని సులువైంది. నాలుగైదు కేసులు ఉంటే.. లేదా చుట్టూ పక్కల తండాల్లోని గర్భిణులను ఒకచోటకు రమ్మని చెబుతున్నారు. బ్యాగుల్లో మెషిన్లు పెట్టుకెళ్లి అక్కడే పరీక్షలు చేసి ఆడ, మగ శిశువు అని నిర్ధారిస్తున్నారు. పరీక్షలకు ఒక్కొక్కరి నుంచి రూ.5వేలకు పైగా తీసుకుంటున్నట్టు సమాచారం. పరీక్ష తర్వాత మగశిశువు అయితే ఆ గర్భిణిని ఇంటికి పంపించడం.. ఆడశిశువు అయితే అక్కడే అబార్షన్లు కూడా చేస్తున్నట్టు తెలిసింది. ఇలా చేయడంతో పలువురు మహిళలు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడం, పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకొని బతికి బయటపడిన సంఘటనలు ఉన్నాయని గిరిజనులు చెబుతున్నారు.

ఆయా జిల్లాల్లో ఇలా..

మొబైల్ స్కానింగ్ పరికరాలతో లింగనిర్ధారణ చేసి ఆడశిశువును చంపేస్తున్న సంఘటనలు ఇటీవల కాలంలో వెలుగులోకి వస్తున్నాయి.

- మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలంలో మొబైల్ స్కానింగ్‌తో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుంటే పట్టుకున్నారు.
- కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో బీడీ ఖార్ఖానా ముసుగులో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ పట్టుపడ్డారు.
- ములుగు జిల్లా మంగపేట మండలంలో, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట , ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో గర్భవిచ్ఛిత్తి కేసులు బయటపడ్డాయి.
- అబార్షన్ సమయంలో మహిళలు చనిపోవడం, లేదా ప్రాణాపాయ స్థితికి వస్తే కానీ బయటకు రావడం లేదు.

'మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన దంపతులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో మొదటగా లింగనిర్ధారణ పరీక్షలు చేసేవారు. ఆపై కురవిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అప్పటికే ఆ ఆస్పత్రి యజమానిపై లింగనిర్ధారణ, అబార్షన్లు చేస్తున్నారని కేసు నమోదైంది. అయితే ఆస్పత్రి యజమాని, ఆ దంపతులు కలిసి ల్యాప్‌టాప్ సైజులో ఉన్న స్కానింగ్ మెషిన్ కొనుగోలు చేశారు. టెక్నికల్ పరిజ్ఞానం తెలిసిన ఖమ్మం పట్టణానికి చెందిన ఆర్ఎంపీతో కలిసి గిరిజన తండాలు, పల్లెల్లో స్కానింగ్ చేయడం, ఆడపిల్ల అని తేలితే అక్కడే అబార్షన్లు చేసి ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వసూళ్లు చేశారు. ఈ విషయం పసిగట్టిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. మొబైల్ స్కానింగ్, అబార్షన్ వ్యవహారాన్ని బట్టబయలు చేసి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి కురవి పోలీసులకు అప్పగించారు.'

కామారెడ్డి జిల్లా రాజంపేటకు చెందిన ఒక ముఠా స్కానింగ్ మెషిన్‌ను ఓ గర్భిణి ఇంటికి తీసుకెళ్లి పరీక్షలు చేస్తుండగా ఇటీవల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆ కేసులో నలుగురిని అరెస్టు చేశారు. వీరు కొంత కాలంగా మొబైల్ స్కానింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. ఎన్ని పరీక్షలు, నిర్ధారణలు చేశారన్న విషయంపై విచారణ కొనసాగుతోంది.

మౌనంగా అధికారులు

చట్టవిరుద్ధంగా లింగనిర్ధారణ చేయడం..అబార్షన్లు చేస్తున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నా.. పలు జిల్లాల్లో వైద్యారోగ్యశాఖ అధికారులు మాత్రం మౌనంగా ఉంటున్నారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీల సమయంలో పెద్దగా పట్టించుకోవడం లేదని, సెంటర్ల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లతో కొందరు అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి చట్టవిరుద్ధంగా నిర్వహించే లింగనిర్ధారణ పరీక్షలను అడ్డుకోకపోతే ఆడపిల్లల రేషియో మరింత పడిపోయే ప్రమాదం ఉందని మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



కామారెడ్డిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న స్కానింగ్ యంత్రం (ఫైల్)

ట్రంప్ 2.0

▶ మొదటి పేజీ తరువాయి

రిపబ్లికన్ అధ్యక్షునిగా నిలిచారు. అంతేగాక తనకు మాయని మచ్చగా మిగిలిన 2020 అధ్యక్ష ఎన్నికల ఓటమి తాలూకు చేదు గుర్తులను కూడా ఈ గెలుపుతో చెరిపేసుకున్నారు. బైడెన్ విజయాన్ని తిరస్కరిస్తూ తన మద్దతుదారులను క్యాపిటల్ హిల్‌పై దాడికి ఉసిగొల్పి క్రిమినల్ కేసుల్లో ఇరుక్కోవడంతో ట్రంప్ రాజకీయ భవితవ్యం ముగిసినట్టేనని అంతా భావించారు. అలాంటి స్థితి నుంచి పుంజుకుని నాలుగేళ్ల తర్వాత ఆయన సాధించిన ఘనవిజయం రిపబ్లికన్ పార్టీలో ఆనందోత్సాహాలు నింపగా 60 ఏళ్ల హారిస్ ఓటమితో డెమొక్రాట్లు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. విజయం ఖాయం కాగానే ట్రంప్ తన భార్య మెలానియాను ఆప్యాయంగా అక్కుని చేర్చుకుని ముద్దాడారు. ఫ్లోరిడాలోని తన వెస్ట్‌పామ్ బీచ్ నివాసం వెలుపల భారీగా గుమిగూడిన అభిమానులకు అభివాదం చేశారు. రన్నింగ్ మేట్ జేడీ వాన్స్‌తో తన ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం కుటుంబంతో కలిసి అమెరికా ప్రజలనుద్దేశించి ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. మరోసారి తనపై విశ్వాసముంచినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ''అపూర్వమైన, అత్యంత శక్తిమంతమైన ఫలితమిది. అమెరికా చరిత్రలో స్వర్ణ యుగానికి నా విజయం నాంది'' అని ప్రకటించారు. ''భగవంతుడు ఏదో పెద్ద కారణంతోనే నాకు ప్రాణదానం చేశాడని చాలామంది చెప్పింది నిజమేనని ఈ ఫలితాలు రుజువు చేశాయి'' అని ప్రచార పర్వంలో తనపై జరిగిన హత్యా ప్రయత్నాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ''ఇది అమెరికా ప్రజల విజయం. అంతేగాక దేశ చరిత్రలోనే అతి గొప్పదైన, కనీవిని ఎరగని రాజకీయ ఉద్యమమిది'' అని చెప్పుకొచ్చారు. ''నా చివరి శ్వాస దాకా ప్రతి రోజూ మీ కోసం, మీ కుటుంబాల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పోరాడతా. మీ జీవితాల్లో వెలుగులు పంచుతా. ద్రవ్యోల్బణం, అక్రమ వలసలతో సహా అన్ని సమస్యలకూ సమర్థ పరిష్కారం చూపుతా'' అని వాగ్దానం చేశారు. ఫలితాల వెల్లడి ప్రక్రియ పూర్తయి ట్రంప్‌ను అధ్యక్షునిగా లాంఛనంగా ప్రకటించేందుకు మరో రెండు నెలలు పట్టనుంది. అనంతరం జనవరి 20న ఆయన ప్రమాణస్వీకారం చేస్తారు. రెండోసారి శ్వేతసౌధంలో అడుగుపెట్టనున్న ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు దేశాధినేతల నుంచి అభినందనలు, శుభాకాంక్ష సందేశాలు వెల్లువెత్తాయి.

ముందు నుంచీ..: అమెరికావ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఆ వెంటనే రాష్ట్రాలవారీగా ఓట్ల లెక్కింపు మొదలైంది. మొదటినుంచీ ట్రంప్ ఆధిపత్యమే సాగుతూ వచ్చింది. చూస్తుండగానే ఏడు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. వాటిలో ఒకటైన విస్కాన్సిన్‌లో గెలుపుతో ఆయన 270 ఓట్ల మెజారిటీ మార్కును దాటగానే రిపబ్లికన్ నేతలు, అభిమానులు, మద్దతుదారులు దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయారు. బుధవారం రాత్రి తుది ఫలితాలు వెల్లడయ్యే సమయానికి 538 ఎలక్టోరల్ ఓట్లలో ట్రంప్ 292 సొంతం చేసుకున్నారు. మరోవైపు హారిస్ 223 ఎలక్టోరల్ ఓట్లకే పరిమితమయేలా కన్పిస్తున్నారు. ట్రంప్‌కు 7.1 కోట్ల పై చిలుకు ఓట్లు రాగా ఆమెకు 6.6 కోట్లే వచ్చాయి. 50 రాష్ట్రాలకు గాను అరిజోనా, నెవడా, మెయిన్ ఫలితమే తేలాల్సి ఉంది. అరిజోనాల్లో ట్రంప్ గెలుపు లాంఛనమే కాగా మెయిన్, నెవడాల్లోనూ ఆయన ఇప్పటికే 50 వేల పై చిలుకు ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆ మూడు రాష్ట్రాల్లోని 21 స్థానాలనూ గెలుచుకుని మరోసారి 300 మార్కు అలవోకగా దాటేలా కన్పిస్తున్నారు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో కూడా ఆయనకు 304 ఓట్లు దక్కడం తెలిసిందే. తన ఓటమి ఖాయం కావడంతో హార్వర్డ్ వర్సిటీలో బుధవారం రాత్రి తలపెట్టిన ప్రసంగ కార్యక్రమాన్ని హారిస్ రద్దు చేసుకున్నారు. అధ్యక్షుడు బైడెన్ అభ్యర్థిత్వం పట్ల డెమొక్రాట్ల నుంచే తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయనకు బదులుగా అనూహ్యంగా బరిలో దిగిన హారిస్‌కు ఈ ఫలితాలు నిరాశ కలిగించేవే. గెలిచి ఉంటే అధ్యక్ష పదవిని అధిష్ఠించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించేవారు. ట్రంప్, హారిస్ మధ్య పోటాపోటీ నెలకొన్నట్టు కొద్ది నెలలుగా ఎన్నికల సర్వేలన్నీ పేర్కొంటూ రావడం తెలిసిందే. స్వింగ్ స్టేట్లలోనూ అదే పరిస్థితి ఉందని చెప్పడంతో ఫలితాలపై సర్వత్రా నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. హారిస్ ట్రంప్‌కు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు.

ప్రకటించాల్సింది హారిసే

అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ విజయాన్ని అధికారికంగా ప్రకటించాల్సింది ఎవరో తెలుసా? ఆయనతో హోరాహోరీగా తలపడ్డ కమలా హారిసే! జనవరి 6న ఎలక్టోరల్ కాలేజీ ఓట్ల లెక్కింపు అనంతరం నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల పేర్లను సెనేట్ ప్రెసిడెంట్ లాంఛనంగా ప్రకటించాల్సి ఉంటుంది. ఉపాధ్యక్షుడే సెనేట్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారు. కనుక వైస్ ప్రెసిడెంట్ అయిన హారిసే ట్రంప్, వాన్స్‌లను విజేతలుగా ప్రకటించనున్నారు.

మెరుగైన పార్లమెంటరీ వ్యవస్థకు ఏఐ సాంకేతికత

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- సిడ్నీ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో ప్రసంగం



సిడ్నీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, బండా ప్రకాశ్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, నరసింహాచార్యులు

సాక్షి, హైదరాబాద్: ఆధునిక కాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ టెక్నాలజీ) వినియోగం ద్వారా పార్లమెంటరీ వ్యవస్థ పనితీరు సమర్థవంతంగా ఉండటంతో పాటు పారదర్శకంగా అందరికీ అందుబాటులో ఉంటుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. భారత్‌తో పాటు కామన్వెల్త్ దేశాల్లో ఏఐ వినియోగం అనివార్యంగా మారిందని, పార్లమెంటరీ వ్యవస్థలోనూ ఏఐ శరవేగంగా విస్తరిస్తోందని తెలిపారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సులో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులుతో కలిసి స్పీకర్ పాల్గొన్నారు. పార్లమెంటరీ ప్రక్రియలో 'కృత్రిమ మేధస్సు ఉపయోగం, ఆచరణ, అవకాశాలు, సవాళ్లు'అనే అంశంపై స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రసంగించారు. చట్టసభల్లో ఏఐ వినియోగం ద్వారా శాసనవ్యవస్థలో జరుగుతున్న మార్పులు, భవిష్యత్తు పోకడలను అంచనా వేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. చట్టసభల్లో కృత్రిమ మేధస్సు వాడకాన్ని విస్తృతం చేయడంతో పాటు సభ్యులకు శిక్షణ, అవగాహన కల్పించాలని స్పీకర్ సూచించారు. ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో అన్ని వర్గాల హక్కులు పరిరక్షించేలా రాజ్యాంగ రచన జరిగిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. చట్టసభల్లో మెరుగైన చట్టాల రూపకల్పన ద్వారా భారత్ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే బాటన తెలంగాణ ప్రయాణిస్తోందని గుత్తా పేర్కొన్నారు.

సమగ్ర సర్వేపై దుష్ప్రచారం

డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం

- ఇంటింటి సర్వే లబ్ధిదారుల తొలగింపు, తగ్గింపునకు కానే కాదు
- అది సంపదను దోచుకునేవాళ్లు సృష్టిస్తున్న గందరగోళం



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక భారం తగ్గించుకోవడంలో భాగంగా రేషన్‌కార్డులు, ఇతర ప్రభుత్వ పథకాల కింద అనర్హులైన లబ్ధిదారుల ఏరివేతకే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిందన్న ప్రచారాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖండించారు. సర్వే ఉద్దేశం లబ్ధిదారుల తొలగింపు, తగ్గింపు కానే కాదని స్పష్టం చేశారు. సర్వే జరగకూడదనే భావనతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే'బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో ఆయన ప్రజాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి అనేక సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారం చూపుతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని భట్టి గుర్తు చేశారు. బంగారు తెలంగాణను నిర్మిస్తామని చెప్పిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు..అప్పుల తెలంగాణగా చేశారని విమర్శించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని విమర్శించారు.

సర్వే ఫలితాల ఆధారంగా నిర్ణయాలు, ప్రణాళికలు

సర్వే పూర్తైన తర్వాత సామాజిక వర్గాల వారీగా రాష్ట్ర ప్రజల స్థితిగతులపై వివరాలను బహిర్గతం చేస్తామని భట్టి చెప్పారు. సర్వే ఫలితాల ఆధారంగా పాలన, ప్రణాళికల రూపకల్పన, బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. సర్వేతో సమాజంలో కులాల మధ్య చీలికలు వస్తాయన్న ఆందోళనలను తోసిపుచ్చారు. మేధావులతో పాటు అన్ని వర్గాల అభిప్రాయాలు స్వీకరించి సర్వేకు సంబంధించిన ప్రశ్నావళిని రూపొందించామని చెప్పారు. సర్వేలో సేకరించే ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

కులగణన దేశానికి దశ, దిశను నిర్దేశిస్తుంది

రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే భవిష్యత్తులో దేశానికి దశ, దిశను నిర్దేశించే గొప్ప కార్యక్రమంగా మారబోతోందని డిప్యూటీ సీఎం అన్నారు. సమావేశంలో ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు

బీసీ వర్గాలకు చెందిన కార్పొరేషన్ చైర్మన్ల భేటీలో తీర్మానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీలోని బీసీ సామాజిక వర్గాలకు చెందిన కార్పొరేషన్ల చైర్మన్లు.. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అధ్యక్షతన బుధవారం గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. కులగణనకు అంకురార్పణ చేసిన రాహుల్‌గాంధీతో పాటు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రేవంత్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సమావేశంలో ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ నేతలు పాల్గొన్నారు. కాగా, సమావేశంలో భాగంగా బీసీ వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్న వ్యవహారశైలిపై చర్చ జరిగిందని, మల్లన్న వ్యాఖ్యలను సమావేశం తీవ్రంగా ఖండించిందని సమాచారం.

'సర్వే అయ్యే దాకా పాఠాలు ఆపండి'

సాక్షి, హైదరాబాద్: కులగణన సర్వే పూర్తయ్యే వరకూ ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనను నిలిపివేయాలని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల విద్య డైరెక్టరేట్ ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారులతో చర్చించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. కులగణన నేపథ్యంలో అన్ని ప్రాథమిక స్కూళ్లలో మధ్యాహ్నం ఒంటి గంట వరకే పాఠశాలలను నిర్వహించాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ ఆదేశించింది. ఈ సమయంలో కొన్ని సబ్జెక్టుల క్లాసులైనా నిర్వహించాలని టీచర్లు భావించారు. కానీ డిసెంబర్ 4న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు 3, 6, 9 తరగతుల విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ సారి న్యాస్‌లో మంచి స్థానం సంపాదించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు నెల రోజుల ముందు నుంచి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే టీచర్లకు కులగణన విధుల కారణంగా న్యాస్ శిక్షణకు సమయం సరిపోదని భావిస్తున్నారు. అందుకే మూడు వారాల పాటు ఇదే విధానం అనుసరించాలని భావిస్తున్నారు.


ట్రంప్ విగ్రహానికి పాలాభిషేకం

బచ్చన్నపేట: అమెరికా అధ్యక్షునిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవడాన్ని హర్షిస్తూ.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామంలో ట్రంప్ విగ్రహానికి బొడ్డు ప్రవీణ్‌కుమార్ అనే అభిమాని బుధవారం పాలాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన బుస్స కృష్ణ అనే వ్యక్తి ట్రంప్‌కు వీరాభిమాని. గతంలోనే ట్రంప్ విగ్రహాన్ని తన ఇంటిలో ఏర్పాటు చేసి నిత్యం పూజలు చేసేవాడు. కానీ ఇటీవల కృష్ణ మృతి చెందాడు. కృష్ణ బతికి ఉంటే.. ట్రంప్ గెలుపుతో పెద్ద ఎత్తున సంబరాలు చేసేవాడని ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించారు.



కులగణన పత్రంతో రాహుల్ ఇంటికి వెళ్లండి

మతతత్వ రాజకీయాలు చేయడమే బీజేపీ పని: కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కులగణన నిర్వహించడానికి రాహుల్‌గాంధీ కులంతో ఏంపని అని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. కుల వివక్షను పోగొట్టడానికే కులగణన అని రాహుల్‌గాంధీ చెప్పారని, ఆయన కులం విషయంలో బీజేపీ నేతలకు సమాచారం కావాలంటే కులగణన పత్రం తీసుకుని ఆయన ఇంటికి వెళ్తే తన కులం ఏంటో రాహుల్‌గాంధీ చెప్తారని అన్నారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆమె పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై పలువురు మంత్రి సురేఖను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అక్కడి నుంచే అధికారులతో మాట్లాడిన ఆమె కొన్ని దరఖాస్తులను పరిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, గతంలో మంత్రులు అపాయింట్‌మెంట్ కూడా ఇచ్చేవారు కాదని, ఇప్పుడు మంత్రులే ప్రజల వద్దకు వచ్చి వినతిపత్రాలు తీసుకుంటున్నారని చెప్పారు.

2000 తర్వాత పుట్టినవారికే జేఈఈ అడ్వాన్స్‌డ్

ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీవారు 1995 తర్వాత జన్మించి ఉండాలి

- అర్హత నిబంధనలు విడుదల చేసిన ఐఐటీ కాన్పూర్
- ఈసారి ఓపెన్ కేటగిరీలో 1,01,250 మందికి అవకాశం
- ఈడబ్ల్యూఎస్ కింద 25 వేలు, ఎస్టీలు 18,750 మంది

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలలో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 పరీక్షకు 2000 సంవత్సరం తర్వాత పుట్టిన వారే అర్హులని ఈసారి ఈ పరీక్ష నిర్వహిస్తున్న ఐఐటీ కాన్పూర్ ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు 1995 సంవత్సరం తర్వాత జన్మించి ఉండాలని తెలిపింది. జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 పరీక్షకు సంబంధించిన అర్హత నిబంధనలను ఐఐటీ కాన్పూర్ బుధవారం విడుదల చేసింది. కేటగిరీలవారీగా ఎంత మంది అభ్యర్థులను ఎంపికచేసే విషయాన్ని కూడా వెల్లడించింది. అయితే ఈ పరీక్ష తేదీలను ప్రకటించలేదు. ఓపెన్ కేటగిరీలో ఈసారి 1,01,250 మందికి అర్హత కల్పించాలని నిర్ణయించింది. ఏటా జేఈఈ మెయిన్స్ 11 లక్షల మంది వరకు రాస్తుంటారు. వీరిలో మెరిట్ ఆధారంగా 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఇందులో సాధించే ర్యాంకుల ఆధారంగా ఐఐటీల్లో సీట్లు కేటాయిస్తారు. అడ్వాన్స్‌డ్ ద్వారా సీట్లు పొందని, జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకులున్న వారికి ఎన్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థలు, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు లభిస్తాయి. ఇప్పటికే జేఈఈ మెయిన్స్ తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 22 నుంచి 30 వరకు తొలి దశ, ఏప్రిల్ 1–8 వరకు రెండో దశ పరీక్షలు నిర్వహిస్తారు. రెండో విడత పరీక్ష తర్వాత వారం రోజుల్లో మెయిన్స్ ర్యాంకులు వెల్లడిస్తారు. దీన్నిబట్టి ఏప్రిల్ ఆఖరి వారం లేదా మే మొదటి వారంలో అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించే వీలుంది. 3 పర్యాయాలు అడ్వాన్స్‌డ్ రాసేందుకు అవకాశం కల్పించారు.

కేటగిరీల వారీగా ఎంపిక చేసే విద్యార్థుల సంఖ్య

కేటగిరీ	అభ్యర్థుల సంఖ్య
ఓపెన్ (96,187)	
ఓపెన్ - పర్సన్ విత్ డిసేబుల్డ్ (పీడబ్ల్యూడీ) (5,063)	1,01,250
జనరల్ - ఎకనమికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) (23,750)	
జనరల్ - ఈడబ్ల్యూఎస్ - పీడబ్ల్యూడీ (1,250)	25,000
ఓబీసీ - నాన్ క్రీమీలేయర్ (ఎన్‌సీఎల్) (64,125)	
ఓబీసీ - ఎన్‌సీఎల్ - పీడబ్ల్యూడీ (3,375)	67,500
ఎస్సీ (35,625), ఎస్సీ - పీడబ్ల్యూడీ (1,875)	37,500
ఎస్టీ (17,812), ఎస్టీ - పీడబ్ల్యూడీ (939)	18,750

ఆధార్ పేరే ప్రామాణికం

- జేఈఈ మెయిన్స్ దరఖాస్తు సమస్యపై ఎన్‌టీఏ
- టెన్త్, ఆధార్‌లో పేర్లు వేరే ఉంటే ఆధార్‌లోని పేరే ఇవ్వాలి
- ఆన్‌లైన్‌లో టెన్త్ మెమో అప్లోడ్ చేయాలి

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ కార్డు, పదోతరగతి ధృవపత్రాల్లోని పేర్లు వేర్వేరుగా ఉంటే ఆధార్‌లోని పేరునే ప్రామాణికంగా తీసుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సూచించింది. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నింపేటప్పుడు ఆధార్, టెన్త్ క్లాస్ సర్టిఫికెట్లలోని పేర్లు సరిపోవడం లేదనే మెసేజ్ వస్తోందని పలువురు అభ్యర్థులు ఎన్‌టీఏకి ఫిర్యాదు చేశారు. ఇలాంటి సందర్భాల్లో ఆధార్‌పై ఉన్న పేరును దరఖాస్తులో నింపాలని, టెన్త్ ధృవపత్రాలను అప్‌లోడ్ చేస్తే సరిపోతుందని ఎన్‌టీఏ వివరణ ఇచ్చింది. 'ఆధార్‌లోని పేరు సరిపోలడం లేదు.. దగ్గర్లోని ఆధార్ సెంటర్‌ను సంప్రదించండి'అనే మెసేజ్ వస్తే దాన్ని క్లోజ్ చేయాలని, అప్పుడు వేరే విండో వస్తుందని.. దాని ద్వారా ముందుకు వెళ్లొచ్చని తెలిపింది.

సమగ్ర సర్వే షురూ

▶ మొదటి పేజీ తరువాయి



సర్వే కిట్‌ను ఎన్యుమరేటర్‌కు ఇస్తున్న మంత్రి పొన్నం, మేయర్

స్టిక్కర్లు వేసే కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. మొదటి దశలో భాగంగా ఈ నెల 8వ తేదీ వరకు ప్రతి ఎన్యూమరేషన్ బ్లాక్‌లో ఉన్న ప్రతి ఇంట్లో ఉన్న కుటుంబాలను నమోదు చేసి, వారి ఇంటి నంబరు, కుటుంబ యజమాని పేరుతో కూడిన జాబితాను తయారు చేయనున్నారు. ఈ జాబితా పూర్తయిన ఇళ్లకు స్టిక్కర్లు వేయనున్నారు. ఆ తర్వాత రెండోదశలో ఈ నెల 9 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టనున్నారు. ఈ సర్వేలో లభించిన సమాచారాన్ని మండల, జిల్లా స్థాయిలో కంప్యూటరీకరిస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేసి సర్వే వాస్తవ పురోగతిని నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించగా, జీహెచ్ఎంసీలో 19,328, ఇతర ప్రాంతాల్లో 67,764 ఉన్నాయి. ఈ బ్లాక్‌ల వారీగా సర్వే చేసేందుకు 94,750 మంది ఎన్యూమరేటర్లను ఎంపిక చేశారు. 24,488 మందిని జీహెచ్ఎంసీలో నియమించగా, ఇతర ప్రాంతాల్లో 70,262 మందిని నియమించారు. వీరి సహకారంతో రాష్ట్రంలోని 1,17,44,954 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించనున్నారు.

క్లుప్తంగా...

రూ.1,100 కోట్లతో అంచనాలు రూపొందించలేదు

కేటీఆర్ ఆరోపణలపై జలమండలి వివరణ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం గోదావరి నీళ్ల కొండపోచమ్మ సాగర్ నుంచి తెచ్చేందుకు రూ.1100 కోట్లతో అంచనా ప్రణాళిక రూపొందించలేదని జలమండలి పేర్కొంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ పునరుజ్జీవానికి మల్లన్నసాగర్ నుంచి నీళ్లు తీసుకురావడానికి వీలుగా గోదావరి ఫేజ్–2 పథకానికి మాత్రమే రూపకల్పన జరిగినట్లు తెలిపింది. గోదావరి జలాల తరలింపు విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలకు బుధవారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు 27,446 దరఖాస్తులు


నల్లగొండ: నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఓటు నమోదు ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఓటు నమోదు ప్రక్రియ అక్టోబర్ 1 నుంచి ప్రారంభమైంది. నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించారు. ఇప్పటివరకు మొత్తం 27,446 మంది ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించారు.

బీఆర్‌కేఆర్ భవన్‌లో ఏకసభ్య కమిషన్ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌కు పూర్తిస్థాయి కార్యాలయాన్ని బీఆర్‌కేఆర్ భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది. వచ్చే వారం నుంచి కమిషన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండడంతో.. ఆలోపు కార్యాలయంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఫర్నిచర్‌తో పాటు ఇతర మౌలిక వసతుల కల్పన పనులు చకచకా సాగుతున్నాయి. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్.. బాధ్యతలు స్వీకరించిన అరవై రోజుల్లో అధ్యయనం పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. ఈక్రమంలో ప్రజల నుంచి వినతులు, విజ్ఞాపనల స్వీకరణ, క్షేత్రస్థాయిలో పర్యటనలు, సంస్థలు, ప్రజాసంఘాలు, మేధావులతో సమావేశాలు, ప్రభుత్వ శాఖలతో సమీక్షలకు కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై మరో పోరాటం చేస్తాం

మాదిగల ధర్మయుద్ధ మహాసభలో మంద కృష్ణమాదిగ



తుక్కుగూడ: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే ఉద్యోగ భర్తీలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. బుధవారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాదిగల ధర్మయుద్ధ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే అసెంబ్లీ సాక్షిగా దేశంలో తమ ప్రభుత్వమే మొదట వర్గీకరణ అమలు చేస్తుందని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. వర్గీకరణ అమలు చేయకుండానే ఉద్యోగ భర్తీలు చేపట్టి నమ్మకద్రోహం చేశారని అన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో మోసం చేసిన సీఎం.. గ్రూప్ 1,2,3,4 ఉద్యోగాలు సైతం ఎస్సీలకు దక్కకుండా కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ ధర్మయుద్ధ మహాసభలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తామన్నారు. రానున్న రోజుల్లో రథయాత్రతో ప్రతి నియోజకవర్గం, మండలాల్లో పర్యటిస్తామని చెప్పారు. డిసెంబర్ 21న చేపట్టే చలో హైదరాబాద్ మహాసభను విజయవంతం చేయాలని మంద కృష్ణ పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ నేతల వ్యాపారాలే పడిపోయాయి

రియల్‌ఎస్టేట్ కుదేలవడానికి కారణం కేటీఆరే: కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ పడిపోయిందని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, కేవలం కబ్జాలు చేసి పేదలను కొల్లగొట్టే బీఆర్ఎస్‌లోని కొందరు నాయకుల రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు మాత్రమే పడిపోయాయని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీ సమావేశం పెట్టుకుని దానికి రియల్ ఎస్టేట్ రంగు పులిమిన కేటీఆర్, రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందన్నట్టు వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైడ్రా ద్వారా చెరువుల కబ్జాలను అడ్డుకుంటే రియల్ ఎస్టేట్ ఎందుకు పడిపోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల కబ్జాలు, అక్రమాలు, అధికార దుర్వినియోగం ఆగిపోయింది కాబట్టే వారికి రియల్ ఎస్టేట్ పడిపోయినట్టు అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రియల్‌ఎస్టేట్ రంగం రాష్ట్రంలో కుదేలు కావడానికి మాజీ మంత్రి కేటీఆరే కారణమని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం వ్యాఖ్యానించారు. గతంలో భూములు, ఆస్తుల ధరలను విపరీతంగా పెంచారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రపంచమంతా ఆర్థిక మాంద్యం చుట్టుముట్టిందని, అది కేవలం తెలంగాణ, హైదరాబాద్‌లోనే లేదని, అందుకే కొన్ని రిజిస్ట్రేషన్ లావాదేవీలు తగ్గాయని గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.

కేశవాపురం రిజర్వాయర్ కాంట్రాక్టు రద్దు

కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాల ప్రతిపాదనకు బ్రేక్

- మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టు రద్దు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు
- మల్లన్నసాగర్ నుంచి తరలించాలని నిర్ణయించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ తాగునీటి అవసరాలకు గాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తలపెట్టిన కేశవాపురం రిజర్వాయర్ పనుల ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం బ్రేక్ వేసింది. మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దు చేసింది. గోదావరి ఫేజ్– 2లో భాగంగా గోదావరి జలాలను కొండపోచమ్మ సాగర్ నుంచి శామీర్‌పేట్ సమీపంలో నిర్మించే కేశవాపురం రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించేలా గత ప్రభుత్వం డీపీఆర్ తయారు చేసింది. ఆరేళ్ల క్రితమే మేఘా కంపెనీకి కాంట్రాక్టు అప్పగించింది. అయితే పనులు ప్రారంభించకపోవడంతో ఈ కాంట్రాక్టును రద్దు చేస్తూ తాజాగా పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కేశవాపురం ప్రాజెక్టుకు అయ్యే రూ. 2 వేల కోట్లతోనే గోదావరి ఫేజ్–2 పథకాన్ని మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల వరకు పొడిగించి, హైదరాబాద్‌కు తాగునీరు అందించేలా కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.

తాగునీటికి 10, జంట జలాశయాలకు 5 టీఎంసీలు

మల్లన్నసాగర్ నుంచి తరలించే 15 టీఎంసీల జలాల్లో 10 టీఎంసీలు హైదరాబాద్ ప్రజల తాగునీటికి, 5 టీఎంసీలు జంట జలాశయాలకు అందించనున్నారు. మల్లన్నసాగర్ నుంచి బహుళ ప్రయోజనాలుండేలా 15 టీఎంసీల నీటిని పంపింగ్ చేసే ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ పనులకు టెండర్లు పిలవాలని హైదరాబాద్ వాటర్ బోర్డ్ అధికారులను సీఎం ఆదేశించారు.

గత ప్రభుత్వ ప్రతిపాదన ఇలా..


గత ప్రభుత్వ ప్రతిపాదన ప్రకారం.. ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరు మీదుగా వచ్చే గోదావరి నీళ్లను మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు తరలించి అక్కడినుంచి ఎత్తిపోతల ద్వారా 5 టీఎంసీల కేశవాపురం చెరువును నింపాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఘన్‌పూర్ మీదుగా హైదరాబాద్‌కు తాగునీటి కోసం 10 టీఎంసీలు సరఫరా చేస్తారు. అయితే ఆరేళ్లయినా ఈ పనులు ప్రారంభం కాలేదు. భూ సేకరణ చిక్కులతో పాటు అలైన్‌మెంట్ లోపాలతో పనులు ముందుకు సాగలేదని ప్రభుత్వం గుర్తించింది.

పనులు ప్రారంభించని నిర్మాణ సంస్థ

బీఆర్ఎస్ హయాంలో రిజర్వాయర్ నిర్మాణ టెండర్లను దక్కించుకున్న మేఘా ఇంజనీరింగ్ కంపెనీ వివిధ కారణాలతో పనులు ప్రారంభించలేదు. అయితే 2017 నాటి ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం పనులు చేపట్టలేమని, 2024 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం అంచనాలను సవరించాలని కోరుతూ ఇటీవలే ప్రభుత్వానికి లేఖ రాసింది. అయితే రేట్ల పెంపును తిరస్కరించటంతో పాటు ఇప్పటివరకు పనులు చేపట్టని కారణంగా ఆ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కొత్త డిజైన్‌లో మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కూడా..

కాంగ్రెస్ సర్కార్ మార్చిన డిజైన్‌లోని కొత్త రూట్ ప్రకారం.. మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్‌కు అక్కడినుంచి నేరుగా హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేస్తారు. దీనితో పాటు మూసీ పునరుజ్జీవ పథకంలో భాగంగా జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు 5 టీఎంసీలు సరఫరా చేస్తారు. ఎక్కువ శాతం నీరు గ్రావిటీతో వచ్చేలా పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.



మల్లన్నసాగర్ బెస్ట్ ఆప్షన్!

కొండపోచమ్మ సాగర్‌కు 15 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమే ఉండగా.. మల్లన్నసాగర్‌కు 50 టీఎంసీల కెపాసిటీ ఉంది. కొండపోచమ్మ సాగర్‌లో 8 టీఎంసీల నీళ్లుంటే తప్ప నీటిని పంపింగ్ చేయడం వీలుకాదు. అదే మల్లన్నసాగర్‌లో డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని పంప్ చేసుకునే వీలుంది. అందుకే కొండపోచమ్మ సాగర్‌కు బదులు మల్లన్నసాగర్‌ను ఎంచుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. పాత ప్రతిపాదనలో అక్కారం, మర్కూర్, కొండపోచమ్మ సాగర్, బొమ్మరాసిపేట, ఘన్‌పూర్.. మొత్తం 5 చోట్ల నీటిని పంపింగ్ చేయాలి. కానీ కొత్త డిజైన్‌లో మల్లన్నసాగర్, ఘన్‌పూర్‌ల వద్ద నీటిని పంపింగ్ చేస్తే సరిపోతుంది. ప్రస్తుతం గోదావరి, కృష్ణా నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు ఒక కిలోలీటర్‌కు రూ.48 వరకు ఖర్చు అవుతుండగా, కొత్త ప్రాజెక్టు పూర్తయితే కేవలం రూ.4 ఖర్చవుతుందని ప్రభుత్వం లెక్కలు వేసింది.

విద్య, వైద్యం, ఉపాధి కల్పన ప్రభుత్వ బాధ్యత

- నవంబర్ 14న రెండో విడత సమీకృత గురుకుల పాఠశాలలు మంజూరు
- వసతిగృహ విద్యార్థులతో ముఖాముఖిలో సీఎం రేవంత్‌రెడ్డి



సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి కల్పన ప్రభుత్వాల బాధ్యత అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా వైరా, మధిర నియోజకవర్గాల నుంచి సంక్షేమ వసతిగృహాలకు చెందిన విద్యార్థులు బుధవారం సచివాలయానికి వచ్చారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో డైట్ , కాస్మెటిక్ చార్జీలు పెంచినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ముఖాముఖిలో సీఎం రేవంత్ మాట్లాడారు. 'విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. నాణ్యమైన విద్య అందించే క్రమంలో డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచాం. రాష్ట్రవ్యాప్తంగా 21 వేల మంది ఉపాధ్యాయులకు పదో న్నతులు కల్పించాం. కొత్తగా 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. సామాజిక న్యాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుల సర్వే ప్రక్రియ చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి తొలివిడత మంజూరు చేసిన సమీకృత గురుకుల పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ రోజుల్లో చదువుతోపాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు లభిస్తున్నాయి. అందుకే విద్యార్థి, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. టాటా ఇన్‌స్టిట్యూట్ సహకారంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశాం. వీటిలో కొత్త ట్రేడ్‌లను కూడా పరిచయం చేశాం. దీంతో సాంకేతిక నైపుణ్యంతోపాటు ఉద్యోగ భద్రత కలుగుతుంది. చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరముంది. రాష్ట్ర ప్రభుత్వ పాలనకు సచివాలయం గుండెకాయలాంటిది. ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో సచివాలయంలో కొలువులు సాధించాలి. ప్రభుత్వ పాలనలో భాగస్వాములు కావాలని నేను ఆకాంక్షిస్తున్నా. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా 100కు డయల్ చేసి సమాచారం అందించండి. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయి. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతను అలవరచుకోవాలి. ఈనెల 14న దాదాపు 15 వేల మంది విద్యార్థులతో మంచి కార్యక్రమం తీసుకుంటున్నాం. అదే రోజు రెండోవిడత సమీకృత గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని నిర్ణయించాం'అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు బలరాంనాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోఆర్ చట్టంపై సీఎం సమీక్ష వాయిదా

రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)పై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష వాయిదా పడింది. వాస్తవానికి బుధవారం సాయంత్రం ఈ అంశంపై సీఎం సమీక్షించాల్సి ఉండగా, ఇతర కార్యక్రమాలకు హాజరు కావాల్సి రావడం, గవర్నర్‌ను కలిసేందుకు వెళ్లాల్సి ఉండటంతో ఈ సమీక్షను వాయిదా వేయాలని సీఎం ఆదేశించినట్టు సమాచారం. దీనిపై మరింత లోతుగా చర్చించాల్సి ఉన్నందున సోమవారం ఈ సమీక్షను ఏర్పాటు చేయాలని సీఎం సూచించినట్టు తెలిసింది.

గవర్నర్‌తో సీఎం భేటీ

కుటుంబ సర్వే, మూసీ ప్రాజెక్టుపై వివరణ... సీఎం సోదరుడి కుమార్తె వివాహానికి గవర్నర్‌కు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు బుధవారం రాత్రి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తీరును గవర్నర్‌కు సీఎం వివరించారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసే విధానాన్ని, ప్రతీ ఇంటికి స్టిక్కరింగ్, 57 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలతో కుటుంబ సమగ్ర సమాచారం సేకరించే వైనాన్ని గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. 2025లో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఈ సర్వేను పరిగణనలోకి తీసుకునేలా చూడాలని కోరారు. మూసీ పునరుజ్జీవ పథకం గురించి కూడా గవర్నర్‌కు సీఎం వివరించారు. ఈ సందర్భంగా మూసీ నిర్వాసితులకు ఇబ్బంది లేకుండా నష్టపరిహారంతోపాటు నివాస వసతి కల్పించాలని గవర్నర్ సూచించినట్లు సమాచారం. అయితే నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇళ్లు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సోదరుని కూతురు వివాహానికి గవర్నర్‌ను ఆహ్వానించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, గుత్తా అమిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాటల సీఎం.. చేతలు శూన్యం

మాజీ మంత్రి హరీశ్‌రావు



రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/ సిద్దిపేటరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి కాని... చేతలు దాటడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా రూరల్ మండలం రాఘవాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులతో మాట్లాడి ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ . గొప్పలకు పోయిన రేవంత్ రెడ్డి నేటికి పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటివి అందించలేదని, బోనస్ కాస్త బోగస్ చేసి రైతులను మోసం చేశాడన్నారు. మంత్రి ఉత్తమ్ రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తానని చెప్పారన్నారు. కానీ ఇప్పటికే 30 శాతం ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని చెప్పారు. ప్పటికైనా కళ్లు తెరిచి వెంటనే పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

చదువుకునేందుకు వెళితే ప్రాణాలు పోతున్నాయి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు వెళుతున్న విద్యార్థుల ప్రాణాలు కోల్పోయే దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలల్లో 'విష పూరిత ఆహారం'ఘటనలు చోటు చేసుకోవడంపై బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మండిపడ్డారు. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 60 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలైన ఘటన మరువకముందే.. మరో ఘటన జరగటం దారుణమని పేర్కొన్నారు. మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలు కావడం బాధాకరమని చెప్పారు. విషపూరిత ఆహారం ఘటనలు పదేపదే జరుగుతున్నా.. ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని, గురుకుల విద్యాసంస్థల్లో ఏం జరుగుతుందని ప్రశ్నించారు.

రాజ్యాంగ సంస్థలు పరిధి దాటొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి తరఫున రవీంద్ర శ్రీవాస్తవ వాదనలు వినిపించారు.

'కైశం మేఘాచంద్ర సింగ్'లో ముగ్గురు జడ్జిల తీర్పు చెల్లదు

'చట్టప్రకారం తహసీల్దార్ లాంటి వారి నిర్ణయానికి కూడా నెల సమయం ఉంటుంది. అలాంటిది స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి పిటిషనర్లు కనీసం ఆ సమయం కూడా ఇవ్వలేదు. ఫిరాయింపు పిటిషన్లపై నిర్దిష్ట వ్యవధిలోగా విచారణ పూర్తి చేయాలనే ఉత్తర్వులు ఇస్తే, భవిష్యత్‌లో స్పీకర్ చట్టసభలో ఎలా నిర్ణయాలు తీసుకోవాలో కూడా కోర్టులు ఆదేశాలు జారీ చేసేందుకు ఆస్కారం ఇచ్చినట్లు అవుతుంది. కిహోటో హోలోహన్ (1992) కేసు విచారణ సందర్భంగా ఐదుగురు జడ్జిల సుప్రీంకోర్టు ధర్మాసనం స్పీకర్‌ను ట్రిబ్యునల్‌గా పేర్కొన్నందున.. ఆయన నిర్ణయాలపై సమీక్ష జరపొచ్చు. కానీ నిర్ణయం తీసుకోక ముందు కోర్టుల జోక్యం కూడదు. కైశం మేఘాచంద్ర సింగ్ (2020) కేసు విచారణ సందర్భంగా ముగ్గురు జడ్జిల సుప్రీంకోర్టు ధర్మాసనం.. స్పీకర్ ముందున్న అనర్హత పిటిషన్లపై జోక్యం చేసుకోవచ్చు అని చెప్పింది. అయితే ఐదుగురు జడ్జిల తీర్పు తర్వాత ముగ్గురు జడ్జి ఇచ్చిన తీర్పు చెల్లదు. విస్తృత ధర్మాసనం ఇచ్చిన తీర్పే పరిగణనలోకి తీసుకోవాలి. సింగిల్ జడ్జి ఉత్తర్వులు కూడా స్పీకర్ పరిధిలో జోక్యం చేసుకున్నట్లే ఉన్నాయి..'అని రవీంద్ర శ్రీవాస్తవ, శ్రీరఘురాం వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి, ఫిరాయింపులపై పిటిషన్ దాఖలు చేసిన బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫున జె.ప్రభాకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున గండ్ర మోహన్‌రావు, పార్టీ ఫిరాయించిన కడియం శ్రీహరి తరఫున మయూర్‌రెడ్డి హాజరయ్యారు. తదుపరి విచారణను ధర్మాసనం గురువారానికి వాయిదా వేసింది.

కులగణనపై చర్చకు సీఎం సిద్ధమా?

రాహుల్‌గాంధీకి కులగణనపై మాట్లాడే నైతికహక్కు లేదు: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: కులగణనపై బహిరంగ చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని మైనార్టీ రిజర్వేషన్లు ఎత్తివేయకుండా బీసీలను కులగణన పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయలబ్ధి కోసమే కాంగ్రెస్ సర్కార్ కులగణన చేపడుతోందని, దీని ద్వారా బీసీలకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..రాహుల్‌గాంధీకి కులగణనపై మాట్లాడే నైతికహక్కు లేదన్నారు. కులగణన ద్వారా బీసీలకు ఏ విధంగా న్యాయం చేస్తారో చెప్పాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన 21 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ చేసిన కామారెడ్డి అసెంబ్లీ సీటును కూడా బీసీలకు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఈ హామీలు నెరవేర్చకుండా కులగణన పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు.

ఈ దేశ కులమే రాహుల్ కులం

దేశంలో కుల గణనకు మోదీని ఒప్పించగలరా?: మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కులం గురించి ప్రశ్నించే అర్హత బీజేపీ నేతలకు లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్‌ది ఏ కులమని బీజేపీ నేతలు అడుగుతున్నారని, దేశమంతా అభిమానించే రాహుల్ గాంధీ కులం, భారతదేశ కులం ఒకటేనని పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2025లో కేంద్రం నిర్వహించే జన గణనలో ఓబీసీ కులగణనను చేర్చేలా ప్రధాని మోదీని బీజేపీ నేతలు ఒప్పిస్తే రాహుల్ కులం ఏంటో తెలుస్తుందని అన్నారు. బీజేఎల్పీ నేతగా తన పదవి ఎప్పుడు ఊడుతుందో తెలియని ఆందోళనలో ఉన్న మహేశ్వర్ రెడ్డి తికమకగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీతో కలిసి నిర్మల్‌లో పాదయాత్ర చేసినప్పుడు ఆయన కులం ఏంటో మహేశ్వర్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ని తొలగించి అగ్రవర్ణాలకు చెందిన కిషన్‌రెడ్డికి కట్టబెట్టిన బీజేపీకి బీసీ కుల గణనను విమర్శించే హక్కు లేదని అన్నారు.

కొడంగల్ ఎత్తిపోతల్లో సీఎం వాటా ఎంత?.. ఢిల్లీ వాటా ఎంత?

▶ మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి హోదాలో ఇప్పుడు రూ.వేల కోట్ల విలువ చేసే పనులు అప్పగిస్తున్నారు. గతంలో 'అరాచక కంపెనీ', 'ఆంధ్రా కంపెనీ', 'పొలిటికల్ మాఫియా'అని సదరు కాంట్రాక్టు సంస్థపై ఆరోపణలు చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు దానిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? హైదరాబాద్ నగరానికి కృష్ణా జలాలను తెచ్చేందుకు చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ సదరు సంస్థ నేరపూరిత నిర్లక్ష్యం మూలంగా కూలిపోయినా బ్లాక్ లిస్టులో పెట్టకపోవడానికి కారణమేంటో చెప్పాలి. కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని విచారణ కమిటీ ఇచ్చిన రిపోర్టును రేవంత్‌రెడ్డి తారుమారు చేసే అవకాశం ఉంది. ఆ నివేదికను వెంటనే బయట పెట్టాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

గోదావరి జలాల పేరిట రూ.5,500 కోట్ల కుంభకోణం

'ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్'నిబంధన పక్కన పెట్టి మంత్రివర్గ సభ్యుడైన పొంగులేటికి సంబంధించిన కంపెనీకి మూసీ ప్రాజెక్టు పనులు ఇస్తున్నారు. రేవంత్‌కు సహాయ మంత్రిలా వ్యవహరిస్తున్న బండి సంజయ్ కూడా దీనిపై మాట్లాడటం లేదు. ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ గురించి మాట్లాడుతున్న మోదీ ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదు. కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలించేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,100 కోట్లతో ప్రతిపాదించిన పనులు రద్దు చేశారు. ఇప్పుడు అంచనాలు రూ.5,500 కోట్లకు పెంచి మరో భారీ కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. ఈ ప్రాజెక్టును కూడా 'ఈస్ట్ ఇండియా కంపెనీ'కి ఇచ్చేందుకే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. సీఎం చెప్పిన చోట అధికారులు సంతకాలు పెడితే ఉద్యోగాలు ఊడటం ఖాయం..'అని మాజీ మంత్రి హెచ్చరించారు.

పొంగులేటీ.. నువ్వు జైలుకు పోకుండా చూసుకో

'అరెస్టులు అంటూ అందరి జాతకాలు చెప్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తాను జైలుకు వెళ్లకుండా చూసుకోవాలి. పొంగులేటి నివాసంలో జరిగిన ఈడీ దాడులపై ఇప్పటివరకు బీజేపీ స్పందించలేదు. ఐటీసీ కోహినూర్ హోటల్లో అదానీ కాళ్లు పట్టుకుని, కడుపులో తలపెట్టి తనను కాపాడాలని పొంగులేటి కోరాడు. రేవంత్ నివాసంలో గౌతమ్ అదానీ కొడుకు కరణ్ అదానీతో 4 గంటల సుదీర్ఘ భేటీ జరిగింది. ఈడీ దాడిలో ఏం జరిగిందో పొంగులేటి చెప్పాలి. అరెస్టుల గురించి చెప్పడానికి పొంగులేటి ఎవరు? వీళ్లు నడిపేది సర్కారా లేక సర్కస్సా?. గొట్టంగాళ్లకు భయపడేది లేదు. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటులో కాంగ్రెస్ హస్తం ఉంది. మరమ్మతు చేయక పోవడం వెనుక ఏదో మతలబు ఉంది. కేసీఆర్‌ను బదనాం చేసేందుకు ఈ అరాచక శక్తులు ఎంతకైనా తెగిస్తాయి. కుంభకోణాలను బయట పెడుతున్నందుకు మమ్మల్ని ఇబ్బంది పెట్టే పనులు చేస్తారు. అయినా ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన బూసాని

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో భేటీ
- ఇప్పటివరకు బీసీ కమిషన్ చేసిన అధ్యయనాల సమాచారం సేకరణ



నిరంజన్‌తో సమావేశమైన బూసాని వెంకటేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ నాలుగో అంతస్తులో కమిషన్‌కు ప్రభుత్వం కార్యాలయాన్ని కేటాయించింది. డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శిగా బీసీ గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు వ్యవహరించనున్నారు.

బీసీ కమిషన్‌తో బూసాని భేటీ

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు బుధవారం తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో సమావేశమయ్యారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తెలంగాణ బీసీ కమిషన్ చేపట్టిన అధ్యయనాలు, పరిశీలనలు, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా రూపొందించిన నివేదికలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. వివిధ రాష్ట్రాల్లో బీసీ కమిషన్ పర్యటించి చేసిన అధ్యయనం తాలూకు నివేదికలపై లోతుగా చర్చించారు. అలాగే ప్రభుత్వ శాఖల నుంచి కూడా బీసీలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించనున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి బీసీ కమిషన్ బహిరంగ విచారణ

- నిజామాబాద్ జిల్లాలో బీసీ కులాల సామాజిక బహిష్కరణపై సీరియస్
- కేసు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డీజీపీకి లేఖ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 18వ తేదీ నుంచి బహిరంగ విచారణ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని తెలంగాణ బీసీ కమిషన్ నిర్ణయించింది. ఉమ్మడి పది జిల్లాల్లో బహిరంగ విచారణ కార్యక్రమం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి ఐదు జిల్లాల్లో పూర్తి చేయగా.. మిగిలిన నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 28 నుంచి నవంబర్ 2 వరకు ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణాల్లో నిర్వహించిన బహిరంగ విచారణ కార్యక్రమాలపై బుధవారం బీసీ కమిషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీలు బీసీ కులాల వారిని సామాజికంగా బహిష్కరించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కమిషన్ చైర్మన్ తెలిపారు. ఆయా కమిటీలపై కఠినచర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీకి లేఖ రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, బోగస్ కుల ధ్రువీకరణ పత్రాల జారీపై మీడియాలో వస్తున్న కథనాలపైనా కమిషన్ స్పందించింది. అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. బహిరంగ విచారణ సందర్భంగా తమ దృష్టికి వచ్చిన వివిధ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కూడా కమిషన్ నిర్ణయించింది.



ఎంత తీసుకుంటే అంతగా మెదడు విస్తరిస్తుంది.

– సెనెకా

సాక్షి

గురువారం, 7 నవంబర్ 2024

ట్రంప్‌కే అమెరికా పట్టం

అంచనాలను మించిన విజయం ఇది. హోరాహోరీ పోరన్న సర్వేల జోస్యాన్ని తలకిందులు చేసిన ఫలితం ఇది. నవంబర్ 5 జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇటు పాపులర్ ఓటులోనూ, అటు ఎలక్టోరల్ ఓటులోనూ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ తిరుగులేని ఆధిక్యం సంపాదించారు. ప్రత్యర్థి, డెమోక్రాటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్‌కు అందనంత దూరంలో నిలిచి, అమెరికా 47వ అధ్యక్షుడిగా పీఠం ఖరారు చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తి కావడానికి మరింత సమయం పట్టనున్నప్పటికీ, ఇప్పటికే ఎలక్టోరల్ కాలేజ్‌లో కావాల్సిన 270 సీట్ల మెజారిటీని ఆయన దాటేశారు. పన్ను తగ్గింపు సహా ప్రజాకర్షక వాగ్దానాలు, కట్టుదిట్టమైన వాణిజ్య షరతుల విధానం, వలసదారులకు అడ్డుకట్ట లాంటి వాటితో అమెరికాను మళ్ళీ అగ్రస్థానానికి తీసుకువెళతానన్న ట్రంప్ మాటలను అమెరికన్లు విశ్వసించారు. అందుకే, గడచిన రెండు అధ్యక్ష ఎన్నికల్లోనూ ఫలితాన్ని హైజాక్ చేశారంటూ గెలిచిన పార్టీపై ఓడిన పార్టీ చేస్తూ వచ్చిన ఆరోపణలకు ఈసారి తావివ్వకుండా అఖండ విజయం అందించారు. ఇక, తమిళనాడుతో బంధమున్న కమల గెలవకున్నా, తెలుగు మూలాలున్న మనమ్మాయి ఉష భర్త జె.డి. వాన్స్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడం భారతీయులకు ఊరట నిచ్చింది.

రెండుసార్లు అభిశంసనకు గురై, అనేక క్రిమినల్ కేసులను ఎదుర్కొంటూ, ఒక దశలో అధ్యక్ష పదవికి పోటీ చేయడానికీ అనర్హులవుతారనే ప్రచారం నుంచి పైకి లేచి, 900 పైగా ర్యాలీలతో తమ పార్టీకి తిరుగులేని విజయం కట్టబెట్టడం ట్రంప్ సృష్టించిన చరిత్ర. అలాగే, ఎప్పుడూ డెమోక్రాటిక్ పార్టీకే మద్దతుగా నిలిచే మైనారిటీ ఓటర్లను పెద్ద సంఖ్యలో ఆకర్షించి, అమెరికా దేశీయ రాజకీయాల్లో కొత్త రాజకీయ పునరేకీకరణకు ఆయన శ్రీకారం చుట్టారు. ఎప్పుడూ డెమోక్రాట్లకు మద్దతుగా నిలుస్తూ వచ్చిన భారతీయ అమెరికన్లు సైతం ఈసారి ఎక్కువగా రిపబ్లికన్ల వైపే మొగ్గడం విశేషం. పీడిస్తున్న ద్రవ్యోల్బణం, పెరుగుతున్న నిరుద్యోగం నుంచి ట్రంప్ బయట పడేస్తారనే ప్రజా భావన కలిసొచ్చింది. ఎన్నికల ప్రచారంలో జరిగిన హత్యాయత్నాల సానుభూతి సరే సరి. ఇలాంటివన్నీ ట్రంప్‌కు అనుకూలించి, కమల అధ్యక్ష పదవి ఆశలను తలకిందులు చేశాయి. ఉదారవాదులు ఎంత వ్యతిరేకించినా విజయం ట్రంప్‌నే వరించింది.

మహిళల అబార్షన్ హక్కుకు అనుకూలంగా కమల నిలబడడంతో స్త్రీలు ఆమెకు బ్రహ్మరథం పడతారని భావించారు. అది కొంతమేర జరిగింది కానీ, అధ్యక్ష పదవి అందుకోవడానికి అదొక్కటే సరిపోలేదు. శ్వేత మహిళల్లో గతంతో పోలిస్తే కమలకు కొంత మద్దతు పెరిగింది. అయితే, ఆఖరికి ఆ వర్గంలోనూ ట్రంప్‌కే అధికశాతం ఓట్లు పడ్డాయి. మొత్తం మీద పురుషుల్లో అధికంగా ట్రంప్‌కూ, మహిళల్లో ఎక్కువగా కమలకూ ఓటు చేశారని తొలి లెక్క. మహిళా నేత ఏలుబడికి అమెరికా సమాజం ఇప్పటికీ సిద్ధంగా లేదనీ, గతంలో హిల్లరీ క్లింటన్‌కైనా, ఇప్పుడు కమలకైనా ఎన్నికల ఫలితాల్లో ఈ లింగ దుర్విచక్షణ తప్పలేదనీ వినిపిస్తున్నది అందుకే. ఇక, గతంలో పెద్దగా ఓటింగ్‌లో పాల్గొనరని పేరున్న యువ, పురుష ఓటర్ల వర్గం ఈసారి పెద్దయెత్తున వచ్చి ఓటేయడం, ముఖ్యంగా శ్వేత జాతీయుల్లో అత్యధికులు ట్రంప్‌కే పట్టం కట్టడం గమనార్హం. ఒక్క నల్ల జాతీయుల్లో మాత్రమే 78 శాతం మంది పురుషులు, 92 శాతం మంది స్త్రీలు కమలకు ఓటేశారు. అమెరికన్ సమాజంలోని కనిపించని నిట్టనిలువు చీలిక, వర్ణవిచక్షణకు ఇది ప్రతిబింబమని ఓ వాదన.

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికవడం, సెనేట్‌లో రిపబ్లికన్ పార్టీ పూర్తి నియంత్రణ సాధించడం అమెరికా రాజకీయాల్లో అతి పెద్ద మలుపు. 2016లో తెలియకున్నా ఇప్పుడు మళ్ళీ పట్టం కడుతున్నప్పుడు ఆయన వ్యవహారశైలి సహా అన్నీ తెలిసే అమెరికన్లు ఆ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడిక సెనేట్‌పై పట్టుతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రజాస్వామ్యయుతంగా ప్రపంచానికి కట్టుబడిన అగ్రరాజ్య విధానం నుంచి పూర్తి భిన్నంగా అమెరికాను ట్రంప్ కొత్త మార్గం పట్టిస్తారని ఒక విశ్లేషణ. అమెరికా జాతీయ ప్రయోజనాల దృక్కోణం నుంచే ప్రపంచాన్ని చూడడం ట్రంప్ పద్ధతి. వాణిజ్య ప్రయోజనాలే గీటురాయిగా ఆయన ముందుకు సాగవచ్చు. అలాగే, ఉక్రెయిన్‌కు సైనిక సాయం ఆపి, ఆక్రమణ జరిపిన రష్యాతో శాంతి చర్చలు జరపాలన్న ట్రంప్ వైఖరి పర్యవసానం యూరప్ అంతటా ఉంటుందని అక్కడి దేశాలు బెంగపడుతున్నాయి.

భారత్‌కు సంబంధించినంత వరకు ట్రంప్ ఎన్నిక శుభవార్తే. నిజానికి, ప్రస్తుత డెమోక్రాట్ల హయాంలోనూ అమెరికా – భారత సంబంధాలు బాగున్నాయి. అయితే, భారత ప్రధాని మోదీతో ట్రంప్ చిరకాల మైత్రి వల్ల రానున్న రిపబ్లికన్ ప్రభుత్వ ఏలుబడి మనకు మరింత సానుకూలంగా ఉంటుందని ఆశ, అంచనా. ఇతర దేశాల సంగతికొస్తే... ట్రంప్ ఎన్నిక ఇరాన్, బంగ్లాదేశ్ లాంటి వాటికి కష్టాలు తెస్తే, ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ లాంటి వారికి ఆనందదాయకం. కమల గద్దెనెక్కితే బాగుండనుకున్న చైనా, ఉక్రెయిన్‌ల ఆశ నెరవేర లేదు. అమెరికాలోని దాదాపు 1.1 కోట్ల మంది అక్రమ వలసదారులను వెనక్కి పంపుతానంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ట్రంప్ రానున్న జనవరిలో అధికారం చేపడుతూనే ఆ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్టు ఆయన అధికార ప్రతినిధులు బుధవారమే తేల్చేశారు. అంటే, ఆది నుంచి ట్రంప్ దూకుడు చూపనున్నారన్న మాట. అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ అధికార క్రమాన్నే మార్చేయాలని చూస్తున్న ఆయన ధోరణి అమెరికానూ, మిగతా ప్రపంచాన్నీ ఎటు తీసుకువెళుతుందో వేచి చూడాలి. సమస్యల్ని పరిష్కరిస్తానంటూ ఎన్నికల నినాదం చేసిన ట్రంప్ కొత్తవి సృష్టిస్తే మాత్రం కష్టమే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, **తిథి:** శు.షష్ఠి రా.8.54 వరకు, తదుపరి సప్తమి,
నక్షత్రం: పూర్వాషాఢ ఉ.9.27 వరకు, తదుపరి ఉత్తరాషాఢ,
వర్జ్యం: సా.5.20 నుండి 6.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.52 నుండి 10.40 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు,
అమృతఘడియలు: రా.2.55 నుండి 4.30 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

వ్యవసాయ రంగమే ఉపాధికి ఊతం

విశ్లేషణ



డి. పాపారావు

నగర ప్రాంతాలకు తరలి వస్తోన్న లక్షలాదిమంది ప్రధానంగా ఉపాధిని పొందుతోంది, నిర్మాణ రంగంలోనే. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి పరిణామాలు అక్కడా ఉపాధికి గండికొడుతున్నాయి. ఈ స్థితిలో ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధికి రఘురామ్ రాజన్ వంటి వారు కూడా సేవారంగాన్ని ఎందుకు పరిష్కారంగా చెప్పజూస్తున్నారు? నేటి ప్రపంచ పరిస్థితులలో సరుకు ఉత్పత్తి రంగం గానీ, సేవా రంగం గానీ కోట్లాది మంది నిరుద్యోగులకు బతుకుతెరువును చూపగల స్థితి లేదు. మిగిలిందల్లా, వ్యవసాయ రంగమే. వ్యవసాయం లాభసాటిగా ఉంటే గ్రామీణులు నగరాలకు రారు. అప్పుడు కారుచవకగా కార్పొరేట్లకు కార్మికులు దొరకరు. అందుకే వ్యవసాయం లాభసాటిగా లేకుండా 'జాగ్రత్తపడటమే' ఇప్పటి విధానం.

దేశంలోని సుమారు 65% జనాభా 35 ఏళ్ల లోపువారు. వీరికి నిరుద్యోగం, చదువుకు తగిన ఉద్యోగం లేకపోవడం ప్రధాన సమస్యలు. కోవిడ్ అనంతరం సమస్య మరింత జటిలం అయ్యింది. 2016లో మోదీ తెచ్చిపెట్టిన పెద్ద నోట్ల రద్దు, 2017లో హడావుడిగా ఆరంభమైన జీఎస్టీ వంటివి చిన్న, మధ్యతరహా పరిశ్రమలను దెబ్బతీసి నిరుద్యోగ సమస్యను మరింత పెంచాయి.

దేశంలో సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామనే వాగ్దానం ఆసరాగా 2014లో బీజేపీ అధికారంలోకి రాగలిగింది. ఇదే నేపథ్యంలో, మోదీ ప్రభుత్వం సరుకు ఉత్పత్తి రంగాన్ని దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక ఉపాధి కల్పనా రంగంగా... దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 25% స్థాయికి చేర్చే పేరిట 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని ఆరంభించింది. దశాబ్ద కాలం తర్వాత, వెనక్కిచూసుకుంటే స్థూల జాతీయ ఉత్పత్తిలో ఈ రంగం వాటా 15– 17 శాతం మధ్య ఎదుగూ బొదుగూ లేకుండా మిగిలిపోయింది. 2020లో ఆరంభమైన 'ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల' పథకం కూడా సాధించింది నామ మాత్రమే.

మేకిన్ ఇండియా కార్యక్రమం విజయవంతం అయ్యే అవకాశాలు లేవంటూ అప్పట్లోనే రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ చెప్పారు. చైనా ప్రపంచం యావత్తుకూ సరిపోయే స్థాయిలో, చవకగా సరుకులను ఉత్పత్తి చేస్తోంది గనుక ప్రపంచానికి మరో చైనా అవసరం లేదంటూ సున్నితంగా హెచ్చరించారు. ఈ రచయిత కూడా 2008 ఆర్థిక సంక్షోభం అనంతరం, అంతర్జాతీయంగా డిమాండ్ పతనం వంటి వివిధ కారణాలను పేర్కొంటూ మేకిన్ ఇండియా, దేశ సమస్యలకు పరిష్కారం కాదంటూ ఒక వ్యాసం రాసివున్నారు.

దేశంలో నిరుద్యోగం పరిష్కారానికీ, వృద్ధి రేటు పెంపుదలకూ దారి ఏమిటనే చర్చ ముమ్మరంగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలోనే, ఈ మధ్య రఘురామ్ రాజన్ 'బ్రేకింగ్ ద మౌల్డ్: రీ ఇమేజింగ్ ఇండియాస్ ఎకనామిక్ ఫ్యూచర్' పేరిట రోహిత్ లాంబా అనే పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయ ఆచార్యునితో కలిసి ఒక పుస్తకం రాశారు. దీనిలో భాగంగా మేకిన్ ఇండియా, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక విధానాలు ఖర్చు ఎక్కువ, ఫలితం తక్కువగా తయారయ్యాయని పేర్కొన్నారు. ఈ సరుకు ఉత్పత్తి రంగంపై దృష్టిని కాస్తంత తగ్గించుకొని, భారతదేశం ఇప్పటికే 'బలంగా' వున్న సేవా రంగంపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా మెరుగైన ఉపాధి కల్పన, వృద్ధి రేటులను సాధించవచ్చనేది వారి వాదన. దీని కోసమై యువజనుల నిపుణతల స్థాయిని పెంచి వారిని సేవా రంగ ఉపాధికి సిద్ధం చేయాలన్నారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం కొరియా, జపాన్... అలాగే చైనా వంటి దేశాలు అనుసరించిన ఆర్థిక వృద్ధి నమూనా అయిన మొదటగా వ్యవసాయ రంగం నుంచి సరుకు ఉత్పత్తి రంగం దిశగా సాగడం...



అనంతరం మాత్రమే సేవా రంగం వృద్ధి దిశగా పయనించడం అనివార్యం కాదని రాజన్ వాదిస్తున్నారు. అనేక ధనిక దేశాలలో ఇప్పటికే సేవా రంగం వాటా జీడీపీలో 70% మేర ఉందనీ, ఈ రంగంలో జీడీపీ వాటా సుమారు 60% పైన వున్న భారత్ కూడా పాత నమూనాని పక్కన పెట్టి మరింతగా సేవా రంగంలోకి వెళ్ళాలనేది రాజన్ తర్కం.

సేవా రంగం వృద్ధి చెందాలంటే యువజనుల విద్యా నిపుణతల స్థాయి సరుకు ఉత్పత్తి రంగంలో కంటే అధికంగా ఉండాలి. ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా సేవా రంగం తాలూకు సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రవేశించగలగడంలో ఎదుర్కొంటున్న సాఫ్ట్ స్కిల్స్ లోటును చూస్తున్నాం. సేవా రంగంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యం అవసరం తెలిసిందే. దేశంలోని ఎంతమంది యువజనులకు ఈ రంగంలో ప్రవేశించగల స్థాయి ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఉంది? దేశంలోని మొత్తం కార్మికులలో 70% మంది మాత్రమే అక్షరాస్యులు. వీరిలో కూడా 25% మంది ప్రాథమిక స్థాయి విద్యలోపే పాఠశాల చదువు మానివేసిన వారు. దేశంలోని 20% సంస్థలు మాత్రమే తమ ఉద్యోగులకు తగిన శిక్షణను ఇచ్చుకునే ఏర్పాట్లను కలిగి వున్నాయి (ప్రపంచ బ్యాంకు పరిశోధన).

ఈ స్థితిలో, గ్రామీణ యువజనులను సేవా రంగం దిశగా ఇప్పటికిప్పుడు తీసుకెళ్ళగలమా? నేడు సాఫ్ట్‌వేర్ రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి పరిణామాలు అక్కడా ఉపాధికి గండికొడుతున్నాయి. ఈ స్థితిలో, ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి కోసం రఘురామ్ రాజన్ వంటి వారు కూడా సేవా రంగాన్ని ఎందుకు పరిష్కారంగా చెప్పజూస్తున్నారు?

దీనికి కారణం ఒక్క ముక్కలో చెప్పాలంటే 'బీయింగ్ డిటర్మిన్స్ కాన్షియస్‌నెస్' (మన అస్తిత్వమే మన ఆలోచనలను నిర్ణయిస్తుంది) అనే కార్ల్ మార్క్స్ ఉద్బోధన. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలో 2003 నుంచి 2007 వరకూ ప్రధాన ఆర్థిక సలహాదారుగా పని చేసిన రాజన్ కూడా దాటుకుని రాలేని నిజం. ఆయన అస్తిత్వం తాలూకు పరిమితులే, ఆయనను వాస్తవాన్ని చూడనివ్వడం లేదు. నేటి ప్రపంచ పరిస్థితులలో అటు సరుకు ఉత్పత్తి రంగం గానీ, ఇటు సేవా రంగం గానీ, కోట్లాది మంది నిరుద్యోగ యువతకు బతుకుదెరువును చూపగల స్థితి లేదు. మిగిలిందల్లా, మన వ్యవసాయ రంగమే. ఈ రంగంలో ఇప్పటికే, అవసరాన్ని మించి మానవ వనరులు చిక్కుకు పోయి ఉన్నాయన్నది నిజం.

ప్రస్తుత ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల 'సంస్కరణల' యుగంలో వ్యవసాయ రంగంపై చిన్న చూపు పెరిగింది. గ్రామీణ వ్యవసాయ రంగం, నగర ప్రాంత పారిశ్రామిక రంగాల మధ్యన ఉన్న సమీకరణం గ్రామీణ ప్రాంతాలకు వ్యతిరేకంగా ఉంది. వ్యవసాయ రంగ సరుకులను కారు చవుకగా, నగర ప్రాంతాలలో అందుబాటులో ఉంచడమనేది పారిశ్రామిక కార్పొరేట్ వర్గాల అవసరం. గ్రామీణ రైతాంగానికి లాభసాటి ధరలను కల్పిస్తే ఆ సరుకుల ధరలు, నగర ప్రాంత మార్కెట్‌లలో అధికంగా ఉంటాయి. నగర ప్రాంత కార్మికులు, ఉద్యోగులకు అవి ఖరీదైనవి అవుతాయి. అప్పుడు వేతనాల పెంపుదల కోసం యజమానులపై ఒత్తిడి తెస్తారు. ఇది పారిశ్రామిక అశాంతిగా మారవచ్చు. ఒక మోస్తరు వేతనాలతోనే పని చేయించుకోగలగాలంటే రైతాంగ ఉత్పత్తులకు తక్కువ ధరలు ఉండేలా జాగ్రత్తపడడం కార్పొరేట్లకు అవసరం.

గ్రామీణ రైతాంగానికి వ్యవసాయం లాభసాటిగా ఉంటే వారు నగరాలకు రారు. అప్పుడు నగర ప్రాంతాలలో కార్మికుల సరఫరా తగ్గుతుంది. కార్మికులకు డిమాండ్ పెరుగుతుంది. దీని వలన, పారిశ్రామికవేత్తలు అధిక వేతనాలను చెల్లించి పనిలో పెట్టుకోవలసి వస్తుంది. దీనికి కూడా పరిష్కారమే గ్రామీణ వ్యవసాయం లాభసాటిగా లేకుండా 'జాగ్రత్తపడడం'. ఈ కథలో సూత్రధారులు ప్రపంచీకరణ వంటి నయా ఉదారవాద విధానాలను మన మీద రుద్దుతోన్న ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధులు. ఆ ఆలోచనా విధానం తాలూకు ప్రతినిధిగా రఘురామ్ రాజన్ వ్యవసాయం ఊసు ఎత్తలేరు. దాన్ని దేశానికీ, ఉపాధి కల్పనకూ దారిగా చూపలేరు. రైతుకు వ్యవసాయం లాభసాటిగా ఉంటే అది అతని కొనుగోలు శక్తిని పెంచి తద్వారా నగర ప్రాంత పారిశ్రామిక సరుకులకు డిమాండ్‌ను కల్పిస్తుంది. దేశ జనాభాలోని 55% పైన ఉన్న రైతాంగం బాగుంటే, విదేశాలలోని డిమాండ్, కొనుగోలు శక్తి, ఎగుమతులతో నిమిత్తం లేకుండా దేశంలోనే డిమాండ్‌ను సృష్టించవచ్చు. ఈ పరిష్కారాన్ని చెప్పలేని మేధా దుర్బలత్వంతో రఘురామ్ రాజన్ వంటివారు మిగిలిపోతున్నారు.

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఈ రోజు...



శాంతి సౌభాగ్యాలు కావాలనుకుంటున్న యూదులు, ముస్లింలకు యూఎస్ ఎన్నికల తీర్పు ఒక గొప్పరోజు. తమను తాము ద్వేషించుకునే యూదులు, జిహాదీ ముస్లింలకు చెడ్డరోజు.

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

దేనికి సంబరం?



అధిక పన్నులు, బలమైన డాలర్ అయిన ట్రంప్ ఎజెండా (ఒకవేళ అమలు చేస్తే) ఎదుగుతున్న మార్కెట్లకు శుభకరం కాదు. కానీ భారతీయ ట్రేడర్లు ట్రంప్ గెలుపునకు సంబరపడుతున్నారు. అదేదో అంటారు కదా, ఊళ్లో పెళ్లికి ఇంకెవరిదో హడావిడి అని...!

– దేబాశీష్ బసు, జర్నలిస్ట్

అంగీకరిస్తారా?



ఇదేమీ గుణపాఠం కాదు. ట్రంపిజం అనేదాన్ని ఆర్థికాంశాలు నడపడం లేదు. కొందరు ఒప్పుకోవడానికి నిరాకరిస్తున్న సాంస్కృతిక అనంగీకారాలు దీన్ని నడుపుతున్నాయి. దీన్ని ఇలాగే నిరాకరించడం కొనసాగిస్తే పెద్ద తప్పు అవుతుంది.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్

ప్రజాస్వామ్యం సురక్షితమేనా?



అందంగా ఉండి ఇట్టే పగిలిపోయే వస్తువులను అమ్మే దుకాణాల్లోని సూచనలను మీరు చూసి వుంటారు. 'చూడ్డానికి బాగుంటుంది, పట్టుకుంటే ముద్దుగా ఉంటుంది, కానీ పగిలిందా అమ్మేసినట్టే.' ప్రజాస్వామ్యం గురించి కూడా మీరు అదే చెప్పొచ్చు.

– స్టీఫెన్ కింగ్, యూఎస్ రచయిత

తప్పెక్కడుంది?



ప్రపంచంలో పెద్ద పాడ్‌కాస్టర్ అయిన జో రోగన్ (1.74 కోట్ల సబ్‌స్క్రైబర్లు) తన జీవిత కాలం ఉదారవాద అనుకూలుడిగా ఉన్నారు. ట్రంప్‌కు ఎన్నటికీ వేదికను ఇవ్వనని చెప్పినవాడు ఒక ఎన్నిక చక్రం పూర్తయ్యేసరికి ట్రంప్ అనుకూలుడిగా మారారు. డెమోక్రాట్లు అద్దంలో చూసుకుని ఇలా ఎందుకు జరుగుతోందని ప్రశ్నించుకోవాలి.

– ఫర్జాద్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

స్థిరమైన హయాం



ఆయన్ని ఇష్టపడకపోవడంలో పెద్ద అదేమీ లేదు; నేనూ ఇష్టపడను. కానీ నరేంద్ర మోదీ హయాం ఇప్పటికి ఆరుగురు బ్రిటన్ ప్రధానులను, నలుగురు అమెరికా అధ్యక్షులను, ఒక ప్రపంచ మాంద్యాన్ని చూసింది. ఇంకా పదవిలో చాలాకాలం ఉండనే వుంది. ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఇది ప్రశంసించదగినదే. ప్రపంచంలోని ఏ పెద్ద ప్రజాస్వామ్యం కూడా ఇంత స్థిరత్వాన్ని ఇటీవల చూపలేదు.

– అమిత్ శాండిలియా, కాలమిస్ట్

లెక్కింపు కాలేదా?



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్లు కూడా వెంటనే లెక్కించడం పూర్తయిపోయింది. అంటే పేపర్ బ్యాలెట్లను వేగంగా లెక్కించొచ్చు. ఈవీఎంలే అన్నింటికీ పరిష్కారం కాదు. అయినా మన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ దీనికి ఒప్పుకోరు.

– సందీప్ మనుధానె, విద్యావేత్త

ఇన్ బాక్స్

ఆ నిబంధన మార్చాలి!

ప్రస్తుతం శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన సందడి రాష్ట్రంలో నెలకొని ఉంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నిక కోసం పట్టభద్రుల ఓటరు నమోదుకు ప్రభుత్వం ఈ నెల 6వ తేదిని ఆఖరు తేదీగా ప్రకటించింది. ఈ ఓటు హక్కు కోసం 2021లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని ప్రకటించింది. ఆ యా పార్టీల అభ్యర్థులు, వ్యాపార సంస్థల నుండి పట్టభద్రులుగా ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోవాలనుకునే వారు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యేకంగా ఓ సెల్ నెంబరు ద్వారా ఓటు నమోదు కోసం గ్రాడ్యుయేట్లను కోరుతున్నారు. అయితే పట్టభద్రులు తమ ఓటును రిజిస్టర్ చేసుకోవడానికి గెజిటెడ్ ఆఫీసర్ సంతకం తప్పనిసరి కావడంతో... చాలామంది రిజిస్ట్రేషన్‌కు వెళ్లడానికి బద్ధకిస్తున్నారు.

వాస్తవానికి ఓటు హక్కును సులువుగా ఉపయోగించుకునేలా ప్రభుత్వమే చర్యలు తీసుకుంటే బాగుండేది. అలా చేయకపోవడం వల్ల అనేక మంది పట్టభద్రులు ప్రత్యేకంగా ఆన్‌లైన్ సెంటర్లకు వెళ్లి ఓటు నమోదు చేసుకోడానికి సమయం వెచ్చించడం లేదు. పట్టభద్రుల ఓటు నమోదు కోసం ఉంచిన వెబ్ సైట్‌లో డిగ్రీ ధ్రువపత్రం, ఆధార్ కార్డ్, ఓటర్ కార్డు నంబర్లను నమోదు చేసినా... మళ్లీ గెజిటెడ్ స్థాయి అధికారి సంతకంతో ధ్రువీకరించిన పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలనే షరతు చికాకు కలిగిస్తోంది. అందుకే చాలామంది తమ ఓటును రిజిస్టర్ చేసుకోవడానికి ఆసక్తి చూపడంలేదు. ఒకవేళ ఇదే మంచి ఆలోచన అని ప్రభుత్వం భావించినప్పుడు ఆ యా మండల స్థాయిలోనే ఒకరిద్దరు గెజిటెడ్ స్థాయి అధికారులను ఉంచి, అక్కడే ఓటు హక్కును ప్రభుత్వమే నమోదు చేస్తే బాగుండేది. ఈ విషయాన్ని అటు ఎన్నికల కమిషన్, ఇటు ప్రభుత్వం మరోసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఎన్ని షరతులు ఉన్నా... వాటిని అధిగమించి తమ ఓటును రిజిస్టర్ చేసుకోవాలి. మంచి ప్రతినిధిని ఎన్నుకుని గొప్ప భవిష్యత్తుకు బాటలు వేయాలి.

– సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా

స్ఫూర్తిమంతమైన విజయపథంలో...

సందర్భం



వెలిచాల రాజేందర్‌రావు

ప్రత్యర్థులు ఎన్ని అవరోధాలు కల్పించినా అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో విజయం సాధించారు అనుమల రేవంత్ రెడ్డి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కొంత స్తబ్ధంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని విజయ తీరాలకు చేర్చడంలో రేవంత్ పాత్ర అంతా ఇంతా కాదు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ పగ్గాలు చేపట్టాక దూకుడుగా ఉంటూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరు సాగించారు. ఈ సమయంలో పార్టీలో సీనియర్లు, జూనియర్లనే భేదం లేకుండా అందరినీ కలుపుకు పోయారు. కేసీఆర్‌ను గద్దె దించుతానని శపథం చేసి నిజంగానే ఆయన్ని ఇంటికి పంపారు. 2023, డిసెంబర్ 7వ తేదీన తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ పదవీ ప్రమాణం స్వీకారం చేసి ప్రజా పాలనను ప్రారంభించారు.

రేవంత్ రెడ్డి 1969 నవంబర్ 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా (ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లా) వంగూర్ మండలం కొండారెడ్డి పల్లెలో జన్మించారు. చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలున్న రేవంత్ పాఠశాలలో చదివే రోజుల్లోనే స్టూడెంట్ లీడర్ అయ్యారు. 2006లో మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జెల్ జడ్పీటీసీగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్సీగా విజయం సాధించారు. అనంతరం టీడీపీలో చేరారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి శాసనసభకు టీడీపీ అభ్యర్థిగా గెలిచారు. మళ్లీ 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత... అదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా రెండోసారి గెలిచారు. 2017లో టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఓటమి పాలైనా, మరుసటి ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందారు. ఎంపీగా అత్యుత్తమ పని తీరును కనబరిచారు. దీంతో కాంగ్రెస్ అగ్ర నాయకత్వం దృష్టిలో పడ్డారు. ఈ నేపథ్యంలో



2021లో రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అధిష్ఠానం నియమించింది.

అన్నీతానై 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోని లోపాలను ఎత్తిచూపారు. వారి అవినీతిని బయట పెట్టారు. కాంగ్రెస్ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ప్రజలను నమ్మించి కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేర్చారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' కింద వైద్య చికిత్సకు పది లక్షల వరకు సాయం పెంచారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. గత 11 నెలల్లో తెలంగాణలో మహిళలు 101 కోట్ల ఉచిత బస్సు ప్రయాణ ట్రిప్స్ ఉపయోగించుకున్నారు. దీని వల్ల మహిళలకు 3,433 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయి.

రుణమాఫీని బీఆర్ఎస్ పదేళ్లలో సక్రమంగా అమలు చేయకుండా చేతులెత్తేసింది. ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని కేవలం 8 నెలల్లోనే అమలు చేసింది కాంగ్రెస్. 22 లక్షల 22 వేల మంది రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసింది. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తోంది.

కేవలం 11 నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో వేల కొలది ఉద్యోగాలను భర్తీ చేశారు. మూసీ నది పునరుజ్జీవానికి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నారు. 11 నెలల కాలంలోనే బీఆర్ఎస్ పాలనలోని చీకట్లను రేవంత్ రెడ్డి పారదోలి తెలంగాణను అన్ని రంగాల్లో గణనీయంగా అభివృద్ధి చేస్తున్నారు. అటువంటి ప్రియ ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు!

వ్యాసకర్త కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి | 98490 61481

(రేపు సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం)

సమదృష్టి

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మానవుడు జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఆ సమస్యలకు పరిష్కారం అంతరంగం నుండే రావాలి. మనస్సే ఈ సమస్యలనన్నింటినీ సృష్టిస్తుంది. కాబట్టి ఈ సమస్యలను తొలగించడం కూడా మనస్సు చేసే పనే. మనస్సు సమతా స్థితిలో ఉన్నప్పుడు, వివేకంతో సమస్యలనన్నింటినీ బహిర్గతం చేస్తుంది. మందబుద్ధికి ఈ సమస్యలకు అంతమే లభించదు. పైపైన తేలికగా కనపడే సమస్యలన్నీ వట్టి భ్రాంతి మాత్రమే. సుఖ–దుఃఖాలు మానవుని స్వాధీనంలోనే ఉంటాయి. ఈ రెండింటినీ సమదృష్టితో చూడగలిగిన కళను అభ్యసించాలి. అప్పుడే దుఃస్థితులన్నీ తొలగిపోతాయి. కానీ, అది అంత సులభమా అంటే... ఔననే చెప్పాలి. నీవు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకొని, భగవన్నామ సంకీర్తన చేస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నుడవై ఉంటే నీలో సరియైన దృక్పథం వృద్ధి చెందుతుంది. అందువలన నీవు ప్రశాంతంగా ఉండగలవు.

క్షణంలో నీటి బుడగ ఏ విధంగా రూపులేకుండా పోతుందో అదే విధంగా ఈ భూమిపై మనిషి జీవితం కూడా సమసిపోతుంది. ఈ వాస్తవం మన హృదయంలో నాటుకుంటే, మన జీవితం సఫలీకృతమై, ఉపయోగకరంగా ఉంటుంది. ఈ సత్యమునే మనం ఎల్లప్పుడూ తదేకంగా దృష్టిలో పెట్టుకొని జీవితాన్ని గడిపితే బంధ విముక్తులం కాగలం. ఏ మనిషి కూడా గమ్యంలేని జీవితాన్ని గడపకూడదు.

జీవితంలో అన్నిరకాల భోగాలు అందుబాటులో ఉండటం నిజమైన ఐశ్వర్యం కాదు. ఆ విధమైన సంపదలన్నీ బంధాలే. వాటివల్ల నీకు తెలియకుండానే నిన్ను నీవు బంధించుకొంటావు. త్యాగబుద్ధిని పెంచుకోవడంలోనే ఆత్మజ్ఞానం ఉంది. సంపదను భగవంతుడు ఇచ్చిన ప్రసాదంగా వాడుకోవాలి. కొంత ముందుగానో లేక ఆలస్యంగానో ఏదో ఒకరోజు ఈ ప్రాపంచిక సంపదను కోల్పోవలసిందే. అందువలన సంపద పట్ల సమదృష్టిని అలవరచుకోవాలి.

మాజీ సర్పంచ్‌ల బిల్లులు వెంటనే చెల్లించండి

- పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి వినతి

సాక్షి, హైదరాబాద్: గ్రామపంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులతో పాటు మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలకు విజ్ఞప్తి చేశారు. అలాగే జెడ్పీటీసీలు, ఎంపీటీసీల గౌరవ వేతనాలు విడుదల చేయాలని కోరారు. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనివేనని, కాంగ్రెస్ సర్కార్ ఏర్పడ్డాక ఎలాంటి బిల్లులు పెండింగ్ లేదని ఆయన స్పష్టంచేశారు. బుధవారం చాంబర్ ప్రతినిధులు ఎం.పురుషోత్తంరెడ్డి, ఎం.వెంకట్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కొత్త పీఆర్ చట్టాన్ని సవరించి మైనింగ్, సీనరేజీ, స్టాంప్‌డ్యూటీలు పంచాయతీల అకౌంట్‌లో జమ అయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.



విమాన గోపురంపై ఉన్న సుదర్శన చక్రానికి పూజలు చేస్తున్న అర్చకులు

విమాన గోపురానికి కళావరోహణ పూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ దివ్య విమాన గోపురానికి బంగారు తాపడంలో భాగంగా.. బుధవారం సుదర్శన చక్రం, విమాన గోపురం వద్ద అర్చకులు కళావరోహణ పూజ నిర్వహించారు. గోపురం ఎదుట హోమం చేపట్టి, సుదర్శన చక్రానికి నవ కలశ స్నపనం జరిపించారు. విమాన గోపురానికి బంగారు తాపడం పూర్తయిన తరువాత పుణ:కుంభాభిషేకం జరిపించనున్నట్లు ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి తెలిపారు.

విజయానికి ఐదు మెట్లు



పోరు హోరాహోరీ అంటూ విశ్లేషణలు. హారిస్‌దే పైచేయి అంటూ అమెరికా మీడియాలో కథనాల వెల్లువ. అందుకు తగ్గట్టు ట్రంప్‌తో ఏకైక డిబేట్‌లోనూ హారిస్ స్పష్టమైన ఆధిపత్యం. వీటికి తోడు ఆమె ఆఫ్రికన్, భారత మూలాలు. మహిళల దన్నుపై ధీమా. అబార్షన్ వంటి కీలకాంశాలు కలిసొస్తాయన్న అంచనాలు. సెలబ్రిటీల బహిరంగ మద్దతు. రిపబ్లికన్లతో పోలిస్తే ప్రచారానికి వరదలా వచ్చి పడ్డ నిధులు. కానీ తీరా చూస్తే ట్రంప్ హవా ముందు అన్నీ కొట్టుకుపోయాయి. హోరాహోరీ అనుకున్న పోటీ కాస్తా ఫలితాలొచ్చే సరికి ఏకపక్షంగా మారిపోయింది. ట్రంప్ విజయానికి, హారిస్ పరాజయానికి దారితీసిన కారణాలను పరిశీలిస్తే...

- సాక్షి, నేషనల్ డెస్క్

1. అమెరికా ఫస్ట్

2016లో ట్రంప్‌ను విజయతీరాలకు చేర్చిన ఈ నినాదం ఈసారి కూడా గట్టిగా పని చేసింది. ఉక్రెయిన్‌కు మద్దతుగా బైడెన్ సర్కారు వందలాది కోట్ల డాలర్లను గుమ్మరించడం సగటు అమెరికన్లకు మింగుడు పడలేదు. దానికి తోడు చైనా తదితర దేశాల నుంచి కారుచౌకగా వచ్చిపడుతున్న వస్తూత్పత్తులు వారి పొట్టకొట్టడమే గాక ఉపాధికి కూడా ఎసరు పెడుతున్నాయి. అసలే ధరాభారంతో కుంగిపోతున్న అమెరికన్లకు ఈ పరిణామం కొన్నేళ్లుగా రోకటిపోటుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాను ప్రాభవం కొడిగడుతున్న దేశంగా ట్రంప్ అభివర్ణించడాన్ని వారు సమర్థించారు. సుంకాలను భారీగా పెంచడం ద్వారా కారుచౌక దిగుమతులకు అడ్డుకట్ట వేస్తానన్న ప్రకటన అమెరికన్లను ఎంతగానో ఆకట్టుకుంది. ఆర్థిక అవ్యవస్థ సహా అన్ని సమస్యలనూ చక్కదిద్దడానికి హారిస్‌తో పోలిస్తే ట్రంపే సరైన నేత అని మెజారిటీ ప్రజలు భావించారు. 'అమెరికా ఫస్ట్' నినాదానికి విపరీతమైన స్పందన దక్కింది. అంతర్జాతీయంగా అన్ని రంగాల్లోనూ అమెరికా ప్రాధాన్యాన్ని పునరుద్ధరిస్తానన్న వాగ్దానం శ్వేతజాతీయుల మనసు గెలుచుకుంది.

2. అక్రమ వలసలు

వలసదారులు తమ అవకాశాలను తన్నుకుపోతున్నారన్న ఆక్రోశం స్థానికుల్లో చాలా ఏళ్లుగా నెలకొని ఉంది. వారిలోని ఈ వ్యతిరేకతను ట్రంప్ పూర్తిస్థాయిలో సొమ్ము చేసుకోగలిగారు. బైడెన్ నాలుగేళ్ల పాలనలో అమెరికాలోకి రికార్డు స్థాయిలో అక్రమ వలసలు జరిగాయి. వలసదారులు అమెరికన్ల పొట్టకొడుతున్నారన్న ట్రంప్ వాదనతో వారు ఏకీభవించారు. వాటికి అడ్డుకట్ట వేయడమే గాక అక్రమంగా వచ్చిన 10 లక్షల పై చిలుకు మందిని స్వదేశాలకు పంపేస్తానని ప్రకటించడం ట్రంప్‌కు భారీగా లాభించింది.

3. ఎకానమీ

ఈసారి ట్రంప్‌ను గద్దెనెక్కించిన అంశాల్లో అత్యంత ముఖ్యమైనది. బైడెన్ పాలనలో గత నాలుగేళ్లలో ద్రవ్యోల్బణం చుక్కలను తాకింది. నిత్యావసరాల ధరలు అమెరికా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రెండు రెట్లకు పైగా పెరిగిపోయాయి. కరోనా తదితర సమస్యలూ దానికి కారణమైనా ఓటర్లు మాత్రం బైడెన్‌ను, ఆయన డెమొక్రటిక్ పార్టీనే దోషులుగా చూశారు. ట్రంప్ హయాంలోనే ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉండేదన్నది అమెరికన్లలో అత్యధికులు అభిప్రాయపడ్డారు. ఆర్థిక అవ్యవస్థను చక్కదిద్దే సామర్థ్యం విషయంలో ట్రంప్‌తో పోలిస్తే హారిస్ తేలిపోయారని అన్ని సర్వేల్లోనూ తేలింది.

5. భావజాలాలు

పైకి కన్పించకపోయినా అమెరికా సమాజంలో జాత్యహంకారం, పురుషాధిక్య భావజాలం బలంగా వేళ్లూనుకుని ఉన్నాయి. ట్రంప్‌కు శ్వేతజాతీయులు మొదటినుంచీ గట్టి మద్దతుదారులుగా ఉండటానికి ఇది కూడా కారణమేనని చెబుతారు. అందుకే 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' వంటి ట్రంప్ నినాదాల్లో అంతర్లీనంగా దాగున్న ఆ భావనలు ఓటర్లపై గట్టి ప్రభావమే చూపాయని భావిస్తున్నారు. వీటికి తోడు ట్రంప్‌పై కోర్టు కేసులు, క్రిమినల్ అభియోగాలను ప్రజలు పట్టించుకోకపోవడం కూడా ఆయనకు కలిసొచ్చింది. పైగా ప్రస్తుతం దేశానికి కావాల్సింది ఆ దూకుడేనని వారు భావించారు. దీన్ని ట్రంప్ కూడా అంగీకరించడం విశేషం. తనపై ఉన్న కేసులు, అభియోగాలు జనాదరణను మరింతగా పెంచాయని చెప్పుకొచ్చారాయన.

4. గ్రామీణ ఓటర్ల బ్రహ్మరథం

తొలినుంచీ ట్రంప్‌కు గట్టి ఓటు బ్యాంకుగా నిలిచిన గ్రామీణ ఓటర్లు ఆయనకు ఈసారి మరింత దన్నుగా నిలిచారు. గత కొన్ని ఎన్నికలతో పోలిస్తే ఈసారి వారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగినట్టు ఫలితాల సరళి చెబుతోంది. ఈ ట్రెండు దేశవ్యాప్తంగా కొనసాగడం ట్రంప్‌కు బాగా కలిసొచ్చింది. ఎందుకంటే గ్రామీణ ఓట్లను ఆయన దాదాపుగా స్వీప్ చేశారు.

మైనారిటీ ఓటర్లలోనూ పాగా

మెక్సికో తదితర లాటిన్ అమెరికా దేశాల నుంచి తరాల కిందట వలస వచ్చి స్థిరపడ్డ స్పానిష్ మాట్లాడే వారిని హిస్పానియన్లుగా పిలుస్తారు. ఫలితాల్లో వీరి ఓట్లూ కీలకమే. డెమొక్రాటిక్ పార్టీ ఓటర్లలో 12 శాతం దాకా ఉండే హిస్పానియన్లు కొన్నేళ్లుగా రిపబ్లికన్ పార్టీవైపు మొగ్గుతున్నారు. ఆ ట్రెండ్ కూడా ఈసారి కూడా కొనసాగినట్టు కన్పిస్తోంది. దీనికి తోడు హిస్పానియన్లకు, ఇండియన్ అమెరికన్లకు దగ్గరయ్యేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. పోలింగ్ సమీపించిన తరుణంలో బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీలపై దాడులను ఖండిస్తూ చేసిన ప్రకటన ఇండియన్ అమెరికన్లపై ప్రభావం చూపింది. 2020తో పోలిస్తే ట్రంప్‌కు ఈసారి లాటిన్, ఇండియన్ అమెరికన్ ఓట్లు గణనీయంగా పెరిగినట్టు దేశవ్యాప్తంగా 1.15 లక్షల ఓటర్లతో జరిపిన ఏపీ వోట్‌కాస్ట్ ప్రాథమిక సర్వే తేల్చింది. 2020లో బైడెన్‌కు ప్రతి 10 మంది లాటిన్ ఓటర్లలో 9 మంది ఓటేయగా ఈసారి హారిస్‌కు 8 మందే వేసినట్టు పేర్కొంది. 2020లో 60 శాతం పడ్డ హిస్పానియన్ ఓట్లు ఈసారి 50 శాతానికి తగ్గాయి. 30 ఏళ్ల లోపు ఓటర్లలో 2020లో బైడెన్‌కు 60 శాతం మంది ఓటేయగా ఈసారి అది 50 శాతానికి పరిమితమైంది. వారిలో 2020లో ట్రంప్‌కు మూడో వంతే ఓటేయగా ఈసారి అది 40 శాతానికి పెరిగింది. ఈ చిన్న మార్జిన్లే తుది ఫలితాలను గట్టిగా ప్రభావితం చేశాయి.

హారిస్.. ఐదు వైఫల్యాలు



1. ప్రభుత్వ వ్యతిరేకత- బైడెన్ అసమర్థత

జో బైడెన్ నాలుగేళ్ల పాలనలో డెమొక్రాట్లపై అమెరికా అంతటా తీవ్ర ప్రభుత్వ వ్యతిరేకత నెలకొంది. ఆర్థిక వ్యవస్థను అదుపు పెట్టడంలో ఆయన తీవ్రంగా విఫలమయ్యారన్న అపప్రథను మూటగట్టుకున్నారు. అన్ని అంశాలపైనా ఆయన విధానాలపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంది. ఇక బైడెన్ విదేశీ విధానం కూడా విమర్శలపాలైంది. ముఖ్యంగా ఉక్రెయిన్, గాజా యుద్ధాలను నివారించడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. ఆ పార్టీ అభ్యర్థిగా ఇవన్నీ హారిస్‌కు ప్రతికూలంగానే మారాయి. విదేశీ విధానంపై ఆమె వాదన అమెరికన్లను పెద్దగా మెప్పించలేకపోయింది. ఈ విషయంలో ట్రంప్‌తో పోలిస్తే బాగా మెతక అన్న అభిప్రాయం ఆమెకు బాగా చేటు చేసింది. పలు కీలకాంశాలపై తన వైఖరి చెప్పకుండా దాటవేయడం కూడా ప్రతికూలంగా మారింది. నిజానికి హారిస్ ఆలస్యంగా బరిలో దిగినా శాయశక్తులా పోరాడి ట్రంప్‌కు గట్టి పోటీ ఇచ్చారు. కానీ అడుగడుగునా బైడెన్ వైఫల్యాల తాలూకు భారాన్ని మోయాల్సి రావడం హారిస్‌కు అతి పెద్ద ప్రతికూలాంశంగా పరిణమించింది. మెజారిటీ అమెరికన్లకు జీవన్మరణ సమస్యగా మారిన ఆర్థిక అవ్యవస్థను గాడిన పెట్టడానికి ఏం చేస్తానన్నది ఆమె సమర్థంగా వివరించలేకపోయారు. ఈ విషయంలో ఆమెకు మొదటినుంచీ పెద్దగా మార్కులు పడలేదు. దీనిపై ప్రతి సర్వేలోనూ ట్రంప్‌దే పైచేయిగా నిలిచింది. ఏకంగా మూడొంతుల మందికి పైగా ప్రభుత్వ విధానాలన్నీ అట్టర్ ఫ్లాప్ అని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యక్షురాలిగా ప్రభుత్వ విధానాల్లో నాలుగేళ్లుగా భాగస్వామి అయిన హారిస్ వాటితో గట్టిగా విభేదించలేకపోయారు. ఇది అంతిమంగా ఆమె కొంప ముంచింది.

2. దన్నుగా నిలవని లాటిన్లు, ఇండియన్లు

లాటిన్, ఇండియన్ అమెరికన్లు సాంప్రదాయికంగా డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులుగా పేరుబడ్డారు. వారిపై హారిస్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ వారిలో ఎక్కువమంది ఈసారి ట్రంప్‌కే ఓటేసినట్టు ఫలితాల సరళిని బట్టి అర్థమవుతోంది. 2020లో ట్రంప్‌తో పోలిస్తే బైడెన్‌కు ఓటేసిన లాటిన్ అమెరికన్ల సంఖ్య 23 శాతం ఎక్కువని తేలింది. ఈసారి సీన్ రివర్సయింది. లాటిన్ అమెరికన్ల ఓట్లు హారిస్ కంటే ట్రంప్‌కు కనీసం 8 శాతం ఎక్కువగా పడ్డట్టు పోల్ పండితులు అంచనా వేస్తున్నారు! ఇండియన్ అమెరికన్లలో కూడా హారిస్‌కు నిరాశే ఎదురైంది. వారు కొన్నాళ్లుగా రిపబ్లికన్ పార్టీవైపు మొగ్గుతున్నారు. ముఖ్యంగా యువతలో ట్రంప్‌ను సమర్థించే వారి సంఖ్య బాగా పెరిగింది. పురుషుల్లోనూ ఈ ధోరణి పెరిగినట్టు పలు సర్వేల్లో తేలింది. భారతీయ అమెరికన్ పురుషుల్లో 53 శాతం హారిస్‌ను సమర్థించగా 47 శాతం ట్రంప్‌వైపు మొగ్గారు. కానీ మిగతా అమెరికన్ల మాదిరిగా ధరాభారం, ఉపాధి తదితరాలు భారత సంతతి వారిని కూడా ప్రభావితం చేసినట్టు కన్పిస్తోంది.

3. యువ, స్వతంత్ర, తటస్థ ఓటర్ల మొండిచేయి

2020లో బైడెన్‌కు ఓటేసిన వారితో పోలిస్తే అన్ని రకాల ఓటర్లలోనూ హారిస్‌కు మద్దతు తగ్గింది. కేవలం విద్యాధికులైన యువతుల్లో మాత్రమే ఆమె బైడెన్ కంటే ఎక్కువ ఓట్లు సాధించగలిగారు. యువకులు మాత్రం ట్రంప్‌కే జైకొట్టారు. దాంతో మొత్తంగా 2020లో బైడెన్‌తో పోలిస్తే హారిస్‌కు యువత ఓట్లు తగ్గాయి. తటస్థులు, ఉదారవాదుల ఓట్లను కూడా ఆమె అనుకున్నంతగా సాధించలేకపోయారు. హారిస్ ఎంతగానో ఆశలు పెట్టుకున్న అబార్షన్ హక్కుల అంశం కూడా ఆమెకు పెద్దగా కలిసిరాలేదు. ట్రంప్ నియంతృత్వ ధోరణులపై ఆందోళన వెలిబుచ్చడంతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణను ప్రధానాంశంగా పేర్కొన్న ఓటర్లు హారిస్‌కే భారీగా మద్దతిచ్చారు. కానీ అడ్వాంటేజీని పూర్వపక్షం చేస్తూ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులపై ఆందోళనగా ఉన్నవారంతా ట్రంప్‌కే గుండుగుత్తగా ఓటేశారు.

4. ఆదుకోని పట్టణ ప్రాంతాలు

డెమొక్రాట్లకు దన్నుగా నిలుస్తూ వస్తున్న పట్టణ, శివారు ప్రాంతాల్లో కూడా ఈసారి ట్రెండ్ రివర్సయింది. వాటిలోనూ ట్రంప్ గణనీయమైన సంఖ్యలో ఓట్లు సాధించినట్టు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా స్పష్టత వచ్చిన పట్టణ ప్రాంతాల్లో మెజారిటీ చోట్ల 2020లో బైడెన్ సాధించిన ఓట్లతో పోలిస్తే హారిస్ వెనకబడ్డారు. పైగా ఆ తేడా కనీసం ఒకట్రెండు పాయింట్లు, అంతకుమించి నమోదైంది. మిషిగన్ వంటి కీలక స్వింగ్ రాష్ట్రాల్లోనైతే పట్టణ ప్రాంతాల్లో బైడెన్ సాధించిన 14 శాతం ఆధిక్యాన్ని హారిస్ నిలుపుకోలేకపోయారు. ఇది కూడా అంతిమ ఫలితాలపై గట్టి ప్రభావమే చూపింది.

5. సోషల్ మీడియా

ఈసారి అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తేల్చడంలో సోషల్ మీడియా కూడా కీలకంగా వ్యవహరించింది. అమెరికా మెయిన్‌స్ట్రీమ్ మీడియా దాదాపుగా హారిస్‌కే దన్నుగా నిలిచింది. కానీ దానికి అమెరికా ప్రజల్లో విశ్వసనీయత అడుగంటి చాలాకాలమైంది. వారు పెద్ద సంఖ్యలో సోషల్ మీడియాకు మళ్లుతున్నారు. ఈ మార్పును ఒడిసిపట్టుకున్న ట్రంప్ సోషల్ మీడియా ప్రచారంలో దూకుడు కనబరిచారు. ముఖ్యంగా ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ బాహాటం మద్దతు ఆయనకు బాగా కలిసొచ్చింది. జో రోగన్ వంటి పాడ్‌కాస్టర్లు కూడా ట్రంప్‌కు విస్తృతమైన ప్రచారం కల్పించారు.

అమెరికా జనాభాలో ఎవరెంత మంది?

అమెరికా జనాభా	33 కోట్ల పైచిలుకు
శ్వేతజాతీయులు	58.9 శాతం
హిస్పానియన్లు	19.1 శాతం
ఆఫ్రో అమెరికన్లు	12.6 శాతం
ఆసియన్లు	6.1 శాతం
మిగతా వారు	2.4 శాతం
మూలవాసులు	0.7 శాతం
ఇతరులు	0.2 శాతం
ఓటేసేవారిలో	
శ్వేత జాతీయులు	73 శాతం
ఆఫ్రో	11 శాతం
హిస్పానియన్లు	9 శాతం
ఆసియన్లు	2 శాతం

మళ్లీ హౌడీ.. అంటారా?

మనపై ట్రంప్ 2.0 ప్రభావమెంత?

న్యూఢిల్లీ: చరిత్రాత్మక విజయంతో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండో విడత శ్వేతసౌధంలోకి కాలు మోపుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక భాగస్వామి భారత్‌తో వాణిజ్య, దౌత్య సంబంధాలు ఇకపై ఎలా ఉంటాయి? ''హౌడీ.. మోదీ!'' ''నమస్తే ట్రంప్..!'' స్నేహ బంధం కొనసాగుతుందా? మరి మనకు అనుకూలతలు - ప్రతికూలతలు ఏమిటన్నవి ఆసక్తికరంగా మారాయి. 'అమెరికా ఫస్ట్' అనే సూత్రాన్ని అనుసరిస్తూ విదేశాంగ విధానాన్ని సంస్కరించనున్నట్లు ట్రంప్ ఇప్పటికే స్పష్టంగా చెప్పారు. అందువల్ల సహజంగానే ఆయన విధానాలు అందుకు అనుగుణంగానే ఉంటాయి. భారత్–రష్యా సంబంధాల విషయంలో చూసీ చూడనట్లు ఉన్నా వాణిజ్యం, ఇమిగ్రేషన్ నిబంధనలు, సుంకాల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరించవచ్చని భావిస్తున్నారు.

మిత్రుడంటూనే..


2017 నుంచి 2021 వరకు ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా పరిశ్రమల కోసం రక్షణాత్మక విధానాన్ని అనుసరించారు. భారత్, చైనా సహా పలు దేశాల ఎగుమతులపై భారీ సుంకాలను విధించారు. అమెరికా ఉత్పత్తులు, సేవలపై అత్యధిక సుంకాలు విధించే దేశాలపై కఠిన వైఖరి అనుసరించారు. ప్రధాని నరేంద్ర మోదీని ట్రంప్ పలు సందర్భాల్లో తన స్నేహితుడిగా అభివర్ణించినా అదే సమయంలో భారత విధానాలను గట్టిగా వ్యతిరేకించారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీ సుంకాలను విధించటాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. వాణిజ్య నిబంధనలను భారత్ ఉల్లంఘిస్తోందని, అత్యధికంగా సుంకాలను విధిస్తోందని.. టారిఫ్ కింగ్ అంటూ ఘాటుగానే వ్యాఖ్యలు చేశారు. అయితే ట్రంప్ కోరిన విధంగా సుంకాల తగ్గింపు నిబంధనలను అమలు చేస్తే భారత జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) 2028 నాటికి 0.1 శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ సంబంధాలు..

గతంలో ట్రంప్ హయాంలో అమెరికా - చైనా మధ్య సంబంధాలు గణనీయంగా క్షీణించాయి. చైనాను ఆయన గట్టి ప్రత్యర్థిగా పరిగణిస్తారు. ఇది కొంతవరకు భారత్ - అమెరికా మధ్య రక్షణ సంబంధాలు బలోపేతం కావటానికి దోహదం చేసింది. చైనాకు దీటుగా ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా, ఆస్ట్రేలియా, భారత్, జపాన్ కూటమి బలంగా ఎదగాలని ట్రంప్ భావించారు. ఇప్పుడు ఆయన రెండోసారి అధ్యక్షుడు అవుతున్నందున అమెరికా - భారత్ మధ్య ఆయుధ సంపత్తి, సంయుక్త సైనిక విన్యాసాలు, సాంకేతిక మార్పిడి విషయంలో మెరుగైన సమన్వయం ఉండవచ్చు.

వీసా విధానం..

ట్రంప్ విధానాలు వలసదారులకు ఇబ్బందికరమే! స్థానికుల ఉద్యోగాలను వారు లాక్కుంటున్నారని గుర్రుగా ఉన్నారు. వీసా నిబంధనలను కఠినతరం చేస్తే ఐటీ సంస్థలకు, నిపుణులకు కష్టకాలమే!!



సిసలైన వ్యాపారవేత్తగా 1985లో ట్రంప్

వివాదాలకు పెద్దన్న

విలక్షణ నాయకుడు డొనాల్డ్ ట్రంప్

- వ్యాపార కుటుంబం నుంచి శ్వేత సౌధానికి..
- బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుప్రఖ్యాతులు
- సంచలనాలు, వివాదాలతో సహవాసం
- రెండు సార్లు అభిశంసనతో అపఖ్యాతి



మంగళవారం రాత్రి పామ్‌బీచ్‌లో కోడలు లారా, భార్య మెలానియాతో ట్రంప్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ జయకేతనం ఎగురవేశారు. 132 ఏళ్ల అనంతరం మధ్యలో ఒక విరామం తర్వాత రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి అభ్యర్థిగా ఆయన చరిత్ర సృష్టించారు. సంచలనాలు, వివాదాలకు మారుపేరైన ట్రంప్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచారు. వ్యాపారం, స్థిరాస్తి, మీడియా రంగాల్లో తన ప్రతిభాపాటవాలతో రాణించారు. వ్యాపార కుటుంబంలో జన్మించిన ట్రంప్ విలక్షణ నాయకుడిగా పేరుపొందారు. రాజకీయ రంగంలో అగ్రస్థానానికి చేరుకోవడమే కాదు, అమెరికా రాజకీయాలపై తనదైన ముద్ర వేయడం విశేషం.

1982లోనే ఫోర్బ్స్ జాబితాలోకి..

ట్రంప్ అసలు పేరు డొనాల్డ్ జాన్ ట్రంప్. 1946 జూన్ 14న న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు ఫ్రెడ్ ట్రంప్, మేరీ అన్నే మెక్‌లి యోడ్ ట్రంప్. మొత్తం ఐదుగురు సంతానంలో ట్రంప్ నాలుగో సంతానం. ఫ్రెడ్ ట్రంప్ అమెరికాలో విజయవంతమైన రియల్ ఎస్టేట్ డెవలపర్‌గా పేరు ప్రఖ్యాతులు గడించారు. డొనాల్డ్ ట్రంప్ బాల్యం న్యూయార్క్‌లోనే గడిచింది. న్యూయార్క్ మిలటరీ అకాడమీలో చదువు కున్నారు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాకు చెందిన వార్టన్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. 1968లో కామర్స్‌లో గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్నారు. కాలేజీలో చదువు పూర్తయ్యాక ట్రంప్ 1971లో తన తండ్రి వ్యాపార సంస్థలోకి అడుగుపెట్టారు. తమ సంస్థను 'ట్రంప్ ఆర్గనైజేషన్'గా పేరుమార్చారు. ట్రంప్ గ్రూప్‌నకు సంబంధించిన హోటళ్లు, క్యాసినోలు, గోల్ఫ్ కోర్సులను మరింత విస్తరింపజేశారు. తన పేరిట కొన్ని ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. అనతికాలంలోనే ట్రంప్ బ్రాండ్‌కు మంచి పేరొచ్చింది. విజయవంతమైన వ్యాపారవేత్తగా డొనాల్డ్ ట్రంప్ పేరు మార్మోగిపోయింది. 200 మిలియన్ డాలర్ల సంపదతో 1982లో తొలిసారి ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో చేరారు. 2023లో ఆ సంపద విలువ 631 మిలియన్ డాలర్లతో సమానం. 2004లో ప్రారంభమైన అప్రెంటీస్ అనే టీవీ రియాలిటీ షోను ట్రంప్ స్వయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు మరింత చేరువయ్యారు. ఇంటింటా అందరికీ అభిమాన పాత్రుడయ్యారు. ఆయనలో మంచి రచయిత కూడా ఉన్నారు. 14కుపైగా పుస్తకాలు రాశారు. 1987లో విడుదలైన 'ద ఆర్ట్ ఆఫ్ ద డీల్' అనే పుస్తకం విపరీతమైన పాఠకాదరణ పొందింది.



నాలుగేళ్ల వయసులో...

నెరవేరిన స్వప్నం

డొనాల్డ్ ట్రంప్‌కు చిన్నప్పటి నుంచి రాజకీయాలంటే ఆసక్తి ఉండేది. 1980వ దశకంలో రాజకీయ రంగంలో ప్రవేశించారు. రిపబ్లిన్ పార్టీలో చేరారు. అధ్యక్షుడు కావాలన్నది ట్రంప్ కల. అందుకోసం ఎంతగానో శ్రమించారు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు సాగించారు. మొదట్లో ఆ ప్రయత్నాలు ఫలించకపోయినా నిరాశ చెందలేదు. మరింత పట్టుదలతో కృషిచేశారు. 2015 జూన్ 16న రిపబ్లిన్ అభ్యర్థిగా ఆయన పేరు బలంగా తెరపైకి వచ్చింది. ప్రైమరీ ఎన్నికల్లో పలువురు అభ్యర్థులను వెనక్కి నెట్టి, ఎట్టకేలకు 2016 జూలైలో అధ్యక్ష ఎన్నికల బరిలో ట్రంప్ నిలిచారు. రిపబ్లికన్ అభ్యర్థిగా ఆయన పేరు అధికారికంగా ఖరారైంది. 2016 నవంబర్ 8న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ సంచలన విజయం సాధించారు. డెమొక్రటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌ను ఓడించారు. రష్యా ప్రభుత్వం ఆయన విజయానికి సహకరించినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. ట్రంప్ 2017 జనవరి 20 నుంచి 2021 జనవరి 20వ తేదీ దాకా అగ్రరాజ్యానికి 45వ అధ్యక్షుడిగా సేవలందించారు. పన్ను సంస్కరణలు, వలస విధానం, విదేశీ వ్యవహారాలపై ట్రంప్ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. కొన్ని కీలకమైన పన్నులను తగ్గించారు. విదేశాలతో వాణిజ్య ఒప్పందాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. నాలుగేళ్ల పాలనలో యుద్ధాలకు దూరంగా ఉన్నారు. కానీ, చైనాతో వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. శత్రుదేశంగా భావించే ఉత్తర కొరియాలో కాలుమోపిన తొలి అమెరికా అధ్యక్షుడిగా(పదవిలో ఉండగానే) ట్రంప్ చరిత్రకెక్కారు. వలసలపై కొంత కఠినంగానే వ్యవహరించారు. కొన్ని ఇస్లామిక్ దేశాల నుంచి ప్రజలు అమెరికాకు రాకుండా నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించేందుకు సైనిక నిధులను మళ్లించారు. తన పదవీ కాలంలో ముగ్గురిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా నియమించారు. ట్రంప్ పాలనలోనే కోవిడ్-19 మహమ్మారి వచ్చిపడింది. ఈ విపత్తును ఎదుర్కోవడంలో ట్రంప్ తీవ్ర అలసత్వం వహించారన్న ఆరోపణలు వచ్చాయి. వాతావరణ మార్పులకు సంబంధించిన పారిస్ ఒప్పందం, ఇరాన్‌తో అణు ఒప్పందం నుంచి వైదొలిగారు. ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్‌తో మూడుసార్లు సమావేశమయ్యారు. కానీ, అణ్వాయుధాల నియంత్రణ దిశగా ఆయనను ఒప్పించలేకపోయారు. ట్రంప్ వేగంగా, స్థిరంగా నిర్ణయాలు తీసుకుంటారన్న పేరుంది. అదే ఆయనను బలమైన నాయకుడిగా మార్చింది.

రెండు సార్లు అభిశంసన

అధ్యక్షుడిగా ట్రంప్ పాలనాకాలం పలు వివాదాలతో గడిచింది. శృంగార తార స్మార్మీ డేనియల్స్‌కు చెల్లించిన సొమ్మును రికార్డుల్లో చూపించకుండా వాటిని తారుమారు చేసిన 'హష్ మనీ' కేసులో న్యూయార్క్ కోర్టు ఈ ఏడాది మే నెలలో ట్రంప్‌ను దోషిగా తేల్చింది. ఒక నేరంలో అమెరికా అధ్యక్షుడు దోషిగా తేలడం ఇదే మొదటిసారి. ఈ కేసులో ట్రంప్‌కు ఇంకా శిక్ష విధించలేదు. మరికొన్ని కేసుల్లోనూ ఆయనపై ఆరోపణలు వచ్చాయి. అమెరికా కాంగ్రెస్‌లో దిగువ సభ అయిన ప్రతినిధుల సభలో ట్రంప్ రెండుసార్లు అభిశంసనకు(ఇంపీచ్‌మెంట్) గురయ్యారు. ఉక్రెయిన్ విషయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో 2019 డిసెంబర్‌లో అభిశంసనను ఎదుర్కొన్నారు. తన మద్దతుదారులతో క్యాపిటల్ భవనం వద్ద ఘర్షణను ప్రేరేపించినట్లు విమర్శలు వెల్లువెత్తడంతో 2021 జనవరిలో మరోసారి అభిశంసనకు గురయ్యారు. రెండుసార్లు అభిశంసనకు గురైన తొలి అధ్యక్షుడిగా అపకీర్తి పొందారు. అయితే, కాంగ్రెస్‌లో ఎగువ సభ అయిన సెనేట్ మాత్రం ఈ రెండు సందర్భాల్లో ట్రంప్‌ను నిర్దోషిగా తేల్చింది. 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ చేతిలో పరాజయం పాలయ్యారు. అయినప్పటికీ రిపబ్లికన్ పార్టీలో ట్రంప్ ప్రభావం చెక్కుచెదరలేదు. అందుకే అదే పార్టీ నుంచి మరోసారి పోటీ చేయగలిగారు. ఈ ఏడాది ఎన్నికల ప్రచారంలో ఉండగా ఆయనపై రెండుసార్లు హత్యాయత్నం జరిగింది. అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డారు. మాజీ అధ్యక్షుడిగానూ ట్రంప్ నిత్యం వార్తల్లో వ్యక్తిగా నిలవడం కావడం విశేషం. కేసులు, విచారణలతో ట్రంప్ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రజల నోట్లో నానింది.

3 వివాహాలు.. ఐదుగురు సంతానం

78 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ కుటుంబం పెద్దదే. మూడు వివాహాలు చేసుకున్నారు. తొలుత చెక్ రిపబ్లిక్‌కు చెందిన మోడల్ ఇవానాను పెళ్లాడారు. 1977 నుంచి 1990 దాకా ఆమెతో కలిసున్నారు. తర్వాత విడాకులు తీసుకున్నారు. అనంతరం సినీ నటి మార్లా మాపిల్స్‌ను వివాహం చేసుకున్నారు. 1993 నుంచి 1999 దాకా వారి బంధం కొనసాగింది. విడాకులతో వేరయ్యారు. 2005లో స్లొవేనియా మోడల్ మెలానియాతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఇరువురూ కలిసే ఉంటున్నారు. ట్రంప్‌కు ముగ్గురు భార్యలతో మొత్తం ఐదుగురు సంతానం ఉన్నారు. మొదటి భార్య ఇవానాతో డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఇవాంక, ఎరిక్, రెండో భార్య మార్లాతో టిఫానీ జన్మించారు. మూడో భార్య మెలానియాతో బారోన్ ట్రంప్ జన్మించాడు. మద్యం, సిగరెట్, డ్రగ్స్ తీసుకోవడం తనకు అలవాటు లేదని ట్రంప్ పలు సందర్భాల్లో చెప్పారు. ఆయన రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలు మాత్రమే నిద్రిస్తారు. ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యం ఇస్తారు. గోల్ఫ్ ఆయనకు ఇష్టమైన క్రీడ. అదే ఆయన వ్యాయామం కూడా. ఇతర వ్యాయామాలేవీ చేయరు. నడక(వాకింగ్) కూడా పెద్దగా ఇష్టపడరు. మానవ శరీరం ఒక బ్యాటరీ లాంటిదని, అందులో సహజంగానే మనిషికి కావాల్సిన శక్తి ఉంటుందని, వ్యాయామాలతో ఆ శక్తి హరించుకుపోతుందని ట్రంప్ నమ్ముతారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్ రికార్డులు

- ట్రంప్ ఖాతాలో అరుదైన ఘనత చేరింది. ఒక విరామం తర్వాత మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇలా జరగడం గత 132 ఏళ్లలో ఇదే తొలిసారి. గ్రోవర్ క్లీవ్‌లాండ్ తర్వాత ఈ రికార్డు ట్రంప్ సొంతమైంది. క్లీవ్‌లాండ్ 1885 నుంచి 1889 దాకా 22వ అధ్యక్షుడిగా, 1893 నుంచి 1897 దాకా 24వ అధ్యక్షుడిగా పనిచేశారు. ట్రంప్ 2017 నుంచి 2021 వరకు ఒకసారి అధ్యక్షుడిగా వ్యవహరించారు. మధ్యలో ఒక విరామంతో 2025 నుంచి 2029 దాకా మరో సారి అధ్యక్షుడిగా పని చేయబోతున్నారు.
- 78 ఏళ్ల వయసులో ట్రంప్ మరోసారి అధ్యక్ష ఎన్నిక ల్లో గెలిచారు. అమెరికా చరిత్రలో అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గిన అత్యంత వృద్ధుడు ట్రంప్.
- గత 20 సంవత్సరాల్లో పాపులర్ ఓటుతో గెలిచిన మొదటి రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్

చరిత్రలో అతిపెద్ద పునరాగమనం

నాలుగేళ్ల క్రితం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలను జీర్ణించుకోలేక ఆయన అభిమానులు రాజధాని వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ భవనం వద్ద వీరంగం సృష్టించారు. వారి నిరసన హింసాత్మకంగా మారింది. ఈ వ్యవహారం చివరకు ట్రంప్ మెడకు చుట్టుకుంది. 2020 నాటి ఎన్నికల్లో పరాజయంతో ట్రంప్ రాజకీయ జీవితం ముగిసినట్లేనని అప్పట్లో రాజకీయ పరిశీలకులు తేల్చిచెప్పారు. పలు వివాదాల్లో ఇరుక్కుపోవడంతోపాటు హష్ మనీ కేసులో దోషిగా తేలిన ట్రంప్ ఇక ఎప్పటికీ రాజకీయ రంగంలో కనిపించే అవకాశం లేదని వాదించారు. వారి అభిప్రాయాలను పటాపంచలు చేస్తూ ట్రంప్ మరోసారి సమరోత్సాహంతో దూసుకొచ్చారు. 78 ఏళ్ల వయసులో అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. సరిగ్గా నాలుగేళ్ల తర్వాత మరోసారి వైట్‌హౌస్‌లో కాలు పెట్టబోతున్నారు.

స్వర్ణయుగం తెస్తా

అమెరికా పాత గాయాలను మాన్పేస్తా

- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా
- అధ్యక్ష ఎన్నికల విజయోత్సవ సభలో ట్రంప్ స్ఫూర్తిదాయక ప్రసంగం

రెండోసారి పరిపాలన మొదలెట్టాక అమెరికాకు స్వర్ణయుగాన్ని తీసుకొస్తానని కాబోయే నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యత కనబరిచాక బుధవారం ఫ్లోరిడా రాష్ట్రంలోని వెస్ట్ పామ్ బీచ్ ప్రాంతంలోని పామ్ బీచ్ కన్వెన్షన్ సెంటర్‌లో కుటుంబసమేతంగా 'ఎలక్షన్ నైట్ వాచ్ పార్టీ'వేదిక మీదకు వచ్చిన ట్రంప్ సుదీర్ఘంగా మాట్లాడారు. ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా సైతం పోడియం మీదకు వచ్చారు. ట్రంప్ సతీమణి మెలానియా, కుమారులు, కోడళ్లు, మనవరాళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు సైతం వేదిక మీదకొచ్చారు. చిరస్మరణీయ విజయం తర్వాత జాతినుద్దేశిస్తూ వందలాది మంది మద్దతుదారుల సమక్షంలో ట్రంప్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

– వాషింగ్టన్


బుధవారం పామ్‌బీచ్‌లో జరిగిన కార్యక్రమంలో జేడీ వాన్స్‌ను అభినందిస్తున్న ట్రంప్

దేశం మునుపెన్నడూ చూడని విజయం

''అమెరికాలో ఇలాంటి విజయాన్ని మునుపెన్నడూ ఎవరూ చూడలేదు. అత్యంత శక్తివంతమైన ప్రజాతీర్పు ఇది. అమెరికా చరిత్రలో అతిగొప్ప రాజకీయ ఉద్యమం ఇది. మా పార్టీ గెలుపుతో అమెరికాకు మళ్లీ స్వర్ణయుగం రాబోతోంది. అమెరికాను మళ్లీ అత్యంత గొప్ప దేశంగా మలిచేందుకు ఈ గెలుపు మాకు సదవకాశం ఇచ్చింది. పాత గాయాలను మాన్పి దేశాన్ని మళ్లీ సరికొత్త శిఖరాలకు చేరుస్తాం. మళ్లీ మేం పార్లమెంట్‌పై పట్టుసాధించాం. హోరాహోరీ పోరు జరిగిన కీలక జార్జియా, పెన్సిల్వేనియా, విస్కాన్సిస్ లాంటి రాష్ట్రాల్లోనూ విజయం సాధించాం. అన్ని వర్గాల సమూహశక్తిగా అతిపెద్ద విస్తృతమైన ఏకీకృత కూటమిగా నిలబడ్డాం. ఇలా అమెరికా చరిత్రలో మునుపెన్నడూ జరగలేదు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా యువత, వృద్ధులు, మహిళలు, పురుషులు అంతా రిపబ్లికన్ పార్టీకే పట్టం కట్టారు. కార్మిక, కార్మికేతర సంఘాలు, ఆఫ్రికన్–అమెరికన్, హిస్పానియన్–అమెరికన్, ఆసియన్–అమెరికన్, అర్బన్–అమెరికన్, ముస్లిం అమెరికన్ ఇలా అందరూ మనకే మద్దతు పలికారు. ఇది నిజంగా ఎంతో సుందరమైన ఘటన. భిన్న నేపథ్యాలున్న వర్గాలు మనతో కలిసి నడిచాయి. అందరి ఆశ ఒక్కటే. పటిష్ట సరిహద్దులు కావాలి. దేశం మరింత సురక్షితంగా, భద్రంగా ఉండాలి. చక్కటి విద్య అందాలి. ఎవరి మీదకు దండెత్తకపోయినా మనకు అజేయ సైన్యం కావాలి. గత నాలుగేళ్లలో మనం ఎలాంటి యుద్ధాల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేదు. అయినాసరే ఐసిస్‌ను ఓడించాం. నేనొస్తే యుద్ధమేఘాలు కమ్ముకుంటాయని డెమొక్రాట్లు ఆరోపించారు. నిజానికి నేనొస్తే యుద్ధాలు ఆగిపోతాయి. ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకు దక్కిన అద్భుత విజయమిది. మరోమారు నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకుని నాకు అసాధారణ గౌరవం ఇచ్చిన నా అమెరికన్ ప్రజలకు మనసారా కృతజ్ఞతలు తెలుపుతున్నా ''అని అన్నారు.

సరిహద్దులను పటిష్టం చేస్తా

''ప్రస్తుతం దేశం చాలా కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. తక్షణ సాయం అవసరం. దేశ గాయాలను మేం మాన్పుతాం. దేశ సరిహద్దుల వద్ద కాపలాను మరింత పటిష్టం చేస్తాం. అదొక్కటేకాదు దేశం ఎదుర్కొంటున్న ప్రతి ఒక్క సమస్యకు పరిష్కారం చూపుతాం. ప్రతి ఒక్క పౌరుడికి నేనొక్కటే చెబుతున్నా. మీ కోసం, మీ కుటుంబం కోసం, మీ భవిష్యత్తు కోసం అవిశ్రాంతంగా పనిచేస్తా. ప్రతి రోజూ పోరాడతా. మనం, మన పిల్లలు కోరుకునే స్వేచ్ఛాయుత, అత్యంత సురక్షితమైన, సుసంపన్నమైన అమెరికా కోసం నా తుదిశ్వాసదాకా కృషి చేస్తా. అమెరికాకు మళ్లీ స్వర్ణయుగాన్ని తెస్తా. ఈ మహాయజ్ఞంతో నాతోపాటు పాలుపంచుకోవాలనుకునే ప్రతి ఒక్క పౌరుడికీ ఇదే నా స్వాగతం''అని అన్నారు.

బంగారు భవితకు బాటలు వేద్దాం

''మనందరం కలిసి సమష్టిగా అమెరికా ఉజ్వల భవితను లిఖిద్దాం. కలిసి కష్టపడి మన తర్వాత తరాలకు చక్కటి భవిష్యత్తును అందిద్దాం. ఎన్నికల వేళ 900 ర్యాలీలు నిర్వహించుకున్నాం. విస్తృతంగా పర్యటించి ప్రజలకు చేరువ కావడం వల్లే ఇప్పుడు విజయ తీరాలకు చేరగలిగాం. ఇప్పుడు దేశం కోసం అత్యంత ముఖ్యమైన పనులను మొదలెడదాం. అత్యంత మెరుగైన అమెరికాను నిర్మిద్దాం''అని అన్నారు. ఎన్నికల బహిరంగసభలో భవనం పైనుంచి ఒక ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో స్వల్ప గాయంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం, గోల్ఫ్ క్లబ్ వద్ద మరో సాయుధుడి అరెస్ట్ ఘటనలను ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ''గొప్ప కార్యం మీతో చేయించాలనే మిమ్మల్ని దేవుడు కాపాడాడు అని చాలా మంది నాతో చెప్పారు'' అని ట్రంప్ అన్నారు. ''దేశాన్ని కాపాడి మళ్లీ గ్రేట్‌గా మార్చేందుకే దేవుడు నాకీ అవకాశం ఇచ్చాడనుకుంటా. ఈ మిషన్‌ను మనం పూర్తిచేద్దాం. ఈ పని పూర్తి చేయడం అంత సులభమేం కాదు. శక్తినంతా కూడదీసుకుని దేశభక్తి, పోరాటపటిమ, స్ఫూర్తితో ఈ ఘన కార్యాన్ని సంపూర్ణం చేద్దాం. ఇది ఉత్కృష్టమైన బాధ్యత. ఇంతటి ఉదాత్తమైన పని ప్రపంచంలోనే లేదు. తొలిసారి అధ్యక్షుడిగా పాలించినప్పుడూ ఒక్కటే లక్ష్యంగా పెట్టుకున్నా. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని. ఇప్పుడు కూడా ఇచ్చిన వాగ్దానాలను తూ.చా. తప్పకుండా అమలుచేస్తా. 'మేక్ అమెరికా.. గ్రేట్ ఎగేన్'ను సాకారం చేసేందుకు దేశం నలుమూలల నుంచి నడుంబిగించి కదలండి. ఐక్యంగా నిలబడాల్సిన తరుణమిది. మనందరం ప్రయత్నించబోతున్నాం. సాధించబోతున్నాం''అని ట్రంప్ అన్నారు.

ఎలాన్ మస్క్‌పై ప్రశంసలు

ప్రసంగిస్తూ ట్రంప్ ప్రపంచ కుబేరుడు, ఎన్నికల్లో తన కోసం కోట్లు ఖర్చుచేసిన వ్యాపారదిగ్గజం ఎలాన్ మస్క్‌ను ప్రశంసల్లో ముంచెత్తారు. ''ఇక్కడో తార(స్టార్) ఉద్భవించింది. అదెవరంటే మన ఎలాన్ మస్క్. ఆయనో అద్భుతమైన వ్యక్తి. ప్రజలు ప్రకృతి వైపరీత్యాల్లో చిక్కుకుపోయినప్పుడు మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ వ్యవస్థ ప్రజలకు ఎంతో సాయపడింది. నార్త్‌కరోలినాలో హెలెన్ హరికేన్ వేళ స్టార్‌లింక్ ఎంతో సాయపడింది. అందుకే ఆయన్ను నేను ఇష్టపడతా. అసాధ్యాలను సుసాధ్యం చేశారు. స్పేస్‌ఎక్స్ వారి స్టార్‌షిప్ కార్యక్రమంలో భాగంగా అత్యంత భారీ రాకెట్ బూస్టర్‌ను పునర్వినియోగ నిమిత్తం మళ్లీ పసిపాపలాగా లాంచ్‌ప్యాడ్‌పై అద్భుతంగా ఒడిసిపట్టారు. మస్క్‌కు మాత్రమే ఇది సాధ్యం. ఆ ఘటన చూసి నేను భవిష్యత్‌తరం సినిమా అనుకున్నా. ఇంతటి ఘనత సాధించిన మస్క్ లాంటి మేధావులను మనం కాపాడుకుందాం. ఎందుకంటే ఇలాంటి వాళ్లు ప్రపంచంలో కొందరే ఉన్నారు''అని ట్రంప్ అన్నారు.

జేడీ వాన్స్‌ను పొగిడిన ట్రంప్

కాబోయే ఉపాధ్యక్షుడు ఇతనే అంటూ జేడీ వాన్స్‌ను ట్రంప్ సభకు పరిచయం చేశారు. ''ఉపాధ్యక్ష పదవికి జేడీ వాన్స్ సరైన వ్యక్తి. ఆయన భార్య ఉషా సైతం అద్భుతమైన మహిళ. పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావం చూపడంలో జేడీ వాన్స్‌కు ఎవరూ సాటిరారు. రిపబ్లికన్ పార్టీని విమర్శించే, ఆగర్భ శత్రువులుగా తయారైన కొన్ని మీడియా కార్యాలయాలకు చర్చకు వెళ్తారా? అని నేను అడిగితే వెంటనే ఓకే అనేస్తారు. సీఎన్ఎన్‌కు వెళ్లాలా?, ఎంఎస్ఎన్‌బీసీకి వెళ్లాలా? అని నన్నే ఎదురుప్రశ్నిస్తారు. ముక్కుసూటిగా దూసుకుపోయే, వైరివర్గాన్ని చిత్తుచేసే నేత'' అంటూ వాన్స్‌ను ట్రంప్ ఆకాశానికెత్తేశారు.

శక్తివంతంగా తిరిగొచ్చారు: వాన్స్

''మళ్లీ గెలిచి అత్యంత శక్తివంతంగా తిరిగొచ్చిన అతికొద్ది మంది నేతల్లో ఒకరిగా ట్రంప్ నిలిచారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ పునరాగమనం ద్వారా ట్రంప్ సారథ్యంలో మేం దేశ ఆర్థిక ప్రగతి రథాన్ని ఉరకలు పెట్టిస్తాం. నాపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్ష పదవికి నన్ను ఎంపిక చేసిన ట్రంప్‌కు కృతజ్ఞతలు''అని జేడీ వాన్స్ అన్నారు.

అభినందనల వెల్లువ

న్యూఢిల్లీ/లండన్/వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీతోపాటు, ఫ్రాన్స్, యూకే, ఇజ్రాయెల్ తదితర దేశాల నేతలు అభినందన సందేశాలు పంపారు. ట్రంప్‌ది చారిత్రక విజయమంటూ ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. ప్రధాని మోదీ బుధవారం రాత్రి ట్రంప్‌నకు ఫోన్ చేసి అభినందించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై స్పందించేందుకు చైనా నిరాకరించగా జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె, యూఏఈ అధ్యక్షుడు జాయెద్ బిన్ అల్ నహ్యాన్, ఈజిప్ట్ అధ్యక్షుడు ఎల్–సిసి, తుర్కియే అధ్యక్షుడు ఎర్దోగన్, పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్, ఇటలీ ప్రధాని మెలోనీ, జర్మనీ చాన్స్‌లర్ షోల్జ్, హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బాన్, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్, ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా తదితరులు ట్రంప్‌నకు శుభాకాంక్షలు తెలిపారు.

మిత్రమా.. మీది చారిత్రక విజయం

ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన నా మిత్రుడు డొనాల్డ్ ట్రంప్‌నకు హృదయపూర్వక అభినందనలు. మీ గత పాలనే తాజా విజయానికి బాటలు వేసింది. భారత్–అమెరికా సమగ్ర గ్లోబల్, వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం మరింత దృఢతరం కావాలని ఆకాంక్షిస్తున్నాను. రెండు దేశాల ప్రజల అభివృద్ధికి, ప్రపంచ శాంతి సుస్థిర, సౌభాగ్యం కోసం కలిసికట్టుగా కృషి చేద్దాం.

– భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

మనది ప్రత్యేక అనుబంధం

ఎన్నికల్లో చారిత్రక విజయంతో అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన ట్రంప్‌నకు అభినందనలు. రానున్న రోజుల్లో మీతో కలిసి పనిచేసేందుకు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నాను. అత్యంత సన్నిహిత మిత్రులుగా, మన ఉమ్మడి విలువలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ కోసం భుజంభుజం కలిసి నడుద్దాం.

– బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్

మళ్లీ అధ్యక్షుడవటం చారిత్రకం

అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌కు మళ్లీ రావడం చారిత్రకం. అమెరికాకు ఇది గొప్ప ఆరంభం. ఇజ్రాయెల్–అమెరికాల గొప్ప మైత్రికి ఈ పరిణామం మరో వాగ్దానం.

– ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ

గొప్ప పునరాగమనం

డొనాల్డ్ ట్రంప్ గెలుపు చరిత్రలోనే గొప్ప పునరాగమనం. రెండుదేశాలు గత నాలుగేళ్లుగా కలిసి పనిచేశాయి. ఇదే ఒరవడిని ఇకపైనా కొనసాగించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతి, సౌభాగ్యాల కోసం కలిసి కృషి చేద్దాం.

–ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

ఇది అద్భుత విజయం

ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు అభినందనలు. బలం ద్వారా శాంతిని సాధించాలనే మీ విధానం ఎంతో నిబద్ధతతో కూడినది. కచ్చితంగా ఇదే విధానాన్ని కార్యాచరణలోకి తేవడం ద్వారా ఉక్రెయిన్‌కు శాంతి సిద్ధిస్తుంది. మనం కలిసికట్టుగా ఈ పనిచేస్తామని ఆశిస్తున్నాను.

– ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

భవిష్యత్తులోనూ కలిసే సాగుదాం

ఆస్ట్రేలియా, అమెరికాలు గొప్ప మిత్రులు, నిజమైన స్నేహితులు. మనం కలిసి పనిచేస్తూ రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని, ప్రజల మధ్య బంధాన్ని భవిష్యత్తులోనూ బలంగా ఉంచుదాం.

– ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్

ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం పనిచేద్దాం

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌నకు భారత జాతీయ కాంగ్రెస్ తరఫున అభినందనలు, శుభాకాంక్షలు. భారత్, అమెరికాలు బలమైన అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రజాస్వామిక విలువలు, ఉమ్మడి ఆసక్తులు, ప్రజల మధ్య సంబంధాల కోసం దీర్ఘకాలంగా కలిసి పనిచేస్తున్నాయి. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం అమెరికాతో సన్నిహితంగా పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాం.

– కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

వలసలకు ఇక బ్రేకే!

- అక్రమ వలసలపై కఠినంగా వ్యవహరించే అవకాశం
- పన్నుల విషయంలో ఉద్యోగస్తులు, మధ్య తరగతికి ఊరట

అగ్రరాజ్యాధిపతిగా డొనాల్డ్ ట్రంప్ మరోసారి పగ్గాలు చేపట్టబోతున్నారు. ఈసారి ఆయన ఎలాంటి విధానాలు అమలు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. అమెరికా అధ్యక్షుడు తీసుకొనే నిర్ణయాలు, చేపట్టే చర్యలు ప్రపంచమంతటా ప్రభావం చూపిస్తాయనడంలో సందేహం లేదు. ట్రంప్ రెండో దఫా పాలనపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. గత ఏడాది కాలంగా ట్రంప్ చేసిన ప్రసంగాలు, ఇచ్చిన ప్రకటనలను బట్టి కొన్ని కీలకమైన అంశాల్లో ఆయన వైఖరి ఎలా ఉండబోతోందో కొంతవరకు అంచనా వేయొచ్చు. అదేమిటో చూద్దాం..

వలసలపై కఠిన వైఖరే

అమెరికాలోకి వలసల పట్ల ట్రంప్ మొదటి నుంచీ వ్యతిరేకమే. 2016లో ఆయన 'గోడ కట్టండి'అని పిలుపునిచ్చారు. అమెరికా–మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించారు. అమెరికా అక్రమంగా నివసిస్తున్న వారిని బయటకు తరిమేయడానికి నేషనల్ గార్డు, పోలీసు దళాలను బలోపేతంపై దృష్టి పెట్టారు. అక్రమంగా వలసవచ్చిన వారికి, చట్టవిరుద్ధంగా నివసిస్తున్నవారికి ఇకపై ట్రంప్ రూపంలో కష్టాలు తప్పకపోవచ్చు. అమెరికా గడ్డపై జన్మిస్తే అమెరికా పౌరసత్వం ఇచ్చే విధానాన్ని ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీన్ని మార్చాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి. కొన్ని ఇస్లామిక్ దేశాల నుంచి వలసలకు ట్రంప్ వ్యతిరేకమే. మొత్తంమీద ఇకపైన చట్టబద్ధంగా కూడా ఎక్కువ మందిని అమెరికాలోకి అనుమతించకపోవచ్చు. విదేశీయులు అమెరికా కలను వాయిదా వేసుకోవాల్సి రావొచ్చు.

గర్భస్రావాలపై మహిళలకు హక్కులు

తొలి దఫాలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మహిళల పునరుత్పత్తి హక్కులను ట్రంప్ వ్యతిరేంచారు. గర్భాన్ని తొలగించుకొనేందుకు మహిళలకు ఉన్న హక్కును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పు తమ వల్లే సాధ్యమైందని ట్రంప్ చెప్పారు. కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ పునరుత్పత్తి హక్కుల కోసం మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్ వారికి మద్దతు పలికారు. అయితే, ఈసారి ట్రంప్ మహిళల గర్భస్రావ హక్కుల విషయంలో జోక్యం చేసుకోకపోవచ్చు. అంటే మహిళలకు స్వేచ్ఛనిచ్చే అవకాశం ఉంది.

తగ్గనున్న పన్నుల భారం

ట్రంప్ పన్నుల విధానాలు కార్పొరేట్ సంస్థలకు, సంపన్నులకు అనుకూలంగా ఉంటాయి. తొలి దఫాలో వారిపై పన్నుల భారం తగ్గించారు. జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికై న తర్వాత ఆయా పన్నులను పెంచారు. ట్రంప్ రాకతో పన్నుల భారం మళ్లీ తగ్గడం ఖాయమే. ఉద్యోగస్తులతో పాటు మధ్య తరగతి అమెరికన్లపై పన్నులు తగ్గిస్తానని ఆయన ఇప్పటికే హామీ ఇచ్చారు. ప్రజల జీవనాన్ని సులభతరం చేయడమే లక్ష్యమని ప్రకటించారు. ఇదిలా ఉంటే, విదేశీ వస్తువులపై టారిఫ్‌లు 10 శాతం నుంచి 20 శాతానికిపైగా పెంచే అవకాశం ఉంది. దీంతో ఆయా వస్తువుల ధర పెరిగిపోనుంది. విదేశీ వస్తువుల వాడకాన్ని నిరుత్సాహపర్చాలన్నదే ట్రంప్ విధానం. ప్రధానంగా చైనా వస్తువులు, సరుకుల వాడకాన్ని అనుమతించడం ఆయనకు ఇష్టం లేదు.

ట్రాన్స్‌జెండర్లకు రక్షణ

లింగమార్పిడి చేయించుకున్నవారిపై ట్రంప్‌కు సానుభూతి ఉంది. లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, ఇంటర్‌సెక్స్ వర్గాలకు చట్టపరమైన రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారి పట్ల సమాజం దృక్పథం మారాలని ఎన్నోసార్లు చెప్పారు. ట్రంప్ పాలనలపై వృద్ధులు సైతం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారికి సామాజిక భద్రత, వైద్య సంరక్షణ కల్పిస్తామంటూ ట్రంప్ హామీ ఇచ్చారు.

శిలాజ ఇంధనాలు


శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించే పేరిట ఎలక్ట్రిక్ వాహనాలపై జో బైడెన్ ప్రభుత్వం విపరీతంగా ప్రజాధనం ఖర్చు చేసిందని ట్రంప్ ఆరోపించారు. శిలాజ ఇంధనాలను పరోక్షంగా సమర్థించారు. ఈ విషయంలో బైడెన్ విధానాలను ట్రంప్ తిరగదోడే అవకాశం కనిపిస్తోంది. శిలాజ ఇంధనాలను ఇప్పటికిప్పుడు పూర్తిగా ఆపేయలేమన్నదే ట్రంప్ వాదన. వాతావరణ మార్పులను అడ్డుకొనే విషయంలో గతంలో ట్రంప్ వైఖరి విమర్శలకు తావిచ్చింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇదీ పరిస్థితి | డెమొక్రాట్లు | రిపబ్లికన్లు


శాన్‌ఫ్రాన్సిస్కోలో టీవీలో ఎన్నికల ఫలితాలను చూసి డెమొక్రాటిక్ పార్టీ మద్దతుదారు నిర్వేదం


విస్కాన్సిన్‌లోని మాడిసన్‌లో సెల్ఫీలతో రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుల ఆనందం



స్వింగ్ స్టేట్స్‌లో క్లీన్‌స్వీప్

తటస్థ ఓటర్ల కోటలుగా పేరొందిన స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్ జయకేతనం ఎగరేశారు. మొత్తం ఏడు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్ హవా కొనసాగింది. అరిజోనా, మిషిగన్, నెవడా, జార్జియా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో తటస్థ ఓటర్లు ఎక్కువ. అంటే మిగతా రాష్ట్రాల ఓటర్లలా ఇక్కడి వారు తాము ఏ పార్టీకి ఓటేయబోతున్నామో ముందే బహిరంగంగా చెప్పబోరు. దీంతో ఈ తటస్థ ఓటర్లను ప్రసన్నంచేసుకోవడం మీదనే ట్రంప్ ప్రధానంగా దృష్టిసారించి సఫలీకృతులయ్యారు. ఈ ఏడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 93 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. వీటిల్లో కనీసం 51 ఓట్లు సంపాదిస్తే ఆధిక్యత సాధ్యమవుతుంది. కడపటి వార్తలు అందే సమయానికి ట్రంప్ ఈ ఏడు రాష్ట్రాల్లో ఇప్పటికే 61 ఎలక్టోరల్ ఓట్లను సాధించారు. ఒక రాష్ట్రంలో ఎవరికి పాపులర్ ఓట్లు వస్తాయో వారికి ఆ రాష్ట్రంలోని అన్ని ఎలక్టోరల్ ఓట్లు ఆ అభ్యర్థికే దఖలుపడతాయి. ఈ లెక్కన గత ఎన్నికల్లో ట్రంప్ ఈ ఏడు రాష్ట్రాల్లో కేవలం ఒక్క రాష్ట్రంలో గెలవగా సారి మొత్తం ఏడింటిలో విజయపతాక ఎగరేయడం విశేషం.

రాష్ట్రం	మొత్తం ఎలక్టోరల్ ఓట్లు
అరిజోనా	11
నెవడా	6
జార్జియా	16
మిషిగన్	15
నార్త్ కరోలినా	16
పెన్సిల్వేనియా	19
విస్కాన్సిన్	10

అమెరికాతో నిర్మాణాత్మక చర్చలకు

పుతిన్ సిద్ధం: రష్యా

మాస్కో: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవడంపై రష్యా తనదైన శైలిలో స్పందించింది. అమెరికాతో నిర్మాణాత్మక చర్చలు జరిపేందుకు అధ్యక్షుడు పుతిన్ సిద్ధంగా ఉన్నారని పేర్కొంది. మున్ముందు రెండు దేశాల మధ్య సంబంధాలు అమెరికా యంత్రాంగం వైఖరిపైనే ఆధారపడి ఉంటాయని వ్యాఖ్యానించింది. అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌ను పుతిన్ అభినందించకుంటే రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణిస్తాయా అన్న ప్రశ్నకు అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఈ మేరకు స్పందించారని ప్రభుత్వ వార్తా సంస్థ టాస్ వెల్లడించింది. 'అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు మునుపెన్నడూ లేనంత తీవ్రస్థాయికి దిగజారాయి. ఇంతకంటే క్షీణించడం అసాధ్యం. ట్రంప్ బాధ్యతలు చేపట్టాక అమెరికా వైఖరిలో మార్పు వస్తుందా లేదా అనేది తెలియాల్సి ఉంది. న్యాయం, సమానత్వం, పరస్పర గౌరవం, ఆధారంగా నిర్మాణాత్మక సంభాషణకు తాను సిద్ధమని అధ్యక్షుడు పుతిన్ పదే పదే చెప్పారు. ఆయన ఇదే వైఖరికి కట్టుబడి ఉన్నారు. అమెరికా మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. వేచిచూద్దాం, జనవరిలో ఏం జరుగుతుందో..'అని పెస్కోవ్ అన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై పుతిన్ స్పందించకపోవడంపై తానేమీ చెప్పలేనన్నారు.

ఎగువ సభలోనూ రిపబ్లికన్ల జోరు

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల్లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ట్రంప్‌కు మరో సువర్ణావకాశం సెనేట్‌లో పార్టీ ఆధిక్యత రూపంలో లభించింది. అధ్యక్ష ఎన్నికలతోపాటు అమెరికాలో మంగళవారం పార్లమెంట్ ఎగువ సభ(సెనేట్)కు జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. అధ్యక్షుడితోపాటు హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్(దిగువసభ), సెనేట్(ఎగువసభ)లో ఆధిక్యత కారణంగా ఇకపై రిపబ్లికన్ పార్టీ తమ ఎజెండాను నిరాటంకంగా అమలుచేయొచ్చు. రెండు సభల్లో ఏ ఒక్కదాంట్లో డెమొక్రాట్ల ఆధిక్యం ఉన్నా ప్రభుత్వం తమ బిల్లులను ఆమోదింపజేసుకోవడం సులువయ్యేది కాదు. మొత్తం 100 సీట్లు ఉన్న సెనేట్‌లో ఈసారి 34 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అయితే పూర్తిస్థాయి అధికారిక ఫలితాలు రావడానికి కొద్ది రోజుల సమయం పట్టే వీలుంది. అయితే ఫలితాల సరళిని బట్టి ఇరు సభల్లో రిపబ్లికన్ పార్టీ ఆధిక్యత ఉందని స్పష్టమైంది. సెనేట్ ఎన్నికల్లో ఓహియోలో స్థానంలో డెమొక్రటిక్ అభ్యర్థి, ప్రస్తుత సెనేటర్ షెరాడ్ బ్రౌన్‌ను రిపబ్లికన్ అభ్యర్థి బెర్నీ మోరెన్ మట్టికరిపించారు. రిపబ్లికన్ నేతలు టెడ్ క్రజ్ టెక్సాస్‌లో, రిక్ స్కాట్ ఫ్లోరిడాలో, డెబ్ ఫిషర్ నెబ్రాస్కాలో, టిమ్ షీహీ మొంటానాలో గెలిచారు. గత సెనేట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి చాలా ఎక్కువ స్థానాల్లో రిపబ్లికన్లు ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

ప్రతినిధుల సభలోనూ రిపబ్లికన్ల హవా

435 స్థానాలున్న పార్లమెంట్ దిగువసభ అయిన ప్రతినిధుల సభలో అన్ని స్థానాలకు ఎన్నికలు జరిగాయి. తాజా సమాచారం ప్రకారం రిపబ్లికన్ పార్టీ 197 స్థానాల్లో విజయం సాధించింది. డెమొక్రటిక్ పార్టీ 177 స్థానాల్లో గెలిచింది. అయితే అధికారికంగా గణాంకాలు వెల్లడించడానికి చాలా రోజుల సమయం పట్టొచ్చు. తక్కువ మెజారిటీతో అభ్యర్థి ఓడిపోతే రాష్ట్ర నిబంధనల మేరకు ఆయా స్థానాల్లో రీకౌంటింగ్ చేపడతారు. దాంతో ఫలితాల వెల్లడి మరింత ఆలస్యం కానుంది. రీకౌంటింగ్ నిబంధనలు అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేవు. కడపటి వార్తలు అందేసమయానికి రిపబ్లికన్ పార్టీ ఎక్కువ స్థానాల్లో ముందంజలో ఉంది. దిగువసభలో సభ్యుల పదవీ కాలం కేవలం రెండేళ్లే. సెనేట్‌లోని 100 స్థానాల్లో మూడోవంతు స్థానాలకు ప్రతి రెండేళ్లకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ ప్రకారమే 34 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరిగింది.

సెనేట్‌లో తాజా ఆధిక్యాలు..

డెమొక్రటిక్ పార్టీ సాధారణ ఆధిక్యతతో కొనసాగుతున్న స్థానాలు..: ఆరిజోనా, మేరీల్యాండ్, నెవడా

డెమొక్రటిక్ పార్టీ అత్యధిక ఆధిక్యత ఉన్న స్థానాలు..: కాలిఫోర్నియా, కనెక్టికట్, డెలావర్, హవాయి, మెయిన్, మసాచుసెట్స్, మిన్నెసోటా, న్యూజెర్సీ, న్యూమెక్సికో, న్యూయార్క్, రోడ్ ఐలాండ్, వెర్మాంట్, వర్జీనియా, వాషింగ్టన్

హోరాహోరీ పోరు కొనసాగుతున్న స్థానాలు: మిషిగన్, ఓహియో, పెన్సిల్వేనియా, వాస్కాన్సిన్

రిపబ్లికన్ పార్టీ సాధారణ ఆధిక్యత ఉన్న స్థానాలు..: ఫ్లోరిడా, మోంటానా, నెబ్రాస్కా, టెక్సాస్

రిపబ్లికన్ పార్టీ అత్యధిక ఆధిక్యత ఉన్న స్థానాలు..: ఇండియానా, మిసిసిప్పి, మిస్సోరీ, నెబ్రాస్కా స్పెషల్, నార్త్ డకోటా, టెన్నెసీ, ఉతా, వెస్ట్ వర్జీనియా, వ్యోమింగ్

ఆరుగురు భారతీయుల విజయకేతనం

వాషింగ్టన్: అమెరికా ఎన్నికల్లో ఆరుగురు భారతీయ అమెరికన్లు విజయం సాధించారు. ప్రస్తుత కాంగ్రెస్‌లో ఐదుగురు ప్రతినిధులు ఉండగా.. ఈ ఎన్నికలతో అమెరికా ప్రతినిధుల సభలో భారతీయ అమెరికన్ల సంఖ్య ఆరుకు పెరిగింది. వర్జీనియా నుంచి ఎన్నికైన తొలి భారతీయుడిగా న్యాయవాది సుహాస్ సుబ్రమణ్యం చరిత్ర సృష్టించారు.

అమీ బెరా..



డెమొక్రాట్ అభ్యర్థిగా కాలిఫోర్నియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న అమీ బెరా విజయం సాధించారు. రిపబ్లికన్ ప్రత్యర్థి క్రిస్టీన్ బిష్‌ను ఆయన ఓడించారు. యూఎస్ ప్రతినిధుల సభలో ఆయన సీనియర్ భారతీయ అమెరికన్. 2012లో రిపబ్లికన్ అభ్యర్థిని ఓడించిన బెరా 6వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహించారు. యూఎస్ ప్రతినిధుల సభకు చేరిన మూడో భారతీయ వ్యక్తిగా నిలిచారు. 1957లో కాలిఫోర్నియా 29వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో కాలు పెట్టిన తొలి భారతీయ అమెరికన్‌గా దలీప్ సింగ్ సౌంద్ చరిత్ర సృష్టించిన 50 ఏళ్ల తరువాత అమీ బెరా కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. మొదట స్వల్ప ఓట్ల తేడాతో గెలిచినా.. తరువాత పర్యాయాల్లో ఆధిక్యాన్ని కొనసాగించారు.

థానేదార్ రెండోసారి..

మిషిగన్‌లోని పదమూడో కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ఇండియన్ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు థానేదార్ రెండోసారి ఎన్నికయ్యారు.



రిపబ్లికన్ ప్రత్యర్థి మార్టెల్ బివింగ్స్‌ను 35 శాతానికి పైగా ఓట్ల తేడాతో ఓడించారు. తాను అందించిన సేవలు, శ్రామికులు, యూనియన్ల పక్షాన నిలబడటం, అబార్షన్ హక్కుల కోసం పోరాటం తన విజయానికి కారణమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు మద్దతు తెలిపిన యూనియన్లు, గ్రూపులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా రాజ్యాంగ హక్కులకోసం తాను పోరాడతానని హామీ ఇచ్చారు.

రో ఖన్నా.. 2016 నుంచి



కాలిఫోర్నియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న డెమొక్రటిక్ ప్రతినిధి రో ఖన్నా మూడోసారి ఎన్నికయ్యారు. డెమొక్రాట్లకు బలమైన పట్టున్న 17వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌లో రిపబ్లికన్ అనితా చెన్‌ను సునాయాసంగా ఓడించారు. 2016లో మైక్ హోండాను ఓడించి ఖన్నా తొలిసారి అమెరికా సభకు ఎన్నికయ్యారు. ఖన్నా హౌస్ ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీలో, పర్యవేక్షణ, జవాబుదారీ కమిటీల్లో పనిచేస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోకు దక్షిణాన సిలికాన్ వ్యాలీలోని కొన్ని భాగాలను కలిగి ఉన్న డిస్ట్రిక్ట్.. 1990 నుంచి డెమొక్రాట్లకు కంచుకోటగా ఉంది.

ఇల్లినాయిస్ నుంచి రాజా కృష్ణమూర్తి..



డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి రాజా కృష్ణమూర్తి ఇల్లినాయిస్ 8వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. రిపబ్లికన్ అభ్యర్థి మార్క్ రిక్‌పై దాదాపు 30 వేలకు పైగా ఓట్ల తేడాతో కృష్ణమూర్తి విజయం సాధించారు. 2016లో తొలిసారి కాంగ్రెస్‌కు ఎన్నికైన ఆయన.. చైనీస్ కమ్యూనిస్టు పార్టీలో అనుమానిత కార్యకలాపాలపై దృష్టి సారించిన సెలక్ట్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న న్యాయవాది అయిన కృష్ణమూర్తి.. మాజీ డిప్యూటీ స్టేట్ కోశాధికారితో సహా రాష్ట్రం తరఫున అనేక పదవులు నిర్వహించారు.

ప్రమీలా జయపాల్

వాషింగ్టన్ 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ప్రమీలా జయపాల్ మరోసారి గెలుపొందారు. మలయాళీ అయిన జయపాల్ నాయర్ రిపబ్లికన్ అభ్యర్థి డాన్ అలెగ్జాండర్‌ను భారీ ఓట్ల తేడాతో ఓడించారు. జయపాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న స్లామ్-డంక్ లిబరల్ సీటు. ఇది డెమొక్రాట్లకు బలమైన జిల్లా.



గెలుపు అనంతరం ఎక్స్ వేదికగా మద్దతు దారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 'వాషింగ్టన్ 7వ జిల్లా కు ప్రాతినిధ్యం వహించడం నాకు గర్వంగా ఉంది. అందరితో కలిసి పురోగతి కోసం పనిచేయడానికి, అవకాశాల కోసం పోరాటం కొనసాగించడానికి నేను ఎదురుచూస్తున్నాను. నాకు మద్దతు పలికిన ప్రతి ఒక్కరూ హృదయపూర్వక కృతజ్ఞతలు'అని ఆమె పేర్కొన్నారు.

సుహాస్ సుబ్రమణ్యం రికార్డు..



ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎన్నికై చరిత్ర సృష్టించిన భారతీయ అమెరికన్ సుహాస్ సుబ్రమణ్యం. ఇప్పటివరకు వర్జీనియా స్టేట్ సెనేటర్‌గా ఉన్న సుబ్రమణ్యం.. వర్జీనియానుంచి ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్‌గా రికార్డు సృష్టించారు. డెమొక్రటిక్‌లకు కంచుకోట అయిన వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి అమెరికా ప్రతినిధుల సభకు పోటీ చేసి రిపబ్లికన్ పార్టీకి చెందిన మైక్ క్లాన్సీని ఓడించారు. ప్రస్తుతం ఐదుగురు భారతీయ అమెరికన్లతో కూడిన కాంగ్రెస్‌లో ఆయన సమోసా కాకస్‌లో చేరారు. సుబ్రమణ్యం తండ్రిది బెంగళూరు. తండ్రిది చెన్నై. తాత మిలటరీలో పనిచేయడంతో తండ్రి ఎక్కువకాలం సికింద్రాబాద్‌లో గడిపారు. బెంగళూరులోని మెడికల్ కాలేజీలో చదువుకున్న ఇద్దరూ పెళ్లి చేసుకుని 70వ దశకంలో అమెరికాకు వలస వచ్చారు. తమ కొడుకు యూఎస్ కాంగ్రెస్‌లో ఉంటారని ఊహించి ఉండదు. సుహాస్ భార్య మిరాండాది వర్జీనియా. ఇద్దరు కుమార్తెలు. 'ఈ జిల్లాకు సేవలందించడం గౌరవంగా భావిస్తున్నా' అని సుబ్రమణ్యం పేర్కొన్నారు. అలాగే 'నా పేరెంట్స్ కొన్ని విలువలు నేర్పారు. నా భారతీయ మూలాలు కోల్పోకూడదన్నది అందులో ఒకటి. అందుకే వేసవిలో ఇండియాకు వెళ్తుంటా. ఇప్పటికీ అక్కడ నాకు కుటుంబం ఉంది. ఆ వారసత్వాన్ని కొనసాగించడం నాకు చాలా ముఖ్యం. నా నేపథ్యం, నా వారసత్వం గురించి గర్వంగా చెప్పుకుంటా'అని చెప్పే సుబ్రమణ్యం.. భారత్-అమెరికా మధ్య బలమైన బంధం ఉండాలని కోరుకుంటున్నారు.

వాన్స్ తెలుగువారి అల్లుడే!

ఆయన భార్య ఉషకు ఏపీలోని వడ్లూరు గ్రామంతో అనుబంధం

నిడదవోలు/ఉయ్యూరు: అమెరికా ఉపాధ్యక్ష పదవిని అధిరోహించబోతున్న రిపబ్లికన్ నేత జేడీ వాన్స్ తెలుగు వారి అల్లుడే. ఆయన భార్య చిలుకూరి ఉషాబాల తెలుగు సంతతికి చెందిన వారే కావడం విశేషం. 38 ఏళ్ల ఉషా అమెరికాలో జన్మించినప్పటికీ ఆమె తాత, ముత్తాలది మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామమని ఆ గ్రామపెద్దలు చెబుతున్నారు. చిలుకూరి ఉషాబాల ముత్తాత రామశాస్త్రి కొంత భూమిని గ్రామంలో ఆలయం కోసం దానంగా ఇచ్చారు. ఆ స్థలంలోనే గ్రామస్తుల సహకారంతో సాయిబాబా ఆలయం, మండపాన్ని నిర్మించారు. వాన్స్ ఉపాధ్యక్షుడిగా ఎన్నివడంపై వడ్లూరు వాస్తవ్యులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయ విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు శాంతమ్మ మరిది రామశాస్త్రి కుమారుడు రాధాకృష్ణ. ఆ రాధాకృష్ణ కూతురే ఉష. ఉషా తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980లలోనే అమెరికాలో స్థిరపడ్డారు. వీళ్ల సంతానం ముగ్గురిలో ఉషా ఒకరు. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం సాయిపురం గ్రామంలోనూ ఉష పూర్వీకులున్నారు. ఆమెకు తాత వరసైన రామ్మోహనరావు కుటుంబం ప్రస్తుతం ఈ గ్రామంలోనే నివసిస్తోంది. ఉష పూర్వీకులు దశాబ్దాల కిందటే ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా సాయిపురంలో 18వ శతాబ్దంలో చిలుకూరి బుచ్చిపాపయ్య శాస్త్రి నివసించారు. ఆయన వంశవృక్షమే శాఖోపశాఖలుగా, కుటుంబాలుగా విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై నగరాలుసహా అమెరికా, ఇతర దేశాల్లో స్థిరపడ్డారు. ఉషా ముత్తాత వీరావధాన్లుకు ఐదుగురు సంతానం. రామశాస్త్రి, సూర్యనారాయణ శాస్త్రి, సుబ్రహ్మణ్య శాస్త్రి, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణమూర్తి. వీరందరూ ఉన్నత విద్యావంతులే. ఉష కారణంగా వడ్లూరు గ్రామం పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోతోందని గ్రామ మాజీ సర్పంచ్ పి.శ్రీనివాసరాజు ఆనందం వ్యక్తంచేశారు.

తొలి భారత సంతతి 'సెకండ్ లేడీ'

అమెరికా అధ్యక్షుడి భార్యను ప్రథమ మహిళగా, ఉపాధ్యక్షుడి భార్యను సెకండ్ లేడీగా సంబోధించడం అమెరికాలో పరిపాటి. భర్త వాన్స్ వైస్‌ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఉషా తొలి భారతసంతతి 'సెకండ్ లేడీ'గా చరిత్ర సృష్టించనున్నారు. కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో ఉషా జన్మించారు. యేల్ విశ్వవిద్యాలయం నుంచి చరిత్రలో డిగ్రీ పట్టా సాధించారు. కేంబ్రిడ్జ్ వర్సిటీ నుంచి తత్వశాస్త్రంలో మాస్టర్స్ చేశారు. సహాయకురాలిగా న్యాయ సంబంధమైన విభాగాల్లో చాలా సంవత్సరాలు విధులు నిర్వర్తించారు. సుప్రీంకోర్టు ఇద్దరు మాజీ న్యాయమూర్తుల వద్ద పనిచేశారు. గతంలో యేల్ లా జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. యేల్ వర్సిటీలో లా అండ్ టెక్ జర్నల్‌కు మేనేజింగ్ ఎడిటర్‌గా ఉన్నారు. చివరిసారిగా ముంగర్, టోల్స్,ఓల్సన్ సంస్థలో పనిచేశారు. యేల్ విశ్వవిద్యాలయంలో ఆమె అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

విద్యావంతులైన తల్లిదండ్రులు

ఉషా తల్లిదండ్రులు ఇద్దరూ విద్యావంతులే. తల్లి లక్ష్మి అణుజీవశాస్త్రంలో, జీవరసాయన శాస్త్రంలో పట్టబద్రులు. ప్రస్తుతం ఆమె అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. శాన్‌డియాగోలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కార్యనిర్వాహక పదవిలోనూ కొనసాగుతున్నారు. ఉషా తండ్రి రాధాకృష్ణ వృత్తిరీత్యా ఏరోస్పేస్ ఇంజినీర్. ఆయన గతంలో ఐఐటీ మద్రాస్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ చేశారు. ఆయన ప్రస్తుతం యునైటెడ్ టెక్నాలజీస్ ఏరోస్పేస్ సిస్టమ్స్‌లో ఏరోడైనమిక్స్ స్పెషలిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతోపాటే కాలిన్స్ ఏరోస్పేస్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు.



భార్య ఉషతో వాన్స్

వాన్స్‌తో ఉష పరిచయం

యేల్ లా స్కూల్‌లో ఉషా, వాన్స్ తొలిసారి కలిశారు. 2013లో ఇద్దరూ కలిసి వర్సిటీలో ఒక చర్చా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆ తర్వాతే ఇద్దరి పరిచయం ప్రేమకు దారితీసింది. 2014 ఏడాదిలో వీరు పెళ్లాడారు. హిందూ సంప్రదాయం ప్రకారమే పెళ్లిచేసుకోవడం విశేషం. వీరికి కూతురు మీరాబెల్, కుమారులు ఎవాన్, వివేక్ ఉన్నారు. భర్త వాన్స్‌కు చేదోడువాదోడుగా ఉంటూ విజయంలో ఉషా కీలకపాత్ర పోషించారు. 'భార్యే నా ధైర్యం. చెబితే నమ్మరుగానీ ఆమె నాకంటే చాలా తెలివైన వ్యక్తి'అని ఉషను పొగడటం తెల్సిందే. రిపబ్లికన్ నేతకు భార్యగా ఉన్న ఉషా దశాబ్ద కాలం క్రితం 2014లో డెమొక్రటిక్ పార్టీకి మద్దతు తెలపడం విశేషం.

సాయిపురం వాసుల్లో ఆనందం

వాన్స్ విజయం సాధించటంతో తెలుగు ప్రజల్లో సంబరం వెల్లివిరిసింది. ప్రత్యేకించి ఉషా పూర్వీకుల మరో గ్రామమైన సాయిపురం వాసుల్లో ఆనందం వెల్లివిరిసింది. మంగళవారం స్థానికులు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

'హిట్లర్' చేతే శెభాష్ అనిపించుకుని..

అత్యల్పకాలంలో రెండో అత్యున్నత పదవి స్థాయికి ఎదిగిన జేడీ వాన్స్

అత్యంత స్వల్పకాలంలో రాజకీయ పదవీ నిచ్చెనను చకచకా ఎక్కేసి ఉపాధ్యక్షుడిగా అవతరించిన జేడీ వాన్స్ ప్రస్థానం ఆసక్తికరం. ఒకప్పుడు ట్రంప్‌ను హిట్లర్ అంటూ బహిరంగంగా విమర్శించిన వాన్స్‌ను ఇప్పుడు అదే ట్రంప్ పిలిచి మరీ తనకు సహసారథిగా ఎంపికచేయడం విశేషం. ఓహియో నుంచి సెనేటర్‌గా ఉన్న వాన్స్ ఉపాధ్యక్ష పీఠంపై కూర్చుంటున్న అతిపిన్నవయస్కుల్లో ఒకరిగా, అత్యల్ప పాలనాఅనుభవం ఉన్న నేతగా రికార్డ్ సృష్టించారు. గతంలో తన జీవితంలో చూసిన సంఘటనల సమాహారంగా 2016లో రాసిన 'హిల్‌బిల్లీ ఎలిగే'పుస్తకం విశేష ఆదరణ పొందటంతో వాన్స్ పేరు ఒక్కసారిగా పాపులర్ అయింది. ఆ రచనను తర్వాత సినిమాగా తీశారు.

+ జేడీ వాన్స్ పూర్తిపేరు జేమ్స్ డొనాల్డ్ బౌమాన్
+ స్కాచ్-ఐరిష్ మూలాలున్న వాన్స్ 1984 ఆగస్ట్ రెండో తేదీన ఓహియోలోని మిడిల్‌టౌన్‌లో జన్మించారు. ఆరేళ్ల వయసులో ఉన్నప్పుడే తల్లిదండ్రులు విడాకులు తీసుకోవడంతో అమ్మమ్మ, తాతయ్య పెంచి పెద్దచేశారు. అందుకే తండ్రి వారసత్వంగా వచ్చిన బౌమాన్ పేరును తీసేసుకుని అమ్మమ్మ వాన్స్ పేరును తగిలించుకున్నారు.

➡ పేదరికం కారణంగా 17 ఏళ్ల వయసులో ఒక సరకుల దుకాణంలో క్యాషియర్‌గా పనిచేశాడు. 2003లో అమెరికా మెరైన్ కార్ప్స్‌లో చేరి మిలటరీ జర్నలిస్ట్‌గా పనిచేశాడు. 2005లో ఇరాక్‌లో అమెరికా సైన్యం సహాయక విభాగంలో పనిచేశారు.

➡ ఓహియో వర్సిటీలో చదువుకున్నారు. యేల్ వర్సిటీలో లా పూర్తిచేసి కొంతకాలం న్యాయవాదిగా న్యాయసేవల సంస్థలో పనిచేశారు. తర్వాత ఒక జడ్జి వద్ద లా క్లర్క్‌గా కొనసాగారు. తర్వాత టెక్నాలజీ రంగంలో వెంచర్ క్యాపిటలిస్ట్ అవతారమెత్తారు. తర్వాత న్యాయసేవల సంస్థనూ స్థాపించారు.

➡ తొలిసారిగా షెరాడ్ బ్రౌన్‌పై సెనేట్ ఎన్నికల్లో పోటీకి ప్రయత్నించినా కుదర్లేదు. 2016లో ట్రంప్‌ను 'అమెరికా హిట్లర్'అని సంబోధించి పలు విమర్శలు చేశారు. తర్వాత ట్రంప్‌కు సారీ కూడా చెప్పారు. తర్వాత 2021లో రాజకీయాల్లోకి వచ్చారు.

➡ 2022లో సెనేట్ ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి టిమ్ రేయాన్‌ను ఓడించి తొలిసారిగా ఓహియో సెనేటర్ అయ్యారు. తర్వాత ట్రంప్‌కు విధేయునిగా మారారు. దీంతో తన రన్నింగ్‌మేట్‌గా వాన్స్‌ను ట్రంప్ ఎన్నుకున్నారు.

➡ మొదట్లో ట్రంప్ కంటే ముందు వాన్స్‌కే అధ్యక్ష అభ్యర్థిత్వం విషయంలో మద్దతు పలకాలని వ్యాపారవేత్తలు ఎలాన్ మస్క్, డేవిడ్ ఓ సాక్స్‌లు భావించారని గతంలో వార్తలొచ్చాయి. యేల్ వర్సిటీలో చదువుకునే రోజుల్లో ప్రేమించిన ఉషను పెళ్లాడారు.

➡ శ్వేతజాతి కార్మికుల సంక్షేమం గురించి ఎక్కువగా మాట్లాడే వాన్స్ విదేశాంగ విధానంలో చైనాకు బద్ధ వ్యతిరేకిగా పేరుంది. ట్రంప్ పేరులోనూ వాన్స్ పేరులోనూ డొనాల్డ్ అనే పేరు ఉండటం గమనార్హం. – వాషింగ్టన్



జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో బుధవారం నిరసన తెలుపుతున్న బీజేపీ సభ్యులు

ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలి

నిరసనల నడుమ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ తీర్మానం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో బుధవారం తీవ్ర గందరగోళం చెలరేగింది. ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ అధికార పక్షం తీర్మానం ప్రవేశపెట్టింది. అయితే, తీర్మానం ప్రతులను చించివేస్తూ, స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీజేపీ సభ్యులు నిరసనలను కొనసాగించారు. వెల్‌లోకి దూసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నాన్ని మార్షల్స్ అడ్డుకున్నారు. నిరసన ధ్వనుల మధ్యే సభ ఈ తీర్మానంపై ఎలాంటి చర్చ చేపట్టకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. దీంతో, బీజేపీ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం ఏర్పడటంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. అయినప్పటికీ బీజేపీ సభ్యులు 5 ఆగస్ట్ జిందాబాద్, జై శ్రీరాం, వందే మాతరం అంటూ నినాదాలు కొనసాగించారు. కేంద్రం తమ ప్రాంత ప్రత్యేక హోదాను ఏకపక్షంగా రద్దు చేసిందని తీర్మానం ఆరోపించింది. ప్రత్యేక హోదా కశ్మీర్ ప్రజల హక్కని పేర్కొంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చామని, అసెంబ్లీ తన కర్తవ్యం నెరవేర్చిందని సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. తీర్మానానికి పీడీపీ, పీపుల్స్ కాన్ఫరెన్స్, సీపీఎంలు మద్దతు తెలిపాయి. అయితే, ప్రభుత్వం ఈ తీర్మానాన్ని అయిష్టంతోనే సభలో ప్రవేశపెట్టిందని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ విమర్శించారు. అసెంబ్లీ అజెండాలోని లేని అంశంపై ప్రభుత్వం తీర్మానం చేయించిందని ప్రతిపక్ష బీజేపీ నేత సునీల్ శర్మ ఆరోపించారు. తీర్మానంతో ఒరిగేదేమీ లేదంటూ ఆయన వ్యాఖ్యానించడంతో సభలో అధికార పక్షం సభ్యులు నిరసన తెలిపారు.

ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ అక్కర్లేదు

- ఎల్ఎంవీ లైసెన్స్‌తో రవాణా వాహనం నడపొచ్చు
- 7,500 కిలోలలోపు బరువున్న వాహనం నడపడానికి అర్హులే
- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు

సాక్షి, న్యూఢిల్లీ: రవాణా వాహనాలను నడిపించే విషయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. రవాణా వాహనాలు నడిపేందుకు ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదని స్పష్టం చేసింది. లైట్ మోటార్ వెహికల్(ఎల్ఎంవీ) డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు 7,500 కిలోల లోపు బరువైన ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కూడా నడపించవచ్చని, అందుకు వారు అర్హులేనని తేల్చిచెప్పింది. బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ వర్సెస్ రంభాదేవి కేసు సహా.. మరో 76 పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ''రవాణా వాహనం బరువు 7,500 కిలోల కంటే తక్కువగా ఉంటే.. ఎల్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తి నడిపించగలడు. తేలికపాటి మోటార్ వాహనం(ఎల్ఎంవీ), రవాణా వాహనం మధ్య స్పష్టమైన వ్యత్యాసం లేదు. రవాణా వాహనం నడపడానికి అదనపు నిబంధనలు 7,500 కిలోల బరువు కంటే ఎక్కువ ఉన్న వాహనాలకు మాత్రమే వర్తిస్తాయి''అని ధర్మాసనం వెల్లడించింది. ఎల్ఎంవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లు రవాణా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్న వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ వాదనను బలపరిచే స్పష్టమైన ఆధారాలేవీ లేవని పేర్కొంది. ఈ మేరకు 126 పేజీల తీర్పు వెలువరించింది. మోటార్ వాహన(ఎంవీ) చట్టం ప్రకారం.. 7,500 కిలోలకు పైగా బరువున్న మధ్య తరహా రవాణా వాహనాలు, మధ్య తరహా ప్రయాణ వాహనాలు, భారీ రవాణా వాహనాలు, భారీ ప్రయాణ వాహనాలు నడపడానికి అదనపు అర్హతలు అవసరమని వివరించింది.

గత తీర్పును సమర్థించిన ధర్మాసనం

ముకుంద్ దేవాంగన్ వర్సెస్ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కేసులో 2017 నాటి విచారణ సందర్భంగా 7,500 కిలోల కంటే తక్కువ బరువున్న రవాణా వాహనాన్ని ఎల్ఎంవీగా పరిగణిస్తున్నట్లు ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం అప్పట్లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ మొత్తం 76 పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. త్రిసభ్య ధర్మాసనం తీర్పు ప్రకారం ఎల్ఎంవీ లైసెన్స్ ఉన్న డ్రైవర్ రవాణా వాహనాలు నడపడం వల్ల పౌరుల జీవితాలు ప్రమాదంలో పడతాయని, నష్టపరిహారం చెల్లించే విషయంలో బీమా సంస్థలపై భారం పెరుగుతుందని ఇన్సూరెన్స్ కంపెనీలు తమ పిటిషన్లలో పేర్కొన్నాయి. ఈ పిటిషన్లను తాజాగా విచారించిన జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం గతంలో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఇన్సూరెన్స్ కంపెనీలు దాఖలు చేసిన పటిషన్లను కొట్టివేసింది. ఇదిలా ఉండగా, తాజా తీర్పుతో డ్రైవర్లకు ప్రయోజనం చేకూరనుంది. ఫలానా లైసెన్స్ లేదన్న కారణంతో బీమా సంస్థలు డ్రైవర్లకు ఇన్సూరెన్స్ సొమ్ము చెల్లించకుండా ఎగ్గొట్టడానికి వీలుండదు.



లోకాయుక్త ఆఫీసు నుంచి బయటకు వస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

ముడా కేసులో సిద్ధరామయ్యను ప్రశ్నించిన లోకాయుక్త పోలీసులు

మైసూరు: ముడా ప్లాట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే కేసులో లోకాయుక్త పోలీసులు బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రెండు గంటల పాటు ప్రశ్నించారు. లోకాయుక్త ఎస్పీ టి.జే.ఉదేష్ తన ముందుంచిన ప్రశ్నావళికి సిద్ధరామయ్య సమాధానాలు ఇచ్చారు. దాదాపు రెండు గంటల పాటు సీఎంను ప్రశ్నించినట్లు లోకాయుక్త వర్గాలు వెల్లడించాయి. సిద్ధరామయ్య లాయర్‌తో కలిసి ప్రైవేటు కారులో లోకాయుక్త ఆఫీసుకు వచ్చారు. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) సిద్ధరామయ్య భార్య పార్వతికి చెందిన 3.16 ఎకరాలను సేకరించింది. దీనికి బదులుగా ఖరీదైన ప్రాంతంలో 14 ప్లాట్లను కేటాయించింది. ఇందులో అవకతవకలు, అవినీతి జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో బుధవారం విచారణ హాజరు కావాలని లోకాయుక్త పోలీసులు సమన్లు జారీచేశారు. లోకాయుక్త పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చానని సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. సీఎం హోదాలో విచారణ హాజరుకావడంపై ప్రశ్నించగా.. కోర్టు దోషిగా తేల్చితే తప్పితే తన ప్రతిష్టకు ఎలాంటి భంగం వాటిల్లదని ఆయన చెప్పుకొచ్చారు. లోకాయుక్త కేసు ఆధారంగా సిద్ధరామయ్య తదితరులపై ఈడీ మనీలాండరింగ్ కేసును నమోదు చేసిన విషయం తెలిసిందే.

నీట్-యూజీకి మళ్లీ ప్రవేశపరీక్ష కుదరదు: సుప్రీం

న్యూఢిల్లీ: వైద్య విద్యలో ప్రవేశాలను గాను నిర్వహించే నీట్- యూజీ 2024 ప్రవేశపరీక్షను మళ్లీ నిర్వహించడం కుదరదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఈ మేరకు ఆగస్టు 2న తామిచ్చిన తీర్పును సమీక్షించడానికి నిరాకరించింది. కాజల్ కుమారి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. ఆగస్టు 2న తామిచ్చిన తీర్పులో తప్పులేమీ లేవని స్పష్టీకరించింది. ఓపెన్ కోర్టులో విచారించాలనే అభ్యర్థననూ తోసిపుచ్చింది.

ప్రతిభావంతుల కోసం పీఎం-విద్యాలక్ష్మి

కేంద్ర మంత్రివర్గం ఆమోదం


న్యూఢిల్లీ: ప్రతిభావంతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ఉద్దేశించిన పీఎం- విద్యాలక్ష్మి పథకానికి బుధవారం కేంద్ర మంతివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ప్రతిభావంతులైన విద్యార్థులు పైచదువులకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతోనే ఈ పథకం తెచ్చామన్నారు. నాణ్యతగల ఉన్నత విద్యాసంస్థల్లో(క్యూహెచ్ఈఐలు) ప్రవేశం పొందిన వారెవరైనా ఈ పథకానికి అర్హులు. వీరికి కోర్సుకు సంబంధించిన పూర్తి ట్యూషన్ ఫీజు, ఇతర ఖర్చులకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఎటువంటి హామీతో పనిలేకుండా రుణాలిస్తాయి. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) తాజాగా గుర్తించిన టాప్-100 ర్యాంకుల్లో ఉన్న విద్యాసంస్థలకు ఈ పథకం వర్తిస్తుంది. విద్యాలక్ష్మి పథకం ద్వారా 22 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ విద్యాసంస్థల్లో ప్రవేశం పొందొచ్చు. పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.7.5 లక్షల వరకు రుణం లభిస్తుంది.

సాక్షి
హైదరాబాద్

గురువారం, 7, నవంబర్, 2024



స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్
క్రీడాకారుల ప్రతిభకు ప్రతిపాదించాల్సిన నగదు ప్రోత్సాహకాలను, ఉద్యోగ అవకాశాలను స్పోర్ట్స్ పాలసీలో స్పష్టం చేయబోతున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రకటించింది. - 10లో



ఆర్ట్.. కలెక్టర్స్
నగరంలో పేరొందిన చిత్రకారులు, శిల్పులు మాత్రమే కాదు.. కళాభిమానం ద్వారా బెస్ట్ ఆర్ట్ కలెక్టర్స్‌గా దేశవ్యాప్తంగానూ ప్రాచుర్యం పొందినవారూ ఉన్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/18.0

వాతావరణం
నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.






ఇంటింటికీ సర్వే స్టిక్కర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే గ్రేటర్‌లో బుధవారం ప్రారంభమైంది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని మూసాపేటలో ఎన్యూమరేటర్లు ఇల్లిల్లూ తిరుగుతూ స్టిక్కర్లు అతికించారు. స్టిక్కర్లు అతికించిన కార్యక్రమం పూర్తి అయిన తర్వాత సర్వేలో భాగంగా అడిగే సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని ఆయా ఇళ్ల యజమానులకు సిబ్బంది సూచించారు.

ఎల్‌బీ నగర్‌లో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

'వన్‌టైమ్ సెటిల్‌మెంట్' గడువు పొడిగింపు

సాక్షి,సిటీ బ్యూరో: నల్లా నీటి బకాయిలు చెల్లించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్) స్కీమ్ ఈ నెల 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ(మున్సిపల్) ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బకాయిదారుల చెల్లింపు సందర్భంగా అఫిడవిట్ కాకుండా స్వయం ధ్రువీకరణ ఇస్తే సరిపోతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

సందడిగా తిరిగి.. నీళ్లబకెట్‌లో పడి..

- విగతజీవిగా మారిన ఏడాదిన్నర చిన్నారి
- ఖైరతాబాద్ డబుల్ బెడ్‌రూం ఇంటిలో విషాదం



ఖైరతాబాద్: రాత్రి 9 గంటలు.. ఇంట్లో కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేస్తున్నారు. ఏడాదిన్నర పాప తప్పటడుగులు వేస్తూ తిరుగుతుండగా తల్లి గోరుముద్దలు పెడుతోంది. చిన్నారి సందడికి అందరూ సంతోషంగా ఉన్నారు. అంతలోనే ఆ పాప బెడ్‌రూం బాత్‌రూంలోని నీళ్ల బకెట్‌లో పడి విగతజీవిగా మారింది. ఖైరతాబాద్ ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ డివిజన్‌లోని ఐమాక్స్ ఎదురుగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో బి బ్లాక్ 307 ఫ్లాట్‌లో తోట సతీష్‌కుమార్, రేణుక దంపతులు నివసిస్తున్నారు. ఈ ఫ్లాట్‌లో మొత్తం 12 మంది ఉంటున్నారు. సతీష్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. ఏడాదిన్నర వయసున్న మూడో కూతురు ఆద్విక మంగళవారంరాత్రి ఇంట్లో తల్లి పెట్టే గోరుముద్దలు తింటూ సందడి చేస్తూ, తప్పటడుగులు వేస్తూ, అటు ఇటు తిరుగుతోంది. ఈ క్రమంలో తల్లి కూడా భోజనం ముగించుకొని 9.30 గంటలకు బెడ్‌రూంలో ఉన్న మొబైల్ ఫోన్ తీసుకునేందుకు వెళ్లగా అటాచ్‌డ్ బాత్‌రూం తలుపు తెరిచి ఉంది. అందులో ఉన్న నీళ్లబకెట్‌లో పాప కాళ్లు పైకి కనిపించడంతో తల్లి లబోదిబోమంటూ ఏడుస్తూ బయటికి తీసింది. కుటుంబసభ్యులు వెంటనే సమీపంలోని వాసవి హాస్పిటల్‌కు పాపను తీసుకువెళ్లారు. అక్కడ వైద్యుల సూచన మేరకు రాత్రి 11 గంటల నిలోఫర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ చిన్నారి చనిపోయింది. కళ్ల ముందు ఆడుకుంటూ ఉన్న పాప అంతలోనే మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నా యి.

ఫ్రీ రైస్ @ నెట్ అమౌంట్!



రేషన్ డీలర్ వద్దే నగదు బదిలీ

- కిలోకు రూ. 10 అందజేత
- బాహాటంగా పీడీఎస్ బియ్యం పక్కదారి
- ప్రతీనెలా కోటా డ్రా కోసం బయోమెట్రిక్

సాక్షి,సిటీబ్యూరో: రేషన్‌షాపుల వద్దే ఉచిత బియ్యం దందా బాహాటంగా కొనసాగుతోంది. పీడీఎస్ బియ్యం పక్కగా పక్కదారి పడుతున్నాయి. కొన్నిచోట్ల డీలర్లే దళారుల అవతారమెత్తారు. ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న 'ఉచిత బియ్యం 'అక్రమంగా నగదు బదిలీగా మారుతున్నాయి. సాక్షాత్తు రేషన్ డీలర్లే బియ్యం కోటాకు బదులుగా కిలో రూ.10 చొప్పున లెక్క కట్టి మరీ కార్డుదారులకు నగదు అందించడం గమనార్హం. కరోనా కాలం నుంచి ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పథకం కొనసాగుతూ వస్తోంది. అయితే ఉచిత బియ్యంపై ఆసక్తి లేని లబ్ధి కుటుంబాలు కేవలం తమ కార్డు యాక్టివ్‌గా ఉండేందుకు నెలసరి బియ్యం కోటాను తీసుకొని దళారులకు విక్రయిస్తూ వచ్చారు. తాజాగా డీలర్లే ఆ బియ్యం కొనుగోలుకు తెరలేపారు. ఈ పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నా పౌర సరఫరాల శాఖ ప్రేక్షక పాత్ర పోషించడం విస్మయానికి గురిచేస్తోంది.

బయోమెట్రిక్ ద్వారా..

ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో బయోమెట్రిక్ అమలు కంటే ముందు రేషన్ డీలర్లు చేతివాటం ప్రదర్శించేవారు. లబ్ధిదారులు తీసుకోని సబ్సిడీ సరుకులను గుట్టుచప్పుడు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకునేవారు. సంస్కరణలో భాగంగా ఈ– పాస్ అమలుతో లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిస్, ఓటీపీ తప్పనిసరిగా తయారైంది. దీంతో డీలర్లు లబ్ధిదారుల ఆమోదంతో చేతికి మట్టి అంటకుండా చేతివాటానికి తెరలేపారు. ఈ–పాస్‌పై కార్డుదారుల బయోమెట్రిక్ తీసుకొని వారి వద్ద నుంచి బియ్యం తీసుకొని నగదు చెల్లిస్తున్నారు.

సగానికిపైగా అనర్హులే...

హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో సుమారు 17.20 లక్షల వరకు రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. అందులో సగానికిపైగా అనర్హత కలిగిన కుటుంబాలు ఉన్నట్లు పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. రేషన్‌కార్డు బహుళ ప్రయోజనకారి కావడంతో నిరుపేదలతోపాటు ఆదాయ వర్గాలు కూడా పెద్ద ఎత్తున కార్డులు పొందాయి. వారికి పీడీఎస్ బియ్యం అవసరం లేనప్పటికీ కేవలం తమ రేషన్ కార్డు రద్దు కాకుండా యాక్టివ్‌గా ఉండేందుకు అప్పుడప్పుడు బియ్యం కోటా డ్రా చేస్తున్నారు. ఇడ్లీ, దోశల కోసమని కొంత బియ్యం తమ దగ్గర ఉంచుకొని మిగతావాటిని విక్రయిస్తున్నారు.

కిలో బియ్యం రూ. 32.94

ప్రభుత్వం పీడీఎస్ కిలో బియ్యం పంపిణీకి రూ.32.94 ఖర్చుచేస్తోంది. వాస్తవంగా కిలో బియ్యం ధర రూ. 31 పలుకుతుండగా దాని రవాణా, నిర్వహణకు కలిపి అదనంగా రూ.1.94 వ్యయమవుతోంది. లబ్ధిదారులు మాత్రం తమ కోటా కింద అందిన బియ్యాన్ని కారుచౌకగా కిలో 10 రూపాయలకు విక్రయించడం గమనార్హం. నిఘా పెట్టి అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని, దందాకు తెరలేపిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సర్వేను అడ్డుకుంటే చర్యలు

- కులగణనపై అపోహలొద్దు
- సర్వే వివరాలు పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతాం
- గ్రేటర్‌లో సర్వే ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం

సాక్షి,సిటీబ్యూరో: సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు ఎలాంటి అనుమానాలు, అపోహలు పెట్టుకోవద్దని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకాలు కల్పిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. సర్వేకు ప్రతిపక్షాలు సహకరించాలని, అవసరమైన సూచనలివ్వాలని కోరారు. గ్రేటర్ నగరంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన సమాచారం గోప్యంగా ఉంటుందని, ఆయా వర్గాల మధ్య అసమానతలు తొలగించి, అవసరమైన వారికి న్యాయం చేసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని స్పష్టం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగానే ముందుకు వచ్చి సర్వే సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఎదుటివారు మంచి పనులు చేస్తున్నారంటే అడ్డుకొని వారిని పడగొట్టేవిధంగా రాజకీయాలు మారాయని వ్యాఖ్యానించారు. ఎవరు ఎలా రెచ్చగొట్టినా ప్రజలు వాటి ప్రభావంలో పడొద్దని కోరారు.

ఆధార్ వివరాలు తప్పనిసరి కాదు.. కానీ

సర్వేలో ఆధార్ వివరాలు తప్పనిసరి కాదని, ఐచ్ఛికం మాత్రమేనని మంత్రి ప్రభాకర్ అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి మంచి చేయాలన్న తపన ఉందన్నారు. ఈ సర్వే దేశానికి దిక్సూచి కానుందని, హైదరాబాద్ రోల్‌మోడల్‌గా నిలవనుందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోని మంత్రులంతా స్వేచ్ఛగా పనులు చేసుకుంటున్నారని చెప్పారు. మేం చెప్పేదే కాక ప్రజలు చెప్పిందీ వింటున్నామన్నారు. సమాజంలోని లోపాల్ని గుర్తించేందుకు సర్వే ఎక్స్‌రే మాదిరిగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. బోనాలు, బతుకమ్మ, వినాయకచవితి వంటి పండుగల్లాగే ప్రజల సహకారంతోనే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందంటూ, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



సర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, చిత్రంలో కలెక్టర్, మేయర్

1.17 కోట్ల ఇళ్ల సర్వే..

గత ప్రభుత్వంలో మాదిరిగా తమ ప్రభుత్వం సర్వే వివరాలను అల్మారాలో దాచి ఉంచదని, పబ్లిక్ డొమైన్‌లో పెడతామని మంత్రి పొన్నం అన్నారు. రాష్ట్రంలో 1.17 కోట్ల ఇళ్లను సర్వే చేసేందుకు 87 వేల మందికిపైగా ఎన్యూమరేటర్లను వినియోగిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తొలి మూడు రోజులు ఎన్యూమరేటర్లు సర్వే చేయాల్సిన ఇళ్లకు స్టిక్కర్లు అంటించి ప్రజలకు ఏయే వివరాలు దగ్గర ఉంచుకోవాలో వివరిస్తారన్నారు. 9వ తేదీ నుంచి సర్వే జరుపుతారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత,హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, స్నేహ శబరీష్, అలివేలు మంగతాయారు, జోనల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ క్యాడెట్ల పాసింగ్ అవుట్

జవహర్‌నగర్: సమాజ నిర్మాణంలో సీఐఎస్‌ఎఫ్ పోలీసులు ముఖ్య భూమిక పోషించాలని నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీ(నీసా) డైరెక్టర్ సునీల్ ఇమ్మాన్యుయేల్ అన్నారు. హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ అకాడమీ (నీసా)లో శిక్షణ పొందిన సీఐఎస్‌ఎఫ్ క్యాడెట్లకు బుధవారం పాసింగ్ అవుట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సునీల్ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి అనుగుణంగా అత్యాధునిక టెక్నాలజీతో క్యాడెట్లకు నీసాలో శిక్షణ అందిస్తున్నామన్నారు. అనంతరం పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సబ్ ఆఫీసర్ ఉత్తర ఇండోర్, అవుట్‌డోర్ ఈవెంట్ రామమూర్తి, అసిస్టెంట్ కమాండెంట్ యోగేశ్‌శర్మలకు ట్రోఫీలు అందచేశారు. ఈ సందర్భంగా క్యాడెట్ల విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో నీసా అధికారులు, క్యాడెట్ల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీసా డైరెక్టర్ సునీల్ ఇమ్మాన్యుయేల్

మేయర్‌కు మళ్లీ కోపమొచ్చింది!

ఆకస్మిక తనిఖీలో అధికారుల గైర్హాజర్‌పై సీరియస్



జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సాక్షి,సిటీబ్యూరో: అయినా తీరు మారలేదు. ఎంతకూ రీతి మారలేదు. ఇష్టం వచ్చినప్పుడు రావడం.. ఓపిక ఉన్నప్పుడు ఫైళ్లు కదపడం.. ఏళ్లుగా ఇదే తంతు. తనిఖీలు చేసి హెచ్చరించినా వారికి లెక్కలేదు. మేయర్ సీరియస్ అయినా పట్టించుకోరు. ఇదీ జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారుల పనితీరు. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మికి మరోసారి కోపమొచ్చింది. గతంలో రెండు పర్యాయాలు కార్యాలయాల్లో తనిఖీలు చేసినప్పుడు సిబ్బంది ఎవరూ తమ సీట్లలో కనిపించకపోవడంపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఆయా విభాగాల్లో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని విభాగాల్లో మధ్యాహ్నం 12 గంటలవుతున్నా అధికారులు తమ తమ స్థానాల్లో లేకపోవడంపై మేయర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై సహించేది లేదని, సమయపాలన పాటించనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలస్యంగా వచ్చేవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తనకు నివేదిక పంపాల్సిందిగా అన్ని విభాగాలకు సర్క్యులర్లు పంపినా, ఎందుకు పంపలేదంటూ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

టౌన్ ప్లానింగ్‌పైనే ఎక్కువ ఫిర్యాదులు

ప్రజావాణిలో ఎక్కువ ఫిర్యాదులు టౌన్ ప్లానింగ్‌వే ఉంటున్నాయని, పరిష్కారం కాక ప్రజలు జీహెచ్‌ఎంసీ చుట్టూ తిరుగుతున్నారని మేయర్ అన్నారు. హెల్త్ సెక్షన్‌లో కొందరు పని మాని సెల్‌ఫోన్ వీక్షణంలో నిమగ్నం కావడాన్ని గుర్తించి సీరియస్ అయ్యారు. ఇన్‌చార్జి సీఎంఓహెచ్ సీట్లో లేకపోవడంపై మండిపడ్డారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీలు చేస్తున్నారో తెలుసుకోవాలని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ముత్యం రాజును ఆదేశించగా, ఆయన శేరిలింగంపల్లి ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సక్రమంగా సమాధానం ఇవ్వకపోవడంతో మేయర్ మండిపడ్డారు. వెటర్నరీ విభాగంలోనూ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంతకు ముందు కూడా రెండుసార్లు అన్ని విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు చేశానని, అయినా వారి తీరు మారలేదన్నారు. ఆయా విభాగాల సిబ్బంది ఉదయం 10:30 గంటల వరకు ఆఫీసులకు రావాలని, 10:40 నిమిషాల వరకు కూడా రాకపోతే ఆలస్యంగా నమోదు చేస్తామని, ఇలా మూడు పర్యాయాల ఆలస్యానికి క్యాజువల్ లీవ్ కట్ చేస్తామని, అవి లేనివారికి ఈఎల్ కట్‌చేస్తామని హెచ్చరించారు. తనిఖీల సందర్భంగా మేయర్ వెంట అడిషనల్ కమిషనర్ నళినీపద్మావతి ఉన్నారు. అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడుతూ ఆలస్యంగా వచ్చేవారి గురించి తనకు ప్రతినెలా నివేదిక అందజేయాలని అన్ని విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీలోని ప్రతి ఉద్యోగి ఫేషియల్ రికగ్నిషన్ హాజరులో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

'సైబర్' రిఫండ్ రూ.137 కోట్లు

- దేశంలోనే ప్రథమస్థానంలో తెలంగాణ
- డిజిటల్ హైజీన్‌తో సైబర్ నేరాలకు చెక్
- 'హాక్–2.0'లో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు



హాక్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో సీవీ ఆనంద్, శిఖా గోయల్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో రాష్ట్రవాసులు కోల్పోయిన మొత్తం నుంచి ఈ ఏడాది రూ.137 కోట్లు రిఫండ్ చేశామని ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ఈ విషయమై తెలంగాణ పోలీసు విభాగం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీసులు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ యాన్యువల్ సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్–2024ను (హాక్–2.0) మంత్రి బుధవారం ప్రారంభించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ 'సైబర్ సెక్యూర్డ్ నేషన్ స్థాపనకు అంతా కృషి చేయాలి. సైబర్ సెక్యూరిటీ అనేది ప్రభుత్వం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించినవారికి మాత్రమే కాదు. ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలి. రాష్ట్రం త్వరలో డిజిటల్ తెలంగాణగా అవతరించబోతోంది. సైబర్ నేరగాళ్లు చేసే విధ్వంసాలను అడ్డుకోవాలి. ప్రజలు భద్రంగా ఉండటానికి టెక్నాలజీని వినియోగించాలనేది మన లక్ష్యం. శారీరక శుభ్రత మాదిరిగానే డిజిటల్ హైజీన్ అత్యంత కీలకం. ఇది లేకుంటే సైబర్ దాడుల ముప్పు పెరుగుతుంది. నేరాల దర్యాప్తు కోసం ఎథికల్ హ్యాకర్ల సేవల్ని పోలీసులు వాడుతుంటారు. వీళ్లు అనెథికల్ హ్యాకర్స్‌గా మారితే పరిస్థితి ఏంటన్నది గుర్తుంచుకోవాలి. దేశంలో ప్రతిరోజూ ఏడు వేల సైబర్ క్రైమ్ కేసులు నమోదవుతున్నాయి. రానున్న ఐదేళ్లల్లో సైబర్ నేరాల వల్ల ప్రపంచవ్యాప్తంగా 10.5 ట్రిలియన్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా. సైబర్ నేరాల నిరోధం విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. యువతకు మెరుగైన ఉద్యోగాల కల్పన కోసమే ముఖ్యమంత్రి స్కిల్ యూనివర్సిటీకి అంకురార్పణ చేశారు'అని అన్నారు.

ఆ పాస్‌వర్డ్స్‌తోనే హ్యాకింగ్ ముప్పు

సైబర్ నేరాల ముప్పు పొంచి ఉన్నప్పటికీ అనేకమంది చాలా బలహీనమైన పాస్‌వర్డ్స్ వాడుతున్నారు. వ్యక్తిగత అంశాల్లో మాత్రమే కాదు, చివరకు ఐటీ రంగానికి చెందిన కార్యాయాల్లోనూ అడ్మిన్లు తమ పాస్‌వర్డ్స్‌ను 'అడ్మిన్'పెట్టుకుంటున్నారు. యూపీఐ పేమెంట్లు వచ్చిన తర్వాత నగదు బదిలీ చాలా తేలికైంది. ఈ యాప్స్ లింకై ఉండే ఖాతాల్లో తక్కువ మొత్తం ఉండేలా చూసుకోవాలి.
– అడవి శేషు, సినీనటుడు

15 రకాలుగా ముప్పు

ప్రస్తుతం హ్యాకింగ్, ర్యాన్సమ్‌వేర్ ఎటాక్స్, స్పూఫింగ్.. ఇలా మొత్తం 15 రకాలైన సైబర్ సెక్యూరిటీ థ్రెట్స్ (ముప్పు) సవాల్ విసురుతున్నాయి. మానవ తప్పిదాల వల్లే 96 శాతం సైబర్ దాడులు జరుగుతున్నాయి. మాల్‌వేర్‌తో కూడిన ఈ–మెయిల్స్‌ను అనాలోచితంగా ఓపెన్ చేయడం వల్లే ఇవి చోటు చేసుకుంటున్నాయి. అనేక సంస్థల్లో కనీస సైబర్ హైజీన్ కూడా ఉండట్లేదు. సైబర్ భద్రతకు ఆయా సంస్థలు ప్రాధాన్యం ఇవ్వట్లేదు. రాష్ట్రంలో సైబర్‌నేరాల బారినపడుతున్న వారిలో 55 శాతం ఐటీ సహా వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులే.
– శిఖా గోయల్, డైరెక్టర్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో

ఐయాం రెడీ క్యాంపెయినింగ్

హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ 'గత ఏడాది ఆర్థిక నేరాలు 11 శాతం, మహిళలపై నేరాలు 4 శాతం పెరిగాయి. సైబర్ నేరాలు 24 శాతం పెరిగాయి. ఈ–నేరాల్లో మొత్తం 36 రకాలు ఉండగా, 25 నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. సైబర్ క్రైమ్ అనేది అతిపెద్ద ముప్పుగా మారింది. ఇటీవల పోలీసు వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయ్యాయి. గతంలో పోలీసులు తుపాకులు, లాఠీలను అనునిత్యం తమ వద్ద ఉంచుకునే వాళ్లు. ఇప్పుడు సెల్‌ఫోన్లు కూడా పెట్టుకోవాల్సి వస్తోంది. ఈ స్మార్ట్‌ఫోన్ల వల్ల సైబర్ దాడుల ముప్పు పెరిగింది. కొన్నాళ్లు మళ్లీ పాత మాదిరిగా డబ్బా ఫోన్లు వాడే రోజు వస్తుంది. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడానికి 'ఐయాం రెడీ'అనే క్యాంపెయినింగ్ చేపడుతున్నాం'అని పేర్కొన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తి స్థలంలో

అక్రమ నిర్మాణాల కూల్చివేత..



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని శబ్దాలయ వెనుక సంగీత దర్శకుడు దివంగత చక్రవర్తికి కేటాయించిన స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది బుధవారం కూల్చివేశారు. చక్రవర్తికి మ్యూజిక్ రికార్డింగ్ స్టూడియో నిర్మించుకునేందుకు ప్రభుత్వం 25 ఏళ్ల క్రితం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లో 20 గుంటల స్థలాన్ని కేటాయించింది. అయితే కేటాయించిన స్థలంలో ఏడాది లోపు ఆ ఉద్దేశాన్ని బహిర్గతపరుస్తూ నిర్మాణాలు చేపట్టాలని నిబంధనలు చెబుతున్నాయి. సంగీత దర్శకుడు చక్రవర్తి మాత్రం తనకు కేటాయించిన స్థలంలో పదేళ్లు దాటినా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఆ తర్వాత ఆయన మృతి చెందారు. ఆయన తనయుడు కూడా సదరు స్థలంలో రికార్డింగ్ స్టూడియో నిర్మించకపోగా తాను కూడా తప్పుకున్నారు. దీంతో ప్రభుత్వం ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ల్యాండ్ బ్యాంక్‌లో నమోదు చేసింది. గత కొన్నేళ్లుగా ఈ స్థలం ప్రభుత్వ ఆధీనంలోనే ఉంది. ఖాళీగా ఉన్న ఈ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలను చేపట్టారు. ఒక్కొక్కరి నుంచి రూ.10 నుంచి 25 వేలు వసూలు చేస్తూ డబ్బాలు ఏర్పాటు చేశారని, కొన్ని శాశ్వత నిర్మాణాలు చేపట్టినట్లు తమ దృష్టికి రావడంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు షేక్‌పేట మండల తహశీల్దార్ అనితారెడ్డి తెలిపారు. ఈ స్థలం ప్రభుత్వానిదేనని, ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా, ఆక్రమించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ విభాగాలకు కేటాయించే ప్రతిపాదన ఉందన్నారు. ఈ స్థలం ఖాళీగా ఉండడంతో కొందరు నకిలీ డాక్యుమెంట్లతో తమదేనంటూ అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెలు తీసుకుంటున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వాటిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అదనపు ఎస్పీల 'ఉచిత సేవ'!

- ఈ ఏడాది జూలైలో 14 మంది డీఎస్పీలకు పదోన్నతి
- అప్పటి నుంచి పని చేస్తున్నచోటే ఎటాచ్‌మెంట్‌పై..
- ఇప్పటి వరకు జీతాలు చెల్లించని ప్రభుత్వం
- బదిలీలకు సంబంధించి కొన...సాగుతున్న కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర పోలీసు విభాగంలో పని చేస్తున్న కొందరు అదనపు ఎస్పీలు కొన్నాళ్లుగా ఉచిత సేవ చేస్తున్నారు. డీఎస్పీ నుంచి పదోన్నతి పొందిన తర్వాత వీరిని ఎటాచ్‌మెంట్ విధానంలో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడు నెలలుగా జీతాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది. ఐపీఎస్‌ల నుంచి డీఎస్పీల వరకు బదిలీలకు సంబంధించిన కసరత్తును పోలీసు విభాగం, ప్రభుత్వం కొన...సాగిస్తుండటంతో తమకు జీతాలు ఎప్పుడు వస్తాయో చెప్పలేని స్థితిలో ఈ అధికారులు ఉన్నారు.

ఎక్కడి వారు అక్కడే పని చేసేలా...

ఈ ఏడాది జూలైలో 14 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో శాంతిభద్రతలు, నిఘా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) తదితర విభాగాల్లో పని చేస్తున్న వాళ్లు ఉన్నారు. సాధారణంగా ఇలా ప్రమోషన్ వచ్చిన వెంటనే ఆయా అధికారుల్ని బదిలీ చేస్తారు. అప్పటి వరకు వీరు నిర్వర్తిస్తున్న పోస్టు నుంచి అదనపు ఎస్పీ స్థాయి దానికి మారుస్తారు. అయితే వీరికి పదోన్నతి ఇచ్చిన సర్కారు... ఎక్కడి వారు అక్కడే ఎటాచ్‌మెంట్‌పై పని చేసే విధంగా ఉత్తర్వులు ఇచ్చింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సర్దుబాట్ల కోసం కొన్ని రోజుల పాటు ఇలా ఎటాచ్‌మెంట్‌పై పని చేయించి.. ఆపై మరోచోట పోస్టింగ్ ఇస్తుంటారు.

మూడు నెలలుగా జీతాలు రాక...

తమకు కూడా అలానే వారం పది రోజుల్లో అదనపు ఎస్పీ స్థానాల్లో పోస్టింగ్ వస్తుందని ఈ అధికారులు భావించారు. పోలీసు విభాగంలో జీతాల చెల్లింపు అనేది అధికారులను బట్టి ఉండదు. వివిధ విభాగాల్లో ఉన్న పోస్టులకే పే అండ్ అకౌంట్స్ (పీఏఓ) కార్యాలయం జీతం కేటాయిస్తుంది. ఈ నేపథ్యంలో ఏ పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లో, వెకెన్సీ రిజర్వ్‌లో (వీఆర్) ఉన్నప్పుడు, ఇలా ఎటాచ్‌మెంట్‌పై పని చేస్తున్నప్పుడు వారికి జీతాల కేటాయింపు జరగదు. పీఏఓ దృష్టిలో అప్పటి వరకు వీరు పని చేసిన డీఎస్పీ పోస్టు పదోన్నతితో ఖాళీ అయినట్లే లెక్క. అక్కడకు కొత్తగా రావాల్సిన అధికారి వస్తేనే మళ్లీ జీతం బిల్లు పాస్ అవుతుంది. వీరిని మరోచోట అదనపు ఎస్పీ పోస్టులో నియమిస్తేనే ఆ జీతం క్లెయిమ్ చేయగలరు. దీని ప్రకారం పదోన్నతి పొందీ డీఎస్పీ పోస్టులోనే ఎటాచ్‌మెంట్‌పై పని చేస్తున్న అదనపు ఎస్పీలకు ఈ రెండు పోస్టుల్లో ఏదీ పీఏఓ దృష్టిలో అధికారికం కానట్లే లెక్క.

సిబిల్ కాపాడుకోవడానికి ఎన్నో తిప్పలు

పోలీసు అధికారుల్లో అంతా 'రెండు చేతులా' సంపాదించుకున్న వాళ్లో, స్థితిమంతులో ఉండరు. ఇలా వరుసగా మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఈ 14 మంది అధికారుల్లో కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇల్లు, కారు, ఇతర ఉపకరణాల్లో ఏదో ఒకదానికి సంబంధించిన నెల వారీ కిస్తీలు (ఈఎంఐ), క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించడం ప్రస్తుతం అత్యధికులకు అనివార్యంగా మారింది. కొందరికి అన్ని రకాలైన ఈఎంఐలు ఉంటున్నాయి. దీంతో వాటికి సంబంధించి జారీ చేసిన చెక్కులు బౌన్స్ కాకుండా, సిబిల్ స్కోరు దెబ్బతినకుండా చూసుకోవడానికి అప్పులు చేసి బ్యాంకు ఖాతాల్లో వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ అధికారులకు పోస్టింగ్ వస్తే తప్ప జీతం బకాయిలు క్లెయిమ్ చేసుకోవడానికి ఆస్కారం ఉండదు. మూడు నెలలుగా పోలీసుల బదిలీలకు సంబంధించిన కసరత్తు నడుస్తున్నా ఇప్పటికీ ఓ కొలిక్కిరాలేదు. దీంతో ఇది ఎప్పటికి పూర్తవుతుందో, తమకు పోస్టింగ్‌తో పాటు జీతం ఎప్పుడు వస్తుందో అని అదనపు ఎస్పీలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

'చెక్‌మేట్' కేసులో ఇద్దరి అరెస్టు

బంజారాహిల్స్: మెడికల్, ఇంజినీరింగ్ సీట్ల పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిన చెక్‌మేట్ సంస్థ ప్రతినిధులు ఆర్. భవానీశంకర్, అచ్యుత్ సాయిరాం చౌదరిలను జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీనగర్‌కాలనీలో రోహిత్ అనే వ్యక్తి చెక్‌మేట్ సంస్థను ఏర్పాటు చేసి మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు ఇప్పిస్తానంటూ వందలాది మంది నుంచి కోట్లు వసూలు చేసి సీట్లు మాత్రం ఇప్పించలేదు. దీంతో బాధితులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోహిత్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసిన పోలీసులు భవానీశంకర్, అచ్యుత్ సాయిరాం చౌదరిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రోహిత్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

శిల్పా లేఔట్ భూముల క్రమబద్ధీకరణపై స్టేటస్‌కో

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో శిల్పా లేఔట్ భూముల క్రమబద్ధీకరణపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. సర్వే నంబర్ 32 నుంచి 40లో ఉన్న దాదాపు 99,013 చదరపు గజాల స్థలం విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శిల్పా లేఔట్‌గా పిలిచే స్థలాన్ని ఫినిక్స్ ఇన్ఫోసిటీ, శిల్ప పయనీర్‌కు క్రమబద్ధీకరించే యత్నాలకు బ్రేక్ పడింది. ఈ 99,013 గజాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ కలెక్టర్‌కు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి 2023 జూలైలో జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ సయ్యద్ ఖాజాం హుస్సేన్‌తో పాటు మరో 144 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. 2008లోని జీవో 166, 2014లోని జీవో 58, 59ల కింద ఈ స్థలంలో ఉంటున్న పేదలు స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది జెల్లి కనకయ్య వాదనలు వినిపించారు. గుడిసెలు వేసుకుని ఉంటున్న ఈ పేదలంతా క్రమబద్ధీకరణకు అర్హులన్నారు. వీరిని అక్కడి నుంచి పంపి ఫినిక్స్, శిల్పా పయనీర్‌కు అధికారులు అప్పగించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు మరో వాయిదా కావాలని కోరడంతో.. తదుపరి విచారణను న్యాయమూర్తి వచ్చే నెల 4కు వాయిదా వేశారు.

'మెడికవర్'లో చికిత్స పొందుతూ జూనియర్ డాక్టర్ మృతి

- బిల్లు చెల్లిస్తేనే మృతదేహాన్ని ఇస్తామని నిర్వాహకుల ఒత్తిడి
- ఆస్పత్రి ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన

మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ జూనియర్ డాక్టర్ మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. శంకర్ పల్లికి చెందిన జూనియర్ డాక్టర్ నాగప్రియ (28) అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమె కుటుంబసభ్యులు ఈనెల 4న మాదాపూర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించారు. రెండు రోజుల పాటు వైద్యం అందించిన డాక్టర్లు రూ.3 లక్షలకు పైగా వసూలు చేశారు. ఇంకా డబ్బులు కట్టాలని లేని పక్షంలో వైద్య సేవలు నిలిపివేస్తామని చెప్పడంతో తాము రూ. లక్ష చెల్లించామన్నారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే నాగప్రియ మృతి చెందినట్లు చెప్పారన్నారు. అంతే గాక రూ.4 లక్షలు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పగిస్తామని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

బిల్లు కోసం వేధించలేదు : డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి

అత్యవసర పరిస్థితిలో రోగిని మెడికవర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. రూ. 5,40,000 బిల్లు కాగా అందులో రూ. 3,10,000 చెల్లించారు. చివరగా ఫార్మసీ, ఇన్వెస్టిగేషన్స్‌కి సంబంధించి రూ. 48,000 చెల్లించాలని కోరగా, రూ.30 వేలు మాత్రమే చెల్లించారు.

స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం

అమీర్‌పేట: స్పా సెంటర్ ముసుగులో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేంద్రంపై సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సంధ్య, నరేష్ దంపతులు ఎస్‌ఆర్‌నగర్‌లో ఓ స్పా సెంటర్ నిర్వహిస్తున్నాడు. వారు నిబంధనలకు విరుద్ధంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఆర్‌నగర్ పోలీసులతో కలిసి సీసీఎస్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిర్వాహకుడు నరేష్ పరారు కాగా విటులు సంతోష్‌దాస్, రామరాజులతో పాటు మరో యువతిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం ఎస్‌ఆర్‌నగర్‌కు బదిలీ చేశారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

జాబ్ పేరుతో రూ.14 లక్షలు టోకరా

నిందితుడిపై కేసు నమోదు..

ఫిలింనగర్: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి కాబోయే భార్యకు ఉద్యోగం ఇప్పిస్తానని ఆమె నుంచి రూ.14 లక్షలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..మేడిపల్లి మండలం బుద్ధానగర్‌కు చెందిన విష్ణు అనే యువకుడితో షేక్‌పేట వినోభానగర్‌కు చెందిన యువతి (26) ఒకే సంస్థలో పని చేసేవారు. దీంతో అతను ప్రేమిస్తున్నానని ఆమె వెంట పడి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇప్పుడు ఆమె చేస్తున్న జాబ్‌ను వదిలేస్తే ఇంకో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆమె నుంచి రూ.14 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడిచినా ఉద్యోగం రాకపోగా ఆమె వివిధ యాప్‌ల నుంచి తీసుకున్న అప్పులు పెరిగిపోయాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు నిందితుడు తండ్రి మల్లికార్జున శ్రీనివాస్‌ను కలిసి న్యాయం చేయాలంటూ కోరింది. తనకు సంబంధం లేదని, మరోసారి వస్తే బాగుండదని ఆయన హెచ్చరించడంతో బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్

- స్పోర్ట్స్ పాలసీతో క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు
- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రీడల పై సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: వివిధ క్రీడా పోటీల్లో తెలంగాణ క్రీడాకారుల ప్రతిభకు ప్రతిపాదించాల్సిన నగదు ప్రోత్సాహకాలను, ఉద్యోగ ఉపాధి అవకాశాలను నూతన స్పోర్ట్స్ పాలసీలో స్పష్టం చేయబోతున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం గచ్చిబౌలిస్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు, తెలంగాణ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి , రామగుండం ఎమ్మెల్యే, శాప్ మాజీ చైర్మన్ ఎంఎస్ రాజ్ ఠాకూర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి(క్రీడలు) జయేష్ రంజన్ సహా ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు నాగపురి రమేష్, ఇస్మాయిల్ బేగ్, ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొని, కొత్తగా ప్రభుత్వం తీసుకురాబోతున్న స్పోర్ట్స్ పాలసీపై చర్చించారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఏ ఏ విభాగాలు ఏర్పాటు చేయబోతున్నారో? ఏ ఏ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నారో? కూడా సమావేశానికి హాజరైన ప్రతినిధులకు వివరించారు. గత పదేళ్లలో విధ్వంసమైన తెలంగాణ క్రీడా రంగాన్ని పునర్నిర్మాణం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చరిత్రలోనే వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకెళ్తుందని, చారిత్రాత్మకమైన క్రీడా బడ్జెట్‌తో నూతన క్రీడా విధాన రూపకల్పన చేస్తుందన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, హైదరాబాద్ నగరాన్ని స్పోర్ట్స్ హబ్ తీర్చిదిద్దేందుకు వివిధ జాతీయ అంతర్జాతీయ పోటీలకు హైదరాబాద్ నగరాన్ని వేదికగా మార్చేందుకు స్పోర్ట్స్ అథారిటీ విశేష సేవలు అందిస్తుందని, క్రీడారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుంద ని కొనియాడారు. ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన స్పోర్ట్స్ పాలసీ తెలంగాణ క్రీడాకారుల ఉత్సాహానికి ప్రోత్సాహాన్ని అందజేస్తుందన్నారు. రామగుండం ఎమ్మెల్యే, శాప్ మాజీ చైర్మన్ ఎంఎస్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది కాంగ్రెస్ ముఖ్యమంత్రులేనని, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జరిగిన క్రీడల అభివృద్ధి కేసీఆర్ హయంలో కుంటుపడిందని, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో మళ్లీ క్రీడలకు పునర్ వైభవం దక్కుతుందన్నారు.

కొత్త కలెక్టర్ హల్‌చల్

- శంకర్‌పల్లి పీహెచ్‌సీ, ఆదర్శ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు
- వైద్యురాలితో పాటు ఇద్దరికి మెమోలు, ఒకరి సస్పెన్షన్
- నెలరోజుల్లో తీరుమారాలని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరిక



హాజరు రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి శంకర్‌పల్లి పట్టణంలో ఆకస్మికంగా పర్యటించారు. తహసీల్దార్, ఆదర్శ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు, రిజిస్ట్రేషన్ తదితర విషయాలను తహసీల్దార్ సురేందర్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న ఆదర్శ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా లేకపోవడం, తాగునీటి సరఫరా, బయట వ్యక్తులు లోపలికి వచ్చే అవకాశం ఉండడం తదితక విషయాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ విద్యా బోధనను మరింత మెరుగు పరుచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల గ్రంథాలయంలో సరైన పుస్తకాలు, మౌలిక సదుపాయాలు లేవని గుర్తించిన ఆయన వద్ద ఉన్న స్పెషల్ గ్రాంట్ నిధుల నుంచి గ్రంథాలయానికి రూ.లక్ష, పాఠశాల అభివృద్ధికి రూ.5లక్షలను మంజూరు చేశారు. పాఠశాలని సీఎస్ఆర్ ఫండ్ కింద మరింత అభివృద్ధి చేసుకోవాలని ఎంఈఓ అక్బర్‌కి సూచించారు.

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదర్శ పాఠశాలతో పాటు ఆస్పత్రి ఆవరణను వెంటనే డోజర్లతో శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తూ ఒక్కొక్కరి వివరాలు తెలుసుకున్నారు. సమాచారం లేకుండా సెలవు తీసుకున్న సీనియర్ అసిస్టెంట్ టోనీని సస్పెండ్ చేయాలని, తమ విధులు సక్రమంగా నిర్వహించని కారణంగా ఎంపీహెచ్ సూపర్‌వైజర్ యాగ్నస్, సిబ్బంది శ్రీనివాస్‌తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేవతిరెడ్డికి మెమోలు జారీ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నెల రోజుల తర్వాత శంకర్‌పల్లికి వస్తానని, ఆదర్శ పాఠశాల, ఆసుపత్రి ఆవరణ తీరు మారిపోవాలన్నారు.

గ్యాంగ్ రేప్ కేసులో నిందితుల అరెస్ట్

వెంగళరావునగర్ : ఓ మహిళపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులను మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముగ్గురు యువకులు కొండాపూర్ ప్రాంతానికి చెందిన మహిళను దుస్తులు ఉతకాలని సోమవారం రాత్రి ఓంనగర్‌లోని తమ గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. బాధితురాలు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నిందితులు చందు, అజయ్, ఆరీఫ్ గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ వద్ద ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మధురానగర్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు 24 గంటల్లో కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడం పట్ల ఉన్నతాధికారులు వారిని అభినందించారు.

క్యాంసన్ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

- పెద్ద ఎత్తున ఎగిసిపడిన మంటలు
- క్షణాల్లోనే నేలమట్టమైన పరిశ్రమ
- సుమారు రూ.30కోట్ల ఆస్తినష్టం



నందిగామ: రంగారెడ్డి జిల్లా నందిగామలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన బుధవారం తెల్లవారుజమామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నందిగామ శివారులోని 44వ జాతీయ రహదారి సమీపంలోని సర్వేంద్రిగూడ రోడ్డులో క్యాంసన్ హైజనిక్‌కేర్ పరిశ్రమ ఉంది. ఇక్కడ డైపర్లు తయారు చేస్తుంటారు. మంగళవారం రాత్రి షిఫ్టులో సుమారు 40 మంది కార్మికులు పనిచేస్తున్నారు. తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో స్టోర్ రూంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా చిన్నగా మంటలు చెలరేగాయి. మంటలు తీవ్రమవుతుండడంతో గమనించిన కార్మికులు భయాందోళనతో బయటకు పరుగు తీశారు. మంటలను ఆర్పేందుకు యత్నించేలోగానే ఒక్కసారిగా పరిశ్రమ మొత్తం నల్లటి పొగతో దట్టమైన మంటలు చెలరేగాయి. దీంతో కార్మికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.

మంటలార్పేందుకు నాలుగు ఫైర్ ఇంజిన్లు

సమాచారం అందిన వెంటనే డీఎఫ్‌ఓ మురళీ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, మహేశ్వరం ఫైర్ స్టేషన్ల నుంచి నాలుగు ఫైర్ ఇంజిన్లు తెప్పించి మంటలు అదుపులోకి తెచ్చారు. అప్పటికే పరిశ్రమ మొత్తం కాలిబూడిదైంది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. యంత్రాలు, స్టాకు పూర్తిగా దగ్ధమై రూ.30కోట్ల ఆస్తినష్టం వాటిల్లిందని నిర్వాహకులు తెలిపారు.

మంటలు వ్యాప్తిచెందకుండా జాగ్రత్తలు

కాగా ఈ పరిశ్రమ ఆవరణలోని మరో షెడ్డుకు మంటలు వ్యాపించి ఉంటే ఆస్తినష్టం మరింత పెరిగేదని నిర్వాహకులు వాపోయారు. ఓ పక్క ఫైరింజన్లతో మంటలార్పుతూనే ఐదు జేసీబీల సాయంతో ఇనుప వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్ఐ గోపాల కృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరిశ్రమ హెచ్‌ఆర్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులపై ఆందోళన వద్దు

చెక్కులు పంపిణీ చేసిన దానం నాగేందర్



ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో సీఎం సహాయ నిధి కింద రావాల్సిన చెక్కులు సకాలంలో వస్తాయని, లబ్ధిదారులకు త్వరితగతిన చెక్కులు పంపిణీ చేస్తామని, ఏమాత్రం ఆందోళన చెందవద్దని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ నిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్‌లో నివసించే చంద్రశేఖర్ కిమ్స్ ఆస్పత్రిలో గుండె జబ్బుతో బాధపడుతున్న సందర్భంగా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎంతోమంది ప్రయోజనం పొందుతున్నారని, లబ్ధిదారులందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రోజు నుంచి మూడు నెలల్లో చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆన్‌లైన్‌లో తమ అప్లికేషన్ ఏ దశలో ఉందో చూసుకోవచ్చన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

ఉద్యమకారుల ఫోరం కో-కన్వీనర్‌గా విజయ్‌కుమార్



నియామక పత్రం అందుకుంటున్న విజయ్‌కుమార్

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖైరతాబాద్ నియోజకవర్గం కో–కన్వీనర్‌గా జెట్టి విజయ్‌కుమార్ నియమితులయ్యారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఉదయ్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడు బి. ఇందర్‌కుమార్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో విజయ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా పని చేసిన తమలాంటి ఉద్యమకారులను ఫోరం గుర్తించి నియోజకవర్గ కో–కన్వీనర్‌గా పదవీ బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందని, ఉద్యమకారుల సమస్యలపై పోరాడు తామని వారికి అండగా నిలిచేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ఎస్.కుమారస్వామి, నాగరాజు, మాణిక్యం, భాస్కర్, జగన్, ప్రసాద్, లక్ష్మణ్, అక్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా హెయిర్ కటింగ్



ఉచితంగా హెయిర్ కటింగ్ చేస్తున్న రమేష్ కొడిచెర్ల

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రముఖ సంఘ సేవకుడు రమేష్ కొడిచెర్ల బుధవారం జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–22లోని ఆల్ఫా స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా హెయిర్ కటింగ్ చేసి తన సామాజిక స్ఫూర్తిని చాటుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి నిమిత్తం వలస వచ్చిన వారి పిల్లలకు ఆల్ఫా స్కూల్‌లో ఉచితంగా చదువులు అందిస్తున్నారు. ఈ పిల్లలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో రమేష్ ఉచితంగా హెయర్ కటింగ్ చేశాడు.

చెత్తను తీసి..మొక్కలు నాటి..!



చెత్తను తొలగించి మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఫిలింనగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఎంత మొత్తుకుంటున్నా కొంతమందిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు వినూత్న తరహాలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పలు చర్యలు తీసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ దైవ సన్నిధానం ఎదురుగా నిత్యం స్థానికులు, రోడ్డు గుండాపోయే వారు పెద్దఎత్తున చెత్తను విసిరేసి వెళ్తున్నారు. దీంతో వారిలో మార్పు తీసుకురావాలని పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను పూర్తిగా తొలగించి మొక్కలు నాటారు. ఈ మొక్కలను చూసైనా వారు ఇక్కడ చెత్తను వేయకుండా ఉంటారని ఆశిస్తున్నారు. అయితే ఇక్కడ మొన్నటి వరకు చెత్తాచెదారం దర్శనమివ్వగా, ఇప్పుడు పరిశుభ్రమైన పచ్చని వాతావరణం కనిపిస్తుంది.

సత్కారం

లిబర్టీ: ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ ఘనంగా సన్మానించారు. విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తారన్న ఆశాభావాన్ని శ్రీకృష్ణ వ్యక్తం చేశారు. కళాశాలలు, హాస్టల్స్‌లో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు.



ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే

- సర్వేను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ అధికారులు
- నియోజకవర్గంలో పర్యవేక్షిస్తున్న 35 మంది సూపర్‌వైజర్లు

మొదటి రోజు ఇంటి నెంబర్లు రాసుకుని..స్టిక్కర్లు అంటివేత



సర్వేకు తరలుతున్న ఎన్యుమరేటర్లు

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) బుధవారం ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు ఉదయమే తమకు కేటాయించిన బ్లాక్‌లలో ఇంటింటికీ వెళ్లి ముందుగా ఇంటి నెంబర్లు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత కుటుంబ యజమాని పేరు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత తాము ఆ ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్ అంటించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం 800 బ్లాక్‌లుగా విభజించి సర్వే కోసం ఒక్కో బ్లాక్‌కు ఒక్కరు చొప్పున 800 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. టీచర్లు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఈ సర్వేలో పాల్గొన్నారు. బుధ, గురు, శుక్ర వారాల్లో మూడు రోజుల పాటు ప్రతి ఇంటినీ సందర్శించి స్టిక్కర్లు వేస్తారు. సోమవారం నుంచి ఇంటింటికీ వెళ్లి 75 రకాల ప్రశ్నలతో సమాచారాన్ని సేకరించనున్నారు. కుటుంబాల వారీగా ఆస్తులు, ఆదాయం, అప్పులు, రాజకీయ పదవులు, ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి తదితర ప్రశ్నలతో దరఖాస్తులను పూరించనున్నారు. ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు ఆ ఇంట్లో ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలు ఉంటే మరో ఇంటి నెంబర్‌ను కేటాయించి సమాచారాన్ని వేర్వేరుగా సేకరించనున్నారు. నియోజకవర్గంలో లక్షన్నరకు పైగా కుటుంబాలు ఉన్నట్లుగా అంచనా వేస్తున్నారు. అయితే వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 15లోగా సర్వే పూర్తి చేయాలని భావిస్తున్నారు. జనాభా ఆధారంగా ఒక్కో బ్లాక్‌లో రోజుకు 10 నుంచి 15 కుటుంబాలను సర్వే చేయాలని నిర్ణయించారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్లను నియమించి శిక్షణ కూడా ఇచ్చారు. కొంత మంది ప్రైవేటు ఆపరేటర్లను కూడా తీసుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో 35 మంది సూపర్‌వైజర్ ఆఫీసర్లు సర్వేను పర్యవేక్షించనున్నారు. వివరాల నమోదులో పొరపాట్లను కూడా పరిశీలిస్తారు. సర్వే కోసం ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. పక్కాగా వివరాలు నమోదు చేయాలని సూచించామని, తప్పులు లేకుండా సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు నియోజకవర్గ సర్వే అధికారి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా ఉదయమే ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతానికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు. సర్వేకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీనగర్‌లో ఇంటింటి సర్వేను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మేయర్ ఇంటికి స్టిక్కర్ అంటించిన సిబ్బంది



బంజారాహిల్స్: ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా బుధవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నివాసానికి ఎన్యుమరేటర్లు స్టిక్కర్ అంటించారు. ఇంటి నెంబర్, కుటుంబ యజమాని పేరు నమోదు చేసుకున్న తర్వాత ఆ ఇంటిని సందర్శించిన గుర్తుగా అతికించిన స్టిక్కర్‌ను మేయర్ పరిశీలించారు.





సర్వేను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి , కుటుంబ యజమాని పేరు నమోదు చేసుకుంటున్న ఎన్యుమరేటర్లు

మధురానగర్‌లో చోరీ

నగలు, నగదు అపహరణ

వెంగళరావునగర్ : ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి నగలు, నగదు చోరీ చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఏపీకి చెందిన మాధవి, శ్రీనివాస్ దంపతులు గత కొంతకాలంగా మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. మాధవి లేడీస్ టైలర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి టైలరింగ్ పని ముగించుకుని ఇంటి తలుపులు, కిటికీలు బిగించుకుని నిద్ర పోయారు. 5వ తేదీ ఉదయం నిద్రలేచి చూసుకునే సరికి ఇంట్లో ఉండాల్సిన రూ.1.20 లక్షలు విలువజేసే (మూడు సెల్ ఫోన్లు, బంగారు ఆభరణాలు) వస్తువులు, నగదు మాయం అయ్యాయి. పరిశీలించగా కిటికీ డోర్స్ పగలగొట్టి ఉన్నాయి. దీంతో బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

వెంగళరావునగర్: అతిగా మద్యం సేవించిన వ్యక్తి మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడకు చెందిన పి.నగేష్ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం అతిగా మద్యం సేవించిన నగేష్ యూసుఫ్‌గూడ బస్టాప్ వద్ద పడిపోయి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మధురానగర్ పీఎస్ సిబ్బంది అక్కడకు వెళ్లి పరిశీలించగా అతను మృతిచెంది ఉన్నాడు. మృతుడి సోదరుడు మహేష్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్ : ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావునగర్‌కు చెందిన బి.శ్రీనివాసరావు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. గతనెల 31న రాత్రి తన ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్ళాడు. అనారోగ్యం వల్ల ఇంట్లోనే ఉండి 4వ తేదీ బయటకు వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి వాన నీటిబొట్టును ఒడిసి పట్టుకోవాలి



కరపత్రం విడుదల చేస్తున్న అధికారులు, టీచర్లు

వెంగళరావునగర్: ప్రతి వాననీటి బొట్టును నగరవాసులు ఒడిసి పట్టుకోవాలని భూగర్భ జలశాఖ జిల్లా అధికారి జగన్నాథం, ఖైరతాబాద్ ఉప విద్యాశాఖాధికారి శ్యామ్యూల్‌రాజ్‌లు సూచించారు. భూగర్భ జలశాఖ సహకారంతో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ ద్వారా బుధవారం చిన్నారులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జగన్నాథం, శ్యామ్యూల్‌రాజ్‌లు మాట్లాడుతూ ప్రతి నీటిబొట్టును ఇంకుడుగుంతల ద్వారా భూగర్భ జలాలుగా నగరవాసులు మార్చాలని తెలిపారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేనందున భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఈ విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత నిర్మించేందుకు చిన్నారులు తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల అదనపు వినియోగం, నీటి వృథాను అరికట్టాలని తెలియజేశారు. కాగా భూగర్భ జలాల వినియోగంపై చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీడ్ సంస్థ సీఈఓ నాగబ్రహ్మాచారి, భూగర్భ జలశాఖ జియోలజిస్ట్ సంధ్య, హైడ్రోజిస్ట్ వాసు, సూపరింటెండెంట్ అంజయ్య, స్కూల్ హెచ్‌ఎం శాంతా రాథోడ్, డిఐఓఎస్ శ్రవణ్, టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత కరపత్రం విడుదల చేశారు. అనంతరం నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటు బీసీలకే కేటాయించాలి

కాచిగూడ: తెలంగాణలో త్వరలో జరుగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీట్లు బీసీ అభ్యర్థులకే కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, కమ్యూనిస్ట్ పార్టీలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ నేతలు నీరడి భూపేష్ సాగర్, సి.రాజేందర్‌ల నేతృత్వంలో బీసీ సంఘాల కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను పూర్తిగా విస్మరించాయని అన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను అన్యాయం చేస్తూ పోతే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారివారి జనాభా ప్రకారం రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 56 శాతం జనాభా కలిగిన బీసీలకు ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా బీసీలను అణచివేతకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ నేతలు వేముల రామకృష్ణ, అనంతయ్య, టి.రాజ్‌కుమార్, మోదీ రాందేవ్, సతీష్, శ్రీనివాస్, శివ, భాస్కర్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు సహకరించండి





బోరబండలో బాబా ఫసియుద్దీన్... రహమత్‌నగర్‌లో సీఎన్‌రెడ్డి...

రహమత్‌నగర్ (బోరబండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, సీఎన్ రెడ్డిలు పిలుపునిచ్చారు. కులగణనలో భాగంగా బుధవారం రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలోని బస్తీల్లో తిరుగుతూ ఇంటింటికి స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ 19 డీఎంసీ జకీయా సుల్తానాలతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

ఖైరతాబాద్: ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రాంగ్‌రూట్, హెల్మెట్ ధరించకుండా డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ చేయడంతో పాటు చలాన్లు విధించారు. బుధవారం ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ మహ్మద్ మాజిద్ నేతృత్వంలో రవీంద్రభారతి చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారుకు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి ఫైన్‌లు వేయడంతో పాటు వారికి కౌన్సెలింగ్ చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఎస్‌ఐ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కాచిగూడ: రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏలుగా పని చేస్తున్న 61 సంవత్సరాలు దాటిన వారి వారసులైన 3797 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్‌ఏ జేఏసీ నేతలు వంగూరు రాములు, బీసం ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి ఉద్యోగాలు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు. జీవో 81 ప్రకారం 61 సంవత్సరాల వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో హరీశ్, రాము, సాగర్, గంగమలు, చందు, శ్రీనివాస్, భారత్ కుమార్, సుల్తాన్ గౌడ్, రవీందర్, అనిల్, రజనికాంత్, హనుమాండ్లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ఇంటిని సర్వే చేసిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

వెంగళరావునగర్: ఇంటింటి సర్వేలో భాగంగా బుధవారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది పలువురు కార్పొరేటర్ల ఇళ్ళకు వెళ్ళి వివరాలు సేకరించారు. ఇందులో భాగంగా వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ గృహాన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా బేగం, ఏఎంఓహెచ్‌తో పాటుగా సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు, ఆశావర్కర్లు సందర్శించి స్టిక్కర్లు అంటించారు. అదేవిధంగా సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ తదితర గృహాలను అధికారులు సందర్శించారు.

మంచినీటి పైప్‌లైన్ పనులు అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు

కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని వెంకటేశ్వరనగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఇప్పటికీ కొన్ని కుటుంబాలకు మంచి నీటి పైప్‌లైన్ సౌకర్యం లేకపోవడంతో తాను నాలుగు ఇంచుల పైప్‌లైన్ మంజూరు చేయించడం జరిగిందని, అయితే కొంతమంది దురుద్దేశపూర్వకంగా అవగాహనారాహిత్యంతో ఈ పైప్‌లైన్ పనులను అడ్డుకుంటున్నారని వెంకటేశ్వర కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి దుయ్యబట్టారు. బుధవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి తమకు మంచినీటి పైప్‌లైన్ సౌకర్యం లేదని చాలా మంది ఫిర్యాదు చేశారని, అందుకే ఇక్కడ పైపులు వేస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ నేతలు ఇక్కడి నుంచి పైపులు తొలగించారని, పనులు ఆపించారని ఇది ఎంతవరకు సమంజసమన్నారు. జలమండలి జీఎం హరిశంకర్‌ను కూడా రాజకీయాలతో బెదిరిస్తూ పనులు ముందుకుసాగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ పైప్‌లైన్ పనులు పూర్తి చేయడం జరుగుతుందని, ఆపితే ప్రజలే పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నందినగర్ గ్రౌండ్‌లో తాము చెత్తవేసే ప్రాంతంలో క్లీన్ చేస్తే లక్షలాది రూపాయలు వసూలు చేసిన కొంతమంది డబ్బాలు వేయించారని, ఈ మొత్తం వ్యవహారాన్ని డివిజన్ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. స్థానికులతో మాట్లాడితే నీళ్ల సమస్యపై వారు తమ గోడు వెళ్లబోసుకుంటారని తెలిపారు. కొంతమంది తమ ఇంటి నల్లాలకు నీళ్ల ప్రెషర్ తగ్గుతుందన్న అక్కసుతో పనులు అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల ఆందోళన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించొద్దని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. పదెకరాల స్థలం కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆందోళనను కొనసాగించారు. జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం న్యాక్–ఏ గ్రేడ్‌ను సాధించిందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ నుంచి నిధుల పొందే అవకాశం ఉందన్నారు. విశ్వవిద్యాలయం ఆంగ్ల భాషా అధ్యయనంతో పాటు అంతర్జాతీయ భాషలకు కూడా కోచింగ్ అందించాలని ప్రయత్నం చేపడుతుందని, సంబంధిత కోర్సుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు, భాషా ప్రయోగశాలలను ప్రత్యేకంగా నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత భవనాల నిర్మాణానికి తగిన యూనివర్సిటీ స్థలం అందుబాటులో లేదన్నారు. విద్యార్థులకు కొత్తగా కంప్యూటర్ ల్యాబ్స్ నిర్మించే అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేఖను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ నిరసనను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తన ఆలోచనా విధానాన్ని మార్చుకోకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు యాకేష్ దైద, కాంతం ప్రేంకుమార్, రవీంద్రనాథ్ సోలమన్, ఎండీ హబీబుద్దీన్, రజనీకాంత్, షబ్బీర్, రాములు, నారాయణరావు, రుషేంద్రమణి, అవినాష్, కిషోర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: ప్రభుత్వ ఆసుపత్రి, కళ్యాణ్‌నగర్ పార్క్ 11కెవీ ఫీడర్లు బేగంపేట, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రభుత్వ ఆసుపత్రి మెయిన్‌రోడ్డు, హోండా షోరూం, అమోఘ జూనియర్ కాలేజీ, అభిరుచి లైన్, బల్కంపేట మెయిన్‌రోడ్డు, సోనీవైన్స్ పక్కన ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ బుధవారం తెలిపారు. అదేవిధంగా శాంతిబాగ్, బంజారానగర్ 11కెవీ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మైనారిటీ ఉపకార వేతనాల విడుదలకు చర్యలు తీసుకోండి



రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌కు ఉపకార వేతానాలపై విజ్ఞప్తి చేస్తున్న మేవా అధ్యక్షుడు

సాక్షి,సిటీబ్యూరో: ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్ ఉపకార వేతనాలు తక్షణమే విడుదలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట మైనారిటీ కమిషన్‌కు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) విజ్ఞప్తి చేసింది. బుధవారం మేవా రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ మసూదుద్దీన్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్‌అన్సారీని కలిసి వినతి పత్రం సమర్పించింది. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఉపకార వేతనాలు విడుదల చేయలేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం ట్యూషన్ ఫీజు చెల్లించాలని యాజమాన్యాల నుంచి వత్తిడి పెరిగిందన్నారు.ఇప్పటికే కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉత్తీర్ణత సరిఫికెట్లు సైతం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ధృవీకరణ పత్రాలు జారీ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

'అన్నిటికంటే ఉత్తమమైనది విద్య'

చిక్కడపల్లి: ప్రపంచంలో అన్నికంటే ఉత్తమమైనది విద్యని కేంద్రమంత్రి ఎస్.వేణుగోపాలచారి అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో యువ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విద్య వైద్య, సేవా శిరోమణి అవార్డుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ఏడాదికిగాను విద్యలో రక్షణ్ ఐఏఎస్ అకాడమి వ్యవస్థాపకురాలు డాక్టర్ మమత మంగనపల్లికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత మంగనపల్లి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉన్నప్పటికి మరింత బాధ్యతను పెంచిందన్నారు. కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్ రాజకుమారి, బీఆర్ఎస్ యువ నేత ముఠాజైసింహ, సంఘసేవకులు కేవిబి వంసంతరాయలు, వెంకటరమణ, సాంబశివరావు, రమణ, చంద్రశేఖర్, సాయిలు పాల్గొన్నారు,

'నార్త్'పై నిర్లక్ష్యమేల?

నార్త్ సిటీకి మెట్రోను విస్తరించాలంటూ స్వరం పెంచుతున్న నేతలు..

మొన్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే.. నేడు బీజేపీ నేతలు



మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మేడ్చల్ జిల్లా నేతలు

సనత్‌నగర్: నగరం అంతకంతకూ విస్తరిస్తోంది. కోటి జనాభాకు పైబడిన భాగ్యనగరంలో ఆశించిన స్థాయిలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం లేకపోవడంతో ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. మెట్రో సిటీగా అవతరించినా నలుదిశలా పూర్తి స్థాయిలో విస్తరించకపోవడంతో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ముఖ్యంగా నార్త్ సిటీ వైపు మెట్రోను విస్తరించాలన్న ఆలోచనే లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో ప్రతినిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు దూరభారాన్ని మోయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. కేవలం ఈస్ట్–వెస్ట్‌లతో పాటు దక్షిణ సిటీ ప్రాంతం పైనే దృష్టిసారిస్తున్నారే తప్ప ఉత్తర భాగంలో ప్రజా రవాణాపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజల తరుపున ప్రజాప్రతినిధులు, నేతలు తమ గళాన్ని వినిపిస్తూనే ఉన్నారు. ఫేజ్–2లోనైనా నార్త్ సిటీకి మెట్రో లైన్‌ను విస్తరించాలంటూ ఇటీవల కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ఆందోళనకు దిగిన విషయం విదితమే. తాజాగా బీజేపీ కూడా నార్త్ సిటీ వైపు మెట్రోను విస్తరించాలంటూ తన స్వరాన్ని పెంచింది. ఈ క్రమంలోనే మేడ్చెల్ అర్బన్ జిల్లా ఇన్‌ఛార్జి అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డిలు బుధవారం మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి ఇదే విషయమై చర్చించి ప్రజల తరుపున తమ డిమాండ్‌ను వెలిబుచ్చారు.

నార్త్ సిటీ వైపు విస్తరిస్తున్న సిటీ..

మేడ్చల్, మెదక్, నిజామాబాద్,ఆదిలాబాద్, కరీంనగర్‌ల వైపు నగరం విస్తరిస్తోంది. అయితే ఆ దిశగా మెట్రోను విస్తరించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఆయా జిల్లాల వైపు విస్తరిస్తున్న సిటీలో సామాన్య, మధ్యతరగతి వర్గాలే అధికంగా నివసిస్తున్నారు. ఈ క్రమంలో వారికి ట్రాన్స్‌పోర్ట్ భారం తలకు మించిన భారమవుతున్నేది వారి వాదన. అంతేకాకుండా వేలాది మంది ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు నగరాన్ని వీడి నార్త్ సిటీ వైపు నివాసాలను ఏర్పరచుకోవడంతో పాటు ఎక్కువ శాతం పారిశ్రామికవాడలు ఇటువైపే ఉన్నాయి. ముఖ్యంగా బాలానగర్, జీడిమెట్ల, ఖాజీపల్లి, మేడ్చెల్, జీనోం వ్యాలీ, శామీర్‌పేట ప్రాంతాల్లో అధిక శాతం పరిశ్రమలు ఉన్నాయి. దీనికి తోడు బీఐటీఎస్(బిట్స్), నల్సార్, ఐపీఈ, మల్లారెడ్డి యూనివర్సిటీ వంటి తదితర విద్యా సంస్థలు నార్త్ సిటీ వైపే ఉన్నాయి. అలాగే దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, ఎస్ఐఎస్‌పి, స్పోర్ట్స్ స్కూల్ ఇలా ఎన్నో రక్షణ రంగ సంస్థలు కొలువుదీరి ఉన్నాయి. ఆయా సంస్థల్లో ఉద్యోగులతో పాటు విద్యనభ్యసించే విద్యార్థులు వేలాదిగా నగరం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ అటువైపు సరైన ప్రజా రవాణా వ్యవస్థ లేకపోవడంతో ఆయా వర్గాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారంటూ అటు ప్రజాప్రతినిధులు, నేతలు పదే పదే మెట్రోరైల్ ఎండీ దృష్టికి తీసుకువస్తూనే ఉన్నారు.

అటువైపు వైపు ఒక్క కారిడార్ లేదు..

మెట్రో ఫేజ్–2లో కూడా నార్త్ సిటీకి అన్యాయం జరుగుతుందని వారు వాపోతున్నారు. ఫేజ్–2లో భాగంగా ఆరు కారిడార్లలో మెట్రోలైన్లను విస్తరిసుండగా నార్త్ సిటీని అనుసంధానం చేస్తూ ఒక్క కారిడార్ కూడా లేదు. ఫేజ్–2 పార్ట్–ఏ కింద 76.4 కిలోమీటర్ల మేర ఐదు కారిడార్లను రూ.24,269 కోట్లతో నిర్మించనున్నారు. పార్ట్–బీ కింద శంషాబాద్ ఎయిర్‌పోర్ట్–ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) మధ్య 40 కిలోమీటర్ల మేర మెట్రో కారిడార్‌ను విస్తరించనున్నారు. కానీ నార్త్ హైదరాబాద్ వైపు మెట్రో కనెక్టివిటీపై నిర్లక్ష్యం వహించారని బీజేపీ నేతలు మల్లారెడ్డి, విక్రమ్‌రెడ్డి ధ్వజమెత్తారు. దీని వల్ల నార్త్ తెలంగాణ వైపు ఉన్న మేడ్చెల్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజలకు మెట్రో కనెక్టివిటీ లేకుండా పోతుందని చెబుతున్నారు.



నాలుగు రూట్లలో మెట్రో కనెక్టివిటీపై ఆలోచన చేయాలి



ప్రధానంగా నార్త్ సిటీ వైపు నాలుగు రూట్లలో మెట్రో కారిడార్ల నిర్మాణంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.బాలానగర్ నుంచి షాపూర్‌నగర్, సూరారం మీదుగా గండిమైసమ్మ వరకు ఒక కారిడార్, బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి, మేడ్చెల్ వరకు, జూబ్లీ బస్ స్టేషన్ నుంచి ఆల్వాల్,తూముకుంట వరకు, తార్నాక నుంచి ఈసీఐఎల్ క్రాస్‌రోడ్డు, నాగారం మీదుగా కీసర వరకు ఏ ఒక్క కారిడార్‌ను పరిగణలోనికి తీసుకోకపోవడం పట్ల నార్త్ సిటీపై నిర్లక్ష్యం తేటతెల్లమవుతుంది.

– మల్లారెడ్డి, బీజేపీ నాయకుడు

11న సుద్దాల అశోక్ తేజకు స్వర్ణ కంకణ ప్రదానం



సుద్దాల అశోక్ తేజ

చిక్కడపల్లి: ఈ నెల 11న వతేదీన శ్రీ త్యాగారాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆళ్ళ(అమెరికా) నిర్వహణలో ప్రముఖ గీత రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజకు సినారె ఆళ్ళ స్వర్ణ కంకణ ప్రదాన వేడుక నిర్వహిస్తున్నట్టు వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సభకు ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్‌రావు పాల్గొని పురస్కారంతో సత్కరిస్తారని అన్నారు.

విజయ్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కాచిగూడ: సామాజిక బాధ్యత కలిగిన ప్రజాపక్ష విద్యావేత్త, నిర్మల్ ప్రధానోపాధ్యాయులు ఆరేపల్లి విజయ్‌కుమార్ సస్పెన్షన్‌ను బేషరతుగా ఎత్తివేసి ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆరేపల్లి విజయ్‌కుమార్‌ను విద్యాశాఖ అధికారులు విధుల నుండి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నిర్మల్ జిల్లా దిలావర్ పూర్, గుండంపల్లి గ్రామాల మధ్యలో నెలకొంటున్న ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు వివిధ రూపాలలో పోరాడుతున్నారని, వారి పోరాటాలకు సంఘీభావంగా విజయ్ కుమార్ విధులకు సెలవు పెట్టి మాత్రమే పాల్గొన్నారన్నారు. ఉపాధ్యాయుడిగా ఆయన ఎప్పుడూ తన విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించలేదన్నారు. టిపిజేఏసీ కో కన్వీనర్ అంబటి నాగయ్య, కన్నెగంటి రవి, భారత్ జోడో అభియాన్ కో ఆర్డినేటర్ విస్సా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా టీపీజీఎల్ సీజన్ - 4



హైదరాబాద్: తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ నాలుగో సీజన్ హోరాహోరీగా సాగుతోంది. రెండో రౌండ్ లో వ్యాలీ వారియర్స్ టీమ్ అత్యుత్తమ ప్రదర్శనతో టాప్ ప్లేస్ లో నిలిచింది. మొత్తం 165 పాయింట్లతో ఓవరాల్ గా ఆరోస్థానానికి దూసుకొచ్చింది. రెండో రౌండ్ లో వారియర్స్ టీమ్ గోల్ఫర్లు అరవింద్ మహాలింగం, కరణ్‌బీర్ సింగ్ 47 పాయింట్లు సాధించారు. రెండోరౌండ్ పోటీలు ముగిసేసరికి ఓవరాల్ పాయింట్ల పట్టికలో ఆటమ్ ఛార్జర్స్, గోల్డెన్ ఈగల్స్ సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాయి. ఇరు జట్లు ప్రస్తుతం 408 పాయింట్లతో కొనసాగుతున్నాయి. డాసోస్ 402 పాయింట్లతో రెండో స్థానంలో , టీమ్ మైసా 401 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాయి. 16 జట్లు పోటీపడుతున్న టీజీపీఎల్ నాలుగో సీజన్ డిసెంబర్ 1న జరిగే ఫైనల్స్ తో ముగుస్తుంది.

సారస్వత పరిషత్తు పోటీల విజేతల వెల్లడి

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన కోడూరి శాంతమ్మ స్మారక కథ, వచన కవిత, పద్య కవిత, చిత్రలేఖనం పోటీలలో విజేతల పేర్లను ప్రకటించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 80 పాఠశాలల నుంచి 750 మంది విద్యార్థులు తమ రచనలను పంపగా పరిష్వత్తు న్యాయ నిర్ణేతలు పరిశీలించారు. మొత్తం మీద 59 మంది విద్యార్థులకు రూ.500 ల చొప్పున నగదు బహుమతిని అందస్తామని, మరో 76 మందికి రెండవ శ్రేణిలో ప్రత్యేక ప్రశంస కింద జ్ఞాపికతో సత్కరిస్తామని పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే బాలల సాంస్కృతికోత్సవం రోజున కూడా అప్పటికప్పుడు పాటలు, వక్తృత్వం, పుస్తక సమీక్షా రచన, ఏకపాత్రాభినయం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రజల మనిషి 'వట్టికోట'

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు



వట్టికోట ఆళ్వారుస్వామికి నివాళులర్పిస్తున్న జస్టిస్ కాశీ విశేశ్వరరావు, రఘుశ్రీ తదితరులు

చిక్కడపల్లి: సామాజిక చింతనతో జీవితాన్ని సమాజ శ్రేయస్సుకు అంకితం చేసిన ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదిక పై జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా వట్టికోట ఆళ్వారుస్వామి యాదిలో జరిగిన సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ కాశీ విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పేదరికం నుంచి ఎన్నో బాధలను భరించి తెలంగాణ సాహితీ కిరణంగా నిలిచిన వట్టికోట ఆళ్వారుస్వామి చరిత్ర నేటి తరాలకు కరదీపిక కావాలని అన్నారు. గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా, దేశోద్ధారక గ్రంథ మాల ద్వారా ప్రముఖ రచనల ప్రచురణ కర్తగా మారిన ఆళ్వార్ స్వామి స్వయంగా రచయిత అని తెలిపారు. ఆయన రచించిన ప్రజల మనిషి నిజాం కాలంలోని ప్రజల అవస్థలకు దర్పణం అని వివరించారు. దాశరథి కృష్ణమాచార్యతో జైలులో సహజీవనం చేశారని గుర్తు చేశారు. కవులు రఘుశ్రీ, చిక్కారామదాసు మాట్లాడుతూ ఆళ్వార్ స్వామి తెలుగుతల్లి మాస పత్రిక నడిపారన్నారు. అభ్యుదయ రచయితల సంఘంలోనూ, తెలంగాణ రచయితల సంఘంలోను క్రియాశీలంగా పనిచేసారని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, పాలక సభ్యురాలు గుండవరపు గీతాదేవీ పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీతో మెరుగైన ఉపాధి అవకాశాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానున్న స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. యువత తమలోని స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకున్నప్పుడే పోటీ ప్రపంచంలో రాణించగలుగుతారని సూచించారు. బుధవారం రవీంద్రభారతిలో తపస్య కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మానవ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడానికి విద్యాసంస్థలు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను డాక్టర్, ఇంజనీరింగ్ కోర్సులలో చేర్పేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని కానీ కామర్స్ కోర్సులలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని గ్రహించాలన్నారు. అనంతరం పట్టభద్రులైన 800 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఓయూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ కె.శ్రీనివాస్, తపస్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తదితరులు

త్వరలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: రాష్ట్రంలో ప్రపంచస్థాయి స్పోర్ట్స్ యూనివర్శిటీని త్వరలో ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం గచ్చిబౌలి లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో 'ఎస్ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్–2024' పేరిట నిర్వహించే బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా అన్ని రకాల క్రీడలకు జాతీయ, అంతర్జా తీయ స్థాయిలో గుర్తింపు పొందే క్రీడాకారులను తయారు చేసేందుకు అవకాశం ఏర్పడుతుం దన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి అధిక బడ్జెట్ కేటాయించిందన్నారు. ఎస్ఎండీసీ ఇంటర్నేషనల్ చాలెంజ్ పోటీలను గోపిచంద్ అకాడమీలో నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ పోటీలలో భారత్‌తోపాటు వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు పాలుపంచుకుంటున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ క్రీడాపోటీలకు నిలయంగా మార్చేందుకు తగిన ప్రణాళికతో సీఎం రేవంత్‌రెడ్డినాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌ఖ పుల్లెల గోపిచంద్‌తోపాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

గొల్ల,యాదవ కాదు.. కురుమలు

- రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేషం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేషం

పంజగుట్ట: చరిత్రాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేలో కురుమలు తమ కులం పేరును కురుమ అని చెప్పి మాత్రమే రాయించాలని గొల్ల, యాదవ్ అని చెప్పకూడదని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేషం పిలుపునిచ్చారు. తెలంగాణలో ముదిరాజ్‌ల తరువాత అత్యధికంగా ఉన్న కులం కురుమలు అని మన కులం పేరు గొల్ల అని రాయిస్తే మన జనాభా తక్కువచూపడమే కాకుండా, కురుమలు బిసీ బీ జాబితాలో ఉంటారని యాదవులు బిసీ డీ 33లో ఉంటారని దీంతో మన పిల్లలు రిజర్వేషన్లు కోల్పోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేష్, ప్రధానకార్యదర్శి బండారు నారాయణలతో కలిసి మాట్లాడుతూ .. గతంలో ఎవరు కులగణన చేశారో తెలియదు కాని కొంతమంది అధికారులు రాష్ట్రంలో కురుమలు కేవలం 5 లక్షల మందే ఉన్నారని విషప్రచారం చేశారని, తాము ఒక్క మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోనే 10 లక్షల మంది కురుమలు ఉన్న విశయాన్ని గ్రహించాలని తెలిపారు. కురుమలల్లో చదువుకున్న యువత ముందుకు వచ్చి గ్రామీణప్రాంతాల్లో చదువులేని కురుమలకు జనగణనలో కురుమ అని రాయించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కొండల్ రాజు, కొలుకుల నర్సింహ, దేవర రాజేశ్వర్, దేవర రాజేశ్వర్, ఎక్కాల కన్నా, పుష్ప, నగేష్, వి.శంకర్, జి.అరుణ్, భూమన్న, బాలామణి, విజయ, ఆర్.ప్రకాష్, శ్యామల, రాఘవేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలి



మాజీ వీసీ పార్థసారథిని సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు పశ్నించే తత్వాన్ని పెంపొందించుకుంటే సరైన జ్ఞానాన్ని పొందవచ్చని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి సి ప్థారసారథి అన్నారు. బుదవారం విశ్వవిద్యాలయంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వ్యవసాయరంగంలో డిజిటల్ విప్లవం అనే అంశంపై ప్రత్యేక ఉపాన్యాస కార్యక్రమాన్ని కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా విజ్ఞానం కోసం చదవాలన్నారు. ప్రతి అంశాన్ని లోతుగా ఆలోచిస్తూ వివరణాత్మకంగా ముందుకు నడవాలని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పద్ధతులను క్షుణంగా పరిశీలిస్తూ అవసరమైన పద్ధతులను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు డాక్టర్ విజయ్,ప్రశాంత్,చిన్యానాయక్,కళాధర్‌బాబు సిబ్బంది పాల్గోన్నారు.

సైన్యానికి ప్రధాన శిక్షణ సంస్థగా ఎంసీఈఎంఈ



భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో లెఫ్టినెంట్ నజరల్ నీరజ్ వర్షేణ



భనంలో ఏర్పాటు చేసిన కళాకృతి

రసూల్‌పురా: ఎంసీఈఎంఈ 75 సంవత్సరాల నుంచి భారత సైన్యానికి వివిధ అంశాల్లో ప్రధాన శిక్షణ సంస్థగా ప్రఖ్యాతి గాంచిందని ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షేణ అన్నారు. తిరుమలగిరిలోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ) కళాశాల అడ్మినిస్ట్రేటివ్ భవనం అనుదేశ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన అడ్మినిస్ట్రేటివ్ భవనంలో ఎంసీఈఎంఈ చరిత్రను వివిధ కమాండెంట్, సభ్యుల సహకారాన్ని ప్రదర్శిస్తుందని తెలిపారు. ఎంసీఈఎంఈ కార్యకలాపాలను ప్రతిబింబించే విధంగా బెంగాలీ కళాకారుడు చార్బెక్ దీప్తా కళాకృతి నూతన భవనంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

పాతబస్తీలో మరో ఆకర్షణ

అజంపురాలో క్లాక్‌టవర్ నిర్మాణం



తుదిదశ నిర్మాణ పనుల్లో అజంపురా క్లాక్‌టవర్

చాదర్‌ఘాట్: హైదరాబాద్ నగరానికి పర్యాటకానికి వచ్చే సందర్శకులు పురాతన వారసత్వ కట్టడమైన క్లాక్‌టవర్‌ను కూడా వీక్షిస్తుంటారు. నగరంలో క్లాక్ టవర్ అనగానే సికింద్రబాద్‌లోని నిజాం కాలం నాటి కట్టడమైన క్లాక్‌టవర్ గుర్తుకు రావడం సహజం. ఇప్పుడు హైదరాబాద్ పాతబస్తీలోనూ మరో క్లాక్‌టవర్ రూపుదిద్దుకుంటుంది. మలక్‌పేట నియోజకవర్గం అజంపురా డివిజన్ పరిధిలోని అజంపురా చమన్ చౌరస్తాలో జీహెచ్ఎంసీ అధికారులు కొత్త క్లాక్‌టవర్‌ను నిర్మిస్తున్నారు. హైదరాబాద్ చరిత్ర ఉట్టిపడేలా దాని నిర్మాణాన్ని రూపొందిస్తున్నారు. రూ. 75లక్షల వ్యయంతో మొదలైన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. 30 అడుగుల ఎత్తులో, నాలుగు వైపులా రంగులతో కూడిన గడియారాలతో ఈ క్లాక్‌టవర్ నిర్మితమవుతుంది. గంట గంటకు అలారం వంటి శబ్దాలు రావటం ఈ క్లాక్‌టవర్‌కు మరో ప్రత్యేకత. టవర్ చుట్టూ పచ్చని గడ్డి, మొక్కలు పెంచి అధికారులు ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాతబస్తీ క్లాక్ టవర్ నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని, ఈ నెలాఖరు లోపు క్లాక్‌టవర్‌ను ప్రారంభిస్తామని మలక్‌పేట సర్కిల్–6 ఏఈ మల్లిఖార్జున్ తెలిపారు.

పేదల ఇళ్లను కాదు.. పార్మా మాఫీయాను కూల్చండి

- మూసీ నది బాధితులకు మద్దతుగా ఆప్ సామూహిక సంతకాల సేకరణ



సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి

కవాడిగూడ: మూసీని అత్యంత కలుషితమైన నదులలో ఒకటిగా మార్చిన ఫార్మా మాఫియాను కూల్చి అనంతరం పునరావాసం కల్పించి పేదల ఇండ్లను కూల్చాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి రాష్ట్రాపభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ శివారులోని ఫార్మా కంపెనీలు, పరిశ్రమల వర్గాలను యథేచ్ఛగా మూసీ నదిలోకి వదులుతున్న రాష్ట ప్రభుత్వం వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోకుండా మూసీనది ప్రక్షాళణ, సుందరీకరణ ఎలా చేపడుతారని, ప్రజల జీవన ప్రమాణాలు ఎలా కాపాడుతారని ఆయన ప్రశ్నించారు. మూసీ బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్‌చేస్తూ వారికి మద్దతుగా బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లిబర్టి చౌరస్తాలో సామూహిక సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ... నదీ కాలుష్యం నుండి ప్రజలను రక్షించడానికి ముందుగా ప్రభుత్వం చర్యలు చేపట్టి నదీ ప్రక్షాళణ చేయడానికి అవసరమైన చర్యలు, తీసుకొని నది ఒడ్డున నివసించే వారి సమస్యను ప్రభుత్వం అధ్యయనం చేసి వారికి పునరావాసం, జీవన ఉపాధి కల్పించిన తరువాతనే మూసీ ప్రక్షాళణ చేపట్టాలి అన్నారు. ఆప్ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ... మూసీ నదీ పునర్‌జీవనం కోసం నదీతీర జనాభాకు హాని కలిగించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం దుర్మార్గం అన్నారు. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్), పుణరావాస పాలసీ లేకుండానే ప్రాజెక్టును ఎందుకు వేగవంతం చేసి పేదల ఇండ్లను కూల్చుతున్నారు అని ఆయన ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అమలుపై డీపీఆర్ ప్రకటనతో పాటు అఖిల పక్ష పార్టీ సూచనలు, సలహాలు తీసుకొని ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, మహిళా విభాగం అధ్యక్షులు హేమా జిల్లోజు, దివ్యాంగక మిటీ చైర్మన్ దర్శనం రమేష్, నేతలు జావేద్ షరీఫ్, సుధారాణి, సునిత తదితరులు పాల్గొన్నారు.

చిరునవ్వుల తేజస్వీ




లాలాపేట: హబ్సిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన వైబ్స్ హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఐస్‌క్రీమ్ సినిమా హీరోయిన్ తేజస్వీ మదివాడతో పాటు పలువురు మోడల్స్ సందడి చేశారు. అక్కడ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహాలకు ప్రిపేర్ అవుతున్నవారికి, లేదా అందంగా తయారు కావాలనుకుంటున్న వారికి అన్నిరకాలైన సౌందర్య సేవలకు వైబ్స్ హెల్త్ కేర్ సెంటర్ కేరాఫ్ అన్నారు. హెల్త్ కేర్, వెల్‌నెస్, డెర్మటాలజీ, హెయిర్ కేర్, సమగ్ర సౌందర్య సేవలకు వైబ్స్ అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. రోజురోజుకూ మహిళలు తమ అందంపై మరింత శ్రద్ధ తీసుకుంటున్నారని, దాని కోసం ఇలాంటి సెంటర్లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. వైబ్స్ హెల్త్ కేర్ వ్యవస్థాపకులు గీతాచౌదరి, లలితాజైన్ తదితరులున్నారు.



ప్యాషన్ కలెక్షన్

ప్రముఖ చిత్రకారుల చిత్రాల సేకరణలో పోటాపోటీ

- సేకరించిన చిత్రాల ప్రదర్శనలతో సెలబ్రిటీ స్టేటస్
- గృహాలను గ్యాలరీలుగా.. 'కళాత్మకంగా' మారుస్తున్న కలెక్షన్స్
- సిటీలో మరింత పెరుగుతున్న హాబీ





నగరంలో పేరొందిన చిత్రకారులు, శిల్పులు మాత్రమే కాదు.. తమకున్న కళాభిమానం ద్వారా కూడా సెలబ్రిటీలుగా మారిన వారు సైతం ఉన్నారు.. బెస్ట్ ఆర్ట్ కలెక్టర్స్‌గా దేశవ్యాప్తంగానూ ప్రాచుర్యం పొందినవారున్నారు. నేషనల్ మ్యూజియం ఆఫ్ కోల్‌కతాలో జనవరి నెలలో నిర్వహించనున్న భారీ కళా ప్రదర్శనలో తన సేకరణను ప్రదర్శించేందుకు నగరంలోని ఓ ఆర్ట్ కలెక్టర్ తాజాగా అవకాశం దక్కించుకోవడం సిటీలో కళాభిమానుల సేకరణ సత్తాకి నిదర్శనం. - సాక్షి, సిటీబ్యూరో

నగరంలో కళల సేకరణ అభిరుచి నానాటికీ విస్తరిస్తోంది. సంపన్నుల నివాస గృహాలను ఆర్ట్ గ్యాలరీలుగా మార్చేస్తోంది. అంతేకాదు దేశవ్యాప్తంగా మెట్రో నగరాలకే పరిమితమైన ఆర్ట్ కలెక్టర్ ట్రెండ్‌లో నేను సైతం అంటూ నగరం సగర్వంగా ముందడుగు వేసేందుకు ఊతమిస్తోంది. నగరంలోని కళా ప్రపంచంలో పద్మశ్రీ జగదీష్ మిట్టల్ పేరు వినని వారుండరు. ఒక కళాభిమానిగా, ఆర్ట్ కలెక్టర్‌గా ఆయన సిటీజనులకు చిరపరిచితులు. ఓ రకంగా నగరంలో కళారూపాల సేకరణకు నాంది పలికి దానికి స్టార్ డమ్ తెచ్చిన ప్రముఖుడిగా ఆయనను చెప్పొచ్చు. అనేక భారీ ప్రదర్శనలను ప్రతిష్టాత్మక ఆయన చూపిన బాటలో ఇప్పుడు అనేక మంది నగరవాసులు ఆర్ట్ కలెక్షన్‌లో తాము సైతం అంటున్నారు.

కోల్‌కతా మ్యూజియం నుంచి ఆహ్వానం

'నా 17ఏళ్ల వయసులో పాకెట్‌మనీతో కొనుక్కున్న పెయింటింగ్ ఇప్పటికీ నా దగ్గర భద్రంగా ఉంది' అంటూ చెప్పారు పార్వతీరెడ్డి. నగరంలో చిరపరిచితమైన సోషలైట్.. అప్పుడు ప్రారంభించిన తన కళాభిరుచిని గత 30ఏళ్లుగా కొనసాగిస్తూనే ఉన్నారు. నచ్చిన చిత్రాలను, శిల్పాలను సొంతం చేసుకుంటూ ఇంటిని 'కళా నిలయంగా' మారుస్తూనే ఉన్నారు. 'చిత్రాలు, శిల్పాలు కొనడం ఇంటిని అలంకరించుకోవడం మాత్రమే కాదు కళాకారులకు వీలైనంత తోడ్పాటు అందించాలనేది నా ఆలోచన' అంటున్న పార్వతీరెడ్డి తన పేరు మీద ఒక ఫౌండేషన్ స్థాపించి ఔత్సాహిక కళాకారులకు అన్ని రకాలుగా అండదండలు అందిస్తున్నారు. త్వరలో నేషనల్ మ్యూజియం ఆఫ్ కోల్‌కతా 200వ వార్షికోత్సవాల సందర్భంగా వచ్చే జనవరి 10న నిర్వహిస్తున్న భారీ ఆర్ట్ ఈవెంట్‌లో నగరం నుంచి తను సేకరించిన కలెక్షన్స్‌ను ప్రదర్శించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్న పార్వతీరెడ్డి.. 'మా తెలంగాణకు చెందిన వైకుంఠం, లక్ష్మాగౌడ్ వంటి ప్రముఖుల చిత్రాలు అలాగే నా దగ్గర ఉన్న పురాతన చేర్యాల చిత్రకళను అక్కడ ప్రమోట్ చేయాలనుకుంటున్నా'నని చెప్పారు.





సీనియర్.. కలెక్టర్



'నా వయసు 75.. నా ఆర్ట్ కలెక్షన్స్ వయసు 50' అంటూ సగర్వంగా చెబుతారు అంజు పొద్దార్. నగరంలో నివసించే అంజు పొద్దార్ అంటే కళా ప్రపంచంలో తెలియనివారు అరుదే. తాను స్వయంగా చిత్రకారిణి కానప్పటికీ అంజుపొద్దార్‌ను అంతగా కళల ప్రపంచానికి సన్నిహితం చేసింది ఆమె అభిరుచి.. అదే కళాఖండాల సేకరణ.. ఎం.ఎఫ్.హుస్సేన్ సాబ్ నా ప్రొఫైల్‌ని గీసి నాకు అందించడం నా జీవితంలో మరువలేని అనుభవం' అంటున్నారు అంజుపొద్దార్. దాదాపు 50ఏళ్లుగా చిత్రకళాభిమానిగా ఆమె కొనసాగిస్తున్న సేకరణాభిరుచి ఆమె ఇంటిని సుసంపన్నం చేసింది. అతి తక్కువ సార్లు అది కూడా ఆప్తుల బలవంతం మీద తప్ప ఎప్పుడూ తన కలెక్షన్స్‌తో ప్రదర్శన నిర్వహించని అంజుపొద్దార్.. 'నేను సేకరించిన చిత్రాలన్నీ.. నా ఇంటికి వచ్చే బంధుమిత్రులు, అతిథులతో పంచుకునే అందమైన అనుభూతుల నేపథ్యాలు మాత్రమే'నని స్పష్టం చేస్తారు.

క్యా చీజ్ హై..



సాక్షి, సిటీబ్యూరో: ఫ్రెంచ్ కల్చరల్ సెంటర్ అలయెన్జ్ ఫ్రాంచైజ్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాన్ని ఈ నెల 9న నిర్వహిస్తున్నారు. వైవిధ్యభరిత చీజ్ వెరైటీలు మరీ ముఖ్యంగా ఫ్రాన్స్ ఫ్రెంచ్ స్టైల్ చీజ్ వంటకాలను ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈవెంట్ నిర్వహిస్తున్నామని, బంజారాహిల్స్‌లోని తమ సెంటర్ ప్రాంగణంలో ఉదయం 11.30 గంటల నుంచీ ఈ రుచుల ఆస్వాదన ప్రారంభమవుతుందని సెంటర్ నిర్వాహకులు తెలిపారు. వంటకాల తయారీలో ప్రసిద్ధి చెందిన ఫ్రెంచ్ చీజ్ మేకర్ వెలెంటైన్ మెల్వర్ ఈవెంట్‌కు హాజరై అతిథులతో ముచ్చటిస్తారని తెలియజేశారు. అదనపు వివరాల కోసం, ఈవెంట్‌కు హాజరు కావాలనుకున్నా సెంటర్ వెబ్‌సైట్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

శెభాష్

చిన్నారి ఆకర్షణకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందన



సనత్‌నగర్: పిన్న వయస్సులోనే ఇప్పటి వరకు 17 లైబ్రరీలను ఏర్పాటు చేసి అందరిలో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుతున్న చిన్నారి ఆకర్షణను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అభినందించారు. లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న గవర్నర్ ఆ చిన్నారిని ప్రత్యేకంగా రాజ్‌భవన్‌కు ఆహ్వానించారు. ఈ మేరకు ఆకర్షణ బుధవారం రాజ్‌భవన్‌ను సందర్శించగా ఆమెను అభినందించి వాచ్‌ను బహూకరించారు. అలాగే ఎంపిక చేసిన పుస్తకాలను ఆమెకు అందించారు. ఈనెల 25న మూసాపేటలోని శ్రీసత్యసాయి బాలికల అనాథ ఆశ్రమంలో ఆకర్షణ 18వ లైబ్రరీని ఏర్పాటు చేయనుంది. ప్రారంభోత్సవానికి హాజరు కావాల్సిందిగా గవర్నర్‌ను ఆమె కోరింది. ఇందుకు ఆయన సమ్మతించారు.

హెల్దీ.. లబ్‌టబ్

వేడినీటి టబ్‌లో స్నానం చేస్తే రోగాలకు చెక్



- పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా..
- సాంకేతికతతో అద్భుతాలు

సాక్షి, సిటీబ్యూరో: బాత్ టబ్‌లో స్నానం చేయడం అనేది ఒకప్పుడు ఉన్నతశ్రేణి కుటుంబాలకు మాత్రమే సాధ్యం అనే ఆలోచన ఉండేది. ఈ తరహా క్రేజ్ నగరమంతా వేగంగా విస్తరిస్తోంది. విల్లాలు, అపార్ట్‌మెంట్లు, హోటల్స్‌లో సైతం అత్యాధునిక వసతులున్న బాత్‌టబ్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. సీజన్‌ను బట్టి చల్లని, వేడి, సాధారణ నీటిలో ఆడుకోవాలనే కుతూహలం అందరిలోనూ ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో కాల్వలు, చెరువులు, నేల బావులు ఉంటాయి. నగర ప్రజలకు బాత్‌టబ్, స్విమ్మింగ్ పూల్స్‌ను ప్రత్యామ్నాయంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇందు కోసం రూ.1.50 లక్షల నుంచి సుమారుగా రూ.15 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. పెద్దలు, పిల్లలకు వేర్వేరు శానిటరీ ఫిక్షర్స్ అందుబాటులోకి వచ్చాయి. ఇటలీ, జపాన్ మేడ్ ఫిక్షర్స్‌కు నగరంలో డిమాండ్ కనిపిస్తోందని ఆర్కిటెక్స్ అంటున్నారు. పింగాణీ, సిరామిక్ ఫిక్షర్స్‌కు ఆక్రలిక్ కల్‌స్టోన్, డాల్ఫిన్ ఇండెక్స్, స్పా తదితర హంగులు అద్దుతున్నారు. చూడటానికి అవుట్ లుక్ అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఇళ్లలో షవర్, బాత్ టబ్ స్నానం చేయడం శరీరానికి ప్రత్యేక ఉత్సాహాన్ని ఇస్తుంది. షవర్ నుంచి చినుకుల మాదిరిగా పడే నీటి బిందువులు శరీరాన్ని పులకరింపజేస్తాయి. బాత్ టబ్‌లో స్విమ్మింగ్ పూల్, సహజ నీటి వనరుల్లో స్నానం చేసే అనుభూతి కల్పిస్తుంది.

వేడి నీటి టబ్‌లో స్నానం చేయడం అనేది నేచురోపతిలో ఒక పార్ట్, దీన్నే హైడ్రో ట్రీట్‌మెంట్ అంటారు. వేడి నీటి టబ్‌లో కూర్చోవడం వల్ల కిడ్నీ, బీపీ, గుండెపోటు ఇతర అనేక వ్యాధులకు బాత్‌టబ్ పరోక్షంగా నివారించడం, శరీరం బరువును నియంత్రిస్తుందని అంటున్నారు. వేడి నీటి టబ్ స్నానం చేయడం వల్ల చెమట, యూరియా, క్రియాటిన్, సోడియం పొటాషియం వంటి వ్యర్థ పదార్థాలు కూడా బయటకు వస్తాయని అంటున్నారు. కిడ్నీ రోగులు డయాలసిస్ ప్రమాదం తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. బాత్ టబ్ వినియోగించాలని చాలా మంది మనసులో ఉన్నా.. ప్రస్తుతం ఉంటున్న నివాస గృహంలో స్థలాభావంతో వెనుకడుగు వేస్తున్నారు. బాత్ టబ్ ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం 2,500 చదరపు అడుగుల ఇల్లు ఉండాలి. కొత్తగా ఇళ్లు కొనుగోలు చేసే కుటుంబాలు మాత్రం ఆ స్థాయికి తగ్గట్లే ఏర్పాట్లు చేసుకుంటున్నాయి.

నేచురోపతిలో ఒక పార్ట్..



విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో..



నగరంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న ఇళ్లలో ఇటాలియన్, జపాన్ మేడ్ శానిటరీ ఫిక్షర్స్ వినియోగిస్తున్నారు. బాత్ టబ్ ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం 2,500 చదరపు అడుగుల ఇంటి నిర్మాణం ఉండాలి. ప్రస్తుతం విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో అధిక శాతం మంది బాత్ టబ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు.
– రాకేష్ వర్మ, ఆర్కిటెక్, మాదాపూర్

వహ్.. క్యాఫీల్ హై..

స్టార్‌బక్స్‌లో సరికొత్త ఫ్లేవర్



సాక్షి, సిటీబ్యూరో: మలబార్ తీరం నుంచి సరికొత్త కాఫీ ఫ్లేవర్‌ను స్టార్‌బక్స్ అందుబాటులోకి తెచ్చింది. చిక్కమగళూరు జిల్లాల్లో పండే ప్రత్యేకమైన కాఫీ గింజలను వర్షాకాలంలో మాత్రమే సేకరించి, మలబార్ తీరానికి తరలించి, ఆరు నెలల పాటు ప్రాసెస్ చేస్తామని టాటా స్టార్‌బక్స్ సీఈవో సుశాంత్ దాస్ వివరించారు. అందుకే ఈ విభిన్నమైన కాఫీని మాన్‌సూన్ మలబార్ పేరుతో అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. యునిక్ టేస్ట్‌తో పాటు పలు రకాల ఫ్లేవర్స్‌ను పరిచయం చేయనున్నట్లు తెలిపారు.

ప్రతిష్టాత్మక 'మెకథ్లాన్'

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెకథ్లాన్ ఇంటర్నేషనల్ రోబోటిక్ అండ్ సైన్స్ ఈవెంట్‌కు మరో వేదికగా హైదరాబాద్ నిలుస్తోంది. ఈవెంట్‌ను బాచుపల్లిలోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9, 10 తేదీల్లో నిర్వహించనున్నారు. సెమీఫైనల్స్‌ను దేశవ్యాప్తంగా ఆరు నగరాల్లో నిర్వహిస్తున్నారు. గ్రాండ్ ఫినాలే 23, 24 తేదీల్లో బెంగళూరు వేదికగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల చిన్నారులు అంతర్జాతీయ స్థాయి పాఠశాలల నుంచి పాల్గొంటున్నారు. ఈ సైన్స్ కాంపిటీషన్స్‌లో భాగంగా ఎకో ఇన్నోవా, బ్రెయినియాక్ క్విజ్, రోబోటిక్ కాంపిటీషన్స్, రేస్ రోబో వంటి అధునాతన సాంకేతిక కార్యక్రమాల వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నారు. రోబోటిక్ సైన్స్ గేమ్ ఇన్ సెషన్స్ ఇతర సైన్స్ వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నారు.

నగరంలో ఇటీఎస్ కార్యకలాపాల విస్తరణ



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ఎడ్యుకేషన్, టాలెంట్ సొల్యూషన్స్ కంపెనీ.. ఇటీఎస్ నగరంలో తన కార్యకలాపాలను విస్తరించనుంది. ఈ విషయాన్ని ఇటీఎస్ జీఎం మోనా అగర్వాల్ తెలిపారు. గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్‌కు లీడ్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో తమ సంస్థ విస్తరణ ప్రణాళికలను గురించి వివరించారు. ఆవిష్కరణల రీత్యా నైపుణ్యం ఉన్న మానవ వనరుల పరంగా హైదరాబాద్ తమకు అత్యంత కీలకమన్నారు. వచ్చే 2025 వరకు తమ సిబ్బంది సంఖ్యను 600కి చేరుస్తామని, ఇందులో 60శాతం నగరం నుంచే ఉంటారని చెప్పారు.

సమన్వితరెడ్డికి పది వరల్డ్ రికార్డులు

రంగారెడ్డినగర్: నృత్యకేళి స్కూల్ ఆఫ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కొంపల్లి డెకథ్లాన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కట్ట సమన్వితరెడ్డి పది ప్రపంచ రికార్డుల్లో స్థానం సంపాదించింది. రివర్స్ స్కేటింగ్ చేస్తూ సోలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకుంది. భారత్ వరల్డ్ రికార్డ్స్, అమేజింగ్ కిడ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్, తెలుగు వరల్డ్ రికార్డ్స్, నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ రికార్డ్స్ హోల్డర్ బుక్, చిల్డ్రన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ గ్లోబల్ రికార్డ్స్, ఫ్యూచర్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ ఇండియా, హైరేంజ్ వరల్డ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్‌లో స్థానం పొందింది. లయన్ కేవీ రమణారావు చేతులమీదుగా ఆమెకు పది అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సత్యవోలు రాంబాబు, నాట్యగురువు నామని రవికుమార్, శ్రీకాంత్‌గౌడ్, అస్మా షాహీద తదితరులు పాల్గొన్నారు.



రూ.2,610 కోట్ల అక్రమ డిపాజిట్లు..
18 ఏళ్లుగా జిత్తులు!





ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు వసూలుచేస్తున్నారంటూ మార్గదర్శికి స్పష్టం చేసిన రిజర్వ్‌బ్యాంక్

2006 నవంబర్ 6న మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలపై ఉండవల్లి ఫిర్యాదు • రామోజీ చట్ట విరుద్ధ కార్యకలాపాలు వెలుగులోకి..

- 1997 నుంచి 2006 వరకు రూ.2,610 కోట్ల అక్రమ డిపాజిట్ల సేకరణ
- తాము ఆర్‌బీఐ చట్ట పరిధిలోకి రామంటూ దబాయింపు
- పిటిషన్లపై పిటిషన్లు వేస్తూ అడుగడుగునా అడ్డంకులు.. విభజన హడావుడిలో ఉండగా రామోజీకి అనుకూలంగా హైకోర్టు తీర్పు
- దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఉండవల్లి, ఏపీ ప్రభుత్వం
- హైకోర్టు తీర్పును తప్పుబట్టిన అత్యున్నత న్యాయస్థానం
- సుప్రీం ఆదేశాలతో తిరిగి విచారణ మొదలుపెట్టిన తెలంగాణ హైకోర్టు
- మొదటిసారి కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి వాదనలు.. నేడు మరోసారి విచారణ • ఉల్లంఘనలు రుజువైతే వసూలు చేసిన రూ.2,610 కోట్లకు రెట్టింపు జరిమానా

చట్టపరమైన చర్యల కోసం కింది కోర్టులో అధీకృత అధికారి ఫిర్యాదు చేస్తే దానిపై పిటిషన్..!
వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు కమిషన్‌ను నియమిస్తే పిటిషన్...!
అధీకృత అధికారిని నియమిస్తే పిటిషన్..!
కేసు వాదించడానికి స్పెషల్ పీపీని నియమిస్తే పిటిషన్!
కింది కోర్టు విచారణకు స్వీకరిస్తే పిటిషన్...!
వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశిస్తే పిటిషన్..!
హైకోర్టు జోక్యానికి నిరాకరిస్తే సుప్రీంకోర్టులో పిటిషన్..!!

ఇలా పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తూ, స్టేల మీద స్టేలు పొందుతూ మార్గదర్శి, రామోజీరావు కాలం వెళ్లదీస్తూ వచ్చారు. దాని ఫలితంగానే గత 18 ఏళ్లుగా కేసు కొనసాగుతూ వస్తోంది. ప్రజల నుంచి ఏకంగా రూ.2,610 కోట్ల మేర డిపాజిట్లను అక్రమంగా వసూలు చేసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త రామోజీరావు బండారం 2006 నవంబర్ 6న బట్టబయలైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చట్టం సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా అక్రమంగా డిపాజిట్లు వసూలు చేయడంపై ప్రజల ముందు నిలబెట్టిన రోజు అది. ఇంత భారీ మొత్తంలో డిపాజిట్లు వసూలు చేసి అడ్డంగా దొరికిపోయిన మార్గదర్శి, రామోజీరావు చట్టం నుంచి తప్పించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూ వచ్చారు. ప్రతి దశలోనూ విచారణను అడ్డుకుంటూ వచ్చారు. అయితే ఈ కేసులో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తిరిగి విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు ఈ నెల 7వ తేదీన మరోసారి విచారణ జరపనుంది. ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు స్వీకరించిందా? లేదా? అనే విషయాన్ని తేల్చనుంది. చట్ట విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించినట్లు తేలితే వసూలు చేసిన రూ.2,610 కోట్లకు రెట్టింపు మొత్తాన్ని జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది.

• అటు అక్రమ డిపాజిట్లు.. ఇటు నష్టాలంటూ

రామోజీరావు 1972లో హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఏర్పాటు చేశారు. 1997 కేంద్ర చట్టం ప్రకారం హెచ్‌యూఎఫ్ లాంటి అన్ ఇన్ కార్పొరేటెడ్ (చట్టపరంగా ఓ కంపెనీగా రిజిస్టర్ కాకుండా వ్యాపారం చేసేవి) సంస్థలు వ్యాపార కార్యకలాపాల కోసం ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధం. అయితే దీన్ని ఖాతరు చేయకుండా మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించి 1997 నుంచి 2006 మార్చి నాటికి 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి దాదాపు రూ.2,610.38 కోట్లు అక్రమంగా వసూలు చేసింది. ఇంత భారీగా డిపాజిట్లు వసూలు చేసిన మార్గదర్శి ఆశ్చర్యకరంగా 2006 మార్చి నాటికి రూ.1,369.47 కోట్లను వృద్ధి చెందుతున్న నష్టాలుగా చూపింది. తద్వారా 50 శాతం మంది డిపాజిటర్లకు డిపాజిట్లు చెల్లించలేని పరిస్థితికి మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేరింది.

• డొంక కదిల్చిన ఉండవల్లి...

మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా రామోజీ చట్ట విరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించడంపై అప్పటి కాంగ్రెస్ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ 2006 నవంబర్ 6న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేశారు. మార్గదర్శి అక్రమాల తీరును బహిర్గతం చేశారు. ఇదే సమయంలో ఆ డిపాజిట్ల వివరాలను ఆర్‌బీఐ అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపడంతోపాటు మార్గదర్శి ఫైనాన్షియర్స్ నుంచి వివరణ కోరింది. వాస్తవానికి 1997లోనే డిపాజిట్ల సేకరణపై మార్గదర్శి స్పష్టత కోరగా ప్రజల నుంచి అలా సేకరించడం చట్ట విరుద్ధమని ఆర్‌బీఐ అప్పుడే స్పష్టం చేసింది. అయినా సరే పట్టించుకోకుండా మార్గదర్శి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు సేకరిస్తూ వచ్చింది. ఎప్పుడైతే ఉండవల్లి అరుణ్ కుమార్ ఫిర్యాదు చేశారో అప్పుడు మళ్లీ ఆర్‌బీఐ దీనిపై స్పందించింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఆర్‌బీఐ స్పష్టంగా చెప్పింది.

• రంగాచారి, కృష్ణరాజు నియామకం..

డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని ఆర్‌బీఐ చేతులెత్తేయడంతో చట్ట ప్రకారం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ముందుగా మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలపై నిగ్గు తేల్చి నివేదిక ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) ఎన్.రంగాచారిని, చట్ట ప్రకారం న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసేందుకు, తదనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఐపీఎస్ టి.కృష్ణరాజును అధీకృత అధికారిగా నియమిస్తూ జీవో జారీ చేసింది. ఈ నియామకాలను సవాలు చేస్తూ రామోజీ 2006లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం కొట్టివేసింది. అనంతరం 2007లో సుప్రీంకోర్టును ఆశ్రయించగా అత్యున్నత న్యాయస్థానం సైతం ఆ పిటిషన్‌ను కొట్టేసింది.

• ఐటీ శాఖ నుంచి సేకరించిన రంగాచారి..

డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రంగాచారి నిర్వహించిన విచారణకు రామోజీరావు, మార్గదర్శి సహకరించకుండా కార్యాలయాల్లో తనిఖీలకు అడ్డంకులు సృష్టించారు. తమ పిటిషన్లు కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్నాయని, డాక్యుమెంట్లు ఇచ్చేది లేదంటూ మొండికేశారు. దీంతో రంగాచారి ఆ వివరాలను ఆదాయపు పన్ను శాఖ నుంచి తెప్పించుకున్నారు. ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించడం నిజమేనని పేర్కొంటూ 2007 ఫిబ్రవరి 19న ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వడ్డీ చెల్లించే అలవాటే మార్గదర్శికి లేదని, ఒత్తిడి చేస్తేనే చెల్లిస్తుందంటూ ఓ డిపాజిటర్ హైకోర్టుకు నివేదించటాన్ని తన నివేదికలో పొందుపరిచారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, అది డిపాజిట్లను తిరిగి చెల్లించే స్థితిలో లేదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.

• రామోజీ పెట్టుబడి రూపాయైనా లేదు..

మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లను రామోజీ తన అనుబంధ కంపెనీలకు మళ్లించడమే నష్టాలకు ప్రధాన కారణమని రంగాచారి తన విచారణలో తేల్చారు. 2000, ఆ తరువాత బ్యాలెన్స్ షీట్‌లను గమనిస్తే మార్గదర్శి ఫైనాన్షియర్స్‌లో రామోజీ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టలేదన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన డిపాజిట్లతోనే మార్గదర్శిని నడిపారని నిగ్గు తేల్చారు.

• కోర్టు అనుమతితో తనిఖీలు..

మరోవైపు ఈ కేసులో అధీకృత అధికారిగా నియమితులైన కృష్ణరాజు కోర్టు అనుమతితో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌లో తనిఖీలు చేశారు. దీన్ని సవాలు చేస్తూ మార్గదర్శి, రామోజీరావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ 14.3.2007న కోర్టు ఉత్తర్వులిచ్చింది. దీనిపై రామోజీ హైకోర్టును ఆశ్రయించగా కింది కోర్టు ఇచ్చిన సెర్చ్ వారెంట్‌ను నిలుపుదల చేసింది. ఈ క్రమంలో చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి టి.కృష్ణరాజు 2008 జనవరి 23న నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) చేశారు. దీన్ని కొట్టి వేయాలంటూ అదే ఏడాది రామోజీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది.

జస్టిస్ రజనీ స్టేతో మూలపడిన కేసు..

దీంతో దిక్కుతోచని రామోజీ 2010లో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. అధీకృత అధికారి ఇచ్చిన ఫిర్యాదులో విచారణను సెక్షన్ 45(ఎస్)(1), 45(ఎస్)(2), 58బీ(5ఏ) రెడ్ విత్ సెక్షన్ 58(ఈ)లకే పరిమితం చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చుతూ నాంపల్లి కోర్టు 2011లో ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులపై మార్గదర్శి, రామోజీ హైకోర్టును ఆశ్రయించారు. ఆర్‌బీఐ చట్టం పరిధిలోకి మార్గదర్శి ఫైనాన్షియర్స్ రాదంటూ వాదించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన అప్పటి న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ మార్గదర్శిపై కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ 20.7. 2011న మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. స్టే వల్ల కేసు అప్పటి నుంచి మూలనపడిపోయింది. అటు తరువాత వచ్చిన ప్రభుత్వాలు రామోజీ గుప్పిట్లో ఉండటంతో మార్గదర్శి అక్రమాలను పట్టించుకోలేదు.

విచారణ.. తీర్పు.. ఒకే రోజు

ఉమ్మడి హైకోర్టు విభజన 1.1.2019న జరిగింది. 31.12.2018 ఉమ్మడి హైకోర్టుకు చివరి రోజు. అటు న్యాయవాదులు ఇటు న్యాయమూర్తులు అందరూ భావోద్వేగ వాతావరణంలో ఉన్నారు. కేసుల విచారణపై దృష్టి సారించలేని పరిస్థితిని రామోజీరావు తనకు అనుకూలంగా మలచుకున్నారు. నాంపల్లి కోర్టులో అధీకృత కృష్ణరాజు చేసిన ఫిర్యాదును కొట్టేయాలంటూ 2011లో తాము దాఖలు చేసిన వ్యాజ్యాలను రామోజీ విచారణకు తెప్పించారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ విచారణ జరిపారు. రామోజీరావు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రాను రంగంలోకి దించారు. లూథ్రా వాదనలు విన్న జస్టిస్ రజనీ ఇంత పెద్ద కేసులో అదే రోజు అంటే 31వతేదీన తీర్పు కూడా ఇచ్చేశారు. రామోజీ, మార్గదర్శి వాదనను సమర్థించారు. హెచ్‌యూఎఫ్.. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45ఎస్ పరిధిలోకి రాదని జస్టిస్ రజనీ తన తీర్పులో తేల్చేశారు. మార్గదర్శి, రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టులో అధీకృత అధికారి కృష్ణరాజు దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ తీర్పునిచ్చారు. ఇంత పెద్ద కేసులో ఒకే రోజు విచారణ జరిపి అదే రోజు తీర్పునివ్వడం అరుదైన ఘటన. అసలు ఈ కేసు విచారణకు వచ్చినట్లు గానీ, న్యాయమూర్తి ఈ విధంగా తీర్పునిచ్చినట్లుగానీ ఎవరూ గుర్తించలేదు. అటు తరువాత కొద్ది నెలలకు ఈ తీర్పు వెలుగు చూసింది. మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. జస్టిస్ రజనీ తీర్పుపై మార్గదర్శి, రామోజీరావు సుప్రీంకోర్టును ఆశ్రయించడం. అటు తరువాత మార్గదర్శి ఫైనాన్షియర్స్ కుంభకోణాన్ని బయట పెట్టిన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అప్రమత్తమై హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ 2019 డిసెంబర్ 17న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంప్లీడ్ అయింది.

హైకోర్టు తీర్పును రద్దు చేసిన సుప్రీం..

హైకోర్టు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు 19.9.2020న సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం17.8.2022న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అటు ఉండవల్లి అరుణ్ కుమార్, ఏపీ ప్రభుత్వం, ఇటు మార్గదర్శి, రామోజీరావు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు 2020 నుంచి విచారిస్తూ వచ్చింది. మార్గదర్శి, రామోజీరావు చట్ట ఉల్లంఘనలకు పాల్పడినట్లు విచారణ సందర్భంగా ఆర్‌బీఐ న్యాయవాది మౌఖికంగా కోర్టుకు తెలిపారు. చివరగా ఈ ఏడాది ఏప్రిల్ 9న సుప్రీంకోర్టు ఈ వ్యాజ్యాలన్నింటిపై విచారణ జరిపింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి కృష్ణరాజు నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజనీ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది.

కేసుల కొట్టివేతకు సుప్రీం నిరాకరణ..

డిపాజిట్లు తిరిగి ఇచ్చేశాం కాబట్టి తనపై కేసులు కొట్టేయాలంటూ ఇదే సమయంలో రామోజీ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన అభ్యర్థనలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. చట్ట విరుద్ధంగా సేకరించిన డిపాజిట్లపై నిగ్గు తేలాల్సిందేనని.. మార్గదర్శి, రామోజీకి అనుకూలంగా హైకోర్టు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పును పక్కనపెడుతున్నామని స్పష్టం చేసింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని, సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. తాజాగా విచారణ జరిపి ఆరు నెలల్లో విచారణను ముగించాలని, సేకరించిన డిపాజిట్లకు సంబంధించి పబ్లిక్ నోటీసు ఇవ్వాలని తెలిపింది.

తిరిగి విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు...

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు ఈ ఏడాది జూన్‌లో తిరిగి విచారణ ప్రారంభించింది. విచారణ జరుగుతుండగానే రామోజీరావు మరణించగా ఆయన స్థానంలో హెచ్‌యూఎఫ్ కర్తగా తనను చేర్చాలని రామోజీ కుమారుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పలు దఫాలు వాయిదాల అనంతరం పూర్తిస్థాయి వాదనల నిమిత్తం ఈ నెల 7న విచారణ చేపట్టనున్నట్లు న్యాయస్థానం పేర్కొంది.

- సాక్షి, అమరావతి

క్లుప్తంగా...

ప్రజలపై భారం పడకుండా విక్రయించాం

ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 22.5 శాతం పెంచడం వల్ల మార్కెట్లో నూనెల ధరలు పెరిగాయని ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా వెల్లడించారు. తాము మాత్రం పాత ధరతో ఉన్న కొద్ది నిల్వలు, కొత్త ధరతో కొంత స్టాక్‌ని కొని.. పాత స్టాక్ నిల్వలు, కొత్త స్టాక్ మధ్య సరాసరి చేసి ప్రజలపై భారం పడకుండా ధర నిర్ణయించి విక్రయాలు చేశామని ఆమె స్పష్టం చేశారు. అదే విధంగా అన్ని ఆయిల్ కంపెనీలు కూడా ధరను నిర్ణయించి అమ్మకాలు జరిపాయన్నారు. 'ఆయిల్‌ఫెడ్‌లో అక్రమదందా' శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆమె వివరణ ఇచ్చారు. ప్రతి రోజూ మార్కెట్ ధరలకు అనుగుణంగా ఆయిల్ ఫెడ్‌లో నూనె ధరలు నిర్ణయిస్తామని స్పష్టం చేశారు. దిగుమతి సుంకంలో మార్పుతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో కూడా చాలా మార్పులు రావడంతో నెలపదిహేను రోజుల నుంచి నూనెల ధరలు స్థిరంగా ఉండటం లేదన్నారు.

ఎయిర్‌బస్ @ ఓరుగల్లు

▶ మొదటి పేజీ తరువాయి

లేఖ రాసింది. దీనికి ప్రభుత్వం సరే అనటంతో పెద్ద విమానాశ్రయమే రూపొందబోతోంది. ఇక్కడ ఎయిర్‌బస్ విమానం దిగేలా దాదాపు 2,800 మీటర్ల పొడవైన రన్‌వే నిర్మించబోతున్నారు. మామునూరులో నిజాం ప్రభుత్వం నిర్మించిన ఎయిర్‌స్ట్రిప్ శిథిలం అయినా, నాటి రెండు రన్‌వేల ఆనవాళ్లు ఉన్నాయి. అందులో పెద్దది దాదాపు 1,400 మీటర్ల పొడవు ఉంది. ఇప్పుడు అదే డైరెక్షన్‌లో దానిపైనే కొత్త రన్‌వే నిర్మించనున్నారు. దాని పక్కన గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్‌వే కూడా ఉంది. దానిని కూడా పునరుద్ధరించే యోచనలో ఉన్నారు.

సొంతంగానే నిర్మాణం

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీఎమ్మార్ సంస్థ నిర్మించింది. ఎయిర్‌పోర్టుకు 150 కి.మీ. పరిధిలో మరో విమానాశ్రయం నిర్మించకూడదన్న నిబంధన ఉంది. వరంగల్ ఎయిర్‌పోర్టుకు ఇది అడ్డంకిగా మారటంతో జీఎమ్మార్ సంస్థతో సంప్రదింపులు జరిపారు. వరంగల్ విమానాశ్రయాన్ని కూడా దానికే కేటాయించేలా కూడా చర్చలు జరిగాయి. చివరకు ఆ నిబంధనపై అభ్యంతరం పెట్టకూడదన్న దిశలో చర్చలు సానుకూలంగా జరిగాయి. ఆ మేరకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌ఓసీ తీసుకుంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కేటాయించకుండా సొంతంగానే వరంగల్ ఎయిర్‌పోర్టును చేపట్టాలని అది నిర్ణయించింది.

• విమానాశ్రయానికి 700 మీటర్ల దూరంలో ఉన్న వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిని మళ్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. దాదాపు కిలోమీటరు నిడివితో భారీ సొరంగమార్గం నిర్మించి వాహనాలను దాని గుండా మళ్లించాలని ప్రతిపాదించారు. కానీ దీనికి భారీ ఖర్చు అవుతున్నందున, దాని బదులు బైపాస్‌రోడ్డు నిర్మించాలన్న ప్రత్యామ్నాయ ప్రతిపాదనపై ఇప్పుడు పరిశీలిస్తున్నారు.

• వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కులో జపాన్, తైవాన్ లాంటి విదేశీ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. ఇవి కార్గో ఫ్లైట్ సేవలు కోరుతున్నాయి. కార్గో ఫ్లైట్ ఆపరేషన్ జరగాలంటే పెద్ద రన్‌వే ఉండాలి. దీంతో అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయంగానే దీనిని రూపొందించబోతున్నారు.

మూడేళ్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్..

మామునూరు విమానాశ్రయాన్ని 'ఉడాన్'లోని రీజనల్ కనెక్టివిటీ స్కీంతో అనుసంధానించనున్నారు. ఇందులో మూడేళ్ల కాలానికి కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండ్ అందిస్తుంది. రూట్ల వారీగా బిడ్డింగ్ నిర్వహిస్తే వాటిల్లో ఎంపికైన ఆపరేటర్లకు ఆయా రూట్లు కేటాయిస్తారు. ఆ ఆపరేటర్లు మాత్రమే ఆ రూట్లలో మూడేళ్లపాటు విమాన సర్వీసులు నిర్వహిస్తారు. ఈ కాలంలో సీట్ల వారీగా నష్టాలను బేరీజు వేసి.. డిమాండ్ అంచనా–వాస్తవ డిమాండ్.. ఈ రెంటి మధ్య ఉండే గ్యాప్‌ను కేంద్రం భర్తీ చేస్తుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ కూడా ఉంటుంది.

రెండేళ్లలో వరంగల్ విమానాశ్రయం

• భూసేకరణ వేగవంతం చేయాలి: కోమటిరెడ్డి



సమీక్షలో కోమటిరెడ్డి, కడియం

సాక్షి, హైదరాబాద్: వరంగల్ విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియను వేగంగా నిర్వహించి రెండేళ్లలో అది సిద్ధమయ్యేలా చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నెలలో రెండుసార్లు ఎయిర్‌పోర్టు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. రోడ్లు భవనాల శాఖ పరిధిలో చేపట్టిన వివిధ పనులపై సచివాలయంలో బుధవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వరంగల్ విమానాశ్రయాన్ని ఉడాన్ స్కీంతో అనుసంధానించి ఇతర పెద్ద నగరాలతో అనుసంధానించేందుకు కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏవియేషన్ అధికారులను ఆదేశించారు. వానలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయటంలో జాప్యం జరుగుతుండటంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ రూల్స్, బదిలీలు.. ఇలా కోరిన వాటిని పరిష్కరిస్తున్నా.. పనులు చేయటంలో ఆలస్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంజినీర్లు ఎమ్మెల్యే ఇళ్ల చుట్టూ తిరుగుతూ కొత్త రోడ్లకు ప్రతిపాదనలు రూపొందించే కన్సల్టెంట్లుగా మారారని, కొత్తగా విధుల్లో చేరిన జూనియర్ ఇంజినీర్లను ఇప్పటి వరకు క్షేత్రస్థాయికి పంపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిమ్స్ ఆసుపత్రి భవనాల నిర్మాణంలో కూడా జాప్యం జరుగుతుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే జూలై నాటికి ఆ ఆస్పత్రులు అందుబాటులోకి రావాలని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన్, ఈఎన్‌సీ మధుసూదన్ రెడ్డి, సీఈలు మోహన్‌నాయక్, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికు చెక్ అందజేస్తున్న అపెక్స్ బ్యాంక్ చైర్మన్ రవీందర్‌రావు

సీఎం సహాయ నిధికి అపెక్స్ బ్యాంక్ భారీ విరాళం

గన్‌ఫౌండ్రి (హైదరాబాద్): ముఖ్యమంత్రి సహాయ నిధికి తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ భారీ విరాళాన్ని అందజేసింది. వరద బాధితుల సహాయార్థం టీజీసీఏబీ, డీసీసీబీ, సహకార సంఘాల ఉద్యోగుల వేతనాల నుంచి రూ.1,51,01,116 చెక్కును బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు, వైస్ చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య, డైరెక్టర్లు చిట్టి దేవేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రమేశ్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 14 ఎక్సైజ్ స్టేషన్లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పరిధి ఎక్కువగా ఉన్న స్టేషన్లను కుదించి కొత్తవి ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 14 ఎక్సైజ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 8 ఎక్సైజ్ జిల్లాల పరిధిలో ఈ స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. కొత్త ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలోనే గ్రీన్‌సిగ్నల్ వచ్చినప్పటికీ అమల్లోకి రాలేదు. బంజారాహిల్స్, మారేడ్‌పల్లి, చిక్కడపల్లి, గండిపేట, కొండాపూర్, మీర్‌పేట, పెద్దఅంబర్‌పేట, కొంపల్లి, కూకట్‌పల్లి, కాప్రా, నాచారం, అల్వాల్, అమీన్‌పూర్, హసన్‌పర్తిలలో ఈ కొత్త స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని కొన్ని ఎక్సైజ్ స్టేషన్ల పరిధి గతంలో చాలా పెద్దగా ఉండేదని, ఇప్పుడు ఆ స్టేషన్ల పరిధిని కుదించి కొత్త స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ వర్గాలు చెపుతున్నాయి.

పోలవరం నుంచి 80 టీఎంసీలు వస్తే.. ఆ మేరకు కృష్ణా జలాలు కట్!

ట్రిబ్యునళ్లు గంపగుత్తగా కేటాయింపులు జరిపినా ప్రాజెక్టులకు రక్షణ
వాటి ఆధారంగానే గత 48 ఏళ్లుగా ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల కొనసాగింపు
కృష్ణా ట్రిబ్యునల్–2 ముందు ఏపీ తరఫు సాక్షి అనిల్‌కుమార్ గోయల్

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల నికర జలాలు లభ్యతలోకి వస్తే నాగార్జునసాగర్, శ్రీశైలం నుంచి కృష్ణా డెల్టాకు ఆ మేరకు నీటి సరఫరా తగ్గిపోతుందని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ముందు ఏపీ ప్రభుత్వ సాక్షి అనిల్‌కుమార్ గోయల్ వాంగ్మూలం ఇచ్చారు. బుధవారం ఢిల్లీలో ట్రిబ్యునల్ నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో పాల్గొన్న ఆయన.. తెలంగాణ న్యాయవాదుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. 1978 ఆగస్టు 4న జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పందం ప్రకారం పోలవరం నుంచి 80 టీఎంసీల గోదావరి జలాలను విజయవాడ ఆనకట్టకు తరలిస్తే, శ్రీశైలం, సాగర్ నుంచి వచ్చే జలాలపై కృష్ణా డెల్టా ఆధారపడదనే వాదనను అంగీకరిస్తారా? అని ప్రశ్నించగా అవునని ఆయన బదులిచ్చారు. కృష్ణా ట్రిబ్యునల్–1, 2లు గంపగుత్తగా నీటి కేటాయింపులు జరిపినా, రెండు రాష్ట్రాల్లోని వివిధ ప్రాజెక్టులకు రక్షణ కల్పించాయని, వాటి ఆధారంగా పలు ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు జరిగాయని చెప్పారు. కేంద్ర జల సంఘం డైరెక్టర్ (హైడ్రాలజీ)గా పదవీ విరమణ పొందిన అనిల్‌కుమార్.. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్స్‌ను ప్రతిపాదించారు.

ఆ ప్రొటోకాల్స్‌కు స్వల్ప మార్పులే..

ట్రిబ్యునల్‌కు కేంద్రం జారీ చేసిన కొత్త టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ (సూచనలతో కూడిన నిబంధనలు) ఆధారంగా ప్రాజెక్టుల వారీగా రెండు రాష్ట్రాలకు సమ కేటాయింపులు చేస్తే ప్రతిపాదిత ఆపరేషన్ ప్రొటోకాల్స్ పూర్తిగా అసంబద్ధంగా మారిపోతాయని ప్రశ్నించగా, వాటికి స్వల్ప మార్పులే చేయాల్సిరావొచ్చని అనిల్‌కుమార్ బదులిచ్చారు. ఏపీ, తెలంగాణ మధ్య ఏ ట్రిబ్యునల్ నీటి పంపకాలు జరపలేదని, ఉమ్మడి ఏపీ ప్రభుత్వం చేసిన పరిపాలనపర ఏర్పాట్లనే కేటాయింపులుగా చూపుతున్నారంటూ తెలంగాణ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే రక్షిత ప్రాజెక్టులు, అదనపు ప్రాజెక్టుల ఆధారంగా ఉమ్మడి ఏపీకి కేటాయింపులు జరిగాయని, ఈ ప్రాజెక్టులకు కేటాయింపులు గత 48 ఏళ్లుగా కొనసాగుతున్నాయని గోయల్ బదులిచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఈ కేటాయింపులకు పలు అంతర్రాష్ట్ర సమావేశాల్లో సమ్మతి తెలిపారన్నారు. 2015 జూన్ 18, 19న అపెక్స్ కౌన్సిల్‌లో ఏపీ, తెలంగాణ మధ్య జరిగిన ఒప్పందమే దీనికి ఆధారమన్నారు. ఆ తర్వాతి కాలంలో తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించి 50:50 నిష్పత్తిలో కేటాయింపులు జరపాలని కోరిన విషయం తెలియదా? అని తెలంగాణ న్యాయవాది ప్రశ్నించగా, లేదని బదులిచ్చారు.

జూరాల నుంచి మిగులు జలాలే వాడాలి

కృష్ణా ట్రిబ్యునల్–1, 2లతో పాటు పునర్విభజన చట్టంలో రక్షణ కల్పించకపోవడంతోనే కోయిల్‌సాగర్, ఒకచెట్టివాగు ప్రాజెక్టులకు జూరాల నుంచి నీటి తరలింపును పరిగణనలోకి తీసుకోలేదని గోయల్ చెప్పారు. షెడ్యూల్–11లో పేర్కొన్న ఏపీ, తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాలు కాకుండా మిగులు జలాలనే సరఫరా చేయాల్సి ఉంటుందని, అందుకే నెట్టెంపాడు ప్రాజెక్టును సైతం పరిగణనలోకి తీసుకోలేదన్నారు. జూరాల నుంచి దిగువకు 342 టీఎంసీలను విడుదల చేసిన తర్వాతే మిగులు జలాలను వాడుకోవాల్సి ఉంటుందన్నారు. 2015–16 నుంచి ఏపీ ప్రభుత్వం తాత్కాలికంగా పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు తరలిస్తున్న గోదావరి నీళ్లను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని, అవి నికర జలాలు కావని చెప్పారు. పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తే ప్రత్యామ్నాయంగా నాగార్జునసాగర్ ఎగువన 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవాలని గతంలో ఒప్పందం జరిగిందని, ఇప్పటికే కర్ణాటక, మహారాష్ట్రలు 35 టీఎంసీలు వాడుకోగా, మిగిలిన 45 టీఎంసీలను ఏపీలోని కృష్ణా డెల్టాకు వాడుకోవాల్సి ఉంటుందని గోయల్ పేర్కొన్నారు. సాగర్‌కి దిగువన వాడినా ఎగువ ప్రాంతంలో వాడినట్టు లెక్కించాల్సి ఉంటుందన్నారు.

బెయిల్‌పై భానుకిరణ్ విడుదల

చంచల్‌గూడ (హైదరాబాద్): హైదరాబాద్‌లో 2011 జరిగిన ఫ్యాక్షనిస్టు మద్దెలచెరువు సూరి అలియాస్ గంగుల సూర్యనారాయణరెడ్డి హత్య కేసు ప్రధాన నిందితుడు భానుకిరణ్ బుధవారం బెయిల్‌పై చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. ఈ హత్య కేసులో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించడం తెలిసిందే. చర్లపల్లి జైల్లో ఉన్న భానుని 2016లో చంచల్‌గూడ జైలుకు తరలించారు. బెయిల్‌పై విడుదలైన భానును.. అత్యంత పటిష్ట భద్రత మధ్య అతని అనుచరులు మరో చోటికి తరలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడేందుకు భాను నిరాకరించాడు. అతని అనుచరుడు మన్మోహన్ ఏడేళ్ల శిక్ష పూర్తి చేసుకుని 2018లో విడుదలయ్యాడు.



● రైడింగ్

ఒకరోజు శ్రీరంజనికి తప్పనిసరి పరిస్థితుల్లో బైక్ ట్యాక్సీ బుక్ చేయాల్సి వచ్చింది. పురుష డ్రైవర్ వెనుక కూర్చొని ప్రయాణించడానికి ఆమె పడిన ఇబ్బంది అంతా ఇంతా కాదు.

'ఎవరైనా చూస్తారేమో...ఏమైనా అనుకుంటారేమో' 'ఈ డ్రైవరు ఉన్నట్టుండీ అసభ్యంగా ప్రవర్తిస్తాడేమో...' ఇలా ఎన్నో ఆలోచనలతో ఆమె ప్రయాణం అత్యంత భారంగా గడిచింది. ఇప్పుడు శ్రీరంజనిలాంటి మహిళలకు బైక్ ట్యాక్సీ ప్రయాణం భారం కాబోదు...

దూసుకెళుతున్నారు

'పింక్' యాప్‌లో బుక్ చేసుకుంటే మహిళా డ్రైవర్లు మాత్రమే వస్తారు. 'పింక్' ద్వారా మహిళల సౌకర్యం, భద్రతా అనేది ఒక కోణం అయితే ఎంతో మంది మహిళలు దీని ద్వారా ఉపాధి పొందుతున్నారనేది మరో కోణం. చెన్నై నగరంలో ఎంటీసీ బస్సులు, ఎలక్ట్రిక్ రైళ్లు, ఎంఆర్‌టీఎస్ రైళ్లు, మెట్రో రైలులాంటి రవాణా సేవలు ఉన్నా, ఆటో, ట్యాక్సీల మీద ఆధారపడే ప్రయాణీకులు కూడా ఎక్కువే. ఆయా సంస్థల యాప్‌లలో బైక్ టాక్సీ కోసం బుక్ చేస్తే పురుష డ్రైవర్‌లే ఎక్కువగా వచ్చేవారు. వారి వెనుక కూర్చుని ప్రయాణించడం మహిళలకు అసౌకర్యంగా ఉండేది. ఈ నేపథ్యంలో 'పింక్' బైక్‌లు వారి చింతను దూరం చేసి నిశ్చింతగా ప్రయాణం చేసేలా చేస్తున్నాయి.

ప్రముఖ బైక్ ట్యాక్సీ అగ్రిగేటర్ 'ర్యాపిడో' చెన్నైలో 'బైక్ పింక్'ను ప్రారంభించింది.

'బైక్ పింక్ సర్వీస్ అనేది మహిళా సాధికారతను దృష్టిలో పెట్టుకొని ప్రారంభించాం. ఇది మహిళా ప్రయాణికులకు భద్రతను ఇవ్వడమే కాదు, ఎంతో మంది మహిళలకు డ్రైవర్‌లుగా ఉపాధిని ఇస్తుంది' అని 'ర్యాపిడో' ప్రకటించింది. మహిళా డ్రైవర్‌లను 'వుమెన్ కెప్టెన్'గా వ్యవహరిస్తారు. ర్యాపిడోతోపాటు ఉబర్, వోలలాంటి ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల ద్వారా మహిళలు డ్రైవర్‌లుగా ఉపాధి పొందుతున్నారు.

అనకాపుత్తూరుకు చెందిన మంగ ఉమెన్ కెప్టెన్. ఆమెకు ఐదేళ్ల కుమార్తె ఉంది. పాపను ఉదయం స్కూల్‌కు బైక్‌పై డ్రాప్ చేసిన తర్వాత ఆమె పని మొదలవుతుంది. సాయంత్రం నాలుగు గంటల వరకు బైక్ రైడింగ్ చేసి ఇంటికి తిరిగి వస్తుంది. ఆ తర్వాత ఇంటి పనుల్లో నిమగ్నమైపోతుంది. కొన్ని సార్లు రాత్రి 9 గంటల వరకు బైక్ రైడింగ్ చేయాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భాలలో పాపను తన తల్లి ఇంటి దగ్గర వదలి పెట్టి వస్తుంది. తొమ్మిది గంటలకు రైడింగ్ యాప్‌ను ఆఫ్ చేస్తుంది.

ఒక క్లాత్‌స్టోర్‌లో పనిచేసిన శ్వేత జీతం సరిపోకపోవడంతో బైక్ ట్యాక్సీ డ్రైవర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. రోజుకు రూ. 1000 వరకు సంపాదిస్తోంది.

'మొదట్లో నేను చేయగలనా? అని భయపడ్డాను. ఎంతోమంది ఉమెన్ బైక్ ట్యాక్సీ డ్రైవర్‌లతో మాట్లాడాను. వారు ఎంతో ధైర్యాన్ని ఇచ్చారు' అంటుంది శ్వేత.

ఇక మహిళా డ్రైవర్‌ల దారి రహదారేనా! కావచ్చేమో కాని... ఆ దారిలో రకరకాల అడ్డంకులు వస్తుంటాయి. 'ఒక ప్రయాణికుడు కావాలని పద్నాలుగు సార్లు నా బైక్ బుక్ చేశాడు. అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చి సంస్థకు ఫిర్యాదు చేస్తే తక్షణం అతడి ఖాతాను రద్దు చేశారు' అంది ఒక మహిళా డ్రైవర్.

'డ్రైవింగ్ సమయంలో మేము అభద్రతగా ఫీల్ అయితే సంస్థకు ఫిర్యాదు చేసే, పోలీసులను సంప్రదించే వీలు ఉంది' అంటుంది మరో మహిళా డ్రైవర్.

కొందరు పురుష ప్రయాణికులు మహిళా డ్రైవర్‌ను చూడగానే తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నారు. 'డ్రైవర్ మహిళ అనే విషయం తెలియక బుక్ చేశాను. సారీ' అంటూ ప్రయాణాన్ని ఆకస్మికంగా రద్దు చేసుకుంటున్నారు. మహిళలు సరిగ్గా డ్రైవ్ చేయరనేది అనేది వారి అపోహ.

ఇలాంటి అపోహల అడ్డుగోడలను కూల్చేస్తూ, లింగ వివక్షతను సవాలు చేస్తూ వుమెన్ కెప్టెన్‌ల బండి వేగంగా దూసుకుపోతోంది.

– అన్మతీన్ మైదీన్, సాక్షి, చెన్నై

● యుద్ధం దుఃఖం

కన్నీటి వీలునామా


సెప్టెంబర్ 30న గాజాలో ఒక ఇంటి మీద ఇజ్రాయిల్ బాంబు వేసింది. ఆ ఇంటిలోని 10 ఏళ్ల పాప, ఆమె 11 ఏళ్ల సోదరుడు మరణించారు. తల్లిదండ్రులు వారిని అంతిమంగా సాగనంపి పాప నోట్‌బుక్ తెరిస్తే ఈ మరణాన్ని, ఇలాంటి మరణాన్ని ఊహించి, గాజాలో కొంతకాలంగా మరణించిన 16,700 మంది పిల్లలతో పాటు తానూ చేరక తప్పదని తెలిసి ఆ పాప నోట్‌బుక్‌లో వీలునామా రాసి వెళ్లింది. ఆ వీలునామాలో తొలి వాక్యం 'నేను చనిపోతే ఏడ్వొద్దు' అని.

గాజా పసిపిల్లలు జీవించి ఉన్నారంటే వారు చిరంజీవులయ్యారని కాదు. వారి ఊపిరి కాలం పొడిగింప బడిందనే అర్థం.

ఇక్కడ చూడండి... జూన్ 10న గాజాలోని ఒక ఇంటి మీద బాంబు జారవిడిచింది ఇజ్రాయిల్. ఆ ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఇరుగూ పొరుగూ కలిసి లోపల ఉన్న భార్యాభర్తల్ని వారి కుమారుడు 11 ఏళ్ల అహ్మద్‌ని కూతురు 10 ఏళ్ల రాషాను బయటకు తీసుకొచ్చారు. వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఇజ్రాయిల్ ఆ ఇంటి మీద బాంబు ఎందుకు వేసింది? కారణం ఏమీ లేదు. మొన్నటి సెప్టెంబర్ 30 వరకూ కూడా ఆ కుటుంబం ఆకలిదప్పులతో వేదనలతో బతికింది. అయితే ఇజ్రాయిల్ తిరిగి సెప్టెంబర్ 30న మరో బాంబు అదే ఇంటి మీద వేసింది. కారణం ఏమిటి? ఏమీ లేదు. కాని దురదృష్టం.. ఈసారి రాషా, ఆమె సోదరుడు అహ్మద్ మృతి చెందారు.

తల్లిదండ్రులు ఎంతో దుఃఖంతో వారిని సాగనంపి తిరిగి వచ్చాక రాషా నోట్ పుస్తకంలో రాసిన తన వీలునామా కనిపించింది. అప్పటి వరకూ వారికి ఆ చిన్నారి అలాంటి వీలునామా రాసి ఉంటుందని తెలియదు. ఆ పాప అప్పటికే ఎందరో చిన్నపిల్లల మరణాలని చూసింది గాజాలో. మాట్లాడుకుంటుంటే వినింది. కనుక తాను కూడా చనిపోతానని భావించిందో ఏమో నోట్‌బుక్‌లో వీలునామా ఇలా రాసింది–



'నేను చనిపోతే నా కోసం ఎవరూ ఏడ్వద్దు. ఎందుకంటే మీ కన్నీళ్లు నాకు నొప్పి కలిగిస్తాయి. నా దుస్తులు అవసరమైనవారికి ఇస్తారని భావిస్తాను. నా అలంకార వస్తువులు రాహా, సరా, జూడీ, బతుల్, లానాల మధ్య సమానంగా పంచాలి. నా పూసల పెట్టె ఇకపై పూర్తిగా అహ్మద్, రాహల సొంతం. నాకు నెలవారీ అలవెన్సుగా వచ్చే 50 షెకెల్స్ (ఒక షెకెల్ 22 రూపాయిలకు సమానం) సగం రాహాకు, సగం అహ్మద్‌కు ఇవ్వండి. నా కథలు, నోట్ పుస్తకాలు రాహావి. నా బొమ్మలు బతూల్‌వి. మరోటి, మా అన్న అహ్మద్‌ను గదమాయించొద్దు. ఈ కోరికలు నెరవేర్చండి'...



● రాషా

రాషా రాసిన ఈ వీలునామాను ఆమె మేనమామ అసిమ్ అలనబి లోకానికి చూపించాడు. రాషా ఎందుకనో తాను మరణించి తన సోదరుడు బతుకుతాడని ఆశించింది. ఆమె సోదరుడు అహ్మద్ గడుగ్గాయి. అల్లరి చేసినా అందరూ వాణ్ణి ప్రేమించేవారట. గదమాయిస్తూనే దగ్గరికి తీసుకునేవారట. కాని ఆమెతో పాటు ఆ ముద్దుల సోదరుడు కూడా మరణించాడు. గాజాలో రోజూ వందలాది మంది పిల్లలు చనిపోతున్నారు. గాజాలో పిల్లల గుండెల్లో ఎన్ని మూగబాధలు చెలరేగుతున్నాయో దూరంగా నిశ్చింతగా ఉంటూ తమ పిల్లలకు గోరుముద్దలు తినిపిస్తున్న తల్లిదండ్రులకు తెలియకపోవచ్చు.

ఏ యుద్ధమైనా, ఎటువంటి ద్వేషమైనా, ఏ విషబీజాలైనా, ఎటువంటి వివక్ష అయినా అంతిమంగా ముందు పిల్లల్ని బాధిస్తుంది. పిల్లల్లో ఉండే కరుణను పెద్దలు ఎప్పటికైనా అందుకోగలరా?

● మన(సు)లో మాట

జీవితాన్నే మార్చేసిన ఒక లిఫ్ట్ ఇన్సిడెంట్

నా వయసు 24 సంవత్సరాలు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ని. నా పనిలో బాగా రాణిస్తున్న తరుణంలో ఒకరోజు లిఫ్ట్‌లో 15 నిమిషాలు ఒక్కదాన్ని స్ట్రక్ అయ్యాను. అపుడు నాకు విపరీతంగా చెమటలు పట్టి, గుండె ఆగిపోతుందేమో అన్నంత వేగంగా కొట్టుకుని, ఒళ్ళంతా చల్లబడి, ఊపిరి ఆడనంత పరిస్థితి. ఆ సమయంలో ఇక చనిపోతానేమో అనేంత భయం వేసింది. ఇది జరిగి ఒక సంవత్సరం అయినప్పటికీ, దీని తర్వాత నేను లిఫ్ట్ ఎక్కడం మానేసి మెట్లే ఎక్కడం కాకుండా, ఫ్లైట్ ట్రావెల్‌ని కూడా అవాయిడ్ చేస్తున్నాను. మరల అలాంటి ఎటాక్ వస్తుందేమో అన్న భయం ఎప్పుడూ వెంటాడుతూనే ఉంది. అనేక సార్లు వచ్చిన ప్రమోషన్ అవకాశాన్ని కూడా ఈ ట్రావెల్ ఫోబియా వల్ల వదులుకున్నాను. నాకు సహాయం చేయండి.

– నందిని, కాకినాడ



నందినీగారూ! మీకున్న ఈ సమస్యను ప్యానిక్ ఎటాక్ అంటారు. ఇటువంటి సమస్య తరచూ వస్తున్నా లేదా వస్తాయనే భయంతో మీరు లిఫ్ట్, ఫ్లైట్ వంటివి అవాయిడ్ చేస్తుండటాన్ని ప్యానిక్ డిజార్డర్ అంటారు. ఇది చాలా సాధారణ మానసిక కండిషన్. కొంతమంది బాగా జనం ఉన్న ప్రదేశాలలో మరికొంత మంది తలుపులు అన్ని మూసేసిన గదిలో ఉన్నా ఇలా అనేక సందర్భాల్లో ప్యానిక్ అటాక్ రావచ్చు. వీటిని నిర్లక్ష్యం చేసినట్లయితే అకారణంగా కూడా ఈ అటాక్ వచ్చే అవకాశం ఉంది. ప్యానిక్ అటాక్‌ని ట్రీట్ చేయడానికి 'కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ' 'మైండ్‌ఫుల్‌నెస్ ట్రెయినింగ్' 'రిలాక్సేషన్ ఎక్సర్‌సైజెస్'తో పాటు కొన్ని రకాల మంచి మందుల ద్వారా చికిత్స చేయవచ్చు. మీ జీవితంలో ఇబ్బంది వల్ల మీరు ఎంతో కోల్పోతున్నట్లు తెలుస్తుంది. కనుక మీరు తొందరలో మంచి మానసిక వైద్యుణ్ణి కలిసి దీని నుండి విముక్తి పొందాలని, మీ పూర్తి సామర్థ్యాన్ని తిరిగి సాధించాలని ఆశిస్తున్నాను.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● ఫీలింగ్

చూతము రారండీ



● మూర్తి, సుధామూర్తి

వయసుతో సంబంధం లేకుండా మహిళల్లో పెద్దరికం ఉట్టిపడుతూ ఉంటుంది. చిన్నవాళ్ళయినా, పెద్దవాళ్ళయినా పెద్దరికం అన్నది మహిళలకు ఒక సొగసు. మళ్లీ మగవాళ్ల అలాక్కాదు. వాళ్లకెంత వయసు వచ్చినా కూడా మాటల్లో, చేతల్లో చిన్నవాళ్లే... మహిళలతో పోలిస్తే'!

సుధామూర్తి వయసు 74. మూర్తి గారి వయసు 78. ఆమె ఆగస్టు 19 న పుడితే, ఆయన ఆగస్టు 20 న జన్మించారు. తేదీలను బట్టి చూసినా సుధ ఆయన కన్నా ఒకరోజు 'పెద్దరికం' ఉన్నవారు. (తమాషాకు లెండి).

సరే, సంగతి ఏమిటంటే... ఈ దంపతులిద్దరూ 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో'కు ఆహ్వానం వస్తే వెళ్లారు. సాధారణంగా కపిల్ బాలీవుడ్ సెలబ్రిటీలను తన టాక్ షో కు పిలుస్తుంటారు. అందుకు భిన్నంగా ఈసారి ఈ బిజినెస్ దిగ్గజ దంపతుల్ని ఒప్పించి రప్పించారు. వారితో టాక్ షో సరదాగా నడిచింది. భర్త గురించి భార్యను, భార్య గురించి భర్తను కొన్ని ప్రశ్నలు అడిగారు యాక్టర్ కమ్ కమెడియన్ కపిల్ శర్మ.

వాటిల్లో ఒక ప్రశ్న : 'మొదటిసారి సుధాజీ మీ ఇంటికి వచ్చినప్పుడు మీకెలా అనిపించింది?' అని అడిగారు కపిల్.

దానికి మూర్తి గారు చాలా గంభీరంగా, నిజాయితీగా సమాధానం ఇచ్చారు.

'ఆ ఫీలింగ్ ఎలా ఉందంటే.. ఒక స్వచ్ఛమైన గాలి పరిమళం నా శ్వాసలోనికి వెళ్లినట్లుగా...' అన్నారు.

ఆ మాటకు వెంటనే సుధామూర్తి... 'అప్పుడు ఆయన వయసులో ఉన్నారు కదా' అన్నారు జోకింగ్‌గా. దెబ్బకు ఆడియెన్స్ ఘొల్లుమన్నారు.

నిజానికి సుధామూర్తి ఉద్దేశ్యం ఆడియెన్స్‌ని నవ్వించడం కాదు, భర్తలోని కవితాత్మక భావోద్వేగాన్ని కాస్త నెమ్మది పరచటం. పైగా అంతమంది ఎదుట భర్త తనను అంతగా 'అడ్మైర్' చెయ్యటంతో ఆమెలోని పెద్దరికం మధ్యలోనే కల్పించుకుని ఆయన్ని ఆపవలసి వచ్చినట్లుంది. ఆపకపోతే... ఇంకా ఏం చెబుతారో అని. అసలే వాళ్ళది లవ్ మ్యారేజ్.

ఈ నెల 9న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అయ్యే 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో' ఎపిసోడ్‌లో మూర్తి గారి ఈ అమాయకత్వాన్ని, సుధామూర్తి పెద్దరికాన్ని కనులారా వీక్షించవచ్చు.

● పేరెంటింగ్

డాటర్ ఆఫ్ ఆలియా





● కూతురు రాహాతో ఆలియా భట్

'ఆలియా భట్ నటి మాత్రమే కాదు, ఎంటర్‌ప్రెన్యూర్ కూడా'... ఈ వాక్యానికి కొనసాగింపుగా 'చక్కని స్టోరీ టెల్లర్' అనే ప్రశంసను కూడా చేర్చవచ్చు. ఎందుకంటే ఆలియా ప్రతి రాత్రి తన కూతురు రాహాకు ఏదో ఒక పిల్లల పుస్తకం చదివి వినిపిస్తుంది.

రాహా 'ఆహా' అంటూ వింటుంది.

'తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పుస్తకాలు చదవడం అనేది వారి భవిష్యత్‌కు పెట్టుబడి పెట్టడంలాంటిది' అంటుది ఆలియాభట్.

'ఎడ్-ఏ-మమ్మా' అనే చిల్డ్రన్ బ్రాండ్ (ప్లేవేర్, స్టోరీ బుక్స్, టాయ్స్ అండ్ మోర్) ఓనర్ అయినా ఆలియా తన బ్రాండ్‌లో కొత్త చిల్డ్రన్ బుక్ సిరీస్‌ను లాంచ్ చేసింది.

'పిల్లల కోసం తల్లులు స్టోరీ టెల్లింగ్ సెషన్‌లు నిర్వహించడం అనేది మంచి విధానం' అంటున్నారు మానసిక నిపుణులు.

'బెడ్ మీద పిల్లలకు పుస్తకాలు చదివి వినిపించడం అనేది వారి మానసిక వికాసంపై సానుకూల ప్రభావం చూపుతుంది. ఉచ్చారణలను, కొత్త పదాలను నేర్చుకుంటారు. పిల్లలకు కొత్త విషయాలు తెలియజేయడానికి ఇదొక అద్భుత సాధనం. ఇది పిల్లలతో తల్లిదండ్రుల భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేస్తుంది. పిల్లల ఏకాగ్రతను పెంచుతుంది. రోజువారీ షెడ్యూల్లో ప్రతి రాత్రి పుస్తక పఠనాన్ని తప్పనిసరి చేయడం పిల్లల్లో క్రమశిక్షణను పెంచుతుంది' అంటుంది కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ శృతి వస.

● వెడ్డింగ్

త్రినేత్ర పర్వం

తండ్రి ఫారెస్ట్ ఆఫీసర్ కావడంతో సౌత్ ఇండియాలో ఎన్నో ప్రాంతాలలో చదువుకుంది అంకిత అస్థాన. ముఖ్యంగా ఎన్నో అడవుల అందాలను చూసే అదృష్టం దక్కింది. పండగలు, ఫ్యామిలీ ట్రిప్‌లలో తండ్రి ఫొటోలు తీసేవాడు. వాటిని చూసి ఎంతో సంతోషించేది. ఆ సంతోషంలో నుంచే అంకితకు ఫొటోగ్రఫీపై ఆసక్తి మొదలైంది.

'సాహసం, సృజనతో కూడిన బాల్యం నాది' అంటున్న అంకిత అడవిలో ట్రెక్కింగ్ చేస్తున్నప్పుడు తొలి ఫొటో తీసింది. ఆ ఫొటో ఇచ్చిన ఉత్సాహం ఇంతా అంతా కాదు.

భౌతిక, గణితశాస్త్రాలను ఇష్టపడే అంకిత ఆర్కిటెక్చర్‌పై ఆసక్తి పెంచుకుంది. ఆ సబ్జెక్ట్‌ను లోతుగా అధ్యయనం చేసింది.

'ఆర్కిటెక్చర్ నాలోని సృజనాత్మకతను, ఫొటోగ్రఫీ పట్ల ప్రేమను మేల్కొల్పింది. నేను ప్రపంచాన్ని చూసే విధానాన్ని మార్చేసింది' అంటున్న అంకిత 'ఫైర్‌ఫైల్స్ అండ్ షట్టర్‌బగ్స్' పేరుతో బ్లాగ్‌ను ప్రారంభించింది. ఫొటోగ్రఫీ ద్వారా ఎన్నో కథలు చెప్పడం మొదలుపెట్టింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందితో కనెక్ట్ అయ్యే అవకాశం వచ్చింది,

ఆర్కిటెక్చర్ చదువుతున్న రోజుల్లో అంకిత అస్థానా మొదటిసారిగా డిజిటల్ కెమెరాను కొనుగోలు చేసింది.

ఎంబీఏ చేయడానికి ఐఐఎం, షిల్లాంగ్‌లో సీటు సంపాదించినప్పటికీ, ఫొటోగ్రఫీపై ఇష్టంతో అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ)లో చేరి ఫొటోగ్రఫీలో మాస్టర్స్ చేసింది.

ముంబైకి షిఫ్ట్ అయిన తరువాత ఫ్రీలాన్స్ ప్రాజెక్ట్‌లు చేయడం మొదలుపెట్టింది. ఒక సంచార జాతి తెగపై చేసిన డాక్యుమెంటరీకి ఎంతో పేరు వచ్చింది.

'ఫొటోగ్రఫీ అనేది ముఖాలను ఫొటోలలో చూపించడం కాదు. ఇదొక శక్తిమంతమైన మాధ్యమం. ప్రజల జీవితాలను కళ్లకు కట్టే సాధనం' అంటున్న అంకిత 'వెడ్డింగ్‌నామా' స్టార్టప్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. ప్రీ వెడ్డింగ్ షూట్స్, పోర్ట్‌ఫోలియో షూట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఎంగేజ్‌మెంట్ షూట్స్‌తో ఈ స్టార్టప్ దేశ, విదేశాలలో పేరు తెచ్చుకుంది.

'వెడ్డింగ్ ఫొటోగ్రఫీ'లో ఎక్కువ మంది పురుష ఫొటోగ్రాఫర్‌లే కనిపిస్తారు. తన విజయం ద్వారా ఎంతోమంది మహిళలు వెడ్డింగ్ ఫొటోగ్రఫీలోకి రావడానికి అవసరమైన స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది అంకిత అస్థాన.



● అంకిత అస్థాన

● వెల్డింగ్

ఫైర్

కన్నగి రాజేంద్రన్ వెల్డర్‌గా ఉద్యోగంలో చేరినప్పుడు 'వెల్‌డన్' అని ఎవరూ అనలేదు.

'వెల్డింగ్ పనిలోకి వెళుతున్నావా! అది మామూలు పని అనుకున్నావా... మంటలతో చెలగాటం' అని మాత్రమే అన్నారు. 'ఫైర్' ఉన్న అమ్మాయికి ఫైర్‌తో భయం ఏమిటీ!

అలాంటి ఒక ఫైర్ కన్నగి.

'వెల్డింగ్ ఫీల్డ్‌లో రావడానికి భయం అక్కర్లేదు. కాస్త ధైర్యం చాలు' అంటుంది...

పురుషుల డొమైన్‌గా భావించే వెల్డింగ్ ప్రపంచంలోకి మహిళలు అడుగు పెట్టడమే కాదు, తమ సత్తా చాటుతున్నారు. దీంతో తమిళనాడులోని కర్మాగారాలు వెల్డింగ్‌కు సంబంధించి మహిళా ఉద్యోగులను నియమించుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి.

ఈ మార్పుకు కారణం కన్నగి రాజేంద్రన్‌లాంటి మహిళలు.

ఆరియలూరుకు చెందిన కన్నగి రాజేంద్రన్ వెల్డింగ్ ఫీల్డ్‌లోకి అడుగు పెట్టినప్పుడు....

'ఇది తప్ప నీకు చేయడానికి మరే పని దొరకలేదా' అన్నట్లుగా మాట్లాడారు.

ఆ మాటలకు కన్నగి వెనకడుగు వేసి ఉంటే ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిని ఇచ్చేది కాదు.

నాలుగు సంవత్సరాలుగా 'ష్వింగ్ సెట్టర్ ఇండియా'లో వెల్డర్‌గా పనిచేస్తున్న కన్నగి 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెల్డింగ్' నిర్వహించిన గ్యాస్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ (జీఎంఎడబ్ల్యు) పోటీలో ఉత్తమ పైప్ వెల్డర్‌గా అవార్డ్ గెలుచుకుంది.

ఈ పోటీలో 45 డిగ్రీల కోణంలో ఉంచిన పైపుపై వెల్డర్‌ల నైపుణ్యాలను పరీక్షిస్తారు. పైప్ చుట్టూ వివిధ స్థానాలలో వెల్డింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ పోటీలో నెగ్గుకు రావడానికి అధునాతన టెక్నిక్, బహుముఖప్రజ్ఞ అవసరం అవుతాయి.

ఆ బహుముఖప్రజ్ఞను సొంతం చేసుకున్న కన్నగి అవలీలగా విజయం సాధించింది.

ఈ పోటీ కోసం కంపెనీలో వివిధ వెల్డింగ్ విభాగాలలో విస్తృతమైన శిక్షణ పొందింది.

ఇంటి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడం వల్లే కన్నగి వెల్డింగ్ ఫీల్డ్‌లోకి వచ్చింది. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. అన్నయ్య డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెల్లి ప్రభుత్వ కళాశాలలో ఇంజనీరింగ్ చేసింది. తిరుచ్చిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో చేరిన కన్నగి 2021లో 'ష్వింగ్ సెట్టర్ ఇండియా'లో ట్రైనీగా ఉద్యోగంలో చేరింది.

'నేను ట్రైనీగా చేరినప్పుడు ఒక్క మహిళ కూడా లేదు. ఎందుకు ఇలా అని అడిగితే అధిక శ్రమతో కూడిన ఈ పనిలోకి మహిళలు ఎందుకు వస్తారు అనే జవాబు వినిపించింది. నేను మాత్రం ఈ పని చేయగలనా అని కాస్త సందేహించాను. అలా భయపడితే ఎలా అని ఆ తరువాత నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను. ఎంతైనా కష్టపడాలి అనుకున్నాను. ఆ కష్టమే ఈ పురుషాధిక్య రంగంలో నన్ను నేను నిరూపించుకోవడానికి ఉపయోగపడింది. రెండు నెలలలోనే నా పనికి ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు రావడం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది' అంటుంది కన్నగి.

కంపెనీ ఫ్యాబ్రికేషన్ విభాగంలో వెల్డర్‌గా చేరినప్పుడు మొదట్లో ఆమె కుటుంబసభ్యులు భయపడ్డారు.

వెల్డింగ్ ఫీల్డ్‌లో జరిగే ప్రమాదాల గురించి ప్రస్తావించారు. వారికి సర్ది చెప్పి ఉద్యోగంలో చేరింది. మొదట్లో చర్మ సమస్యలు, కంటి సమస్యలు వచ్చాయి. సరైన మందులు, భద్రతా చర్యలతో త్వరలోనే వాటి నుంచి బయటపడింది.

'ప్రతి ఉద్యోగంలో కష్టాలు, సవాళ్లు ఉంటాయి. వాటిని అధిగమించినప్పుడే మనల్ని మనం నిరూపించుకోగలం' అంటున్న కన్నగి రాజేంద్రన్ వెల్డింగ్ ఫీల్డ్‌లోకి రావాలనుకుంటున్న యువతులకు ధైర్యాన్ని ఇస్తోంది.

'చేయగలనా! అనే సందేహం దగ్గర ఉండిపోతే అక్కడే ఆగిపోతాం. యస్... నేను చేయగలను అనుకుంటే ముందుకు వెళతాం. నేను సాధించిన విజయం సంతోషాన్ని ఇవ్వడమే కాదు ఎంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. రాబోయే కాలంలో మరింత మంది మహిళలు ఈ రంగంలోకి రావాలి. అలా వచ్చినప్పుడు పురుషాధిక్య రంగాల్లో మహిళలు కూడా రాణించగలరు. తాము పురుషులతో సమానమని వారు తెలుసుకుంటారు' అంటుంది కన్నగి రాజేంద్రన్.



● కన్నగి రాజేంద్రన్








అరోనియన్‌తో అర్జున్ గేమ్ 'డ్రా'

చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. అమెరికా గ్రాండ్‌మాస్టర్ అరోనియన్‌తో చెన్నైలో బుధవారం జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను అర్జున్ 36 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఇదే వేదికపై జరుగుతున్న చెన్నై చాలెంజర్స్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక రెండో ఓటమిని చవిచూసింది. లియోన్ మెండోకాతో జరిగిన రెండో రౌండ్ గేమ్‌లో హారిక 43 ఎత్తుల్లో ఓడింది.

సిడ్నీ థండర్ టి20 జట్టు కెప్టెన్‌గా వార్నర్



బిగ్‌బాష్ లీగ్ టి20 క్రికెట్ టోర్నీలో సిడ్నీ థండర్ జట్టుకు ఆస్ట్రేలియా డాషింగ్ ప్లేయర్ డేవిడ్ వార్నర్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఆస్ట్రేలియాలో ఎనిమిది జట్ల మధ్య బిగ్‌బాష్ లీగ్ డిసెంబర్ 15న మొదలవుతుంది. 2018లో చోటు చేసుకున్న బాల్ టాంపరింగ్ వివాదం సందర్భంగా వార్నర్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) జీవితకాలంపాటు కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించకూడదని నిషేధం విధించింది. అయితే సీఏ కోడ్ ఆఫ్ కండక్ట్ కమిషన్ విచారణ తర్వాత ఇటీవల వార్నర్‌పై కెప్టెన్సీ నిషేధం ఎత్తి వేసింది.



సిరాజ్

కోట్లాభిషేకమే!

- ఐపీఎల్ వేలంలో భారత క్రికెటర్లపై ఈసారీ కాసుల వర్షం ఖాయం
- 2 కోట్ల రూపాయల కనీస ధరతో బరిలో 23 మంది భారత క్రికెటర్లు
- ఇటలీ నుంచి తొలిసారి ఒకరు వేలంలోకి

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలానికి సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఆసక్తికర విషయాలు వెల్లడవుతున్నాయి. ఈ నెల 24, 25న సౌదీ అరేబియాలోని జిద్దా నగరం వేదికగా ఐపీఎల్–2025 వేలం జరగనుండగా... ఇందులో భారత్ నుంచి 23 మంది ప్లేయర్లు రూ. 2 కోట్ల కనీస ధరతో పాల్గొననున్నారు. రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ వంటి స్టార్ ఆటగాళ్లతో పాటు... చాలా రోజుల నుంచి జాతీయ జట్టుకు దూరమైన ఉమేశ్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్ వంటి వాళ్లు ఈ జాబితాలో ఉన్నారు. ముంబై ఇండియన్స్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా, వెంకటేశ్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ కూడా తమ కనీస ధరను రెండు కోట్లుగా నమోదు చేసుకోవడం విశేషం. శస్త్రచికిత్స అనంతరం తిరిగి కోలుకుంటున్న సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ, హైదరాబాద్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్, అర్‌్షదీప్ సింగ్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, హర్షల్ పటేల్, దీపక్ చహర్, శార్దుల్ ఠాకూర్, హర్షల్ పటేల్, ప్రసిధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, అశ్విన్, యుజువేంద్ర చహల్ కూడా ఉన్నారు. మూడేళ్ల కోసం చేపడుతున్న ఈ మెగా వేలంలో మొత్తం 1574 మంది ప్లేయర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కనీస ధర నిర్ణయించుకునే అవకాశం ఆటగాళ్లదే కాగా... ఒక్కో జట్టు గరిష్ఠంగా 25 మంది ప్లేయర్లను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.



పంత్



రాహుల్



శ్రేయస్

అండర్సన్ తొలిసారి...

టెస్టు క్రికెట్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఇంగ్లండ్ టెస్టు జట్టు సారథి బెన్ స్టోక్స్ ఈసారి ఐపీఎల్ వేలానికి దూరమయ్యాడు. కాగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్ తొలిసారి ఐపీఎల్ వేలం కోసం తన పేరు నమోదు చేసుకోవడం గమనార్హం. 42 ఏళ్ల అండర్సన్ ఈ ఏడాదే టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన పేసర్‌గా రికార్డుల్లోకి ఎక్కిన అండర్సన్... టి20 మ్యాచ్ ఆడి ఇప్పటికే పదేళ్లు దాటిపోయింది. అండర్సన్ చివరిసారిగా 2014లో ఈ ఫార్మాట్‌లో మ్యాచ్ ఆడాడు. అండర్సన్ తన కనీస ధరను రూ. 1 కోటీ 25 లక్షలుగా నిర్ణయించుకున్నాడు. గత వేలంలో అత్యధిక ధర (రూ. 24 కోట్ల 50 లక్షలు) పలికిన ప్లేయర్‌గా ఘనత సాధించిన ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌తో పాటు, మినీ వేలంలో అమ్ముడుపోని ఆస్ట్రేలియా ఆఫ్ స్పిన్నర్ నాథన్ లియాన్ రూ. 2 కోట్ల ప్రాథమిక ధరలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. 2023లో చివరిసారి ఐపీఎల్లో పాల్గొన్న ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ కూడా ఇదే ధరతో వేలంలో పాల్గొననున్నాడు.

రూ. 75 లక్షలతో సర్ఫరాజ్

గత వేలంలో అమ్ముడిపోని ఆటగాళ్ల జాబితాలో మిగిలిపోయిన ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు... పేలవ ఫామ్‌తో ముంబై రంజీ జట్టులో చోటు కోల్పోయిన పృథ్వీ షా ఈసారి వేలంలో రూ. 75 లక్షల ప్రాథమిక ధరతో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వేలంలో పేర్లు నమోదు చేసుకున్న వారిలో 1165 మంది భారతీయ ప్లేయర్లు, 409 మంది విదేశీయులు ఉన్నారు. దక్షిణాఫ్రికా నుంచి అత్యధికంగా 91 మంది ప్లేయర్లు పోటీలో ఉండగా... ఆస్ట్రేలియా నుంచి 76 మంది, ఇంగ్లండ్ నుంచి 52 మంది, న్యూజిలాండ్ నుంచి 39 మంది, వెస్టిండీస్ నుంచి 33 మంది ప్లేయర్లు వేలంలో పాల్గొంటున్నారు. ఇటలీ, యూఏఈ నుంచి ఒక్కో ప్లేయర్ తమ పేరు నమోదు చేసుకున్నారు.

ఇటలీ నుంచి తొలి ఎంట్రీ...

ఇటలీ పేసర్ థామస్ డ్రాకా ఐపీఎల్ వేలంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనుండగా... ఈ ఏడాది టి20 ప్రపంచకప్ సందర్భంగా ఆకట్టుకున్న భారత సంతతికి చెందిన అమెరికా బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్‌పై అందరి దృష్టి నిలవనుంది. ఐపీఎల్ వేలంలో పేరు నమోదు చేసుకున్న తొలి ఇటలీ ప్లేయర్‌గా డ్రాకా నిలిచాడు. ఇటలీ తరఫున ఇప్పటి వరకు నాలుగు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన 24 ఏళ్ల డ్రాకా... గ్లోబల్ టి20 కెనడా టోర్నీ ద్వారా వెలుగులోకి వచ్చాడు. ఆ టోర్నీలో 11 వికెట్లు పడగొట్టిన డ్రాకా... ఆల్‌రౌండర్ల జాబితాలో ప్రాథమిక ధర రూ. 30 లక్షలతో ఐపీఎల్ వేలంలో తన పేరు నమోదు చేసుకున్నాడు. ఇటీవల ఐఎల్ టి20 లీగ్‌లో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి చెందిన ముంబై ఎమిరేట్స్ జట్టుకు డ్రాకా ఎంపికయ్యాడు. ఇక అండర్–19 స్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఆ తర్వాత మెరుగైన ఉపాధి కోసం అమెరికా వెళ్లి స్థిరపడి అక్కడ అటు ఉద్యోగంతో పాటు ఇటు క్రికెట్‌లో రాణిస్తున్న నేత్రావల్కర్ కూడా రూ. 30 లక్షల ప్రాథమిక ధరతో వేలానికి రానున్నాడు.

రిత్విక్ జోడీ సంచలనం

టాప్ సీడ్ జంటపై విజయంతో సెమీఫైనల్లోకి



మెట్జ్ (ఫ్రాన్స్): మోజెల్లి ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ (భారత్)–ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్) జోడీ సంచలనం సృష్టించింది. టాప్ సీడ్, అపార అనుభవం ఉన్న సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను బోల్తా కొట్టించింది. 91 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో రిత్విక్–కబ్రాల్ ద్వయం 7–6 (7/1), 6–4తో సాంటియాగో–వాసెలిన్ జంటను ఓడించింది. 23 ఏళ్ల రిత్విక్, 27 ఏళ్ల కబ్రాల్ ఈ మ్యాచ్‌లో ఆరు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. 40 ఏళ్ల వాసెలిన్ తన సుదీర్ఘ కెరీర్‌లో 28 ఏటీపీ టూర్ డబుల్స్ టైటిల్స్ నెగ్గి, 18 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు. వాసెలిన్–సాంటియాగో ద్వయం 2023లో ఏకంగా ఐదు ఏటీపీ టూర్ డబుల్స్ టైటిల్స్ సాధించింది. 41 ఏళ్ల సాంటియాగో తన కెరీర్‌లో 23 ఏటీపీ టూర్ డబుల్స్ టైటిల్స్ సాధించి, 17 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు. వాస్తవానికి ఈ టోర్నీలో భారత్‌కే చెందిన అర్జున్ ఖడేతో రిత్విక్ జతగా పోటీ పడాల్సింది. అయితే గతవారం బ్రాటిస్లావాలో జరిగిన స్లొవాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీ సందర్భంగా అర్జున్‌కు గాయమైంది. దాంతో అర్జున్ మోజెల్లి ఓపెన్ నుంచి వైదొలగగా... పోర్చుగల్ ప్లేయర్ కబ్రాల్‌తో కలిసి రిత్విక్ ఈ టోర్నీలో ఆడుతున్నాడు. కెరీర్‌లో ఐదో ఏటీపీ–250 టోర్నీలో ఆడుతున్న రిత్విక్ గత నెలలో కజకిస్తాన్‌లో జరిగిన అల్మాటీ ఓపెన్‌లో అర్జున్ ఖడేతో కలిసి కెరీర్‌లో తొలిసారి ఏటీపీ టూర్ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. తాజా విజయంతో రిత్విక్ రెండోసారి ఏటీపీ–250 టోర్నీలో సెమీఫైనల్ దశకు చేరుకున్నాడు.

టాప్–20 నుంచి కోహ్లి, రోహిత్ అవుట్



దుబాయ్: న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో భారత స్టార్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఘోరంగా విఫలం కావడంతో ఆ ప్రభావం వారిద్దరి ర్యాంకింగ్స్‌పై కూడా పడింది. బుధవారం విడుదలైన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కోహ్లి, రోహిత్ శర్మ టాప్–20లో చోటు కోల్పోయారు. కోహ్లి ఎనిమిది స్థానాలు దిగజారి 22వ ర్యాంక్‌లో, రోహిత్ రెండు స్థానాలు పడిపోయి 26వ ర్యాంక్‌లో నిలిచారు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో కోహ్లి 93 పరుగులు, రోహిత్ 91 పరుగులు సాధించడం గమనార్హం. మరోవైపు భారత్‌కే చెందిన యశస్వి జైస్వాల్ ఒక స్థానం పడిపోయి నాలుగో ర్యాంక్‌లో నిలువగా... రిషభ్ పంత్ ఐదు స్థానాలు మెరుగై ఆరో ర్యాంక్‌లోకి వచ్చాడు. శుబ్‌మన్ గిల్ నాలుగు స్థానాలు ఎగబాకి 16వ ర్యాంక్‌లో నిలిచాడు.

మహారాష్ట్ర 30 గుజరాత్ 0

చెన్నై: జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో బుధవారం మహారాష్ట్ర జట్టు గోల్స్ వర్షం కురిపించింది. గుజరాత్ జట్టుతో జరిగిన గ్రూప్ 'జి' లీగ్ మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 30–0 గోల్స్ తేడాతో గుజరాత్ జట్టును చిత్తుగా ఓడించింది. మహారాష్ట్ర తరఫున అజింక్య జాదవ్ (40వ, 42వ, 53వ, 53, 59వ నిమిషాల్లో), ఆదిత్య లలాగే (5వ, 22వ, 24వ, 25వ, 29వ నిమిషాల్లో) ఐదు గోల్స్ చొప్పున చేశారు. వెంకటేశ్ దేవ్‌కర్ (7వ, 30వ, 38వ నిమిషాల్లో), తలేబ్ షా (12వ, 23వ, 45వ నిమిషాల్లో), అనికేత్ గౌరవ్ (39వ, 54వ, 55వ నిమిషాల్లో) మూడు గోల్స్ చొప్పున సాధించారు. ప్రతాప్ షిండే (5వ, 30వ నిమిషాల్లో), వెంకటేశ్ కెంచే (13వ, 21వ నిమిషాల్లో), కెప్టెన్ దేవిందర్ సునీల్ వాల్మీకి (19వ, 33వ నిమిషాల్లో), గోవింద్ నాగ్ (28వ, 43వ నిమిషాల్లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. ఆకీబ్ రహీమ్ (3వ ని.లో), రజత్ శర్మ (49వ ని.లో), దర్శన్ (57వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

ది ప్యారడైజ్



నాని

'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'ది ప్యారడైజ్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు వెల్లడించి, టైటిల్ లోగోను 'ఎక్స్'లో షేర్ చేశారు నాని. పీరియాడికల్ పవర్‌ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపుదిద్దుకోనుందని, ఇందులో సికింద్రాబాద్ కుర్రాడిగా నాని నటిస్తారని టాక్. హీరోయిన్‌గా జాన్వీకపూర్ లేదా శ్రద్ధాకపూర్ నటిస్తారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు నాని 'హిట్ 3' చిత్రం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రాజస్తాన్‌లో జరుగుతోంది. 2025 మే 1న 'హిట్ 3' రిలీజ్ కానుంది.

భావోద్వేగాలు మనసుని హత్తుకున్నాయి


- నితిన్



శివ కార్తికేయన్, సాయిపల్లవి, రాజ్‌కుమార్, నితిన్, సుధాకర్ రెడ్డి, సునీల్ నారంగ్

'అమరన్'లాంటి ఒక దేశభక్తి సినిమాలో ప్రేమ, కుటుంబం వంటి అంశాలని కలపడం అంత సులభం కాదు. డైరెక్టర్ రాజ్ కుమార్ చాలా అద్భుతంగా ఈ సినిమా తీశారు. క్లైమాక్స్‌లో వచ్చే భావోద్వేగ సన్నివేశాలు నిజంగా మనసుని హత్తుకున్నాయి'' అని హీరో నితిన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన చిత్రం 'అమరన్'. కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ కలిసి నిర్మించిన ఈ మూవీ అక్టోబర్ 31న విడుదలైంది. హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి, సోదరి నిఖిత రెడ్డి శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్‌పై తెలుగులో విడుదల చేశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'అమరన్' సక్సెస్ మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన నితిన్ మాట్లాడుతూ–''ఈ దీపావళికి మూడు సినిమాలు(అమరన్, లక్కీ భాస్కర్, క) వచ్చాయి. అన్ని సినిమాల్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని చెప్పారు. శివ కార్తికేయన్ మాట్లాడుతూ–''తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ మంచి కథలను ఆదరిస్తారు. ఆ విషయం మా 'అమరన్' తో మరోసారి రుజువయింది'' అన్నారు. ''ఈ చిత్రంలో నేను చేసిన ఇందు పాత్రకి గొప్ప స్పందన రావడం చాలా ఆనందంగా ఉంది'' అని సాయి పల్లవి తెలిపారు. ''అమరన్'ని తెలుగులో గొప్పగా ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని రాజ్‌కుమార్ పెరియసామి పేర్కొన్నారు. 'అమరన్'కి నాలుగు జాతీయ అవార్డులు వస్తాయని ఆశిస్తున్నాను. ఈ సినిమా తెలుగులో రూ.20 కోట్లు వసూలు చేయడం ఆనందంగా ఉంది'' అని నిర్మాత సుధాకర్ రెడ్డి చెప్పారు. డైరెక్టర్ వెంకీ కుడుముల, లిరిక్ రైటర్ కృష్ణ కాంత్, డైలాగ్ రైటర్ హనుమాన్ చౌదరి మాట్లాడారు.


దీపావళికి రామాయణ



సాయిపల్లవి, రణ్‌బీర్ కపూర్

భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా హిందీలో తెరకెక్కుతున్న కొత్త సినిమాకు 'రామాయణ' అనే టైటిల్ ఖరారు చేశారు. నితేష్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందని, తొలిభాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి రిలీజ్ చేస్తామని మేకర్స్ వెల్లడించారు. అయితే ఈ సినిమా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు మాత్రం వెల్లడించలేదు. అయితే 'రామాయణ' లో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్, రావణుడిగా యశ్ నటిస్తున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ మూవీ చిత్రీకరణ మొదలైంది. కైకేయిగా లారా దత్తా, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు..'రామాయణ' సినిమా తెలుగు వెర్షన్‌కు త్రివిక్రమ్ డైలాగ్స్ రాస్తున్నారని, ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు యశ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఎవరు తాతా ఇతను!



సత్యరాజ్

సత్యరాజ్, వశిష్ఠ ఎన్. సింహా, సాంచి రాయ్, 'సత్యం' రాజేష్ లీడ్ రోల్స్‌లో నటించిన సినిమా 'త్రిబాణధారి బార్బరిక్'. మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించారు. ఈ సినిమా మోషన్ పోస్టర్ వీడియోను రిలీజ్ చేసింది చిత్రయూనిట్. 'తాతా.. ఎవరు తాతా ఇతను', 'ప్రపంచం గుర్తించని గొప్ప యోధుడమ్మా..', 'భీష్ముడా తాతా.. కాదమ్మ...', 'మాధవ.. వెయ్యి ఏనుగుల బలశాలి భీముడికి మనవణ్ణి, ఘటోత్కచుడికి కొడుకుని' వంటి డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: కుశేందర్ రమేశ్ రెడ్డి, సంగీతం: ఇన్ఫ్యూషన్ బాండ్.

యాక్షన్ డ్రామా



నారా రోహిత్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్నారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతీలాల్ గడ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి నారా రోహిత్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్‌ను రివీల్ చేశారు మేకర్స్. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కలిసి నటిస్తుండటం సినీ అభిమానులకు కన్నుల పండగలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: హరి కె. వేదాంతం, సంగీతం: శ్రీ చరణ్ పాకాల.

అందరూ నవ్వుకునేలా ఉంటుంది

- చేతన్ కృష్ణ



''తండ్రి కోసం కొడుకు, కొడుకు కోసం తండ్రి ఎక్కడిదాకా అయినా వెళ్తారు? అనే కథకి వాణిజ్య అంశాలు జోడించి తీసిన చిత్రమే 'ధూం ధాం'. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన మా సినిమా అన్నివర్గాల ప్రేక్షకులు నవ్వుకునేలా ఉంటుంది'' అని హీరో చేతన్ కృష్ణ అన్నారు. సాయి కిషోర్ మచ్చా దర్శకత్వంలో చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జోడీగా నటించిన చిత్రం 'ధూం ధాం'. ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా రేపు(శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా చేతన్ కృష్ణ మాట్లాడుతూ–''నాకు నటనంటే ప్యాషన్. 'ఫస్ట్ ర్యాంక్ రాజు, బీచ్ రోడ్ చేతన్, రోజులు మారాయి, గల్ఫ్' వంటి సినిమాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వచ్చింది. ఫ్యామిలీ అంతా ఎంజాయ్ చేసేలా ఓ కథ రాయమని గోపీ మోహన్‌గారికి చెప్పడంతో 'ధూం ధాం' రాశారు. ఈ కథని సాయి కిషోర్ గారు అద్భుతంగా తెరకెక్కించారు. 'వెన్నెల' కిషోర్‌గారి టైమింగ్ పట్టుకోవడం నాకు కష్టమైంది. హెబ్బా పటేల్ యాక్షన్ అనగానే తన పాత్రలోకి మారిపోతుంది. నేను హీరోగా మంచి స్థాయిలో ఉండాలని నాన్నగారు(నిర్మాత ఎంఎస్ రామ్‌కుమార్) ఈ సినిమాను గ్రాండ్‌గా నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లు మా సినిమా రిలీజ్ చేస్తుండటం.., గోపీ సుందర్‌గారి మ్యూజిక్.. మా చిత్రానికి అదనపు బలాలు'' అని తెలిపారు.

ప్రేక్షకుల స్పందనే ఆక్సిజన్

- ఆదిత్య ఓం



ఆదిత్య ఓం, శివ కంఠమనేని

''ఆదిపర్వం' సినిమాలో హనుమంతు అనే పాత్ర చేశాను. ఈ చిత్రంలో ప్రేక్షకులు థ్రిల్ అయ్యేలా యాక్షన్, భక్తి అంశాలు ఉంటాయి. ప్రతి నటుడికి, ఫిలిం మేకర్‌కు ప్రేక్షకుల నుంచి వచ్చే స్పందనే ఆక్సిజన్ లాంటిది. మా 'ఆదిపర్వం'ని థియేటర్స్‌లో చూసి ఆ ఆక్సిజన్‌ని మా యూనిట్‌కి అందిస్తారని కోరుకుంటున్నాను'' అని నటుడు ఆదిత్య ఓం తెలిపారు. మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని, ఆదిత్య ఓం ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఆదిపర్వం'. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక్షా ఆర్ట్స్, ఏఐ(అమెరికా ఇండియా) ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులను అలరించే భక్తి, యాక్షన్ అంశాలతో తీసిన 'ఆదిపర్వం' హిట్ అవ్వాలి'' అన్నారు. ''తెలుగు, కన్నడలో 500కుపైగా థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం'' అని సంజీవ్ మేగోటి చెప్పారు. ''ఆదిపర్వం'లో క్షేత్రపాలకుడిగా చేశాను'' అన్నారు శివ కంఠమనేని.

దొరకునా ఇటువంటి ప్రేమ!



వర్ధన్ గుర్రాల, హమరేశ్, శాంతి తివారి, నిత్య శ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ట్రెండింగ్ లవ్'. 'దొరకునా ఇటువంటి ప్రేమ' అనేది ఉప శీర్షిక. హరీశ్ నాగరాజు దర్శకత్వంలో సోనూ గుప్తా, రూపేశ్ డి. గోయల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను నటి–నిర్మాత నిహారిక విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఓ షార్ట్‌ఫిల్మ్ కోసం హరీశ్‌తో వర్క్ చేశాను. 'ట్రెండింగ్ లవ్'లో కొన్ని కట్స్ చూశా.. బాగున్నాయి. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''మా చిత్రంలో నటించే వారికి మంచి పేరు వస్తుంది'' అని తెలిపారు హరీశ్ నాగరాజు. ఈ సినిమాకు సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: బ్రహ్మతేజ మరిపూడి.

జితేందర్ రెడ్డి విజయం సాధిస్తుంది

- రాకేష్ వర్రే



రవీందర్ రెడ్డి, విరించి వర్మ, రాకేష్ వర్రే

రాకేష్ వర్రె టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'జితేందర్ రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాకేష్ వర్రె మాట్లాడుతూ– ''జితేందర్ రెడ్డి' సినిమాకు రూ.75తో ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నాం. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''మంచి సినిమాతో వస్తున్నాం.. ఆదరించాలి'' అని తెలిపారు విరించి వర్మ. ''జితేందర్ రెడ్డి జీవితం ఒక చరిత్ర. ఇప్పటికే ఈ సినిమా ప్రీమియర్స్ వేశాం.. చూసిన వాళ్లు భావోద్వేగానికి గురయ్యారు'' అని రవీందర్ రెడ్డి చెప్పారు. పాటల రచయిత రాంబాబు గోశాల మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
901	271
80,378	24,484

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,908	▲ 468
డోజోన్స్	43,593	▲ 1371
ఎఫ్‌టీఎస్ఈ 100	8,167	▽ 6
డాక్స్	19,039	▽ 221
షాంఘై	3,384	▽ 217
నికాయ్	39,480	▲ 1005

అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	78,136	▽ 430
బంగారం (99.5 స్వచ్ఛత)	77,823	▽ 428
వెండి (కేజీ)	92,901	▽ 221


ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.61	110.46
€	యూరో	ఎస్‌బీఐ	89.62	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.27	55.57
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.55	66.32
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.04	23.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.89	12.65

మార్కెట్.. 'ట్రంపె'ట్!

- ఫార్మా, ఐటీ షేర్లకు భారీ డిమాండ్
- సెన్సెక్స్ 901 పాయింట్లు ప్లస్
- 24,500 స్థాయికి చేరువలో నిఫ్టీ

ముంబై: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయంతో బుధవారం దలాల్ స్ట్రీట్ ఒకశాతానికిపైగా లాభపడింది. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 901 పాయింట్లు పెరిగి 80,378 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 271 పాయింట్లు బలపడి 24,484 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన స్టాక్ సూచీలు ట్రంప్ ఆధిక్యంతో పాటు పెరుగుతూ వచ్చాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,094 పాయింట్లు పెరిగి 80,570 వద్ద, నిఫ్టీ 325 పాయింట్లు పెరిగి 24,538 వద్ద గరిష్టాలు తాకాయి. బీఎస్ఈలో చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 2.28%, రెండుశాతం రాణించాయి. రంగాల వారీగా అత్యధికంగా బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 4% లాభపడింది. టెక్ 3%, రియల్టీ 3%, ఇండస్ట్రియల్ 3%, సర్వీసెస్ ఇండెక్సులు 2.50% రాణించాయి.



→ అమెరికాలో అధికారం చేజిక్కించుకున్న రిపబ్లికన్ల పార్టీ 'ట్రంప్ సరిచేస్తారు' నినాదం అక్కడి మార్కెట్లనూ ప్రతిధ్వనించింది. యూఎస్ డోజోన్స్ 3%, ఎస్అండ్‌పీ 2%, నాస్‌డాక్ 2.5% లాభాల్లో ట్రేడవుతున్నాయి. అయితే ట్రంప్ అమెరికా ఫస్ట్ వైఖరి ప్రభావంతో ఆసియా, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. సుంకాల మోత ఖాయమనే అంచనాలతో ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్, థాయ్‌లాండ్, కొరియా సూచీలు 2.5% నుంచి అరశాతం నష్టపోయాయి. అయితే జపాన్, సింగపూర్, తైవాన్ సూచీలు 2% వరకు పెరిగాయి. యూరప్‌లో జర్మనీ డాక్స్, ఫ్రాన్స్ సీఏసీ, బ్రిటన్ ఎఫ్‌టీఎస్ సూచీలు 1% నష్టపోయాయి.

→ ట్రంప్ గెలుపు ఆధిక్యం కొనసాగుతున్న వేళ డాలర్ల రూపంలో ఆదాయాలు ఆర్జించే దేశీయ ఐటీ కంపెనీల షేర్లకు డిమాండ్ లభించింది. టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 4% లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో అత్యధికంగా పెరిగిన షేర్లు ఇవే. పెర్సిస్టెంట్ 6%, ఎల్‌టీఐమైండ్‌ట్రీ 5%, విప్రో షేర్లు 4% చొప్పున పెరిగాయి.

→ సెన్సెక్స్ రెండురోజుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద ఎగసింది. బీఎస్ఈలోని మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.10.47 లక్షల కోట్లు పెరిగి రూ.452 లక్షల కోట్లకు చేరింది.

రూపాయి ఆల్‌టైమ్ కనిష్టం



డాలర్ మారకంలో రూపాయి విలువ బుధవారం 22 పైసలు క్షీణించి జీవితకాల కనిష్టం 84.31 స్థాయి వద్ద స్థిరపడింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్‌కు మార్గం సుగమం కావడంతో పాటు ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలతో యూఎస్ కరెన్సీ డాలర్ బలపడటం దేశీయ కరెన్సీ కోతకు కారణమైంది. దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ కొనసాగుతుండడమూ ప్రతికూలంగా మారింది.

జీవితకాల గరిష్టానికి బిట్‌కాయిన్




డొనాల్డ్ ట్రంప్ గెలుపు ఖాయమనే వార్తలతో క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ 8% ఎగసి జీవితకాల 75,000 డాలర్లకు చేరింది. క్రిప్టో కరెన్సీలకు ట్రంప్ సానుకూలత కలిసొచ్చిందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాదిలో 77% ర్యాలీ చేసింది. ఎన్నికల సందర్భంగా అమెరికాను క్రిప్టోల రాజధానిగా మార్చడంతో పాటు వ్యూహాత్మక రిజర్వ్‌గా బిట్‌కాయిన్‌ను తీర్చిదిద్దుదామని ట్రంప్ వ్యాఖ్యానించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎఫ్‌సీఐకి కేంద్రం రూ. 10,700 కోట్లు	టాటా స్టీల్ లాభాల బాట

టారిఫ్ వార్ 2.0!



ట్రంప్ విక్టరీతో మళ్లీ వాణిజ్య వివాదాలకు ఆజ్యం

- భారత్ 'టారిఫ్ కింగ్' అంటూ గతంలో వ్యాఖ్యలు
- ప్రతీకార సుంకాలను వడ్డిస్తామని స్పష్టీకరణ...
- ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఐటీ రంగాలపై ఎఫెక్ట్

'చైనా, బ్రెజిల్, భారత్.. అమెరికాపై దిగుమతి సుంకాల మోత మోగిస్తున్నాయి. కొన్ని ఉత్పత్తులపై చైనా కంటే భారీగా భారత్ సుంకాలను విధిస్తోంది. 'టారిఫ్ కింగ్'గా మారింది. నేను తిరిగి అధికారంలోకి వస్తే టిట్-ఫర్-టాట్ సుంకాలతో బదులు తీర్చుకుంటాం. అమెరికాను మళ్లీ అత్యంత సంపన్న దేశంగా మార్చాలంటే ప్రతీకార టారిఫ్‌లే మందు'.

గతేడాది అక్టోబర్‌లో డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. అనుకున్నట్లే బంపర్ విక్టరీతో మళ్లీ అగ్రరాజ్యాధిపతిగా శ్వేత సౌధంలో కొలువుదీరనున్నారు. ట్రంప్ అమెరికా ఫస్ట్ ఎజెండాతో భారత్ సహా చాలా దేశాలకు టారిఫ్ వార్ గుబులు పట్టుకుంది. - సాక్షి, బిజినెస్ డెస్క్

ప్రచారంలో ట్రంప్ ఊదరగొట్టిన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా)' నినాదం గనుక అమల్లోకి వస్తే... ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఫార్మా వంటి కొన్ని కీలక రంగాల్లో ఎగుమతులపై అధిక కస్టమ్స్ సుంకాలకు దారితీసే అవకాశం ఉందని వాణిజ్య రంగ నిపుణులు చెబుతున్నారు. చైనాతో పాటు భారత్, మరికొన్ని దేశాలపై సుంకాల పెంపు ద్వారా ట్రంప్ 2.0లో మలివిడత టారిఫ్ వార్‌కు ట్రంప్ తెరతీయవచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ఫౌండర్ అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. 'ట్రంప్ రెండో విడత అధికారంలో అమెరికా ఫస్ట్ నినాదానికి అనుగుణంగానే భారత్ ఉత్పత్తులపై రక్షణాత్మక చర్యలు, ప్రతీకార సుంకాలు విధించవచ్చు. ఈ జాబితాలో వాహన రంగం, వైన్స్, టెక్స్‌టైల్స్, ఫార్మా, స్టీల్ వంటి కీలక రంగాల్లో అడ్డంకులకు ఆస్కారం ఉంది. దీనివల్ల ఆయా పరిశ్రమల ఆదాయాల్లో కోత పడుతుంది' అని శ్రీవాస్తవ చెప్పారు. అయితే, మనతో పోలిస్తే చైనాపై టారిఫ్ వార్ తీవ్రంగా ఉంటే గనుక, అది భారతీయ ఎగుమతిదారులకు కొత్త అవకాశాలు కల్పిస్తుందన్నారు.

వస్తు ఎగుమతి-దిగుమతులు (బి. డాలర్లలో)

	అమెరికాకు భారత్ ఎగుమతులు	అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు
2019-20	53	35.8
2020-21	51.6	28.8
2021-22	76.1	43.3
2022-23	78.5	50.8
2023-24	77.5	42.1

ద్వైపాక్షిక సేవల వాణిజ్యం (బి. డాలర్లలో)

2018	2024
54.1	70.5

అతిపెద్ద వాణిజ్య భాగస్వామి...

భారత వస్తు, సేవలకు సంబంధించి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలుస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యం 2023-24లో 190 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇక పెట్టుబడుల విషయానికొస్తే, అమెరికా మూడో అతిపెద్ద ఇన్వెస్టర్. 2000 నుంచి 2024 మధ్య 66.7 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) భారత్ అందుకుంది! కాగా, ఇంజనీరింగ్ గూడ్స్, స్టీల్ వంటి అత్యధిక ఎగుమతి ఆదాయ రంగాలపై అమెరికా భారీగా టారిఫ్‌లు విధిస్తే, ప్రభావం తీవ్రంగా ఉంటుందని సీఐఐ జాతీయ ఎగ్జిమ్ కమిటీ కో-చైర్మన్ సంజయ్ బుధియా పేర్కొన్నారు. ట్రంప్ గత హయాంలో స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై 10-25 % అదనపు సుంకాలు విధించడంతో, భారత్ 28 ఉత్పత్తులపై ప్రతీకార టారిఫ్‌లతో బదులిచ్చింది. ఇవే కాకుండా డెయిరీ ఉత్పత్తులు (188%), పండ్లు-కూరగాయలు (132%), నూనె గింజలు, ఫ్యాట్స్, ఆయిల్స్ (164 శాతం), బేవరేజెస్-పొగాకు (150%)పై కూడా అమెరికా అధిక టారిఫ్‌లతో విరుచుకుపడింది.

ఈ సారి ఐటీపై ప్రభావం అంతంతే!



అక్రమ వలసలకు అడ్డుకట్టవేయడమే లక్ష్యమని ట్రంప్ తేల్చిచెబుతుండటంతో.. గత హయాంలో మాదిరిగానే ఐటీ రంగంపై ప్రతికూల ప్రభావం ఉంటుందనే ఆందోళనలు సహజంగా వ్యక్తమవుతున్నాయి. 80% పైగా భారత్ ఐటీ సర్వీసుల ఆదాయం అమెరికా నుంచే వస్తోంది. హెచ్1బీ/ఎల్1 వీసాలపై ట్రంప్ తొలిసారి అధికారం వచ్చిన వెంటనే నిబంధనలను కఠినతరం చేయడం తెలిసిందే. విదేశీ ఐటీ సంస్థలు ఉద్యోగాల్లో అమెరికన్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని హుకుం జారీ చేయడంతో పాటు వీసాల జారీపైనా పరిమితులు విధించారు. దీంతో అప్పట్లో ఐటీ కంపెనీలు వ్యయ భారాన్ని ఎదుర్కొన్నాయి. ఈ ప్రభావంతో వీసాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంతో పాటు విదేశీ సెంటర్లలో స్థానిక నిపుణులకే పెద్దపీట వేస్తున్నాయి. 2016-17లో అమెరికాలో భారతీయ ఐటీ సంస్థల ఉద్యోగుల్లో మూడింట రెండొంతులు హెచ్1బీ/ఎల్1 వీసాల ద్వారానే నమోదుకాగా, ప్రస్తుతం ఈ సంఖ్య గణనీయంగా తగ్గినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఐటీ అగ్ర త్రయం టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో హెచ్1బీ వీసాలు గత పదేళ్లలో 50-80% తగ్గిపోయినట్లు అంచనా. ట్రంప్ నియంత్రణల తర్వాత ఇది జోరందుకుంది. 2019-20లో ఇన్ఫీ గ్లోబల్ సిబ్బంది 65 శాతానికి, విప్రోలో 69 శాతానికి ఎగబాకినట్లు బ్రోకరేజ్ సంస్థ జేఎం ఫైనాన్షియల్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ 2.0 హయాంలో మళ్లీ వీసా పరిమితులు, కఠిన నిబంధనలు విధించినప్పటికీ.. పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చనేది నిపుణుల అభిప్రాయం. దీనికితోడు దేశీయ కార్యకలాపాలపై కార్పొరేట్ ట్యాక్స్‌ను 21% నుంచి 15%కి తగ్గిస్తామన్న ట్రంప్ ప్రతిపాదనలు కూడా భారత్ ఐటీ కంపెనీలకు సానుకూలాంశమని విశ్లేషకులు చెబుతున్నారు. వీసా నియంత్రణలు ఉన్నప్పటికీ... ట్రంప్ తొలి విడతలో దేశీ ఐటీ షేర్లు రంకెలేయడం విశేషం. టీసీఎస్ 185 శాతం, ఇన్ఫోసిస్ 174 శాతం, విప్రో 140 శాతం చొప్పున ఎగబాకాయి!!

వాణిజ్య వివాదాలు పెరగవచ్చు...



ట్రంప్ 2.0 హయాంలో వాణిజ్య పరంగా కష్టాలకు ఆస్కారం ఉంది. అధిక టారిఫ్‌ల కారణంగా వాణిజ్య వివాదాలు పెరగవచ్చు. గతంలో మాదిరిగా రక్షణాత్మక విధానం, కఠిన వలస నిబంధనల ట్రెండ్ కొనసాగుతుంది.

- అజయ్ సహాయ్, భారత ఎగుమతి సంస్థల సమాఖ్య డైరెక్టర్ జనరల్

టెక్ బంధాన్ని బలోపేతం చేసుకుందాం...



ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు శుభాకాంక్షలు. ఇరు దేశాల మధ్య నెలకొన్న అద్భుతమైన టెక్నాలజీ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కొత్త ప్రభుత్వంతో మరింత సన్నిహితంగా కలిసి పనిచేయడం కోసం ఎదురుచూస్తున్నాం. ద్వైపాక్షిక వాణిజ్యంలో టెక్నాలజీ రంగం 'వెన్నెముక'గా నిలుస్తోంది.

- సింధు, గంగాధరన్, నాస్కామ్ చైర్‌పర్సన్

ఎగుమతులకు కొత్త మార్కెట్లు....



ట్రంప్ 2.0 హయాంలో చైనా, కొన్ని యూరప్ దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు, దిగుమతి నియంత్రణలకు ఆస్కారం ఉంది. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు కొత్త మార్కెట్లకు ద్వారాలు తెరుచుకుంటాయి. ట్రంప్ భారత్‌ను ట్రంప్ మిత్ర దేశంగానే పరిగణిస్తారు. దీనివల్ల యూఎస్ కంపెనీల పెట్టుబడులు పెరుగుతాయి. ట్రంప్ విజయం భారత్‌కు సానుకూలాంశమే.

- రాజీవ్ కుమార్, నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్

రాష్ట్రీయం

'స్థానిక' వివాదంపై వివరణ ఇవ్వండి

పీజీ మెడికల్ సీట్లపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

తదుపరి విచారణ ఈ నెల 12కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సు సీట్ల భర్తీలో 'స్థానిక' వివాదంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శితోపాటు కాళోజీ నారాయణ రావు వర్సిటీ రిజిస్ట్రార్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. తెలంగాణ మెడికల్ కాలేజీల (పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సులలో ప్రవేశం) నిబంధనలు 2021లోని రూల్ VIII(i), (ii) చెల్లుబాటును సవాల్ చేస్తూ హైకోర్టులో మంచిర్యాలకు చెందిన డాక్టర్ ఎస్. సత్యనారాయణ, హైదరాబాద్‌కు చెందిన డా. వి.రజిత పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనల్లో మార్పులు చేస్తూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148 చట్టవిరుద్ధమన్నారు. ఈ జీవో ప్రకారం తెలంగాణలో బ్యాచిలర్ మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను మాత్రమే పీజీ మెడికల్ సీటుకు స్థానిక కోటా కింద పరిగణిస్తారని పేర్కొన్నారు. తమను స్థానిక అభ్యర్థులుగా పరిగణించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్రం వెలుపలి విద్యా సంస్థల్లో (సిద్ధార్థ మెడికల్ కాలేజీ) చదివిన వారిని స్థానికులుగా పేర్కొనడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేయాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. చట్ట విరుద్ధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలను కొట్టివేసి, పిటిషనర్లకు స్థానిక కోటా కింద సీట్లు కేటాయించేలా ఉత్తర్వులివ్వాలని సీనియర్ న్యాయవాది ఎం.సురేందర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

వదంతులను నమ్మొద్దు

సాక్షి, హైదరాబాద్: బ్రహ్మ కుమారీస్ సంస్థపై కొంత కాలంగా వస్తున్న వదంతులను నమ్మొద్దని ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. బ్రహ్మకుమారీస్‌పై సోషల్ మీడియాలో రకరకాల నిందలు, అపోహలు, వ్యతిరేక భావ వ్యక్తీకరణ, దూషణ, అపవాదులు, ధర్మ విరుద్ధ ఆరోపణలు చేస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. సంస్థ నుంచి వేరైన కొందరు.. క్రమశిక్షణకు విరుద్ధంగా అనైతికత, అసాంఘిక విధానాలతో ఇలాంటివి నడిపిస్తున్నారని ఆరోపించింది. ఢిల్లీ కేంద్రంగా బ్రహ్మకుమారీలకు వ్యతిరేకంగా వీరేంద్ర దీక్షిత్, రాయిపూర్‌లో ఓం మండలి అనే సంస్థ, గుజరాత్‌లోని పలు సంస్థలు ప్రచారం చేస్తున్నాయని విమర్శించింది.

పబ్లిక్ సర్వెంట్ల ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

బీపీ ఆచార్య, ఆదిత్యనాథ్ దాస్‌లపై ఈడీ కేసుల కొట్టివేత సబబే.. తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

- తెలంగాణ హైకోర్టు సరైన తీర్పే ఇచ్చింది
- అనుమతి లేకుండా కేసులు నమోదు చేయడానికి వీల్లేదు
- అలాంటి కేసులను విచారణకు స్వీకరించడం సరికాదు



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ కంపెనీల్లో పెట్టుబడుల వ్యవహారానికి సంబంధించి అప్పటి సీనియర్ ఐఏఎస్ అధికారులు బీపీ ఆచార్య, ఆదిత్యనాథ్ దాస్‌లకు సుప్రీంకోర్టు భారీ ఊరటనిచ్చింది. వీరిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులను కొట్టేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఐఏఎస్ అధికారుల ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అనుమతి తీసుకోకుండా ఈడీ కేసు నమోదు చేయడం, దానిని ఈడీ ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించడం సరికాదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని తెలిపింది. అయితే భవిష్యత్తులో వీరి ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం అనుమతినిస్తే అప్పుడు కేసు విచారణకు స్వీకరించాలని ప్రత్యేక కోర్టును ఆశ్రయించవచ్చునంటూ సుప్రీంకోర్టు ఈడీకి సూచించింది. అయితే ఈ వెసులుబాటు ప్రతివాదులైన అధికారులు లేవనెత్తే న్యాయపరమైన అభ్యంతరాలకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసి ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది.

విధి నిర్వహణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలవి: 'ఈడీ ఫిర్యాదులోని అంశాలన్నింటినీ మేం క్షుణ్ణంగా పరిశీలించాం. ఇండియా సిమెంట్స్‌కు అదనంగా 10 లక్షల లీటర్ల నీటిని కేటాయించారన్నదే ఆదిత్యనాథ్ దాస్‌పై ఉన్న ఆరోపణ. ఫిర్యాదులోని ఆరోపణలు వాస్తవమనుకున్నా, నీటి కేటాయింపులు తన విధి నిర్వహణలో భాగంగానే చేశారు. ఇందూ టెక్ జోన్‌కు 250 ఎకరాలు కేటాయించారన్నది బీపీ ఆచార్యపై ఉన్న ఆరోపణ. ఇది కూడా నిజమనుకున్నా, ఆ నిర్ణయం కూడా విధి నిర్వహణలో భాగంగా తీసుకున్నదే. వారి విధి నిర్వహణకు, తీసుకున్న నిర్ణయాలకు సంబంధం ఉంది. ఇద్దరు అధికారులు కూడా పబ్లిక్ సర్వెంట్‌లే. వీరికి సీఆర్‌పీసీ సెక్షన్ 197(1) వర్తిస్తుంది. ఈ సెక్షన్ మనీలాండరింగ్ నిరోధక చట్టం కిందకు వచ్చే నేరాలకు సైతం వర్తిస్తుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టంలో ఏ నిబంధన కూడా సెక్షన్ 197(1)కు విరుద్ధంగా లేదు. అధికార విధుల్లో భాగంగా తీసుకున్న నిర్ణయాలకు, చేపట్టిన చర్యలకు గాను అధికారులను ప్రాసిక్యూట్ చేయకుండా ఉండేందుకు ఈ సెక్షన్‌ను తీసుకొచ్చారు. అయితే ప్రభుత్వం అనుమతినిస్తే మాత్రం ప్రాసిక్యూట్ చేయవచ్చు. అయితే ఈ కేసులో అలా జరగలేదు. అయినప్పటికీ ఈడీ నమోదు చేసిన కేసును ఈడీ ప్రత్యేక కోర్టు విచారణ నిమిత్తం తీసుకుంది. ఇలా చేయడం ఎంత మాత్రం సరికాదు. అందువల్లే బీపీ ఆచార్య, ఆదిత్యనాథ్ దాస్‌లపై కేసు కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తున్నాం' అని సుప్రీంకోర్టు ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది.

ఈడీ కేసుల పూర్వాపరాలు

- ఇండియా అరబిందో, హెటిరో గ్రూపులకు జడ్చర్ల ఎస్ఈజెడ్‌లో 150 ఎకరాల భూమి కేటాయించడంలో అప్పటి ఏపీఐఐసీ ఎండీగా బీపీ ఆచార్య కీలక పాత్ర పోషించారంటూ ఈడీ ఆయనపై కేసు నమోదు చేసింది. అలాగే ఇందూ టెక్‌జోన్‌కు 250 ఎకరాల భూమి కేటాయింపు వ్యవహారంలోనూ ఆచార్య నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఈడీ ఆరోపించింది. ఇండియా సిమెంట్స్‌కు నీటి కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ అప్పటి నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌పై కూడా ఈడీ కేసు నమోదు చేసింది. సీబీఐ చార్జిషీట్‌ల ఆధారంగా ఈడీ తమపై కేసులు నమోదు చేసిందని, అందువల్ల వాటిని కొట్టేయాలంటూ వారిద్దరూ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులను కొట్టేస్తున్నట్లు 2019 జనవరి 21న హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఈడీ 2019 జూలైలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు పలు మార్లు విచారణ జరిపింది. చివరిగా గత నెల 15న పూర్తి స్థాయి వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తన తీర్పును వెలువరించింది.

డాక్టర్ సీటొచ్చినా.. కూలి పనికి

ఫీజు కట్టలేక పత్తి కూళ్లకు నీట్ ర్యాంకర్

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు

ఫీజులకు డబ్బులేక దాతల కోసం ఎదురుచూపు



పత్తి తీసేందుకు వెళ్లిన గౌతమి

తుంగతుర్తి: డాక్టర్ కావాలన్నది ఆ అనాథ బిడ్డ తపన. అందుకోసం కూలీ పనులు చేస్తూనే కష్టపడి చదివింది. నీట్ పరీక్షలో 507 మార్కులు సాధించింది మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. కానీ కనీసం పుస్తకాలు, దుస్తులు, ఫీజు చెల్లించడానికి డబ్బులు లేక ఎప్పటిలాగే తాత, నానమ్మతో కలిసి కూలీ పనులకు వెళ్తోంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన శిగ గౌతమి తన మూడేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయింది. దీంతో గౌతమిని తాత శిగ రాములు, నాయనమ్మ వెంకటమ్మ కూలి పనులు చేస్తూ పోషించారు. గ్రామంలోని సర్కారు బడిలో ఐదో తరగతి వరకు, పసునూర్ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివించారు. గౌతమి పదో తరగతిలో 10/10 జీపీఏ, ఇంటర్ బైపీసీలో 992/1000 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. వైద్యురాలు కావాలనే కోరికతో నీట్‌కు హాజరై మొదటి ప్రయత్నంలోనే దంత వైద్య కళాశాలలో సీటు సాధించింది. దంత వైద్యురాలు కావడం ఇష్టం లేక మళ్లీ నీట్ రాయాలనుకున్న ఆమెకు ఆర్థిక సమస్యలు గుదిబండగా మారాయి. అయినప్పటికీ నానమ్మ పుస్తెలతాడు తాకట్టుపెట్టి హైదరాబాద్‌లో కోచింగ్‌కు పంపారు. గౌతమి డాక్టర్ కావాలనే లక్ష్యంతో తాత, నానమ్మతో కలిసి కూలి పనులకు వెళ్తూనే రెండోసారి నీట్‌కు సిద్ధమైంది. ఈసారి నీట్‌లో 507 మార్కులు సాధించి ఇటీవల జరిగిన ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సంపాదించింది. కానీ ఎంబీబీఎస్ చదవడానికి ఏడాదికి రూ.1,50,000 ఖర్చు అవుతుందని, అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో చేసేది లేక కూలి పనులకు వెళ్తున్నట్లు శిగ రాములు తెలిపారు. ఫీజుకోసం అమ్మటానికి కూడా వారికి ఎలాంటిఆ ఆస్తులు లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరైనా ఆర్థిక సహాయం చేస్తే తమ బిడ్డ ఆశ నెరవేరుతుందని గౌతమి తాత, నానమ్మ వేడుకుంటున్నారు. సహాయం చేయాలనుకున్న దాతలు ఫోన్ పే నంబర్ 93989 19127కు ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

హైడ్రాను చూసి బ్యాంకర్లు భయపడొద్దు

- రుణాలు ఇవ్వండి.. అన్ని అనుమతులున్న వాటిని ముట్టుకోం
- మహిళా సంఘాలు, వ్యవసాయానికి అధిక నిధులివ్వండి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: హైడ్రాను చూసి భయపడొద్దంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు ధైర్యం నింపారు. హైడ్రా గురించి ఆందోళన అవసరం లేదని, హైడ్రా భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వదని స్పష్టం చేశారు. బుధవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన బ్యాంకర్ల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకం మహిళలు గౌరవ మర్యాదలతో జీవించేందుకు దోహదపడుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ నిర్ణయించిందని, వీలైతే అంతకుమించి వడ్డీలేని రుణాలు ఇస్తామన్నారు. కార్పొరేట్ కమర్షియల్ బ్యాంకులు 9 నుంచి 13 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయని, బ్యాంకర్లు సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు. మహిళల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వమే బస్సులు కొనుగోలు చేసి వారికి లీజుకు ఇవ్వాలని ఆలోచన సైతం చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటుచేసే సూక్ష్మ, మధ్యతరహా పారిశ్రామిక పార్కుల్లో మహిళలకు ప్రత్యేకంగా కేటాయింపులు చేస్తున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి వన్‌టైం సెటిల్‌మెంట్ చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, పురపాలక సంచాలకులు, కమిషనర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపకుండా వనరుల సమీకరణ: సామాన్య ప్రజలపై భారం మోపకుండా వనరుల సమీకరణపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఆదాయ వనరుల సమీకరణపై వాణిజ్య పన్నులు, రవాణా, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మైనింగ్, ఎక్సైజ్ శాఖల ఉన్నతాధికారులతో భట్టి భేటీ అయ్యారు. సమావేశంలో భాగంగా శాఖల వారీగా సాధించిన పురోగతి వివరాలు, ఆదాయ సమీకరణ కోసం రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ సీఎంకు అధికారులు వివరించారు. భట్టి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే పన్ను ఎగవేతదారులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇసుకను అందరికీ అందుబాటులో ఉంచడానికి కావలసిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుకుమార్ సుల్తానియా, రెవెన్యూ, వాణిజ్య పనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, భూగర్భ గనుల శాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాశ్ పాల్గొన్నారు.

విరిగిన రైలు పట్టా

సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



విరిగిన పట్టాను వెల్డింగుతో మరమ్మతు చేస్తున్న రైల్వే సిబ్బంది

ఓదెల (పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టా విరిగింది. సాధారణ తనిఖీలు చేస్తున్న సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. బుధవారం ఉదయం కొందరు రైల్వే సిబ్బంది అప్‌లైన్‌లో పట్టాలు తనిఖీ చేస్తూ.. ముందుకు వెళ్తున్నారు. వారు పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే అప్‌లైన్‌లోని పట్టా విరిగినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అధికారుల సూచనల మేరకు సిబ్బంది, సాంకేతిక నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని, విరిగిన పట్టాకు మరమ్మతులు చేశారు. శీతాకాలం కావడం.., సంకోచ, వ్యాకోచాల కారణంగా రైలు పట్టా విరిగి ఉంటుందని అధికారులు వివరించారు. దీని కారణంగా సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ వైపు వెళ్లాల్సిన పలు ఎక్స్‌ప్రెస్, గూడ్స్, ప్యాసింజర్ రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.



ఏదో ఒక పెద్ద జీవి అమాంతం నోరు తెరిచి ఈ డైవర్‌ను మింగేస్తున్నట్లు కనిపి స్తోంది కదూ.. ఈ సాడీన్ చేపలు వేల సంఖ్యలో గుంపుగా తిరుగుతుంటాయి. ఆ సమయంలో ఇవి రకరకాల ఆకారాలను ఏర్పరుస్తుంటాయి. ఆ సందర్భంగా తీసినదే ఈ చిత్రం. ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ అవార్డు-2024లో బెంజమిన్ యావర్ తీసిన ఈ చిత్రం నేచర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైంది.

సెకనుకో సైబర్ నేరం

ఎనిమిది నిమిషాలకు ఒక ర్యాన్సమ్‌వేర్ దాడి

రోజుకు 90 లక్షల కొత్త కంప్యూటర్ వైరస్‌ల పుట్టుక

హెల్త్ డేటా లీకైతే జీవాయుధాల దాడి ముప్పు

'హాక్-2.0'లో సైబర్ నిపుణుడు పెండ్యాల కృష్ణశాస్త్రి



సాక్షి, సిటీబ్యూరో: మనదేశంలో ప్రతి సెకనుకు ఒక సైబర్ నేరం జరుగుతోందని ప్రముఖ సైబర్ ఫోరెన్సిక్ నిపుణుడు పెండ్యాల కృష్ణశాస్త్రి తెలిపారు. ప్రతి 8 నిమిషాలకు ఒక ర్యాన్సమ్‌వేర్ దాడి జరుగుతోందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీరోజు 90 లక్షల కంప్యూటర్ వైరస్‌లు పుట్టుకొస్తున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బిట్‌కాయిన్ల రేటు పెరుగుతోందంటే ఓ భారీ సైబర్ దాడికి రంగం సిద్ధమవుతోందని సంకేతమని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల వసూళ్లకు పాల్పడేది, లావాదేవీలు జరిపేది బిట్‌కాయిన్ల రూపంలోనే కావడమే అందుకు కారణమని వివరించారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నగర పోలీసులు, సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ బుధవారం 'హైదరాబాద్ యాన్యువల్ సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్-2024'(హాక్-2.0) నిర్వహించింది. దీనికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సినీ నటుడు అడవి శేషు తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సులో కృష్ణశాస్త్రి కీలకోపన్యాసం చేశారు. సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు దేశంలోని అన్నిరంగాలకు సైబర్ దాడుల ముప్పు పొంచి ఉన్నదని తెలిపారు. ప్రతీరోజూ పుట్టుకొస్తున్న 90 లక్షల కంప్యూటర్ వైరస్‌లలో రెండు శాతం వైరస్‌ల లక్షణాలు ఎవరికీ తెలియదని అన్నారు. కృష్ణశాస్త్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలు..



గుర్తించటం కష్టమే..

సైబర్ నేరగాళ్లు నిత్యం కొత్త మార్గాల్లో దాడులకు పాల్పడుతుండటంతో వాటిని గుర్తించటం కష్టంగా మారింది. విమాన సర్వీసులకు జీపీఎస్ స్పూఫింగ్, డ్రాపింగ్ పెద్ద సవాల్‌గా పరిణమించింది. సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల జీపీఎస్‌ను హ్యాక్ చేసేందుకు 64 శాతం అవకాశం ఉంది. ప్రపంచంలోని ప్రతి ఆటోమేటిక్ వ్యవస్థకు హ్యాకింగ్ ముప్పు పొంచి ఉంది. ఎస్సెమ్మెస్‌ల ద్వారా లింకులు పంపే విషింగ్, ఈ-మెయిల్స్ ద్వారా పంపే ఫిషింగ్ స్కామ్‌లు ఇప్పటివరకు చూశాం. తాజాగా క్యూఆర్ కోడ్ పంపిస్తూ చేసే క్యూఆర్ ఇషింగ్ కూడా జరుగుతోంది. పుణేలోని కాస్మోస్ బ్యాంక్ సర్వర్‌పై మాల్‌వేర్‌తో దాడి చేసిన సైబర్ నేరగాళ్లు రూ.94 కోట్లు కాజేశారు. 2018లో ఇది జరిగినా ఆ మొత్తం ఎక్కడకు వెళ్లిందో ఇప్పటికీ గుర్తించలేకపోయాం.

హెల్త్ డేటా లీకైతే బయోవెపన్స్ ముప్పు


- వ్యక్తిగత, ఆర్థిక డేటాతోపాటు హెల్త్ డేటా కూడా అత్యంత కీలకం. ఇటీవల కాలంలో వైద్య రంగానికి చెందిన సంస్థలు, ఇన్సూరెన్స్ ప్రొవైడర్లు, ఆస్పత్రులకు సంబంధించిన సర్వర్ల మీద సైబర్ దాడులు చేస్తూ ప్రజల హెల్త్ డేటాను కాజేస్తున్నారు. ఇది శత్రుదేశాల చేతికి చిక్కితే భవిష్యత్తులో బయోవెపన్స్ (జీవాయుధాలు) ముప్పు పెరుగుతుంది. ఈ హెల్త్ డేటా ద్వారా ఏ బ్లడ్ గ్రూప్ ఉన్న వాళ్లు ఏ ప్రాంతంలో ఎక్కువ నివసిస్తున్నారు అనేది వారికి తెలుస్తుంది. దీంతో ఆయా బ్లడ్ గ్రూప్స్ వారిపైనే ఎక్కువ ప్రభావం చూపేలా బయోవెపన్స్ తయారు చేసి ప్రయోగించే ప్రమాదం ఉంటుంది. ఈ ఏడాది డిజిటల్ ఫోరెన్సిక్‌కు సిల్వర్ జూబ్లీ ఇయర్. ఈ నేపథ్యంలో ప్రిడెక్టివ్, రెస్పాన్సివ్ కంట్రోల్స్‌ను తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ఆ ఫోన్ ఎక్కడ.. విదేశీ మద్యం ఎక్కడ నుంచి తెచ్చారు?

విజయ్ మద్దూరిపై పోలీసుల ప్రశ్నల వర్షం..

శంకర్‌పల్లి: విజయ్ మద్దూరిపై పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. కొకైన్ ఎక్కడ తీసుకున్నావ్? ఫోన్ ఎక్కడ దాచావ్? విదేశీ మద్యం ఎక్కడ నుంచి తెచ్చారు? పార్టీలో ఎవరెవరు డ్రగ్స్ తీసుకున్నారు అంటూ ప్రశ్నించనట్లు సమాచారం. మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల కేసులో డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిన విజయ్ మద్దూరి హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం మోకిల పోలీస్‌స్టేషన్‌లో తన న్యాయవాది అవినాష్‌తో కలిసి విచారణకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా నార్సింగి ఏసీపీ రమణగౌడ్ సమక్షంలో మోకిల సీఐ వీరబాబు విచారణ చేపట్టారు. రెండుసార్లు నోటీసులు ఇచ్చిన తర్వాత విజయ్ పోలీస్‌స్టేషన్‌కు రావడంతో పోలీసులు ఆయన్ను పలుకోణాల్లో ప్రశ్నించినట్టు తెలిసింది. తాను అక్టోబర్ 10 నుంచి 14 వరకు నెదర్లాండ్స్‌లో రోజూ కొకైన్ తీసుకున్నానని..రాజ్ పాకాల ఇంట్లో పార్టీలో తీసుకోలేదని సమాధానం ఇచ్చారు. పార్టీ సమయంలో తన ఫోన్‌లో చార్జింగ్ లేక అక్కడే చార్జింగ్ పెట్టానన్నాడు. ఎవరైనా తీసుకున్నట్టు తెలిస్తే అప్పగిస్తానని పోలీసులకు చెప్పాడు. సుమారు మూడు గంటల పాటు విచారించిన పోలీసులు, మళ్లీ అవసరమైతే పిలుస్తామని పంపించారు. ఇంటికి వెళ్లే సమయంలో విజయ్ మద్దూరితో మీడియా ప్రతినిధులు మాట్లాడే ప్రయత్నం చేయగా, ఆయన నిరాకరించారు.

ప్రపంచంలోని టాప్-10 ఆర్థిక వ్యవస్థల్లో రిటైర్‌మెంట్ వయసు..



- రిటైర్‌మెంట్ వయసును ఆయా దేశాల విధాన నిర్ణేతలు కార్మిక శక్తి సరఫరా, ప్రజల జీవిత కాలం, పని పరిస్థితులు, ఆర్థిక పరిస్థితులు, సిబ్బంది ఆరోగ్యం తదితరాల ఆధారంగా నిర్ణయిస్తారు. – సాక్షి సెంట్రల్ డెస్క్

తెగిన చేతిని అతికించారు

రోడ్డు ప్రమాదంలో పూర్తిగా తెగిపోయిన చేయి

గోల్డెన్ అవర్ దాటిన తర్వాత అపోలో ఆస్పత్రికి రోగి.. 8 గంటల పాటు శ్రమించి అతికించిన వైద్య బృందం

సాక్షి, హైదరాబాద్: రోడ్డుప్రమాదంలో పూర్తిగా తెగిపడిపోయిన చేయిని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా అతికించారు. గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన తొలి గంట)సమయం దాటిపోయిన తర్వాత కూడా అత్యంత క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించటం గమనార్హం. మంచిర్యాలకు చెందిన పవన్ కుమార్ అనే వ్యక్తి అక్టోబర్ 11న బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగి మోచేయి పై భాగంవరకు తెగి పడిపోయింది. తెగిన చేయిని ఓ కవర్‌లో చుట్టి అతడిని హుటాహుటిన మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి డాక్టర్లు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి రిఫర్ చేశారు. పవన్‌కుమార్‌ను హైదరాబాద్‌కు తరలించే సమయానికి అప్పటికే గోల్డెన్ అవర్ కూడా దాటిపోయింది. అయినప్పటికీ 8 గంటల పాటు శ్రమించి క్లిష్టమైన మైక్రో వ్యాస్కులర్ రీప్లాంటేషన్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి చేయిని తిరిగి అతికించారు. సాధారణంగా వేలు కానీ, చిన్న అవయవం కానీ తెగిపడిపోతే సులువుగానే అతికించవచ్చని, పూర్తి చేయిని అతికించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి అని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స వివరాలను బుధవారం మీడియా సమావేశంలో అపోలో ఆస్పత్రి కన్సల్టెంట్ మైక్రో సర్జన్ డాక్టర్ జీఎస్ భండారి వెల్లడించారు. 26 రోజుల్లోనే పవన్ కోలుకున్నాడని తెలిపారు. అతికించిన చేయి వేళ్లు తిరిగి పనిచేసేందుకు ఆరు నెలల సమయం పడుతుందని, ఇందుకోసం మరికొన్ని శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంటుందని చెప్పారు.




అతికించిన చేతితో పవన్‌కుమార్

తెగిన వెంటనే జాగ్రత్త చేయాలి

తెగిపోయిన శరీర భాగాలను అతికించే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డాక్టర్ భండారి అన్నారు. తెగిపోయిన శరీర భాగాలను నీటితో కడిగి, పాలిథీన్ కవర్ లేదా అల్యూమినియం కవర్‌లో ఉంచాలని తెలిపారు. ఆ కవర్‌ను ఐస్‌ప్యాక్‌లో పెట్టి తీసుకొస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. అయితే నేరుగా ఐస్‌లో ఉంచితే అవయవం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని, అప్పుడు తిరిగి అతికించడం సాధ్యం కాదని వివరించారు. పుట్టుకతో లోపాలు, విరిగిపోయిన చేతులు, పక్షవాతం వంటి వ్యాధుల కారణంగా చేతులు, కాళ్లు పనిచేయకపోతే బ్రెయిన్ డెడ్ అయిన వారి భాగాలను అతికించే అవకాశం ఉందని తెలిపారు. మీడియా సమావేశంలో అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ బాబు, శస్త్ర చికిత్సలో పాలుపంచుకున్న డాక్టర్ గురు ప్రసాద్ (ప్లాస్టిక్ సర్జన్), డాక్టర్ వివేక్ రెడ్డి (ఆర్థోపెడిక్ సర్జన్), డాక్టర్ శరణ్య (అనస్థీషియా) తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



గణితం బోధిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఇదీ లెక్క!

ఖమ్మం కలెక్టర్ గణితం బోధన

ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌లోని ఉన్నత పాఠశాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆరో తరగతిలో ఉపాధ్యాయిని గణితం బోధిస్తుండగా.. కాసేపు విద్యార్థుల మధ్య కూర్చుని విన్నారు. అనంతరం కలెక్టరే సుద్దముక్క అందుకుని.. గణితంలో సులువైన పద్ధతులను బోధించారు. బోధన ఎలా ఉంది?, సమస్యలున్నాయా?, ఏమైనా సౌకర్యాలు కావాలా? అని ఆరా తీశారు. విద్యార్థుల లక్ష్యాలను తెలుసుకుని వారిలో స్ఫూర్తి నింపారు.

- సాహసకృత్యాలకు చిరునామా మయూరి ఎకో పార్క్
- అందుబాటులో జిప్‌సైకిల్, జిప్‌లైన్
- ప్రత్యేకంగా అడవిలో జంగిల్ సఫారీ
- భవిష్యత్‌లో మరిన్ని సాహస క్రీడలకు ప్రణాళికలు

మయూరి... సాహసానికి దారి...



మహబూబ్‌నగర్‌లోని మయూరి ఎకో అర్బన్ పార్క్

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి సమీపంలో 'మయూరి హరితవనం'(ఎకో అర్బన్ పార్క్) ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ఈ పార్క్ వనవిహార కేంద్రంగా రూపుదిద్దుకుంది. జిల్లా కేంద్రం అప్పన్నపల్లి శివారులోని ఈ ఎకో అర్బన్ పార్క్ పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తోంది. ఈ నేచర్‌పార్క్ అర్బన్ లంగ్స్ స్పేస్ పర్యాటక కేంద్రంగా మారుతోంది. 2,087 ఎకరాల్లో మయూరి పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. పర్యాటకుల ఆహ్లాదం కోసం అన్ని రకాల వసతులు ఉండడంతో ఎకో పార్క్‌కు సందర్శకుల తాకిడి అధికమైంది.

ఎకో అర్బన్ పార్కులో సౌకర్యాలు

పార్క్‌లో చిల్డ్రన్స్ పార్క్, బటర్‌ఫ్లై గార్డెన్, కరెన్సీ పార్క్, రోజ్ గార్డెన్, రాశీవనం, నక్షత్ర వనం, నవగ్రహ వనం, హెర్బల్ గార్డెన్‌లు పర్యాటకులకు అమితంగా ఆకర్షిస్తున్నాయి. పార్క్‌లో మాకావ్ ఎన్‌క్లోజర్, స్వాన్ పాండ్, హిల్‌వ్యూ పాయింట్, ప్రత్యేకంగా జంగిల్ సఫారీ, ఫ్లాగ్ పాయింట్, ఆస్ట్రిచ్ బర్డ్ ఎన్‌క్లోజర్‌లను ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న అడ్వెంచర్ గేమ్‌లు

పార్క్‌లో పెద్దల కోసం ఏర్పాటు చేసిన జిప్‌లైన్, జిప్‌సైకిల్, చిన్నారులకు జిప్‌సైకిల్, జిప్‌లైన్ తదితర అడ్వెంచర్ గేమ్స్ అమితంగా ఆకట్టుకుంటున్నాయి. పెద్దల జిప్ సైకిల్ రూ.150, జిప్‌లైన్ రూ.70, చిన్నారుల జిప్ సైకిల్ రూ.30, జిప్‌లైన్ రూ.30గా నిర్ణయించారు. జిప్‌సైకిల్ రానుపోను 600 మీటర్లు, జిప్‌లైన్ 200 మీటర్ల వరకు ఉంటుంది. వీకెండ్ రోజుల్లో ముఖ్యంగా చిన్నారులు, యువత జిప్ సైకిల్, జిప్ లైన్‌పై హుషారుగా సందడి చేస్తున్నారు. పార్క్‌లో అడల్ట్, చిల్డ్రన్స్ బోటింగ్‌తోపాటు నేచర్ నైట్ క్యాంపింగ్ సైట్ అందుబాటులో ఉంది.



పెద్దల జిప్‌సైకిల్



జంగిల్ సఫారీ

అడవిలో జంగిల్ సఫారీ

పార్క్‌లో జంగిల్ సఫారీని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పార్క్ నుంచి అడవిలో రానుపోను 14 కిలోమీటర్లు ఈ జంగిల్ సఫారీ ఉంటుంది. పార్క్ నుంచి ప్రారంభమయ్యే ఈ సఫారీ గోల్ బంగ్లా వాచ్ టవర్ వరకు తీసుకెళ్లి తిరిగి పార్క్‌కు చేరుకుంటుంది. సఫారీలో నెమళ్లు, జింకలు, ఇతర జంతువులను తిలకించే అవకాశం ఉంటుంది. రూ.2 వేలు చెల్లించి 8 మంది జంగిల్ సఫారీ చేయవచ్చు.

మరిన్ని సాహస క్రీడల ఏర్పాటు



పర్యాటకులను ఆకట్టుకునే విధంగా మయూరి పార్క్‌లో భవిష్యత్‌లో మరిన్ని సాహస క్రీడలను ఏర్పాటు చేస్తాం. రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్, ట్రెక్కింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. జంగిల్ సఫారీకి పర్యాటకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

– సత్యనారాయణ, డీఎఫ్‌వో, మహబూబ్‌నగర్

సీఎంపై కేసు పెట్టాలన్న పిటిషన్ కొట్టివేత

పిటిషన్ విచారణార్హం కాదన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నేతలను దూషించేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర నేతలు రాజకీయ సభల్లో మాట్లాడే మాటలను తప్పుబట్టలేమని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. పలు సమావేశాల్లో వివిధ అంశాలపై వారంతా విమర్శలు చేస్తూనే ఉంటారని వ్యాఖ్యానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసేలా బంజారాహిల్స్ పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలంటూ బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. పిటిషనర్‌కు పిటిషన్ వేసే అర్హత లేదని, ఇది విచారణార్హం కాదని స్పష్టం చేసింది. 'మార్చి 6న జరిగిన పాలమూరు బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీ నేతలను ఇలాంటి నీచమైన, అవమానకరమైన భాషతో బెదిరిస్తే పౌరుల్లో హింస, భయాందోళనలు నెలకొంటాయి. దీనిపై కేసు నమోదు చేయాలని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం లేదు. వెంటనే సీఎంపై కేసు నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలి'అని కోరుతూ హైకోర్టులో ఎర్రోళ్ల శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ముఖ్యమంత్రులు మాట్లాడిన అంశాలను తప్పుబట్టి విచారణ చేయలేమని చెప్పారు. రాజకీయ నేతల మాటలపై ఇలాంటి పిటిషన్ల విచారణ చేపడితే కోర్టులు సరిపోవని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం మాట్లాడిన మాటలతో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లలేదు కదా అని పిటిషనర్‌ను ప్రశ్నించారు.

సర్వేలో పాల్గొనండి: సీతక్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అందరూ పాల్గొనాలని, ఊరూరా ఉత్సవంగా, ఉద్యమంగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణలో కులగణన మొదలు పెట్టామని ఆమె స్పష్టం చేశారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆమె ఈ మేరకు ఒక వీడియో సందేశం విడుదల చేశారు.

కులగణనలో కార్యదర్శులే కీలకం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేలో పంచాయతీ కార్యదర్శులదే ముఖ్య పాత్ర అని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సందిల బలరాం తెలిపారు. గ్రామంలోని అన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తూ, మిగిలిన ఎన్యుమరేటర్లకు గ్రామ పరిస్థితులపై సమగ్ర సమాచారం అందిస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులగణనను రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు విజయవంతం చేయాలని బలరాం కోరారు.

కులగణనను స్వాగతించాలి

సాక్షి, హైదరాబాద్: రాజకీయాలకతీతంగా మొదలుపెట్టిన కులగణన కార్యక్రమాన్ని ఇండియా కూటమి, ఎన్డీఏ మిత్రపక్షాలు రాజకీయ, వివిధ పార్టీలు మంచి మనసుతో స్వాగతించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో మితిమీరిన అసమానతలను ప్రక్షాళన చేయడానికే కులగణనను నిర్వహిస్తున్నామన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని తెలిపారు. కులగణనతో రాజకీయంగా నష్టం వాటిల్లినా వెనక్కి తగ్గేది లేదని రాహుల్ చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో సంచలనాత్మకమన్నారు.

నేడు 'బీజేపీ సంఘటనా పర్వ్-స్టేట్‌లెవల్ వర్క్‌షాపు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను బీజేపీ వేగవంతం చేసింది. ఇందులో భాగంగా గురువారం కేంద్రమంత్రి, పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన 'బీజేపీ సంఘటనా పర్వ్-సేట్‌లెవల్ వర్క్‌షాపు'ను నిర్వహించనున్నారు. వర్క్‌షాపులో పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీ య ప్రధానకార్యదర్శి, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జి సునీ ల్ బన్సల్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ పాల్గొంటారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 15 తర్వాత జరిగే బూత్ కమిటీల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగావకాశాలు

- గల్ఫ్‌తోపాటు ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాల్లో ఉపాధికి బాటలు
- జపాన్, జర్మనీ భాషల్లో శిక్షణ కోసం వివిధ సంస్థలతో ఒప్పందాలు
- వీసా ఖర్చులూ తక్కువే

మోర్తాడ్ (బాల్కొండ): వలస కార్మికులు, గల్ఫ్ దేశాల్లో ఉన్న పలు కంపెనీలకు మధ్య వారధిగా వ్యవహరించిన ప్రభుత్వ రంగ సంస్థ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్).. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసింది. ఇప్పటి వరకు గల్ఫ్ దేశాలకే వలస కార్మికులను పంపించిన ఈ సంస్థ.. తాజాగా ఇజ్రాయెల్‌తో పాటు పాశ్చాత్య దేశాల్లోనూ ఉపాధి అవకాశాలను కల్పించడానికి చర్యలు చేపట్టింది. గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగరి, జపాన్, పోలాండ్, రొమానియా, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాల్లో ఆతిథ్యరంగం, ఫుడ్ టెక్నాలజీ, లాజిస్టిక్స్, టెక్నాలజీ రంగాల్లో ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు టామ్‌కామ్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ 60 శాతం మార్కులతో పూర్తి చేసిన 28 ఏళ్లలోపు యువత వీసాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా నిర్మాణ రంగంలోనే ఉపాధి అవకాశాలు ఉన్నాయి. న్యాక్ ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ పొందిన వారిని టామ్‌కామ్ సంస్థ గల్ఫ్ దేశాలకు పంపిస్తుంది. ఇజ్రాయెల్ దేశానికి తెలంగాణ నుంచి దాదాపు 1,500 మంది కార్మికులను తరలించారు. వ్యవసాయ, నిర్మాణ రంగాల్లో ఉపాధి కల్పించడానికి ఇజ్రాయెల్ వీసాలు జారీ చేయగా.. టామ్‌కామ్ సంస్థ మధ్యవర్తిగా వ్యవహరించింది. జపాన్, జర్మనీ దేశాల్లో ఉపాధి కోసం వెళ్లే వారు ఆ దేశాల భాషలను తప్పనిసరిగా నేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం టామ్‌కామ్ కొన్ని సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుని జపాన్, జర్మనీ భాషలలో నిరుద్యోగులకు శిక్షణ ఇప్పిస్తోంది. భాషా ప్రావీణ్యం సంపాదించిన తర్వాతే వీసాల కోసం దరఖాస్తు ప్రక్రియను ప్రారంభిస్తున్నారు.

వీసా ఫీజు తక్కువే...

ప్రైవేటు ఏజెన్సీలకంటే టామ్‌కామ్ సంస్థ వీసాల కోసం తక్కువ మొత్తంలో ఫీజులను వసూలు చేస్తోంది. ఇజ్రాయెల్ వీసాలకు ఇతర మ్యాన్‌పవర్ కంపెనీలు రూ.15 లక్షల వరకు వసూలు చేస్తే, టామ్‌కామ్ సంస్థ ఆధ్వర్యంలో వెళ్తున్నవారికి రూ.2 లక్షల వరకే ఖర్చవుతున్నాయి.

వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

టామ్‌కామ్ అందిస్తున్న విదేశాలలో ఉపాధి వీసాల కార్యక్రమాన్ని వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి. విదేశాల్లో ఉపాధి కోరుకునేవారి కోసం మా సంస్థ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. అనేక దేశాల్లో ఆయన రాయబారిగా పని చేశారు. ఆ అనుభవంతో గల్ఫ్‌యేతర దేశాల్లోనూ ఉపాధి అవకాశాలను కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు.

– నాగభారతి, జనరల్ మేనేజర్, టామ్‌కామ్

తెల్లబోతున్న తెల్ల బంగారం



రాష్ట్రంలో తగ్గిపోతున్న పత్తి ఉత్పత్తి	గత ఏడాది 51.01 లక్షల బేళ్ల ఉత్పత్తి	ఈ ఏడు 48.95 లక్షల బేళ్లు అంచనా	వరి ఉత్పత్తి అంచనా 1.44 కోట్ల టన్నులు	పెరగనున్న పప్పు ధాన్యాల ఉత్పత్తి	భారీ వర్షాలతో పంటల నాణ్యత తగ్గుదల	2024-25 వానకాలం ఉత్పత్తి అంచనా నివేదిక విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ ఏడు పత్తి ఉత్పత్తి పడిపోయింది. గత ఏడాదితో పోల్చితే దాదాపు 2 లక్షల బేళ్లు తగ్గనుంది. వరిధాన్యం ఉత్పత్తి మాత్రం గత ఏడాదితో సమానంగా వచ్చే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. '2024-25 పంటకాలంలో రాష్ట్రంలో పంటల వారీగా విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతపై మొదటి ముందస్తు అంచనా నివేదికను బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది పప్పు ధాన్యాల ఉత్పత్తి ఆశాజనకంగా ఉన్నదని వెల్లడించింది.

పత్తి సాగు తక్కువే.. ఉత్పత్తి తక్కువే

గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో అనిశ్చితి కనిపిస్తోంది. ఒకవైపు విస్తీర్ణం తగ్గుతుండగా, మరోవైపు ఉత్పత్తి పడిపోతుందని వ్యవసాయశాఖ నివేదికలు చెబుతున్నాయి. పత్తి ధరలో భారీ హెచ్చుతగ్గులు కూడా ఇందుకు కారణమవుతున్నాయి. ఒకప్పుడు మార్కెట్లో గరిష్టంగా క్వింటాల్ పత్తికి రూ.14 వేల వరకు ధర పలుకగా, ఇప్పుడు రూ.6 వేల మించి రావటం లేదు. దీంతో రైతులు పత్తి సాగు చేసేందుకు ఆసక్తి చూపటంలేదు. వాస్తవంగా ఈ ఏడాది వానకాలం సీజన్‌లో 60 లక్షల ఎకరాలకు పైగా పత్తి విస్తీర్ణాన్ని పెంచాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్దేశించుకొన్నది. కానీ, 44.55 లక్షల ఎకరాల్లోనే సాగైంది. 2023 వానకాలం సీజన్‌లో 44.93 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేయగా, 51.01 లక్షల బేళ్ల ఉత్పత్తి వచ్చింది. ఈ ఏడాది ఉత్పత్తి 48.95 లక్షల బేళ్లకు పరిమితమవుతుందని అంచనా వేసింది. అంటే 2 లక్షల బేళ్లకుపైగా ఉత్పత్తి తగ్గనుంది.

1.44 కోట్ల టన్నుల వరి ఉత్పత్తి

రాష్ట్రంలో వరిధాన్యం గత ఏడాది ఉత్పత్తికి దాదాపు సమానంగా వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. 2022-23 ఏడాది వానకాలం సీజన్‌లో 1.38 కోట్ల టన్నులు వరిధాన్యం ఉత్పత్తి వచ్చింది. 2023-24 ఏడాది వానకాలం సీజన్‌లో 1.44 కోట్ల టన్నులు ఉత్పత్తి అయ్యింది. ఈసారి కూడా 1.44 కోట్ల టన్నుల వరకు ఉత్పత్తి వస్తుందని అంచనా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించటంతో చాలామంది రైతులు పత్తిని వదిలి వరి సాగు చేశారు. దీనివల్ల కూడా పత్తి సాగు విస్తీర్ణం తగ్గిందని అధికారులు తెలిపారు.

పెరిగిన పప్పుధాన్యాల ఉత్పత్తి

పత్తి ఉత్పత్తి తగ్గినా ఈసారి రాష్ట్రంలో పప్పుధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత ఏడాది వానకాలంలో పప్పుధాన్యాల ఉత్పత్తి 1.63 లక్షల టన్నులు వచ్చింది. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో 1.95 లక్షల టన్నుల వరకు ఉంటుందని తెలిపింది. అందులో కందులు 1.69 లక్షల టన్నులు కాగా, పెసళ్లు 19 వేల టన్నులు ఉన్నాయి. మొక్కజొన్న 10.01 లక్షల టన్నులు ఉత్పత్తి కానుంది. జొన్న ఉత్పత్తి 13 వేల టన్నులు వచ్చే అవకాశముంది. సోయాబీన్ 2.62 లక్షల టన్నులు ఉత్పత్తి రావచ్చని ముందస్తు అంచనాల్లో పేర్కొన్నారు.

వరదలు, వర్షాలతో నాణ్యత లోపం

ఈ సీజన్లో భారీ వర్షాల కారణంగా లక్షలాది ఎకరాల్లో పత్తి పంట నాశనమైంది. దీంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. అనేకచోట్ల పత్తి రంగు మారింది. గత ఏడాది ఒక మోస్తరు ధర పలికిన పత్తికి, ఈసారి కూడా ఆ మాత్రం ధర ఉంటుందని అనుకున్నారు. కానీ వర్షాలతో పత్తి రంగు మారటంతో పంటను అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నాడు. పత్తిలో తేమ శాతం ఎక్కువ ఉంటుందంటూ సీసీఐ కూడా కొర్రీలు పెడుతోంది. ఫలితంగా అన్నదాతలు ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో వ్యవసాయశాఖ వైఫల్యం కనిపిస్తుంది. వరి పంట కూడా నీటిలో నానిపోవడంతో అనేకచోట్ల నాణ్యత కోల్పోయింది.

రాష్ట్రంలో కొన్నేళ్లుగా పత్తి ఉత్పత్తి వివరాలు (లక్షల బేళ్లల్లో)

ఏడాది	ఉత్పత్తి
2019-20	54.0
2020-21	57.97
2021-22	48.78
2022-23	54.41
2023-24	51.01
2024-25	48.95

భవిష్యత్‌తరాల అవగాహనకే 'బర్డ్స్ ఆఫ్ తెలంగాణ' ప్యాకెట్ గైడ్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పక్షుల గురించి భవిష్యత్‌తరాలకు అవగాహన కల్పించడానికి హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ (హెచ్‌బీపీ) రూపొందించిన 'బర్డ్స్ ఆఫ్ తెలంగాణ'ప్యాకెట్ గైడ్ ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ గైడ్‌ను రూపొందించేందుకు హెచ్‌బీపీ సభ్యులు చేసిన కృషి, వారు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను భట్టి అభినందించారు. బుధవారం ప్రజాభవన్‌లో ఈ ప్యాకెట్ గైడ్‌ను మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. తెలంగాణలోని పక్షుల గురించి ముద్రితమైన మొదటి ప్యాకెట్ గైడ్‌గా ఈ పుస్తక ప్రాముఖ్యతను హెచ్‌బీపీ ప్రెసిడెంట్ ఆడెపు హరికృష్ణ డిప్యూటీ సీఎంకు వివరించారు. తెలంగాణ పక్షుల ఆహారం, వలసలు, పరిరక్షణ స్థితి గురించి తెలుసుకోవటానికి ప్రజలకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 252 ముఖ్యమైన పక్షి జాతుల సమాచారంతో ఉన్న ఈ ప్యాకెట్ గైడ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మాజీ ఐపీఎస్ అధికారి తేజ్‌దీప్‌కౌర్ మీనన్ మాట్లాడుతూ హెచ్‌బీపీ బృందం ఇప్పటివరకు నిర్వహించిన 490కిపైగా బర్డ్ వాక్‌ల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజలు, విద్యార్థులకు ఎంతో అవగాహన ఏర్పడిందన్నారు.

అబ్రాడ్‌లో ఉద్యోగాలంటూ మోసగిస్తున్న ఇద్దరి అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: అబ్రాడ్‌లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు సీఐడీ చీఫ్ శిఖాగోయల్ బుధవారం వెల్లడించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి సమీపంలోని బాచుపల్లికి చెందిన గంట సునీల్‌కుమార్, చీకటి నవ్యశ్రీలు కేపీహెచ్‌బీలో అబ్రాడ్ స్టడీ ప్లాన్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. కొట్టు సాయిరవి తేజ, కొట్టు సాయిమనోజ్, శుభం, వంశీ సహా మరికొంత మందితో కలిసి విజయవాడ, ఢిల్లీలో కూడా కన్సల్టెన్సీని నిర్వహిస్తున్నారు. అబ్రాడ్‌లో చదువుతో పాటు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను ట్రాప్ చేశారు. తెలంగాణ, ఏపీ, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక సహా ఇతర రాష్ట్రాలకు చెందిన వందమందికి పైగా మోసం చేశారు. ఇందుకు గాను ఒక్కో వ్యక్తి నుంచి రూ.5 లక్షలు వసూలు చేస్తూ వచ్చారు. ఆ తర్వాత అబ్రాడ్‌కు తరలించేవారు. అక్కడకు వెళ్లిన తర్వాత బాధితులు మోసపోయామని గుర్తించడం, అక్కడ ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతోపాటు ఆర్థిక సమస్యలు ఎదుర్కోవడం... తర్వాత తిరిగి ఇండియాకు చేరుకునేవారు. కరీంనగర్‌కు చెందిన సీహెచ్.కమలాకర్‌తో పాటు అతని స్నేహితుని నుంచి కూడా రూ.8 లక్షలు వసూలు చేశారు. నకిలీ డాక్యుమెంట్లతో మాల్టా దేశానికి పంపారు. వీరికి అక్కడ ఎలాంటి ఉద్యోగం లభించలేదు. దీంతో ఇండియాకు తిరిగి వచ్చారు. ఈ ఏడాది మార్చి 14న కరీంనగర్‌లోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు సీఐడీలోని ఎకానమిక్ అఫెన్సెస్ వింగ్‌కు బదిలీ అయ్యింది. జూలై 4 నుంచి సీఐడీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేపీహెచ్‌బీ, నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో కూడా కేసులు రిజిస్టర్ అయినట్టు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో నిందితులు గంటా సునీల్‌కుమార్, చీకటి నవ్యశ్రీలను మంగళవారం బాచుపల్లిలో అరెస్ట్ చేశారు.

పీసీఐ సిఫారసుల అమలుకు వినతి

సాక్షి, హైదరాబాద్: దేశంలో జర్నలిస్టుల భద్రత, రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) చేసిన సిఫారసులు అమలు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ఆనందరం బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మీడియాతో వ్యవహరించే విధానంపై పోలీసులకు అవగాహన కల్పించే చట్టాన్ని పీసీఐ తన నివేదికలో కేంద్రానికి సిఫారసు చేసిందని వెల్లడించారు. జర్నలిస్టుల రక్షణ విషయంలో ప్రెస్ కౌన్సిల్ మరింత చైతన్యంతో వ్యవహరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

నందిగం బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, అమరావతి: మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నిందితునిగా ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ బుధవారం తీర్పు వెలువరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మృతిచెందారు. దీని వెనుక సురేష్ ప్రోద్బలం ఉందంటూ పోలీసులు కేసు నమోదుచేసి అరెస్టుచేశారు. ఈ కేసులో బెయిల్ ఇచ్చేందుకు కింది కోర్టు నిరాకరించింది. దీంతో నందిగం హైకోర్టును ఆశ్రయించారు. గత వారం వాదనలు విన్న జస్టిస్ కృపాసాగర్ బుధవారం నందిగం బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పును వెలువరించారు.

వైద్యసేవ ట్రస్ట్ అదనపు సీఈవోగా అప్పారావు

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)లో డిప్యూటీ డైరెక్టర్(అడ్మిన్)గా పనిచేస్తున్న కె.అప్పారావును డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ అదనపు సీఈవో (104, 108)గా నియమిస్తూ వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకునే వరకు డీఎంఈలో డిప్యూటీ డైరెక్టర్ బాధ్యతలను కూడా అప్పారావు నిర్వర్తిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన అదనపు సీఈవో (108, 104)గా పంచాయతీరాజ్ శాఖకు చెందిన వైవీవీఎస్ ప్రసాద్‌బాబును ప్రభుత్వం నియమించింది. ఆయనకు వైద్యసేవ ట్రస్ట్ అడ్మిన్ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

మెగా సీడ్‌పార్క్ సీఈవోగా ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: కర్నూల్ జిల్లాలోని ఏపీ స్టేట్ మెగా సీడ్ పార్క్ సీఈవోగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) ఇచ్చింది. ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు.

మాతృశాఖకు 'మన బడి-మన భవిష్యత్' డైరెక్టర్

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో మన బడి-మన భవిష్యత్ కార్యక్రమం డైరెక్టర్ ఎం.కాలేబ్‌ను సాంఘిక సంక్షేమ శాఖలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. డిసెంబర్ నెలాఖరున పదవీవిరమణ చేస్తున్న క్రమంలో కాలేబ్ పెట్టుకున్న వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బుధవారం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. 12 మందికి గాయాలు

జగదాంబ: ఆటో బోల్తా పడిన ఘటనలో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం రంగరాయపురం గ్రామానికి చెందిన 12 మంది ఆటోలో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో గ్రేటర్ విశాఖ 39వ వార్డులోని కన్నె మేరీమ్మ ఆలయానికి వచ్చారు. ప్రార్థనల అనంతరం 11 గంటల సమయంలో ఘాట్ రోడ్డు దిగుతుండగా బ్రేక్ ఫెయిలై ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న ప్రయాణికులందరూ రోడ్డుపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 11 మంది డిశ్చార్జి కాగా ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

విద్యుత్ ప్రమాదంలో 15 గొర్రెలు మృతి

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం కాట్లగంటివారిపల్లెలో బుధవారం విద్యుత్ ప్రమాదానికి గురై 15 గొర్రెలు మృతి చెందాయి. వాటి యజమాని నరసింహనాయుడు ప్రమాదంలోంచి తృటిలో తప్పించుకున్నాడు. నరసింహనాయుడు తన గొర్రెలను రాత్రి ఇంట్లో ఉంచి ఉదయాన్నే ఆరుబయట ఉన్న కంచెలోపలకు తోలేవాడు. బుధవారం కూడా గొర్రెలను కంచె లోపలికి తోలుకెళ్లాడు. చీకటి ఉండటంతో అప్పటికే తెగిపడి ఉన్న 11కేవీఏ విద్యుత్ వైరును గమనించలేదు. కంచె లోపలికి వెళ్లగానే విద్యుత్ షాక్‌కు గురై 15 గొర్రెలు మృతి చెందాయి. వాటి వద్దకు వెళ్లే ప్రయత్నంలో అతడు కూడా షాక్‌కు గురై వెనక్కు పడి స్పృహ కోల్పోయాడు. పక్కనే ఉన్న గ్రామస్తులు అతన్ని కాపాడారు. గొర్రెల విలువ రూ. 2లక్షలు పైనే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

సెల్‌ఫోన్ చూడొద్దనందుకు ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: కుమార్తె తరచుగా సెల్‌ఫోన్ చూడటం, మాట్లాడుతుండటంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన కుమార్తె ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం చిత్తూరు జిల్లాలో జరిగింది. చౌడేపల్లె మండలం బూరగపల్లికి చెందిన వెంకట్రమణారెడ్డి కుమార్తె జానకి(19) తరచూ స్నేహితులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, సెల్‌ఫోన్ చూస్తుండటంతో తండ్రి మందలించాడు. మనస్తాపానికి గురైన జానకి ఇంట్లో ఉన్న క్రిమి సంహారక ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.



శభాష్ షెర్పా

ప్రపంచంలో ఎత్తయిన 14 పర్వతాలను అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా నిమా రింజి షెర్పా రికార్డ్

అవమానాలే అవకాశాలుగా మలచుకుని, తండ్రి స్ఫూర్తితో 'పర్వతా'లంత కీర్తి సాధించాడు నేపాల్‌కు చెందిన పర్వతారోహకుడు నిమా రింజి షెర్పా. తాము కేవలం సహాయకులమే కాదనీ, పర్వతాలనూ అధిరోహించగలమని నిరూపిస్తూ ప్రపంచంలో 8వేల మీటర్ల పైచిలుకు ఉన్న పర్వతాలను ఎక్కి 'షెర్పా' కీర్తి పతాకను రెపరెపలాడించాడు. తాజాగా చైనాలోని శిషాపంగ్మా శిఖరాగ్రానికి చేరుకున్న అతి పిన్నవయస్కుడిగా రికార్డ్ సాధించాడు. నేపాల్‌లోని హిమాలయ పర్వత సానువుల్లో 'షెర్పా' సామాజిక వర్గం పర్వతారోహకులకు సహాయకులుగా ఉంటారు. తరచూ వారి నుంచి 'షెర్పా' సామాజిక వర్గానికి చీత్కారాలు ఎదురయ్యేవి. చిన్నప్పటి నుంచి వీటిని కళ్లారా చూసిన రింజి, ఈ పరిస్థితిని మార్చాలనుకున్నాడు. పర్వతారోహకుల నుంచి మెలకువలు నేర్చుకున్నాడు. ఆక్రమంలోనే 2022లో తన 16 ఏట మౌంట్ మనస్లు (8163మీ) శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించాడు.

- ఏపీ సెంట్రల్ డెస్క్

మరిన్ని పర్వతాల అధిరోహణ..



2022లో మౌంట్ మనస్లు (8163మీ) శిఖరాన్ని అధిరోహించడం ద్వారా అతి పిన్న వయసులో ఈ పర్వతాన్ని ఎక్కిన యువకుడిగా రికార్డు సాధించాడు. అనంతరం మే 2023లో 17 సంవత్సరాల వయసులో కేవలం 10 గంటల వ్యవధిలో మౌంట్ ఎవరెస్ట్ (8848.86మీ), మౌంట్ లోట్సే (8516మీ) పర్వతాలను అధిరోహించడంతో అతని కెరీర్‌లో అతి పెద్ద విజయాన్ని సాధించినట్లయింది.

నిమా రింజి షెర్పా అధిరోహించిన 14 పర్వతాలు ఇవే..

మౌంట్ మనస్లు	8163మీ.	30 సెప్టెంబర్, 2022
మౌంట్ ఎవరెస్ట్	8848మీ.	24 మే, 2023
మౌంట్ లోట్సే	8516మీ.	24 మే, 2023
మౌంట్ నాగ పర్బాత్	8125మీ.	26 జూన్, 2023
మౌంట్ గషెర్‌బ్రీమ్-1	8068మీ.	18 జూలై, 2023
మౌంట్ గషెర్‌బ్రీమ్-2	8035మీ.	19 జూలై, 2023
మౌంట్ బ్రాడ్‌పెర్క్	8047మీ.	23 జూలై, 2023
మౌంట్ కె-2	8611మీ.	27 జూలై, 2023
మౌంట్ చో-ఓయు	8201మీ.	6 అక్టోబర్, 2023
మౌంట్ ధౌలగిరి	8167మీ.	29 సెప్టెంబర్ 2023
మౌంట్ అన్నపూర్ణ	8091మీ.	12 ఏప్రిల్ 2024
మౌంట్ మకాలు	8485మీ.	4 మే, 2024
మౌంట్ కంచన్‌జంగా	8586మీ.	8 జూన్, 2024
మౌంట్ శిషాపంగ్మా	8027మీ.	9 అక్టోబర్, 2024



స్ఫూర్తినిచ్చిన విజయం..



తాను సాధించిన విజయాలను బాటలుగా ఎంచుకుని 2023 జూలైలో మౌంట్ గాషెర్‌బ్రీమ్-1 (8068మీ), మౌంట్ గషెర్‌బ్రీమ్-2 (8035మీ), మౌంట్ బ్రాడ్‌పీక్ (8047మీ), మౌంట్ కె-2 (8611మీ), సెప్టెంబర్‌లో మౌంట్ ధౌలగిరి (8167మీ), అక్టోబర్‌లో చో-ఓయు పర్వతం (8188మీ)లను అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు.

కలతచెందిన మనసు

అయితే శిషాపంగ్మా పర్వతాన్ని అధిరోహిస్తున్న సమయంలో హిమపాతం కారణంగా నలుగురు అధిరోహకులు మరణించడంతో తాత్కాలికంగా విరామం తీసుకున్నాడు. దీనిపై స్పందిస్తూ మరణించిన నలుగురిలో తనకు ఒకరు స్నేహితుడని, అతడితో కలిసి పాకిస్తాన్‌లో ఐదు పర్వతాలను అధిరోహించినట్లు తెలిపాడు. తనకు మార్గదర్శిలాంటివాడని, కానీ హిమపాతంలో చిక్కుకుని మరణించడం మనసును కలచివేసిందని రింజి షెర్పా చెప్పాడు. ఇక 2024 ఆరంభంలో మళ్లీ పర్వతారోహణకు అవకాశం రాగా, ఏప్రిల్‌లో మౌంట్ అన్నపూర్ణ (8091), మే 4లో మకాలు (8485మీ) పర్వతాలను అధిరోహించగా, తాజాగా శిషాపంగ్మాను అధిరోహించడం ద్వారా రికార్డు నెలకొల్పాడు.

దొరా.. ఇళ్లురెడీ!

సమరయోధుల వారసుల సొంతింటి కల త్వరలోనే సాకారం

- గంటందొర, మల్లుదొర వారసుల కోసం లంకవీధిలో 11 ఫ్లాట్లు
- సామాజిక బాధ్యతగా రూ.2 కోట్లతో నిర్మించిన 'నాగార్జున కన్‌స్ట్రక్షన్స్'
- ఏడాది కిందట నాటి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యేల చొరవతో నిర్మాణం ప్రారంభం
- త్వరలో లబ్ధిదారులకు అందజేత

కొయ్యూరు: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుతో కలసి తెల్లదొరలపై సాయుధ పోరాటం చేసిన గంటందొర, మల్లుదొర వారసుల సొంతింటి కల అతి త్వరలోనే సాకారం కానుంది. సామాజిక బాధ్యతగా నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ(ఎన్‌సీసీ) రూ.2 కోట్లతో మల్లుదొర సొంత ఊరు అయిన కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీలోని లంకవీధిలో నిర్మిస్తున్న ఇళ్లు దాదాపు పూర్తయ్యాయి. నెల రోజుల్లో గంటందొర, మల్లుదొర వారసులు 11 మందికి వాటిని అందజేస్తారు. స్వాతంత్య్ర సమరయోధులు గాం గంటందొర, మల్లుదొర వారసుల కుటుంబాలకు సొంతిళ్లు లేక, గుడిసెల్లో నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ద్వారా క్షత్రియ సేవా సమితి నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ దృష్టికి తీసుకెళ్లింది. సామాజిక బాధ్యతగా సమరయోధుల వారసులకు ఇళ్లు నిర్మించాలని కోరారు. ఈ మేరకు 11 మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఎన్‌సీసీ ముందుకొచ్చింది. గత ఏడాది అక్టోబర్‌లో అప్పటి అరకు ఎంపీ జి.మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్ గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని సంస్థ నిలబెట్టుకుంది. రూ.2 కోట్లు వెచ్చించి రెండు భవనాలను నిర్మించింది.



ఒక్కో భవనంలో ఆరు ఫ్లాట్లు...

ఒక్కో భవనంలో ఆరు ఫ్లాట్లను ఎన్‌సీసీ నిర్మించింది. ఒక్కో ఫ్లాట్‌లో రెండు బెడ్ రూమ్‌లు, అటాచ్డ్ బాత్‌రూమ్‌లు, హాలు, వంటగదితో సహా అన్ని వసతులు కల్పించింది. మలు గంటందొర వారసులు 11 మందికి 11 ఫ్లాట్లు కేటాయించి, ఒక ఫ్లాట్‌ను ఎన్‌సీసీ తమ కార్యకలాపాల కోసం వినియోగించుకోనుంది. ఈ నిర్మాణ పనులను క్షత్రియ సేవా సమితి పర్యవేక్షిస్తోంది.

ఆనందంగా ఉంది

ఎన్నో సంవత్సరాల నుంచి సరైన గూడు లేక అవస్థలు పడుతున్నాం. ఇప్పటికి మా నిరీక్షణ ఫలించింది. చాలా ఆనందంగా ఉంది. ఇంత మంచి గృహాలు నిర్మించి ఇస్తున్న సంస్థకు కృతజ్ఞతలు. – గాం గంగరాజు, లంకవీధి

సొంతిల్లు అదృష్టం

ఎట్టకేలకు సొంత గూటికి చేరుతున్నామన్న ఆనందంలో ఉన్నాం. ఇంత అద్భుతంగా ఇళ్లు నిర్మించి ఇస్తారని అనుకోలేదు. రెండు బెడ్ రూమ్‌లతోపాటు హాలు, కిచెన్, అటాచ్డ్ బాత్‌రూమ్‌లు నిర్మించడం ఆనందంగా ఉంది. – గాం సన్యాసమ్మ, లంకవీధి

సమస్యను పరిష్కరించాం

ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని స్వాతంత్య్ర సమరయోధుల పక్కా ఇళ్ల నిర్మాణం మా హయాంలో చేపట్టినందుకు ఆనందంగా ఉంది. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ సంస్థ బాధ్యత తీసుకుని ఇంత అద్భుతంగా గృహాలను నిర్మించడం మరిచిపోలేని విషయం. లబ్ధిదారులు జీవితకాలం ఆ కంపెనీకి రుణపడి ఉంటారు. – జి.మాధవి, మాజీ ఎంపీ, అరకు

బాపూ మ్యూజియంలో వ్యాపారం!

- దుకాణాలకు అడ్డాగా మారిన పురావస్తు ప్రదర్శనశాల
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు ప్రవేశం
- ప్రాచీన విగ్రహాలు, శాసనాల భద్రతకు ముప్పు
- బాపూ మ్యూజియంలో కనుమరుగవుతున్న సందర్శకులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మ్యూజియంల (పురావస్తు ప్రదర్శన శాలల) భద్రత గాలిలో దీపంలా మారింది. ముఖ్యంగా విజయవాడ నడిబొడ్డున అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బాపూ మ్యూజియం వ్యాపార కేంద్రాలకు అడ్డాగా మారుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక మ్యూజియాన్ని ప్రైవేటు వ్యక్తుల ఎగ్జిబిషన్‌కు కట్టబెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బాపూ మ్యూజియం అంటే చారిత్రక ప్రసిద్ధి చెందిన గొప్ప కళాఖండాలు, విగ్రహాలు, పురాతన వస్తువులకు నిలయమనే భావాన్ని పక్కా ప్రణాళిక ప్రకారమే మరుగున పడేస్తున్నారు. విచ్చలవిడిగా ఎగ్జిబిషన్లకు అనుమతులు ఇవ్వడంపై పెట్టిన శ్రద్ధ మ్యూజియాన్ని ప్రమోట్ చేయడంలో చూపించకపోవడం పురావస్తు శాఖ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

వ్యాపారానికి అడ్డాగా మ్యూజియం

పురావస్తు శాఖలో ఏడేళ్లకుపైగా పాతుకుపోయిన ఓ ఉన్నతాధికారి ధనదాహానికి మ్యూజియం బలైపోతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డబ్బులే పరమావధిగా మ్యూజియాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నారని పురావస్తు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగ్జిబిషన్ల ఏర్పాటుతో బాపూ మ్యూజియం పేరున్న బోర్డు సైతం కనిపించకుండా పోతోందని, మహనీయుల విగ్రహాలను మూసేస్తూ దుకాణ సముదాయాలు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. వాస్తవానికి మ్యూజియం ప్రాంగణంలోకి



సందర్శకులు మినహా వ్యాపారాల కోసం ప్రైవేటు వ్యక్తులకు అనుమతి ఉండదు. కానీ, సదరు ఉన్నతాధికారి చెప్పిందే వేదంగా పురావస్తు శాఖను భ్రష్టుపట్టిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు మ్యూజియం ప్రాంగణంలో ప్రైవేటు వ్యాపారులను అనుమతించడమే తప్పంటే.. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పిలవడం కొసమెరుపు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో కాకుండా పురావస్తు శాఖ వెబ్‌సైట్‌లో ఎవరికీ కనిపించకుండా గుట్టుచప్పుడు కాకుండా టెండర్లు పిలిచి.. తనకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు దక్కేలా చక్రం తిప్పుతున్నట్టు భోగట్టా.

నిధులు పక్కదారి

బాపూ మ్యూజియంలో ప్రతి నెలా ఏదో ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 70–80 దుకాణాలు ఏర్పాటు చేస్తే.. నెలకు రూ.5లక్షల నుంచి రూ.7లక్షల వరకు వస్తోంది. ఏడాదికి రూ.50లక్షల నుంచి రూ.70లక్షల ఆదాయం వస్తుంటే.. ప్రభుత్వ ఖజానాకు వెళ్లకుండా పక్కదారి పడుతున్నట్టు తెలుస్తోంది. మ్యూజియంలోకి వ్యాపారులు రావడం వల్ల పురాతన వస్తువుల భద్రత, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని పురావస్తు పరిశోధకులు ఆందోళన చెందుతున్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 68,146 మంది స్వామివారిని దర్శించుకోగా 22,667 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టిక్కెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం అవుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

శివయ్య హుండి ఆదాయం 1.94 కోట్లు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,94,41,581 వచ్చినట్టు ఈవో బాపి రెడ్డి తెలిపారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం హుండీలోని కానుకలను లెక్కించినట్టు పేర్కొన్నారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 85.100 మి.గ్రాములు, వెండి 607.100 కిలోలు, విదేశీ కరెన్సీ 145 నోట్లు వచ్చినట్టు పేర్కొన్నారు.

దుర్గమ్మ హుండీ కానుకల ఆదాయం రూ.2.83 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, ముడుపులు, మొక్కుబడులను బుధవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 15 రోజులకు గాను హుండీల ద్వారా రూ. 2,83,53,460 నగదుతో పాటు 431 గ్రాముల బంగారం, 6.450 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

ముగిసిన తిరునక్షత్రం పూజలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గడిచిన ఐదు రోజులుగా జరిగిన మనవాళ మహామునులు తిరునక్షత్రం పూజలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఆలయ ఆస్థానమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారులను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు.

విద్యా సమాచారం

సాంస్కృతిక వైభవంపై నేడు 'నన్నయ'లో సదస్సు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రెండు రోజులపాటు నిర్వహించే 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు గురువారం ప్రారంభం కానుంది. సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్‌తో యూనివర్సిటీకి కుదిరిన ఒప్పందంలో భాగంగా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ వీసీ ప్రొఫెసర్ శాంతిశ్రీ దూళిపాల పండిట్, శుక్రవారం జరిగే ముగింపు కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరు కానున్నారు.

మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఎంకామ్, ఎంఏ తెలుగు, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం)లో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం, అర్హత, ఫీజు, కోర్సు వివరాలు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. స్పాట్ అడ్మిషన్ల కోసం ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందజేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 0877–2284524, 8121787415 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఇంటర్వ్యూ

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ స్థానంలో (ఆర్ఏఆర్ఎస్) రెండు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాంట్ ఫెథాలజీ, వైరాలజీ, బయోకెమిస్ట్రీలో మాస్టర్ డిగ్రీ, ఫామ్ మిషనరీలో ఎంటెక్ చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆంగ్రౌ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట: పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, జీవో నెం .77 రద్దు చేయాలని, విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సాయికుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్లు విడుదల చేయలేదన్నారు.

నాగార్జునకొండను సందర్శించిన శ్రీలంక దేశీయులు



విజయపురి సౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను బుధవారం శ్రీలంక దేశానికి చెందిన 50 మంది బృందం సందర్శించింది. వీరు స్థానిక లాంచీస్టేషన్ నుంచి శాంతిసిరి లాంచీలో నాగార్జునకొండకు చేరుకున్నారు. కొండలోని మ్యూజియంలో తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని పుట్టుకకు సంబంధించిన శిలా ఫలకాలు, రాతి పనిముట్లు, సింహళ విహార్‌లోని మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం తిలకించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి పర్యాటకశాఖ ఉద్యోగులు వారికి వివరించారు.

సన్నిధి
సాక్షి ప్లస్
గురువారం ॥ 7-11-2024



పూజ ఎందుకు? ఎలా చేయాలి?

భగవంతుణ్ణి చేరుకోవడానికి పెద్దలు చెప్పిన అనేక మార్గాలలో పూజ లేదా అర్చన అనేది ఒక మార్గం. మన ఇంటికి వచ్చిన పెద్దవారిని గౌరవించి చేసే అతిథి సత్కారమే పూజ. మన ప్రార్థన మన్నించి మనం పిలవగానే మన ఇంటికి వచ్చే భగవంతుడికి మనం చేసే సేవనే పూజ అంటాం. అజ్ఞానం నుండి జ్ఞానం వైపుకు, చీకటి నుండి వెలుగులోకి, దానవత్వం నుండి మానవత్వానికి, మానవత్వం నుండి దైవత్వం వైపు మన మనస్సును పురోగమింప చేయడానికి పూజను చేయాలి.

షోడశోపచార పూజ

ఉత్సవాలు ఎన్నిచేసినా అన్నిటికీ పునాది వంటిది షోడశోపచార పూజ. ఇది అన్ని పూజలకు సమానంగా ఉండే పునాది. మిగిలిన ఉత్సవాలు చేతనైనా కాకపోయినా ప్రతివారూ ఈ షోడశోపచార పూజా విధానం నేర్చుకోవాలి.

షోడశ అంటే 16; అంటే 16 రకాల సేవలు మనం దేవతలకు అర్పిస్తున్నాం గనుక, దీని పేరు షోడశోపచార పూజ. దేవత మన ఎదురుగుండా ప్రత్యక్షంగా ఉండదు. మరి మనం ఉపచారాలు ఎలా చేస్తాము?

పూజ అంటే లోపల ఏదో ఆలోచిస్తూ పూలు చల్లటం కాదని, మనస్ఫూర్తిగా భగవంతుని గురించి భావన చేయటమేనని అర్థం చేసుకోవాలి. పూజలో ఉపయోగపడే మంత్రాలు, శ్లోకాలు మొదలైనవన్నీ ఈ భావనాశక్తిని పెంచటం కోసం అనుభవజ్ఞులైన మన పెద్దలు ఏర్పరచినవే.

దైవానికి చేసే సపర్యలే షోడశోపచార సేవలు

1. ఆవాహనం, 2. ధ్యానం 3. ఆసనం 4. పాద్యం 5. అర్ఘ్యం 6. స్నానం-అభిషేకం 7. వస్త్రం, 8. యజ్ఞోపవీతం 9. గంధం 10. అధాంగ పూజ 11. ధూపం 12. దీపం 13. నైవేద్యం 14. తాంబూలం 15. నీరాజనం 16. మంత్ర పుష్పం



1. ఆవాహనం
భగవంతుడిని పూజామండపానికి ఆహ్వానించడం

2. ధ్యానం
భగవంతుడిపై పూర్తిగా మనసు లగ్నం చేసి పూజామండపం లోకి ఆహ్వానించి పూజించడానికి శ్లోకంతో చేసే సేవను ధ్యానం అంటారు. భగవంతుడిని రాముడు, కృష్ణుడు, లక్ష్మి లేదా గౌరీ అంటూ ఏ రూపంలోనైనా పూజించవచ్చు. అది పూజ చేసే సందర్భాన్ని బట్టి, మనకున్న నమ్మకాన్ని బట్టి ఉంటుంది. ఏ పేరుతో పిలిచినా, ఏ రూపంలో కొలిచినా భగవంతుడు ఎప్పుడూ భక్తుల పక్షమే. శ్రద్ధాసక్తులు ముఖ్యమైనవి.

3. ఆసనం
రత్నాలంకృతమైన బంగారు సింహాసనాన్ని అధిష్టించి పూజలందుకొమ్మని ఆసనం సమర్పించడం.

4. పాద్యం
పాదాలు(కాళ్ళు) శుభ్రపరుచుకోవడానికి నీరందించడాన్ని పాద్యం అంటారు.

5. అర్ఘ్యం
చేతులు శుభ్రపరుచుకోవడానికి నీరు అందించడాన్ని అర్ఘ్యం అంటారు.

6. అభిషేకం
స్నానికి జలం సమర్పించడాన్ని అభిషేకం అంటారు. దేవునికి పంచామృతం (తేనె, ఆవు పాలు, ఆవు నెయ్యి, పెరుగు, పంచదార) స్నానం అత్యంత ప్రీతికరమైనది. ఈ ఏడు పదార్థాలతో స్నానం చేయించి తర్వాత మళ్ళీ శుద్ధమైన జలంతో స్నానం చేయించడాన్ని అభిషేకం అంటారు.

7. వస్త్రం
అభిషేకం పూర్తి అయ్యాక దేవునికి సమర్పించే వస్త్రాలను వస్త్రం సమర్పయామి అని అందిస్తారు.

8. యజ్ఞోపవీతం
భుజం పై నుంచి వేసుకోవడానికి యజ్ఞోపవీతం సమర్పించడం.

9. గంధం
దేవి లేదా దైవానికి గంధం, అక్షతలు మరియు పుష్పాలు సమర్పించడం.

10. అధాంగ పూజ
దేవునికి వారి అన్ని శరీర అవయవాలను కీర్తిస్తూ పూజ సమర్పించడాన్ని అధాంగ పూజ అంటారు.

11. ధూపం
దైవానికి సుగంధంతో కూడిన అగరవత్తులు, ధూపం సమర్పించడం.

12. దీపం
దీపాన్ని వెలిగించి దేవుని ముందుంచి ధ్యాన నిమగ్నులమై పూజించడం.

13. నైవేద్యం
భక్తి ప్రపత్తులతో, శ్రద్ధాసక్తులతో భగవంతునికి ఆరగించడానికి సమర్పించే భక్ష్య భోజ్యాలను నైవేద్యం అంటారు. ఆ భగవానుడే మనకి ఇచ్చిన జీవితానికి, ఆనందాలకు, సుఖశాంతులకు, మనం మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ఇదొక అవకాశం.

14. తాంబూలం
మనం భక్తి తో సమర్పించిన భక్ష్య భోజ్యాలతో సంతుష్టుడైన దేవునికి, తాంబూలం సమర్పించడం. తాంబూలం జీర్ణశక్తిని పెంచుతుంది.

15. నీరాజనం
దేవునికి కర్పూరంతో హారతి వెలిగించి, దిష్టి తీసి, మంగళం పాడి, మనం కళ్ళకి అద్దుకోవడం.

16. మంత్రపుష్పం
మన మనస్సునే ఒక పుష్పంగా చేసి భగవంతునికి సమర్పించడానికి మంత్ర సహితంగా చేసే సేవనే మంత్రపుష్పం అంటారు.

ఇన్ని సేవలూ పూర్తి అయ్యాక, చేసిన పూజలో గాని, చదివిన మంత్రాలలో గాని తప్పులు ఏమైనా దొర్లితే మన్నించమని, ఉచ్చారణ దోషాలున్నా, భక్తి లో ఎటువంటి లోపము ఉండదని అపరాధ క్షమాపణ చెప్పుకుని మనం ఆహ్వానించిన దైవాన్ని తిరిగి సాదరంగా సాగనంపుతారు.

వెళ్లేముందు ''పునరాగమనాయచ'' అంటూ మళ్ళీ రమ్మని చెప్పి మరీ పంపుతారు. చివరగా ఒక మాట... ఏ వస్తువు మీద మనసు ఏకాగ్రమౌతుందో దాని లక్షణాలను పొందటం మనస్సు స్వభావం. మనస్సు భగవంతుడి మీద ఏకాగ్రమైతే అది భగవంతుడే ఐపోతుంది. అదే మన చివరి లక్ష్యం. ఇవి మనం నిత్యం దేవునికి సమర్పించే షోడశోపచారాలు (సేవలు).

- డీవీఆర్

దక్షిణ భారతాన అతి పెద్ద ఆలయం
మయూర నాథ ఆలయం

కార్తీకమాసం సందర్భంగా సుప్రసిద్ధ శైవ క్షేత్రమైన మయూర నాథ ఆలయం గురించి తెలుసుకుందాం. దక్షిణ భారత దేశంలోని అతిపెద్ద శివాలయాలలో ఒకటిగా పేరు గాంచింది. మాయవరంలోని మయూర నాథ ఆలయం. శివుడు లింగ రూపంలో వెలసిన ఆలయాలు అనేకం ఉన్నాయి, అందులో అతి పెద్ద శివాలయాలలో ఈ ఆలయం ఒకటిగా చెబుతారు. ఈ ఆలయంలో చెప్పుకోదగ్గ విశేషం ఏమింటంటే... పార్వతీదేవి మయూర రూపంలో స్వయంగా సృష్టించిన దేవాలయం ఇది. మరి పార్వతీదేవి ఈ దేవాలయాన్ని ఎందుకు సృష్టించింది? ఇదెక్కడ ఉందనే విషయాన్ని తెలుసుకుందాము...







తమిళనాడు లోని, నాగపట్నం జిల్లాలోని మైలాడుతుర్రై అని పిలిచే మాయవరంలో మయూరనాథ దేవాలయం వుంది.

ప్రస్తుతమున్న మైలాడుతుర్రైనే మాయవరం అని పిలిచేవారు. ఇది చాలా పురాతనమైన ఆలయంగా, ఎంతో విశిష్టతను కలిగి ఉంది.

ఈ దేవాలయ రాజగోపురం తొమ్మిది అంతస్థులలో నిర్మితమైంది.

దక్షిణ భారతదేశంలో అతి పెద్ద శివాలయాలలో ఇది కూడా ఒకటి.

స్థలపురాణం

ఇక్కడ దక్షప్రజాపతి శివపార్వతులను ఆహ్వానించక చేస్తున్న యాగానికి, పరమశివుడు వారిస్తున్నా వినకుండా వచ్చిన పార్వతీదేవిని అవమానిస్తున్న సందర్భంలో... జరుగుతున్న ఈ రసాభాసలో ఆ యజ్ఞగుండ అగ్నికి భయపడి, అక్కడే ఉన్నటువంటి ఓ చిన్న నెమలిపిల్ల పార్వతీదేవి ఒడిలో దాక్కుంది.

అదే సమయానికి పార్వతీదేవి తనని తాను యోగాగ్నిలో దహించుకునేసరికి, ఒడిలో ఉన్న నెమలిపిల్ల కూడా ఆహుతైపోతుంది.

అలా నెమలితో అగ్నికి ఆహుతి కావడంతో, తర్వాత నెమలి రూపంలో జన్మించి, జరిగిన పాపాన్ని ప్రక్షాళన చేసుకోడానికి పార్వతీదేవి ఇక్కడ శివుని మందిరాన్ని సృష్టించి, శివుణ్ణి ప్రార్థించి, ఆయనలో లీనమైనట్లు స్థల పురాణం చెబుతోంది.

పార్వతీదేవి మయూర రూపంలో స్వయంగా సృష్టించిన దేవాలయం కాబట్టి, ఈ ఆలయానికి మయూర నాథ దేవాలయం అని పేరు స్థిరపడింది.

ఈ మయూరనాథుడే శివుడు. పార్వతీదేవిని ఇక్కడ అభయాంబిక, అభయ ప్రధాంబిక అనే పేర్లతో భక్తులు పిలుస్తుంటారు.

ఈ ఆలయాన ఓ మర్రి చెట్టు ఉంది.

ఈ మర్రి చెట్టుకిందే పార్వతీదేవి మయూర రూపంలో తపస్సు చేసినట్లు భక్తులు భావిస్తారు.

ఇక్కడ కావేరీ నది ప్రవహిస్తోంది. దీనిని వృషభా తీర్థం అని పిలుస్తారు. ఇక్కడి కావేరీ నదిలో, ప్రతీ పౌర్ణిమ రోజున తమ తమ గంగ యమునలతోపాటు ఇక్కడికి వచ్చి తమ అంశలతో కూడిన నదులు ఇక్కడికి వచ్చి, తమ జలాల్ని ఈ కావేరినదిలో జారవిడుస్తాయట.

అందువలనే ఈ ప్రాంతాన్ని దక్షిణ త్రివేణి సంగమమని భక్తులు తలుస్తుంటారు.మాయవరం పట్టణం చిదంబరం నుంచి 46 కిలోమీటర్ల దూరంలో ఉంది.



పురాతన ఆలయం

శాసనాల ప్రకారం క్రీ.శ 9 వ శతాబ్దంలో చోళుల కాలంలో నిర్మితమైందని చెబుతారు.

చోళరాజుల వాస్తు నైపుణ్యం, అద్భుతమైన చెక్కడాలు, అపురూపమైన శిల్పాలు ఎంతోగాను ఆకట్టుకుంటాయి. తమిళనాడులోని అత్యంత అందమైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ఈ క్షేత్రం ప్రసిద్ధికెక్కింది.

నిమిషం విషయం

తీర్థాన్ని ఎలా తీసుకోవాలి?



గుడికి వెళ్తే ప్రసాదం తీసుకున్నా లేకున్నా తీర్థం తప్పకుండా తీసుకుంటాం. పూజారి గారు మరేదో వ్యాపకంలో ఉన్నా అడిగి మరీ తీసుకుంటాం. తీర్థం అంత అమూల్యమైంది, శ్రేష్ఠమైంది.

తీర్థం తీసుకునేటప్పుడు కుడిచేతిని గోకర్ణంలా (ఆవు చెవి ఆకృతి) పెట్టాలి. అంటే చేతిని డిప్పలా ముడిచి, చూపుడు వేలును బొటనవేలుకు ఆనించాలి. అంతే తప్ప ఒక చేయి, లేదా రెండు చేతులను దోసిళ్ళలా పట్టకూడదు.ఉద్ధరణితో మూడు సార్లు తీర్థం పోసిన తర్వాత కళ్ళకు అద్దుకుని తాగాలి. తీర్థం తాగేటప్పుడు నిలబడకూడదు. కూర్చుని మాత్రమే సేవించాలి. తీర్థం తీసుకునేటప్పుడు జుర్రిన శబ్దం రాకూడదు. మనసులో దేవుని స్మరించుకుంటూ నిశ్శబ్దంగా సేవించాలి.

కొన్ని ఎప్పటికీ ఆచరించవలసిన నియమాలు

- అన్నం తింటున్నప్పుడు అన్నాన్ని, ఆ అన్నం పెట్టువారిని తిట్టటం, దుర్భాషలాడటం చేయరాదు.
- ఏడుస్తూ తినడం, గిన్నె / ఆకు మొత్తం ఊడ్చుకొని తినడం పనికిరాదు,
- ఒడిలో కంచం, పళ్ళెం పెట్టుకుని అన్నం తినరాదు.
- భోజనసమయంలో నవ్వులాట, తగువులాట, తిట్టుకొనటం, గేలి చేయటం నష్టదాయకం.
- భోజనానంతరం ఎంగిలి ఆకులు / కంచాలు ఎత్తేవారికి వచ్చే పుణ్యం, అన్నదాతకు కూడా రాదు.



ప్రవక్త పలుకు


ఏది హరాం? ఏది హలాల్?

అల్లాహ్ అంటున్నాడు: అంధుడు గాని, కుంటివాడు గాని లేదా వ్యాధిగ్రస్తుడు గానీ, ఎవరింట్లోనైనా ఏదైనా తింటే తప్పులేదు. మీరైనా సరే మీ ఇండ్లలో గాని, మీ తండ్రి తాతల ఇళ్లల్లో గాని, మీ తల్లి, అమ్మమ్మ, నాయనమ్మల ఇళ్లల్లో గాని, మీ అన్నదమ్ముల ఇళ్లల్లో గాని, మీ అక్క చెల్లెళ్ల ఇళ్లల్లో గాని, మీ బాబాయి పెదనాన్నల ఇళ్లల్లో గాని, మీ మేనత్తల ఇళ్లల్లో గాని, మీ మేనమామల ఇళ్లల్లో గాని, మీ పిన్ని, పెద్దమ్మల ఇళ్లల్లో గాని, తాళపు చెవులు మీ అధీనంలో ఉన్న ఇండ్లలో గాని లేదా మీ స్నేహితుల ఇళ్లల్లో గాని, ఏదైనా తింటే తప్పులేదు. అలాగే అందరూ కలిసితిన్నా, వేరువేరుగా తిన్నా తప్పులేదు. 'అయితే మీరు ఇండ్లల్లో ప్రవేశించే ముందు ఇంట్లో ఉన్నవారికి సలాం చేయండి' ఇది దేవుడు నిర్ణయించిన ఆశీర్వాదం. ఎంతో శుభప్రదమైనది.

వివరణ: భోజనం చేసే విషయం ఇక్కడ ఎందుకు ప్రస్తావనకు వచ్చిందంటే, అల్లాహ్: 'హలాల్' అంటే అనుమతించబడిన దాని గురించి 'హరాం' అంటే నిషేధితమైన దానిగురించి ఆదేశించినందువల్ల.

ఇబ్ను అబ్బాస్ ప్రకారం అల్లాహ్ వారిని: ఒకరి సొమ్ము ధర్మ విరుద్ధమైన రీతిలో తినకండి అని ఆదేశించినప్పుడు

ఇక్కడ తమ ఇండ్లలో భోజనం చేయడం గురించి వచ్చిన ప్రస్తావన అనుమతి ఇవ్వడానికి కాదు తమ బంధువుల ఇళ్లల్లో మిత్రుల ఇళ్లల్లో బోజనం చేయడం కూడా తమ ఇండ్లలో తినడం లాంటిదే అనే విషయాన్ని తెలియజేయడానికే.



అంగవికలురైన వారి విషయానికి వస్తే వారు తమ ఆకలిని తీర్చుకునేందుకు ప్రతి ఇంట, ప్రతిచోట భోజనం చేయవచ్చు. వారి అశక్తత స్వయంగా సమాజం మొత్తం పైన వారి హక్కును నిర్ధారిస్తుంది. అందువల్ల వారికి భోజనం ఎక్కడ లభించినా అది 'హలాల్' అంటే ధర్మ సమ్మతం అవుతుంది.

మిత్రులు అంటే సన్నిహిత మిత్రులు. మొగమాటం లేని ఆప్తమిత్రులు. తన సంపాదన హలాల్ సంపాదన లేక హరాం సంపాదన తను తినే ఆహారం అనుమతించబడిందా నిషేధించబడిందా అని అడుగడుగునా ఆలోచిస్తూ జీవించాలి. అప్పుడే మనిషి హలాల్‌కు అలవాటై హరాంకు దూరం అవుతాడు. సామాన్యంగా కోడిని లేక మేకను, మేకపోతు గొంతు కోయడాన్ని హలాల్ అంటారు. హలాల్ అంటే ధర్మ సమ్మతం చేయబడింది. అంటే ఈ హలాల్ అనే పదం కేవలం పశువును కోయడం వరకే పరిమితం కాదు సంపాదన కోసం ఉపయోగపడుతుంది అంటే హలాల్ సంపాదన. నీతి నిజాయితీగా సంపాదించిన సంపాదన హలాల్ సంపాదన. లంచం, వడ్డీ ద్వారా సంపాదించింది అవినీతి దొంగతనం ద్వారా సంపాదించింది నిలువు దోపిడి చేసి సంపాదించింది వ్యభిచారం చేసి సంపాదించింది సారాయి అమ్మి సంపాదించింది ఇవన్నీ హరాం కిందికి వస్తాయి. అంటే నిషేధించబడిన సంపాదన. కాబట్టి అడుగడుగునా ఆలోచించి ఏ పనైనా చేస్తే వారు హరాం నుంచి రక్షణపొంది హలాల్ వైపు వెళ్లగలుగుతారు.

- మొహమ్మద్ అబ్దుల్ రషీద్

సువార్త

అర్థవంతమైన జీవితం



అర్థవంతమైన చక్కటి జీవితం కొరకు ఆశ కలిగి వుండుట ఆశీర్వాదకరం. ప్రతి విషయంలో చేయగలిగే నూతనమైన ఆశ, ఆశయం, ఉజ్వల భవిష్యత్తుకోసం ప్రణాళిక కలిగి వుండాలి. ఈ యవ్వన కాలం బాగుపడాలన్నా, పాడైపోకుండా వుండాలన్నా దేవుని యందు భయభక్తులు కలిగి వుండాలి. అప్పుడే వారి జీవితాలకు బీజం పడుతుంది. గుణమంతురాలైన భార్యాబిడ్డలు, వ్యాపారం /ఉద్యోగం కావాలన్నా యవ్వనదశలోనే ప్రవర్తన సక్రమంగా వుండాలి. అటువంటి వారి జీవితం సుఖమయమౌతున్నది.

అనేకమంది యువతీ యువకులు కన్నులు పాపంతో నిండి వున్నాయి. ఈ విషయంలో యేసుప్రభువు వారు తన కొండమీద ప్రసంగంలో ఒక స్త్రీని మోహపు చూపు చూసే ప్రతివాడు అప్పుడే తన హృదయంలో ఆమెతో వ్యభిచారం చేసినవాడవుతాడని, సాధారణంగా కామం కంటిచూపుతోనే మొదలవుతుంది. శోధన అంతర్గతంగా బయలుదేరుతుంది. తర్వాత కార్యరూపం దాలుస్తుంది. కనుక కంటిని ఎంతో పవిత్రంగా కాపాడుకోవాలి. దేహానికి, ఆత్మకు దీపం కన్నే కనుక నీ కన్ను తేటగా ఉంటే దేహమంతయూ వెలుగు మయమై వుండును. నీ కన్ను చెడితే నీ దేహమంతా చీకటిమయమవునని వాక్యం బోధిస్తున్నది (లూకా 11:33-34).

ఒకరోజు యేసుప్రభువువారు గతిలయకు వెళ్ళగోరి ఫిలిప్పును కనుగొని- నన్నువెంబడించుమని అతనికి చెప్పాడు. ఫిలిప్పు నతనయేలును కనుగొని-ధర్మశాస్త్రంలో మోషేయు ప్రవక్తలు ఎవరిని గూర్చి రాశారో ఆయనను కనుగొంటిమి. ఆయన యేసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని అతనితో చెప్పాడు. అందుకు నతనయేలు-నజరేయలో నుండి మంచిదేదైనను రాగలదా అని అతనిని అడగ్గా -వచ్చి చూడమని ఫిలిప్పు అతనితో చెప్పాడు. యేసు నతనయేలు తన వద్దకు రావడం చూసి యితడు నిజంగా ఇశ్రాయేలీయుడు, ఇతని యందు ఏ కటము లేదు. నన్ను నీవు ఎలాగైనా ఎరుగుదువని నతనియేలు యేసును అడగ్గా యేసు ఫిలిప్పు నిన్ను పిలవక మునుపే,నీవు అంజూరపు చెట్టుకింద వున్నప్పుడే నిన్ను చూశానని అతనితో చెప్పాడు. నతనయేలు -బోధకుడా! నీవు దేవుని కుమారుడవు. ఇశ్రాయేలు రాజువు అని ఆయనకు ఉత్తరమిచ్చెను. అందుకు యేసుక్రీస్తు అంజూరపు చెట్టుకింద కూర్చున్నావని చెప్పినందుకు నమ్ముతున్నావా? వీటికంటే గొప్ప కార్యక్రమాలు చూస్తావని అతనితో చెప్పాడు. ఆయన (యేసు ప్రభువువారు) - మీరు ఆకాశం తెరువబడుటయు దేవుని దూతలు మనుష్య కుమారునిపైగా ఎక్కుటయు, దిగుటయు చూస్తారని మీతో నిశ్చయంగా చెబుతున్నానని అన్నాడు (యోహాను 1:43-51).

కనుక మనకు ఇంత సాక్షి సమూహం మేఘం వలె ఆవరించి వున్నందున మనం కూడా ప్రతి భారాన్ని సులువుగా చిక్కుల్లో పెట్టు పాపాన్ని విడిచిపెట్టాలి. విశ్వాసానికి కర్తయైన యేసుప్రభువు వైపు చూసి పందెంలో ఓపికతో పరుగెత్త వలెను. మీరు పాపంతో పోరాడటానికి రక్తం కారునంతగా ఎదిరింపలేరు. ఇంకోసంగతి నా కుమారులారా! ప్రభువు వేయు శిక్షను తృణీకరించవద్దు. ప్రభువు తాను ప్రేమించిన వారిని శిక్షించును.. అని కుమారులతో మాట్లాడినట్లు ప్రభువు మనతో మాట్లాడుతున్నాడు. మనం శరీర సంబంధీకులైన తలిదండ్రులతో భయభక్తులతో వున్నారు కానీ, ఆత్మలకు తండ్రియైన దేవునికి మరి ఎక్కువగా లోబడి బతుకవలెనని, అట్టి భయభక్తులు దేవునియందు కలిగి ఉండి, మంచిగా జీవించాలని వాక్యం సెలవిస్తుంది (హెబ్రీ 12:1 -10). కనుక ఆ విధంగా ప్రవర్తనను జాగ్రత్తగా వుంచుకొందురు గాక.

- కోట బిపిన్ చంద్రపాల్

కథారీతి

సంకల్పమే సగం బలం

సత్ సంకల్పం వల్ల సత్ఫలితాలే కలుగుతాయి. అందుకు మన పురాణాలలో కోకొల్లలుగా కథలు కనిపిస్తాయి. పురాణాలలో కొన్ని పాత్రలు సంకల్పానికి ఉన్న బలమేంటో మనకు తెలియజేస్తున్నాయి...

తన పితరులైన సగరులకు మోక్ష ప్రాప్తి కోసం భగీరథుడనే మహారాజు కఠోర తపస్సు చేసి, బ్రహ్మను మెప్పించి గంగను భూమి మీదకు పంపవలసిందిగా ప్రార్థించాడు. అందుకు బ్రహ్మ కరుణించి గంగా ప్రవాహాన్ని భూమి తట్టుకోలేదని, ఆ శక్తి ఒక్క శివునికే ఉందని చెప్పాడు. దాంతో భగీరథుడు శివుని గూర్చి ఘోరతపస్సు చేయగా, శివుడు ప్రత్యక్షమై అతని కోర్కెను తీర్చడానికి అంగీకరించడమే కాక, గంగను తన తలమీదనే ఉంచుకుంటానని చెప్పాడు. అయితే, గంగ అహంకారంతో శివుడి తలనే వంచానని విర్రవీగింది. గంగ అహాన్ని గమనించిన శివుడు ఆమెను ఏకంగా తన జటాజూటంలో బంధించాడు. మార్గంతరం లేని భగీరథుడు మరలా తపమాచరించి గంగను క్షమించి, భూమిపైకి పంపమని శివ మహారాజును కోరగా, అందుకు ఆయన అంగీకరించి గంగను భూమిమీదకు పంపాడు. భగీరథుడు గంగా ప్రవాహాన్ని ఎంతగా క్రమబద్ధం చేస్తున్నప్పటికీ, అత్యుత్సాహంతో గంగ మహర్షి జాహ్నవి హోమాన్ని చిందరవందర చేసింది. దానికి ఆగ్రహించిన ఆయన గంగను ఔపాసన పట్టడంతో భగీరథుని సమస్య మరలా మొదటి కొచ్చింది. పట్టువీడని భగీరథుడు గంగను కరుణించి విడుదల చేయమని మహర్షిని కోరాడు. అందుకు జాహ్నవి అంగీకరించి ఆమెను విడవడంతో తన పూర్వీకుల భస్మాలపై గంగను ప్రవహింపజేసి, వారికి ముక్తి కలిగించాడు! ఈ విధంగా అకుంఠిత దీక్షకు మారుపేరుగా భగీరథుడు నిలిచాడు. లక్ష్య సాధనకు కృషి అంటే అదన్నమాట.. ఇవే కాక ఏకలవ్యుడు, హనుమంతుడు, భీష్ముడు, విశ్వామిత్రుడు, ధ్రువుడు వంటివారి గాథలు చదివితే, పట్టువదలని బలమైన సంకల్పబలమే వారిని లక్ష్యం దిశగా నడిపించి, అనుకున్నది సాధించేలా చేసిందని, మనం తెలుసుకోవచ్చు.



బిజినెస్ రీల్

ఎఫ్‌సీఐకి రూ. 10,700 కోట్లు

సీసీఈఏ ఆమోదం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) నిర్వహణ మూలధన అవసరాల కోసం కేంద్రం నుంచి రూ. 10,700 కోట్లు అందనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదముద్ర వేసినట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఆహార ధాన్యాల సేకరణ, పంపిణీకి ఎఫ్‌సీఐ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఎఫ్‌సీఐ కార్యకలాపాల నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ నిధులు తోడ్పడతాయని మోదీ తెలిపారు. 1964లో రూ. 100 కోట్ల అధీకృత మూలధనంతో ప్రారంభమైన ఎఫ్‌సీఐ గణనీయంగా విస్తరించింది.

హనీవెల్ ఏరోస్పేస్‌తో సైయంట్ డీఎల్‌ఎం జట్టు

CYIENT DLM — Honeywell Aerospace

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైక్రో వేపర్ సైకిల్ సిస్టం (మైక్రో వీసీఎస్) అభివృద్ధికి సంబంధించి హనీవెల్ ఏరోస్పేస్ టెక్నాలజీస్‌తో జట్టు కట్టినట్లు సైయంట్ డీఎల్‌ఎం వెల్లడించింది. ఎయిర్‌క్రాఫ్ట్ కూలింగ్ సిస్టమ్స్ కోసం లిక్విడ్ కూలింగ్ లూప్స్‌ను అభివృద్ధి చేసేందుకు దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ ప్రోగ్రాం 16 ఏళ్ల పాటు ఉంటుందని వివరించింది. మైక్రో వీసీఎస్ టెక్నాలజీతో విమానాల్లో క్యాబిన్ ఉష్ణోగ్రతల నియంత్రణ విధానం గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉంది. ప్రస్తుత సిస్టమ్స్‌తో పోలిస్తే బరువు 35 శాతం తగ్గడంతో పాటు సిస్టమ్ సమర్థత 20 శాతం మెరుగ్గా ఉంటుందని సంస్థ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

7-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560-00
విజయవాడ	565-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00
రిటైల్ ధర	6.10

నేటి బోర్డు సమావేశాలు

ఎంఅండ్‌ఎం, ఎస్కార్ట్స్, ఏబీ ఫ్యాషన్స్, శ్రీ చక్ర సిమెంట్స్, మ్యాట్రిమోనీ డాట్‌కామ్, కొచ్చిన్ షిప్‌యార్డ్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, విజయ డయాగ్నొస్టిక్, ఇండియన్ హోటల్స్, ఇమామీ పేపర్స్, పేజ్ ఇండస్ట్రీస్, సెయిల్, ఎన్‌హెచ్‌పీసీ, మోల్డ్ టెక్ ప్యాక్, ఇండిగో పేయింట్స్, ఇర్కాన్.

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	301.6	5.33
ADANIENT	3,046.25	4.48
TCS	4,143.00	4.32
WIPRO	565	3.92
HCLTECH	1,843.00	3.92

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,607.00	-1.6
TITAN	3,183.55	-1.45
HDFCLIFE	709.3	-1.11
INDUSINDBK	1,080.20	-0.91
TRENT	6,929.95	-0.55

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,948
ఎన్‌ఎస్‌ఈ	99,926
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,36,749
ఎఫ్ఐఐ	- 2,569
డీఐఐ	+ 3,031

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.58	$ 71.47
బ్రెంట్	75.19	$ 75.08

క్విక్ కామర్స్‌లోకి మరిన్ని బ్రాండ్‌లు

యూఎస్‌పోలో, ఫ్యాబ్ ఇండియా, అడిడాస్, డెకథ్లాన్

- లిస్టింగ్‌కు క్యూ కడుతున్న కంపెనీలు
- మార్కెట్ విస్తరణతో అమ్మకాల పెంపుపై దృష్టి



న్యూఢిల్లీ: క్విక్‌కామర్స్‌కు పట్టణ వాసుల నుంచి ఆదరణ పెరుగుతుండడంతో.. ప్రముఖ బ్రాండ్‌లు అమ్మకాలు పెంచుకునేందుకు ఈ దిశగా ఆసక్తి చూపిస్తున్నాయి. ఫ్యాబ్ ఇండియా, డెకథ్లాన్, అడిడాస్, యూఎస్ పోలో, బోట్ తదితర ప్రముఖ బ్రాండ్లు బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో ప్లాట్‌ఫామ్‌లపై తమ ఉత్పత్తులను ఇటీవలి కాలంలో లిస్ట్ చేశాయి. పుమా, స్కెచర్స్ సైతం క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై లిస్టింగ్‌కు ఉత్సాహం చూపిస్తున్నాయి. ''ఇది కేవలం ఆరంభమే. వేగం, సౌకర్యం దేశంలో ప్రజల షాపింగ్ తీరును మార్చివేయనున్నాయి''అని జెప్టో అప్పారెల్ లైఫ్‌స్టయిల్ హెడ్ ఆస్థా గుప్తా తెలిపారు. క్విక్ కామర్స్ సంస్థలు ఇంతకాలం మెట్రోలకే పరిమితం కాగా, టైర్-2, 3 పట్టణాల్లోకి విస్తరిస్తున్నాయి. కనుక ఈ విభాగాన్ని ప్రముఖ బ్రాండ్లు నిర్లక్ష్యం చేయడానికి అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్‌కు చెందిన 'తస్వ' మెన్స్‌వేర్ బ్రాండ్, డిజైనర్ తరుణ్ తహిల్యాని క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై తమ ఉత్పత్తులను లిస్టింగ్ చేసే ప్రణాళికతో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ప్రముఖ బ్రాండ్లు తమ స్టోర్ల కోసం సరైన లొకేషన్‌ను గుర్తించడం, అమ్మకాల పరంగా విజయం సాధించడం క్లిష్టమైన టాస్క్ అనడంలో సందేహం లేదు. అదే క్విక్ కామర్స్ అయితే మరింత మంది వినియోగదారులకు వేగంగా, సులభంగా చేరుకోగలగడం వాటిని ఆకర్షిస్తోంది. ఇటీవలి కాలంలో నాసిక్, వారణాసి, ఉదయ్‌పూర్, హరిద్వార్, బటిండ తదితర చిన్న పట్టణాలకూ క్విక్‌కామర్స్ సేవలు విస్తరించడం గమనార్హం.

సంప్రదాయ స్టోర్లపై ప్రభావం..

క్విక్‌కామర్స్ శరవేగంగా విస్తరిస్తుండడం సంఘటిత స్టోర్ల అమ్మకాలపై ప్రభావం చూపిస్తోంది. సెప్టెంబర్ త్రైమాసికం డీమార్ట్ ఫలితాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. ఫలితాల తర్వాత స్టాక్ కూడా భారీగా పడిపోవడం గమనార్హం. పెద్ద మెట్రోల్లో క్విక్ కామర్స్ సంస్థల రూపంలో డీమార్ట్ వంటి స్టోర్లకు పోటీ తీవ్రంగా ఉన్నట్టు బ్రోకరేజీ సంస్థలు తమ విశ్లేషణలో పేర్కొన్నాయి. క్విక్ కామర్స్ కంపెనీలు తొలుత తక్షణ గ్రోసరీ డెలివరీ సేవలతో వ్యాపారం మొదలు పెట్టగా, కస్టమర్ల స్పందన ఆధారంగా తర్వాతి కాలంలో మరిన్ని విభాగాల్లోకి సేవలను విస్తరించాయి. గృహోపకరణాలు, చార్జింగ్ కేబుళ్లు, ఎయిర్‌కూలర్లు, ఐఫోన్లు, ఆటబొమ్మలు ఇలా ఎన్నో ఉత్పత్తులను జోడించుకుంటూ వెళుతున్నాయి. ఇది సంప్రదాయ రిటైల్ పరిశ్రమను దెబ్బతీస్తుందని, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తుందన్న ఆందోళనలు వర్తకుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

స్పందన చూద్దాం..

క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో దీర్ఘకాల ఒప్పందాలకంటే, ముందు ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు ప్రముఖ బ్రాండ్లు ఆసక్తి చూపుతున్నట్టు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ''ప్రస్తుతం బ్రాండ్లకు ఇది ప్రయోగాత్మక దశ. అడిదాస్, ఫ్యాబ్ ఇండియా తదితర బ్రాండ్లకు భారీ అమ్మకాలు ఉండకపోవచ్చు. ఎందుకంటే అవి కేవలం అప్పారెల్ కంపెనీలు. ఈ ఉత్పత్తుల్లో వెనక్కి తిరిగి పంపడం ఎక్కువగా ఉంటుంది. ఆన్‌లైన్ కొనుగోళ్లలో 25-30 శాతం వెనక్కి వస్తుంటాయి. కనుక వీటి విషయంలో విజయం ఎంతన్నది వేచి చూస్తే కానీ తెలియదు. అదే గ్రోసరీ, స్టాపుల్స్, సౌందర్య ఉత్పత్తులు, బహుమతులు, మొబైల్ ఉత్పత్తులు క్విక్ కామర్స్‌పై ఎక్కువ డిమాండ్ ఉన్న విభాగాలు''అని ఎలారా క్యాపిటల్ వైస్ ప్రెసిడెంట్ కరణ్ తురాణి వివరించారు.

టాటా స్టీల్ లాభాల బాట

- రూ.759 కోట్లు నమోదు
- నష్టాల్లోనే యూకే స్టీల్



న్యూఢిల్లీ: టాటా స్టీల్ సెప్టెంబర్ త్రైమాసికంలో తిరిగి లాభాల్లోకి అడుగు పెట్టింది. రూ.759 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.6,511 కోట్ల నష్టం ఎదురుకావడం గమనార్హం. మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.55,910 కోట్ల నుంచి రూ.54,503 కోట్లకు తగ్గింది. కంపెనీ వ్యయాలను గణనీయంగా తగ్గించుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో వ్యయాలు రూ.55,853 కోట్లుగా ఉంటే, సమీక్షా త్రైమాసికంలో రూ.52,331 కోట్లకు పరిమితమయ్యాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.4,806 కోట్ల మూలధన వ్యయాలను వెచ్చించింది. కంపెనీ నికర రుణభారం రూ.88,817 కోట్లుగా ఉంది. కంపెనీ వద్ద రూ.26,028 కోట్ల లిక్విడిటీ ఉంది. టాటా స్టీల్ యూకే ఆదాయం 600 మిలియన్ పౌండ్లుగా ఉంటే, 147 మిలియన్ పౌండ్ల ఎబిట్డా నష్టం నమోదైంది. నెదర్లాండ్ కార్యకలాపాల నుంచి 1,300 మిలియన్ పౌండ్ల ఆదాయం రాగా, 22 మిలియన్ పౌండ్ల ఎబిట్డా నమోదైంది. దేశంలోనే అతిపెద్ద బ్లాస్ట్ ఫర్నేస్ కళింగనగర్ ప్లాంట్ ప్రారంభమైనట్టు సంస్థ ప్రకటించింది. అంతర్జాతీయంగా నిర్వహణ వాతావరణం ఎంతో సంక్లిష్టంగా ఉన్నట్టు టాటా స్టీల్ సీఈవో, ఎండీ టీవీ నరేంద్రన్ పేర్కొన్నారు. కొన్ని కీలక ప్రాంతాల్లో వృద్ధి స్తబ్దుగా ఉన్నట్టు అంగీకరించారు. యూకే ప్రభుత్వంతో నిధులపై ఒప్పందాన్ని చేసుకున్నామని, గ్రీన్ స్టీల్‌కు మళ్లే దిశగా పురోగతిలో ఉన్నట్టు చెప్పారు. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో టాటా స్టీల్ షేరు ధర ఒక శాతం లాభపడి రూ.154 వద్ద స్థిరపడింది.

వృద్ధి బాటలో సేవల రంగం..

- అక్టోబర్‌లో 58.5గా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ సూచీ
- మెరుగుపడిన డిమాండ్, ఉద్యోగాల కల్పన

న్యూఢిల్లీ: దేశీయంగా సెప్టెంబర్‌లో పది నెలల కనిష్టానికి పడిపోయిన సేవల విభాగం సూచీ (పీఎంఐ) అక్టోబర్‌లో తిరిగి కోలుకుంది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 58.5కి మెరుగుపడింది. డిమాండ్ పటిష్టంగా ఉండటంతో కొత్త ఆర్డర్లు రావడం, సర్వీసులు పెరగడం, ఫలితంగా ఉపాధి కల్పనకు ఊతం లభించడం మొదలైనవి దీనికి తోడ్పడ్డాయి. సెప్టెంబర్‌లో ఈ సూచీ 57.7గా ఉంది. తయారీ, సేవల రంగం పనితీరుకు పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్‌ను (పీఎంఐ) కొలమానంగా పరిగణిస్తారు. వివిధ కంపెనీలవ్యాప్తంగా కొత్త ఆర్డర్లు, నిల్వల స్థాయులు, ఉత్పత్తి, ఉద్యోగాల కల్పన తదితర అంశాల్లో పర్చేజింగ్ మేనేజర్లతో నిర్వహించిన సర్వే ఆధారంగా దీని స్కోరు ఉంటుంది. సాధారణంగా ఇది 50కి పైన ఉంటే వృద్ధిని, 50కి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. 'భారత సర్వీసెస్ పీఎంఐ సెప్టెంబర్ నాటి పది నెలల కనిష్ట స్థాయి నుంచి అక్టోబర్‌లో 58.5 స్థాయికి మెరుగుపడింది. ఉత్పత్తి, డిమాండ్‌తో పాటు ఉద్యోగాల కల్పన విషయంలోనూ భారతీయ సర్వీసుల రంగం గణనీయంగా మెరుగుపడింది' అని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఎకానమిస్ట్ ప్రాంజల్ భండారీ తెలిపారు.

'వాయు' ఫుడ్ డెలివరీ యాప్ విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీరో కమీషన్ ఫుడ్ డెలివరీ యాప్ 'వాయు' తాజాగా హైదరాబాద్ మార్కెట్లోకి కార్యకలాపాలు విస్తరించింది. ఇందుకోసం తెలంగాణ స్టేట్ హోటల్స్ అసోసియేషన్‌తో (టీఎస్‌హెచ్‌ఏ) జట్టు కట్టింది. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), టీఎస్‌హెచ్‌ఏతో భాగస్వామ్యం ద్వారా 3,000 పైచిలుకు రెస్టారెంట్లతో కలిసి పని చేయనున్నట్లు వాయు యాప్ సహ వ్యవస్థాపకులు ఎల్. మందార్, కె. అనిరుధ్ తెలిపారు. దీనితో ఇటు రెస్టారెంట్లకు ఆర్డర్లు పెరగడంతో పాటు వినియోగదారులకు అదనపు ఛార్జీల భారం లేకుండా సర్వీసులు అందుతాయని పేర్కొన్నారు. ఈ యాప్ ఇప్పటికే ముంబై, పుణె, బెంగళూరు తదితర నగరాల్లో అందుబాటులో ఉందని వివరించారు.

భారత్‌లో ఎస్‌ఏపీ అపార పెట్టుబడులు

భారీగా కొలువులు కూడా... ● కంపెనీ సీఈఓ క్రిస్టియన్ క్లీన్



న్యూఢిల్లీ: జర్మనీ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఎస్‌ఏపీ భారత్‌లో అపారమైన పెట్టుబడులతో పాటు భారీగా ఉద్యోగాలను కల్పించే ప్రణాళికల్లో ఉందని కంపెనీ సీఈఓ క్రిస్టియన్ క్లీన్ చెప్పారు. తమకు అత్యంత వేగవంతమైన వృద్ధిని అందించడంతో పాటు భవిష్యత్తులో అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా కూడా భారత్ నిలుస్తుందన్నారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్ బోర్డు బెంగళూరు పర్యటనలో భాగంగా ఆయన విషయాలను వెల్లడించారు. 'భారత్ టాప్-10 మార్కెట్లలో ఒకటి. ఈ ర్యాంక్ అంతకంతకూ ఎగబాకుతోంది. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌డీ కార్యకలాపాలపై భారీగా వెచ్చించనున్నాం. జర్మనీ తర్వాత ఇక్కడే కంపెనీకి అత్యధిక సిబ్బంది ఉన్నారు. ఇతర ఎస్‌ఏపీ ల్యాబ్‌లతో పోలిస్తే అసాధారణ రీతిలో నియామకాలను చేపట్టనున్నాం. అతి త్వరలోనే అతిపెద్ద హబ్‌గా భారత్ ఆవిర్భవిస్తుంది. ఏఐ భారీ అవకాశాలను అందించనుంది. భారత్‌లోని ఏఐ నిపుణుల పనితీరు అద్భుతం' అని క్లీన్ చెప్పారు. కాగా, భారత్‌లోని ఎస్‌ఏపీ ఆర్‌అండ్‌డీ సెంటర్లలో 15,000 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. మరో 15,000 కొలువులు కల్పించే ప్రణాళికల్లో కంపెనీ ఉంది.

మారుత్ డ్రోన్స్‌కి 6 మిలియన్ డాలర్ల నిధులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రోన్ టెక్నాలజీ కంపెనీ మారుత్ డ్రోన్‌టెక్ తాజాగా 6.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 55 కోట్లు) పెట్టుబడులు సమీకరించింది. లోక్ క్యాపిటల్ నుంచి ఈ నిధులు సమీకరించినట్లు సంస్థ తెలిపింది. వార్షికంగా 3,000 డ్రోన్ల స్థాయికి తయారీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు, వచ్చే అయిదేళ్లలో రూ. 1,000 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యకలాపాలను పటిష్టపర్చుకునేందుకు ఇవి తోడ్పడగలవని మారుత్ డ్రోన్స్ సీఈవో ప్రేమ్ కుమార్ విశ్లావత్ పేర్కొన్నారు. అలాగే, అధునాతన వ్యవసాయ డ్రోన్లను అభివృద్ధి చేసేందుకు, ద్వితీయ-తృతీయ శ్రేణి పట్టణాల్లోకి చానల్ పార్ట్‌నర్ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు, గ్రామీణ ప్రాంత వినియోగదార్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఈ నిధులను ఉపయోగించనున్నట్లు వివరించారు.


వృద్ధికి సానుకూలతలే ఎక్కువ

- బలంగా ఆర్థిక కార్యకలాపాలు
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్
- వృద్ధిపై ఆందోళనలను తేలికపరిచే ప్రయత్నం
- రేట్ల కోతకు సమయం ఉందన్న సంకేతం

ముంబై: దేశ జీడీపీ వృద్ధికి సంబంధించి వస్తున్న గణాంకాలు మిశ్రమంగా ఉన్నాయంటూ.. ప్రతికూలతల కంటే సానుకూలతలే ఎక్కువని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థలో అంతర్లీనంగా కార్యకలాపాలు మొత్తానికి బలంగానే కొనసాగుతున్నట్టు చెప్పారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగంపై ముంబైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా దాస్ మాట్లాడారు. ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే, వెనక్కిలాగే 70 అధిక వేగంతో కూడిన సూచికలను ట్రాక్ చేసిన తర్వాతే ఆర్‌బీఐ అంచనాలకు వస్తుందని వివరించారు. 2024-25 మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) జీడీపీ వృద్ధి 6.7 శాతంగా నమోదు కావడం గమనార్హం. 15 నెలల కనిష్ట స్థాయి ఇది. దీంతో వృద్ధిపై విశ్లేషకుల నుంచి ఆందోళన వ్యక్తమవుతుండడం తెలిసిందే. కానీ, జీడీపీ 2024-25లో 7.2 శాతం వృద్ధిని నమోదు చేస్తుందంటూ ఆర్‌బీఐ గత అంచనాలను కొనసాగించడం గమనార్హం. ప్రతికూలతల విషయానికొస్తే.. పారిశ్రామికోత్పత్తి సూచీ డేటా (ఐఐపీ), పట్టణాల్లో డిమాండ్ మోస్తరు స్థాయికి చేరినట్టు ఎఫ్‌ఎంసీజీ విక్రయ గణాంకాల ఆధారంగా తెలుస్తోందని దాస్ అన్నారు. దీనికితోడు సబ్సిడీల చెల్లింపులు కూడా పెరగడం సెప్టెంబర్ త్రైమాసికం జీడీపీ (క్యూ2) గణాంకాలపై ప్రభావం చూపిస్తుందని చెప్పారు.

బలంగా ఆటో అమ్మకాలు

డిమాండ్ బలహీనంగా ఉండడంతో ఆటోమొబైల్ కంపెనీల ఇన్వెంటరీ స్థాయిలు పెరిగిపోవడం పట్ల చర్చ జరుగుతుండడం తెలిసిందే. ఆర్‌బీఐ గవర్నర్ దాస్ ఇదే అంశంపై స్పందిస్తూ అక్టోబర్‌లో ఈ రంగం మంచి పనితీరు చూపించిందని, 30 శాతం వృద్ధి నమోదైనట్టు చెప్పారు. దీనికి అదనంగా వ్యవసాయం, సేవల రంగాలు సైతం మెరుగైన పనితీరు చూపిస్తున్నట్టు వెల్లడించారు. కనుక వృద్ధి మందగిస్తుందని ప్రకటించడానికి తాను తొందరపడబోనన్నారు. భారత్ సైక్లికల్ వృద్ధి మందగమనంలోకి అడుగుపెట్టినట్టు జపాన్ బ్రోకరేజీ సంస్థ నోమురా ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో దాస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం నెలకొంది. ఆర్థిక వ్యవస్థకు పెద్దపులి లాంటి బలం ఉందంటూ, దీనికి ఆర్‌బీఐ చలాకీతనాన్ని అందిస్తున్నట్టు వ్యాఖ్యానించారు.



అధిక ద్రవ్యోల్బణం.. రేట్ల కోత

అక్టోబర్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో వచ్చిన 5.5 శాతం కంటే అధికంగా ఉంటుందని శక్తికాంతదాస్ సంకేతం ఇచ్చారు. ఈ నెల 12న గణాంకాలు వెల్లడి కానున్నాయి. రెండు నెలల పాటు అధిక స్థాయిలోనే కొనసాగొచ్చన్న ఆర్‌బీఐ అంచనాలను గుర్తు చేశారు. మానిటరీ పాలసీ విషయంలో ఆర్‌బీఐ తన విధానాన్ని మార్చుకోవడం (కఠినం నుంచి తటస్థానికి) తదుపరి సమావేశంలో రేట్ల కోతకు సంకేతంగా చూడొద్దని కోరారు. తదుపరి కార్యాచరణ విషయంలో ప్యానెల్‌పై ఎలాంటి ఒత్తిళ్లు లేవన్నారు.

దిద్దుబాటు కోసమే చర్యలు..

నాలుగు ఎన్‌బీఎఫ్‌సీలపై నియంత్రణ, పర్యవేక్షణ చర్యల గురించి ఎదురైన ప్రశ్నకు స్పందిస్తూ.. దేశంలో 9,400 ఎన్‌బీఎఫ్‌సీలు ఉండగా, కేవలం కొన్నింటిపైనే చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఆయా సంస్థలతో నెలల తరబడి సంప్రదింపుల అనంతరమే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీన్ని పర్యవేక్షించడం చాలా కష్టమని అంగీకరించారు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

జిందాల్ స్టీల్ అండ్ పవర్ మిశ్రమ పనితీరు

- ఆదాయం 7 శాతం డౌన్
- నికర లాభం 38 శాతం జంప్



న్యూఢిల్లీ: జిందాల్ స్టీల్ అండ్ పవర్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి మిశ్రమ పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూస్తే 38 శాతం ఎగసి రూ.860 కోట్లుగా నమోదైంది. ఆదాయం మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.14,128 కోట్ల నుంచి రూ.13,025 కోట్లకు క్షీణించింది. అంటే 7 శాతానికి పైగా తగ్గింది. స్టీల్ ఉత్పత్తి 1.90 మిలియన్ టన్నుల (ఎంటీ) నుంచి 1.97 ఎంటీలకు పెరిగింది. ఉత్పత్తి పెరిగినా అమ్మకాలు తగ్గాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో స్టీల్ అమ్మకాలు 2.01 ఎంటీలుగా ఉంటే, సమీక్షా త్రైమాసికంలో 1.85 ఎంటీలకు విక్రయాలు పరిమితమయ్యాయి. నికర రుణ భారం రూ.12,464 కోట్లుగా ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది. విస్తరణ కార్యకలాపాలపై రూ.2,642 కోట్లను సెప్టెంబర్ క్వార్టర్‌లో వెచ్చించింది. కంపెనీ ఆస్ట్రేలియా సబ్సిడరీ వూలాంగాంగ్ రీసోర్సెస్ పీటీఈ లిమిటెడ్ రూ.36 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేయడం లాభాలపై ప్రభావం చూపించింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కంపెనీ షేరు 2 శాతం లాభపడి రూ.954 వద్ద ముగిసింది.

బ్లూస్టార్ ఆకర్షణీయ ఫలితాలు


- లాభం 36 శాతం అప్
- రాణించిన అన్ని విభాగాలు



న్యూఢిల్లీ: కూలింగ్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ లిమిటెడ్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో మెరుగైన పనితీరు ప్రదర్శించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.71 కోట్ల నుంచి రూ.96 కోట్లకు దూసుకుపోయింది. 35 శాతం వృద్ధి నమోదైంది. ఆదాయం 22 శాతం వృద్ధితో రూ.2,276 కోట్లుగా నమోదైంది. బలమైన ఆర్డర్ల పైప్‌లైన్‌తో అన్ని విభాగాల్లోనూ మెరుగైన పనితీరు చూపించినట్టు.. కంపెనీ ఉత్పత్తులకు డిమాండ్ కొనసాగినట్టు బ్లూస్టార్ తెలిపింది. ఎలక్ట్రో మెకానికల్ ప్రాజెక్టులు, వాణిజ్య ఏసీ సిస్టమ్స్ ఆదాయం 33 శాతం పెరిగి రూ.1,428 కోట్లకు చేరింది. ఈ విభాగం మార్జిన్లు 2.2 శాతం బలపడ్డాయి. ఎలక్ట్రో మెకానికల్ ప్రాజెక్టుల విభాగంలో తయారీ రంగం, డేటా సెంటర్ల నుంచి వృద్ధి కనిపించింది. యూనిటీ ప్రాడక్టుల (రూమ్ ఏసీలు కూడా) ఆదాయం 5 శాతం వృద్ధితో రూ.767 కోట్లుగా నమోదైంది. ప్రొఫెషనల్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ సిస్టమ్స్ ఆదాయం స్వల్పంగా క్షీణించి రూ.80 కోట్లుగా ఉంది. అన్ని విభాగాల్లోనూ అవకాశాలు ఆశావహంగా ఉన్నట్టు, రూమ్ ఏసీలు, వాణిజ్య ఏసీల వ్యాపారం మంచి పనితీరు చూపిస్తున్నట్టు సంస్థ చైర్మన్, ఎండీ ఎస్ అద్వానీ తెలిపారు. 2024-25 సంవత్సరం పట్ల సానుకూలంగా ఉన్నట్టు చెప్పారు. డైరెక్టర్ పీవీ రావును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా (ప్రాజెక్టులు, సొల్యూషన్లు) నియమించినట్టు సంస్థ ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో బ్లూస్టార్ షేరు ఒక శాతానికి పైగా పెరిగి రూ.1,878 వద్ద క్లోజ్ అయింది.

పవర్‌గ్రిడ్ లాభం రూ.3,793 కోట్లు

షేరుకు రూ.4.50 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఐఎల్) సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.3,793 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.3,781 కోట్లతో పోల్చితే కేవలం రూ.12 కోట్లు పెరిగింది. ఆదాయం రూ.11,530 కోట్ల నుంచి రూ.11,846 కోట్లకు వృద్ధి చెందింది. స్థిరాస్తుల స్థూల విలువ రూ.2,78,983 కోట్లకు చేరింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో రూ.38,575 కోట్ల విలువ చేసే ఎనిమిది ప్రాజెక్టులకు పవర్‌గ్రిడ్ విజయవంతమైన బిడ్డర్‌గా అర్హత సాధించింది. వాటాదారుల వద్దనున్న ప్రతి షేరుకు రూ.4.50 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇచ్చేందుకు కంపెనీ బోర్డు నిర్ణయించింది. అలాగే పవర్‌గ్రిడ్ కాలా అంబ్ ట్రాన్స్‌మిషన్, పవర్‌గ్రిడ్ పర్లి ట్రాన్స్‌మిషన్, పవర్‌గ్రిడ్ వరోరా ట్రాన్స్‌మిషన్, పవర్‌గ్రిడ్ జబల్‌పూర్ ట్రాన్స్‌మిషన్‌ను పవర్‌గ్రిడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (పీజీఇన్విట్)కు విక్రయించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో షేరు ధర పెద్దగా మార్పుచెందకుండా రూ.318 వద్ద క్లోజ్ అయింది.

గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్.. ఫర్వాలేదు

లాభంలో 15 శాతం వృద్ధి



ముంబై: గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో సానుకూల వృద్ధిని నమోదు చేసింది. నికర లాభం 15 శాతం వృద్ధితో రూ.84 కోట్లకు, ఆదాయం 6 శాతం పెరిగి రూ.849 కోట్లకు చేరాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.74 కోట్లు, ఆదాయం రూ.802 కోట్లుగా ఉండడం గమనార్హం. అనిశ్చిత మార్కెట్ పరిస్థితుల్లో మంచి పనితీరు చూపించినట్టు కంపెనీ ప్రకటించింది. మార్జిన్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టామని, దీంతో స్థూల మార్జిన్లలో మెరుగుదల నమోదైనట్టు కంపెనీ సీఎఫ్‌వో మనీష్ గంగ్వాల్ తెలిపారు. లాభదాయకత పెంచుకోవడం ద్వారా వాటాదారులకు మరింత విలువ సమకూర్చుతామని ప్రకటించారు. డిమాండ్‌పై సానుకూల అంచనాలతో ఉన్నామని, మధ్య కాలం నుంచి దీర్ఘ కాలానికి భారత లూబ్రికెంట్ల రంగంపై విశ్వాసంతో ఉన్నట్టు చెప్పారు. పటిష్ట ఫలితాలతో బీఎస్‌ఈలో కంపెనీ షేరు ధర 6 శాతం ఎగసి రూ.1,263 వద్ద ముగిసింది.



ప్రియాన్షు అజేయ సెంచరీ

- ఉత్తరాఖండ్ 232/1
- ఆంధ్రతో రంజీ మ్యాచ్

సాక్షి, విజయనగరం: దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో తొలి విజయం కోసం ఎదురు చూస్తున్న ఆంధ్ర జట్టుకు నాలుగో మ్యాచ్‌లోనూ మెరుగైన ఆరంభం దక్కలేదు. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఆంధ్ర జట్టు... ఎలైట్ గ్రూప్ 'బి'లో అట్టడుగున కొనసాగుతోంది. విజయనగరం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఉత్తరాఖండ్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 232 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రియాన్షు ఖండూరి (272 బంతుల్లో 107 బ్యాటింగ్; 11 ఫోర్లు) అజేయ శతకంతో చెలరేగగా... మరో ఓపెనర్ అవనీశ్ (158 బంతుల్లో 86; 12 ఫోర్లు) అర్ధ శతకంతో రాణించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 157 పరుగులు జోడించి ఉత్తరాఖండ్‌కు బలమైన పునాది వేశారు. 29 ఏళ్ల ప్రియాన్షుకు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇది రెండో సెంచరీ కాగా... శతకం చేసేలా కనిపించిన అవనీశ్‌ను ఆంధ్ర స్పిన్నర్ లలిత్ మోహన్ అవుట్ చేశాడు. ఆ తర్వాత కెప్టెన్ రవికుమార్ సమర్థ్ (30 బ్యాటింగ్; 2 ఫోర్లు) కూడా సాధికారికంగా ఆడాడు. ఎలాంటి తొందరపాటుకు పోకుండా ఆచితూచి ఆడిన ఉత్తరాఖండ్ ఆటగాళ్లు రోజంతా బ్యాటింగ్ చేసిన 2.66 రన్‌రేట్‌తో పరుగులు రాబట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేయడమే లక్ష్యంగా సాగుతున్న ఉత్తరాఖండ్‌ను గురువారం ఆంధ్ర బౌలర్లు ఏమాత్రం అడ్డుకుంటారో చూడాలి.

స్కోరు వివరాలు

ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్: అవనీశ్ (సి) షేక్ రషీద్ (బి) లలిత్ మోహన్ 86; ప్రియాన్షు ఖండూరి (బ్యాటింగ్) 107; రవికుమార్ సమర్థ్ (బ్యాటింగ్) 30; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (87 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 232. **వికెట్ల పతనం:** 1–157, **బౌలింగ్:** చీపురుపల్లి స్టీఫెన్ 19–6–42–0; శశికాంత్ 18–8–31–0; సత్యనారాయణ రాజు 15–3–50–0; లలిత్ మోహన్ 26–2–83–1; త్రిపురాణ విజయ్ 6–1–15–0; మారంరెడ్డి హేమంత్ రెడ్డి 3–0–6–0.

హైదరాబాద్ 261/5

రాణించిన రాహుల్, తన్మయ్ ◆ రాజస్తాన్‌తో రంజీ మ్యాచ్



జైపూర్: రంజీ ట్రోఫీ దేశవాళీ క్రికెట్ టోర్నీలో గత మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యంతో ఘనవిజయం సాధించిన హైదరాబాద్ జట్టు... మరోసారి స్ఫూర్తివంతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం రాజస్తాన్‌తో ప్రారంభమైన గ్రూప్ 'బి' నాలుగో రౌండ్ లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ బ్యాటర్లందరూ బాధ్యతాయుతంగా ఆడారు. ఫలితంగా హైదరా బాద్ గౌరవప్రద స్కోరు దిశగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 88 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (100 బంతుల్లో 66; 7 ఫోర్లు, ఒక సిక్స్) హాఫ్ సెంచరీతో మెరిశాడు. వికెట్ కీపర్ రాహుల్ రాదేశ్ (43 బ్యాటింగ్; 3 ఫోర్లు), ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (40; 4 ఫోర్లు) ఆకట్టుకున్నారు. అభిరత్ రెడ్డి (21; 4 ఫోర్లు), రోహిత్ రాయుడు (21; ఒక సిక్స్), హిమతేజ (24; 3 ఫోర్లు) క్రీజులో నిలదొక్కుకుంటున్న దశలో అవుటయ్యారు. కెప్టెన్ రాహుల్ సింగ్ మాత్రం ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తీసు కొచ్చాడు. అంతర్జాతీయ క్రికెటర్లు దీపక్ చహర్, దీపక్ హుడా వంటి బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పరుగులు రాబట్టాడు. రాజస్తాన్ బౌలర్లలో అజయ్ సింగ్ 3, దీపక్ చహర్, అరాఫత్ ఖాన్ చెరో వికెట్ పడగొట్టారు. ఆట ముగిసే సమయానికి రాహుల్ రాదేశ్‌తో పాటు అజయ్ దేవ్ గౌడ్ (34 బ్యాటింగ్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు


హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (సి) లోమ్రర్ (బి) అజయ్ సింగ్ 40; అభిరత్ రెడ్డి (బి) అజయ్ సింగ్ 21; రోహిత్ రాయుడు (ఎల్బీ) (బి) అజయ్ సింగ్ 21; హిమతేజ (బి) దీపక్ చహర్ 24; రాహుల్ సింగ్ (సి) అజయ్ సింగ్ (బి) అరాఫత్ ఖాన్ 66; రాహుల్ రాదేశ్ (బ్యాటింగ్) 43; అజయ్‌దేవ్ గౌడ్ (బ్యాటింగ్) 34; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (88 ఓవర్లలో 5 వికెట్లకు) 261. వికెట్ల పతనం: 1–33, 2–70, 3–95, 4–137, 5–206, బౌలింగ్: దీపక్ చహర్ 17–4–53–1; అనికేత్ 15–4–32–0; అజయ్ సింగ్ 29–1–88–3; అరాఫత్ ఖాన్ 11–1–28–1; దీపక్‌హుడా 5–1–13–0; జుబైర్ అలీ 8–1–27–0, మహిపాల్ లొమ్రోర్ 1–0–2–0; శుభమ్ గర్వాల్ 2–0–10–0.



శ్రేయస్ అయ్యర్ భారీ శతకం

- ముంబై 385/3
- ఒడిశాతో రంజీ మ్యాచ్

ముంబై: టీమిండియా ఆటగాడు శ్రేయస్ అయ్యర్ (164 బంతుల్లో 152 బ్యాటింగ్; 18 ఫోర్లు, 4 సిక్స్‌లు) వన్డే తరహా సెంచరీతో చెలరేగడంతో ముంబై జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం ఒడిశాతో ప్రారంభమైన పోరులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. భారత టెస్టు జట్టులో సుస్థిర స్థానం దక్కించుకోవాలని చూస్తున్న శ్రేయస్ అయ్యర్ సాధికారిక ఆటతీరుతో ఆకట్టుకోగా... సిద్ధేశ్ లాడ్ (234 బంతుల్లో 116 బ్యాటింగ్; 14 ఫోర్లు) కూడా సెంచరీతో అలరించాడు. సిద్ధేశ్ ఆచితూచి ఆడితే... శ్రేయస్ అయ్యర్ చెలరేగిపోయాడు. వీరిద్దరూ అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 231 పరుగులు జోడించారు. రంజీ ట్రోఫీలో శ్రేయస్‌కు ఇది వరుసగా రెండో సెంచరీ. అంతకుముందు యువ ఓపెనర్ అంగ్‌క్రిష్ రఘువంశీ (124 బంతుల్లో 92; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. ఆయుశ్ మాత్రే (18), అజింక్యా రహానే (0) విఫలమయ్యారు. ఒడిశా బౌలర్లలో బిప్‌లాబ్ సమంత్రాయ్ 2 వికెట్లు పడగొట్టాడు.



సాకేత్-రామ్ జోడీ ముందంజ

మత్సుయామ (జపాన్): యూనిచార్మ్ ట్రోఫీ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్–రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ 4–6, 7–6 (9/7), 10–8తో 'సూపర్ టైబ్రేక్'లో హైదరాబాద్‌కే చెందిన అనిరుధ్ చంద్రశేఖర్–నిక్కీ కలియంద పునాచా (భారత్) ద్వయంపై గెలిచింది. 98 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–రామ్‌కుమార్ కీలకదశలో పాయింట్లు గెలిచి విజయాన్ని అందుకున్నారు. నాలుగు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసిన సాకేత్–రామ్‌కుమార్ తొలి సెట్‌లో తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయింది. రెండో సెట్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. నువ్వా నేనా అన్నట్లు సాగిన టైబ్రేక్‌లో సాకేత్–రామ్ ద్వయం పైచేయి సాధించి మ్యాచ్‌లో నిలిచింది. ఇక 'సూపర్ టైబ్రేక్' కూడా పోటాపోటీగా సాగగా... చివరకు సాకేత్–రామ్ కీలక తరుణంలో పాయింట్లు నెగ్గి విజయం సాధించారు. గత వారం కొరియాలో జరిగిన సియోల్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో సాకేత్–రామ్ జంట విజేతగా నిలిచి ఈ ఏడాది తమ ఖాతాలో మూడో డబుల్స్ టైటిల్‌ను జమ చేసుకుంది.

తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్

- తమిళ్ తలైవాస్‌పై ఒక్క పాయింట్ తేడాతో విజయం
- పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలోకి

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన హోరాహోరీ పోరులో తెలుగు టైటాన్స్ 35–34 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌ను మట్టికరిపించింది. దీంతో తాజా సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన టైటాన్స్ 4 విజయాలు, 3 ఓటములతో మొత్తం 21 పాయింట్లు ఖాతాలో వేసుకొని పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది. టైటాన్స్ సారథి పవన్ సెహ్రావత్ 12 పాయింట్లతో విజృంభించగా... ఆశిష్ నర్వాల్ 9 పాయింట్లతో అతడికి సహకారం అందించాడు. తలైవాస్ తరఫున సచిన్ 17 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. ఈ సీజన్‌లో తలైవాస్‌కు ఇది మూడో పరాజయం కాగా.. 21 పాయింట్లతో ఆ జట్టు మూడో స్థానంలో కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో యు ముంబా జట్టు 42–40 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. యు ముంబా తరఫున అజిత్ 19 పాయింట్లతో సత్తా చాటగా... పట్నా తరఫున దేవాంక్ 15 పాయింట్లు సాధించాడు. ఫలితంగా యు ముంబా 24 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానానికి చేరగా... పట్నా పైరేట్స్ 17 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 8 గంటలకు), హరియాణా స్టీలర్స్‌తో గుజరాత్ జెయింట్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.


తమిళ్ తలైవాస్ రెయిడర్‌ను పట్టేసిన టైటాన్స్ ఆటగాళ్లు

ఘజన్‌ఫర్ మాయాజాలం

- 26 పరుగులిచ్చి 6 వికెట్లు తీసిన అఫ్గానిస్తాన్ స్పిన్నర్
- తొలి వన్డేలో బంగ్లాదేశ్ పరాజయం

షార్జా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన అఫ్గానిస్తాన్ జట్టు... బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌లో శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి పోరులో అఫ్గానిస్తాన్ 92 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 49.4 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీ (79 బంతుల్లో 84; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించగా... కెప్టెన్ హష్మతుల్లా షాహిది (92 బంతుల్లో 52; 2 ఫోర్లు) అర్ధశతకంతో రాణించాడు. గుర్బాజ్ (5), రహమత్ షా (2), అజ్మతుల్లా (0) విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో ముస్తఫిజుర్, తస్కిన్ అహ్మద్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 34.3 ఓవర్లలో 143 పరుగులకు ఆలౌటైంది. అఫ్గానిస్తాన్ ఆఫ్ స్పిన్నర్ అల్లా మొహమ్మద్ ఘజన్‌ఫర్ 26 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి బంగ్లాదేశ్‌ను దెబ్బ కొట్టాడు. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ నజ్ముల్ షాంటో (68 బంతుల్లో 47; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ నిలిచాడు. సౌమ్య సర్కార్ (33), మిరాజ్ (28) మినహా ఇతర బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు.



తంజీద్ హసన్ (3), మహ్మదుల్లా (2), ముష్ఫికర్ (1), రిషాద్ (1), తౌహిద్ (11) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. ఇరు జట్ల మధ్య శనివారం ఇక్కడే రెండో వన్డే జరగనుంది.

11 ఏళ్ల తర్వాత...

డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీ సెమీస్‌లో చైనా క్రీడాకారిణి

రియాద్: మహిళల టెన్నిస్ సంఘం ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో చైనా క్రీడాకారిణి కిన్‌వెన్ జెంగ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పర్పుల్ గ్రూప్ చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో కిన్‌వెన్ జెంగ్ 6–1, 6–1తో నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో కిన్‌వెన్ పర్పుల్ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. తద్వారా ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో 11 ఏళ్ల తర్వాత సెమీఫైనల్ దశకు చేరుకున్న రెండో చైనా క్రీడాకారిణిగా కిన్‌వెన్ గుర్తింపు పొందింది. 2013లో నా లీ ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరుకొని సెరెనా విలియమ్స్ (అమెరికా) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. జాస్మిన్‌తో 67 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో కిన్‌వెన్ 12 ఏస్‌లతో చెలరేగిపోయింది. అంతేకాకుండా జాస్మిన్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. పర్పుల్ గ్రూప్‌లోనే ఉన్న ప్రపంచ నంబర్‌వన్, ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్న సబలెంకా (బెలారస్)కు చివరి లీగ్ మ్యాచ్‌లో ఓటమి ఎదురైంది. రిబాకినా (కజకిస్తాన్)తో జరిగిన మ్యాచ్‌లో సబలెంకా 4–6, 6–3, 1–6తో పరాజయం పాలైంది.



విష్ణువర్ధన్ పరాజయం

భువనేశ్వర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) ఎం25 పురుషుల టోర్నమెంట్‌లో భారత డేవిస్‌కప్ జట్టు మాజీ సభ్యుడు, లండన్ ఒలింపియన్ విష్ణువర్ధన్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా మెయిన్ 'డ్రా'కు అర్హత పొందిన 37 ఏళ్ల విష్ణువర్ధన్ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. బుధవారం జరిగిన మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్ 4–6, 3–6తో భారత్‌కే చెందిన మరో క్వాలిఫయర్ నితిన్ కుమార్ సిన్హా చేతిలో ఓడిపోయాడు. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో విష్ణు ఏడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నాలుగుసార్లు తన సర్వీస్‌ను కోల్పోయిన విష్ణు... ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు ఆరుసార్లు అవకాశం రాగా ఒకసారి మాత్రమే సద్వినియోగం చేసుకున్నాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత్‌కే చెందిన మానస్ ధామ్నే, దేవ్ జవియా, సిద్ధార్థ విశ్వకర్మ, రెథిన్ ప్రణవ్, సిద్ధార్థ్ రావత్, ఆర్యన్ షా, కరణ్ సింగ్, యశ్ చౌరాసియా, రోహన్ మెహ్రా, ప్రజ్వల్ దేవ్ తమ ప్రత్యర్థులపై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. డబుల్స్ విభాగంలో హైదరాబాద్‌కే చెందిన రిషబ్ అగర్వాల్–కబీర్ హన్స్ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో రిషబ్–కబీర్ ద్వయం 6–2, 6–4తో ప్రత్యూష్ మొహంతి–ధర్మిల్ షా (భారత్) జంటను ఓడించింది.



హంపి గేమ్ 'డ్రా'

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ క్రీడాకారిణి కోనేరు హంపి ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. ఎలిజబెత్ పాట్జ్ (జర్మనీ)తో బుధవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపి కేవలం 14 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. పది మంది క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. భారత్‌కే చెందిన జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఖాతాలో ఆరో 'డ్రా' చేరింది. అసుబయేవా బీబీసారా (బల్గేరియా)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను దివ్య 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఏడో రౌండ్ తర్వాత హంపి, దివ్య 3.5 పాయింట్లతో సంయుక్తంగా ఐదో స్థానంలో ఉన్నారు.

కిరణ్ జార్జి శుభారంభం



సియోల్: కొరియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ కిరణ్ జార్జి శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 44వ ర్యాంకర్ కిరణ్ జార్జి 15–21, 21–12, 21–15తో హయ్ డాంగ్ ఎన్గుయెన్ (వియత్నాం)పై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 57 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కిరణ్ తొలి గేమ్‌ను కోల్పోయాడు. అయినప్పటికీ ఆందోళన చెందకుండా రెండో గేమ్‌లో తేరుకున్నాడు. రెండో గేమ్ ఆరంభంలో కిరణ్ వరుసగా ఆరు పాయింట్లు గెలిచి 6–0తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత ఇదే జోరు కొనసాగించి గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లోనూ కిరణ్ దూకుడుగా ఆడాడు. ఆరంభంలోనే 5–1తో ఆధిక్యంలోకి వెళ్లి చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ చి యు జెన్ (చైనీస్ తైపీ)తో కిరణ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో కిరణ్ 1–0తో ఆధిక్యంలో ఉన్నాడు. గతేడాది హాంకాంగ్ ఓపెన్ టోర్నీ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో చి యున్ జెన్‌తో ఆడిన కిరణ్ వరుస గేముల్లో గెలిచాడు.





బుధవారం బోసిపోయి కన్పిస్తున్న తమిళనాడులోని తులసేంద్రపురం వీధులు



అమెరికా అధ్యక్ష ఎన్నికల వార్తలను టీవీలో ఆసక్తిగా వీక్షిస్తున్న గ్రామస్తులు

కమల యోధురాలు

ఆమె మళ్లీ పోటీ చేసి గెలుస్తారు • కమల పూర్వీకుల గ్రామంలో ప్రజల మనోగతం

తిరువరూర్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ చేతిలో ఓటమిపాలైనప్పటికీ కమలా హారిస్‌ను పోరాట యోధురాలంటూ ఆకాశానికెత్తేస్తున్నారు తమిళనాడులోని ఆమె పూర్వీకుల గ్రామ ప్రజలు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి, విజయం సాధిస్తారంటూ తులసేంద్రపురం గ్రామస్తులు ధీమాగా చెబుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెల్లడవుతుండటంతో గ్రామస్తులు టీవీలకు అతుక్కుపోయారు. స్థానిక శ్రీ ధర్మ శాస్త పెరుమాల్ ఆలయంలో పూజలు చేసి, కమల గెలవాలని మొక్కుకున్నారు. మధ్యాహ్నానికల్లా ట్రంప్‌దే విజయమని, కమల ఓడిపోతున్నారని తేలడంతో నిరుత్సాహానికి గురయ్యారు. మంగళవారం గ్రామానికి అమెరికా, బ్రిటన్‌ల నుంచి వచ్చిన కమల అభిమానులు ముగ్గురు బుధవారం తిరిగి వెళ్లిపోయారు. 'కమల గెలిస్తే దీపావళికి మించి ఘనంగా ఉత్సవం నిర్వహించాలని అనుకున్నాం. ఇందుకోసం, టపాసులు సిద్ధంగా ఉంచాం. ఆలయంలో పూజలయ్యాక అన్నదానం, స్వీట్లు పంపిణీ చేయాలనుకున్నాం'అని డీఎంకే తిరువరూర్ జిల్లా ప్రతినిధి, తులసేంద్రపురం గ్రామ నేత జె.సుధాకర్ చెప్పారు. 'గెలుపోటములు జీవితంలో భాగం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమల గట్టిపోటీని ఎదుర్కొన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని చూస్తే మెచ్చుకోవాల్సిందే. ఆమె యోధురాలు, మళ్లీ పోటీ చేసి విజయం సాధిస్తారు'అని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడామె అధ్యక్షురాలు కాకపోవచ్చు, భవిష్యత్తు ఏదో ఒకనాడు కమల అమెరికా అధ్యక్షపీఠం ఎక్కడం ఖాయమంటూ మరికొందరు విశ్వాసం వ్యక్తం చేశారు. 'కమల ఓటమిని తట్టుకోలేకపోతున్నాం. కానీ, ఆమెకిప్పుడు 60 ఏళ్లే. ఈ ఓటమితో నిరాశ చెందక ఇంతకుమించి పట్టుదలతో పోరాడి వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధిస్తారనుకుంటున్నాం'అని గ్రామానికి చెందిన టీఎస్ అన్బరసు చెప్పారు. తమ గ్రామంలోని కుటుంబానికి చెందిన ఓ మహిళ అమెరికా మొట్టమొదటి అధ్యక్షురాలవుతారని గ్రామస్తులంతా ఆశతో ఉన్నారని ఆయన అన్నారు. అధ్యక్షురాలైతే కమల తమ గ్రామానికి వస్తారని ఎదురుచూస్తామని చెప్పారు.

నర్గీస్‌ను చంపేందుకు కుట్ర

ఇరాన్‌పై నోబెల్ గ్రహీత కుటుంబం ఆరోపణ

టెహ్రాన్: నోబెల్ గ్రహీత, మానవ హక్కుల కార్యకర్త నర్గీస్ మొహమ్మదీని చంపేందుకు ఇరాన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె కుటుంబం ఆరోపించింది. కేన్సర్ నిర్ధారణకు అవసరమైన కీలకమైన శస్త్రచికిత్సను నిరాకరించి, నెమ్మదిగా ఆమె ప్రాణాలు పోయేందుకు కారణమవుతోందని తెలిపింది. ఆమె కుడి కాలు ఎముక గాయాన్ని వైద్యులు ఇటీవల గుర్తించారని, క్యాన్సర్ నిర్ధారణకు అవసరమైన బయాప్సీకోసం శస్త్రచికిత్సకు అవకాశం ఇవ్వకుండా ఆమె ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని కుటుంబం వెల్లడించింది. చికిత్సలో మరింత జాప్యం జరిగితే ఆమె ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని కుటుంబ సభ్యులు హెచ్చరించారు. సంవత్సరాల తరబడి జైలు జీవితం, సుదీర్ఘకాలం ఏకాంత నిర్బంధం ఆమె ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని, కేవలం ఆస్పత్రి సందర్శనలతో చేసే చిన్న చికిత్స ఆమె ఆరోగ్యాన్ని బాగు చేయలేదని వారు తెలిపారు. కాగా, ఇటీవల ఎంఆర్ఐలో ఆర్థరైటిస్, డిస్క్ వ్యాధి ఉన్నట్లు బయటపడిందని, 2021లో గుండెపోటుకు గురైన తర్వాత ఆమె గుండె ధమనుల్లో ఒకదానికి యాంజియోగ్రఫీ చేయాలని వైద్యులు సూచించారని ఆమె తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ వంటి ప్రముఖులు సైతం మొహమ్మదీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'నిర్బంధంలో ఉన్న మొహమ్మదీకి అవసరమైన వైద్య సంరక్షణను నిలిపివేస్తూ ఇరాన్ అధికారులు ఆమెను నెమ్మదిగా చంపుతున్నారు'అని హిల్లరీ క్లింటన్ గత శుక్రవారం తన అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

మొహమ్మదీ రెండు దశాబ్దాలుగా టెహ్రాన్‌లోని ఎవిన్ జైలులో ఖైదీగా ఉన్నారు. ఇరాన్‌లో మానవ హక్కులకోసం, మహిళల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్న నర్గీస్ 2011లో తొలిసారి అరెస్టయ్యారు. రెండేళ్ల జైలు శిక్ష తర్వాత బెయిల్ పొందిన ఆమె.. 2015లో మళ్లీ జైలుకు వెళ్లారు. జైలులోనూ ఆమె పోరాటాన్ని ఆపలేదు. మహిళల హక్కులతో పాటు, మరణశిక్ష రద్దు, ఖైదీల హక్కుల కోసం కూడా పోరాడారు. జైలులో ఉన్నప్పటికీ మొహమ్మదీ మానవ హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్నారు. ఇందుకుగాను 2023 సంవత్సరంలో మొహమ్మదీకి నోబెల్ శాంతి బహుమతి దక్కింది.

రాఘవేంద్ర స్వామి మఠంలో రిషి సునాక్ దంపతుల పూజ

బెంగళూరు: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్, ఆయన సతీమణి అక్షతా మూర్తితో కలిసి బెంగళూరులో పర్యటించారు. కార్తీక మాసం పవిత్రమైన మాసం కావడంతో గురురాఘవేంద్ర స్వామి ఆశీస్సులు పొందేందుకు ఈ దంపతులు మఠాన్ని సందర్శించారు. జయనగర్‌లో ఉన్న రాఘవేంద్ర స్వామి మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు సునక్ అత్తమామలు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి ఉన్నారు. గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఫోటోలు సోషల్ మీడియా వేదికగా దర్శనమిచ్చాయి. స్వామివారి దర్శనం సందర్భంగా ఆలయ సంప్రదాయ పూజల్లో వారు పాల్గొన్నారు. భారతీయ సంప్రదాయాలపై తన విశ్వాసం గురించి బహిరంగంగానే ప్రకటించే రిషి సునాక్.. గతంలో దేశంలో పర్యటించినప్పుడు అనేక దేవాలయాలను సందర్శించారు. ఈ ఏడాది జనవరిలో సునాక్ లండన్‌లోని ప్రఖ్యాత బీఏపీఎస్ స్వామినారాయణ్ మందిర్‌ను సందర్శించారు. ''నేను హిందువును. అందరిలాగే, నేనూ నా విశ్వాసం నుంచి ప్రేరణను, ఓదార్పును పొందుతాను. పార్లమెంటు సభ్యుడిగా 'భగవద్గీత'పై ప్రమాణ స్వీకారం చేసినందుకు గర్వంగా ఉంది' అని వ్యాఖ్యానించారు.

మహారాష్ట్రలో రెబల్స్ తలనొప్పి

టికెట్లు రాలేదని బరిలో నిలిచిన అసంతృప్తులు | ఐదుగురిని బహిష్కరించిన శివసేన (ఉద్ధవ్)

సాక్షి, న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. మహాయుతి, మహావికాస్ అఘాడీకి రెబల్స్ సవాలుగా మారారు. ఈ అసెంబ్లీ ఎన్నికలకు ఏకంగా 10,900 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో 5,949 నామినేషన్లు ఆమోదం పొందగా, 1,649 తిరస్కరణకు గురయ్యాయి. మరో 3,302 మంది నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. నామినేషన్లను వాపసు తీసుకున్న వారిలో మహాయుతి, మహావికాస్ అఘాడీ తిరుగుబాటు నేతలు కూడా ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన ఐదుగురు తిరుగుబాటు నేతలను పార్టీ నుంచి బహిష్కరించింది. నామినేషన్లను వెనక్కి తీసుకోకుంటే చర్యలు తప్పవని మహాయుతి పార్టీలు కూడా రెబల్స్‌ను హెచ్చరించాయి.

మహాయుతిలో తగ్గేదేలేదంటున్నారు..!

బీజేపీ మాజీ ఎంపీ హీనా గవిత్ నందుర్‌బార్ జిల్లాలోని అక్కల్‌కువా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ శివసేన షిండే వర్గానికి చెందిన అమ్షియా పద్వీ మహాయుతి అధికారిక అభ్యర్థిగా ఉన్నారు. అయితే గవిత్ బరిలో నిలవడం మహాయుతికి తలనొప్పిని పెంచింది. మాహిమ్‌లో ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ ఠాక్రే నామినేషన్ వేశారు. అయితే, శివసేన షిండేకు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే సదా శరవంకర్‌కూడా పోటీకి దిగారు. ఇక్కడ అమిత్ ఠాక్రేకు మద్దతు ఇవ్వాలని బీజేపీ మిత్రపక్షాలను కోరుతోంది. నాసిక్‌లోనూ తిరుగుబాటును ఆపడంలో మహాయుతి విఫలమైంది. మహాయుతి అధికారిక అభ్యర్థులపై నంద్‌గావ్ నుంచి సమీర్ భుజ్‌బల్, దేవ్‌లాలీ నుంచి రాజశ్రీ అహిర్‌రావ్, చాంద్‌వాడ్ నుంచి కేదా అహెర్ పోటీలో ఉన్నారు. భివాండి రూరల్ స్థానంలో శివసేన అభ్యర్థి శాంతారామ్ మోరేపై బీజేపీ రూరల్ యూత్ అధ్యక్షురాలు స్నేహా పాటిల్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. పార్టీలు ఒత్తిడి చేసినప్పటికీ రెబల్స్ నామినేషన్ ఉపసంహరించుకోవడం లేదు. కల్యాణ్ ఈస్ట్ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా సులభ గణపత్ గైక్వాడ్‌ను ప్రకటించిన తర్వాత, శివసేనకు చెందిన మహేష్ గైక్వాడ్ రెబల్‌గా పోటీలో ఉన్నారు. బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే మందా మత్రేని బేలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ప్రతిపాదించగా... ఇక్క స్వతంత్ర అభ్యర్థిగా శివసేనకు చెందిన విజయ్ నహతా రెబల్‌గా బరిలో ఉన్నారు. ఐరోలి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి గణేష్ నాయక్‌పై శివసేన షిండే వర్గానికి చెందిన విజయ్ చౌగులే నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు.

శివాజీనగర్‌లో మహాయుతి అనుకోని సవాల్‌ను ఎదుర్కొంటోంది. ఎన్సీపీ (అజిత్ వర్గం) నవాబ్ మాలిక్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అయితే, ఇక్కడ శివసేన(షిండే)కు చెందిన సురేష్ కృష్ణ పాటిల్‌ను కూటమి అధికారిక అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. దేవేంద్ర ఫడ్నవీస్, ఆశిష్ షెలార్ సహా పలువురు బీజేపీ నేతలు మాలిక్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండటం గమనార్హం.

ఎంవీఏలోనూ ఇదే తీరు

మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లోని చాలా మంది తిరుగుబాటు నాయకులు ఎన్నికలకు ముందు తమ నామినేషన్లను వాపసు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. పుణేలో ముగ్గురు సీనియర్ కాంగ్రెస్ నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. శివాజీనగర్, పార్వతి స్థానాల్లో కాంగ్రెస్, కస్బాపేట్ స్థానంలో ఎన్సీపీ (ఎస్పీ) పోటీ చేస్తోంది. కొప్రి పచ్‌పాఖాడీలో కాంగ్రెస్ రెబల్స్ ఠాక్రే వర్గాన్ని ఎదుర్కొంటున్నారు. భివాండీ వెస్ట్‌లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. కోప్రి పచ్‌పాఖాడీ అసెంబ్లీ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై ఉద్ధవ్ ఠాక్రే బృందం కేదార్ దిఘేను నామినేట్ చేయగా... కాంగ్రెస్‌కు చెందిన మనోజ్ షిండే ఇక్కడ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మరోవైపు భివాండీ వెస్ట్ స్థానం నుంచి దయానంద్ చోర్గేను కాంగ్రెస్ నిలపగా.. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రియాజ్ అజ్మీ స్వతంత్రునిగా నామినేషన్ వేయడం గమనార్హం.

శిథిలాల్లో 30 మృతదేహాలు

బీరుట్: లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయారు. బర్జా పట్టణంపై మంగళవారం రాత్రి జరిగిన దాడిలో ఓ అపార్టుమెంట్ భవనం నేలమట్టమైంది. బుధవారం సహాయక సిబ్బంది శిథిలాల కింద చిక్కుకున్న కనీసం 30 మృతదేహాలను వెలికితీశారు. మరికొందరు శిథిలాల కిందే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముందస్తు హెచ్చరికలు లేకుండా చేపట్టిన ఈ దాడిపై ఇజ్రాయెల్ ఆర్మీ స్పందించలేదు. తీరప్రాంత సిడాన్ నగరానికి ఉత్తరాన ఉన్న ఈ పట్టణంపై ఇప్పటి వరకు ఇజ్రాయెల్ దాడి చేసిన దాఖలాలు లేవు. ఇలా ఉండగా, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సాయుధ గ్రూపు బుధవారం ఇజ్రాయెల్‌పైకి కనీసం 10 రాకెట్లను ప్రయోగించింది. దీంతో, టెల్ అవీవ్‌లో సైరన్లు మోగాయి. ఒక రాకెట్ శకలం సెంట్రల్ ఇజ్రాయెల్ నగరం రాననలోని పార్కు చేసిన కారుపై పడింది. టెల్ అవీవ్‌లోని ప్రధాన విమానాశ్రయం సమీపంలోని బహిరంగ ప్రాంతంలో రాకెట్లు పడ్డాయని మీడియా తెలిపింది. విమానాల రాకపోకలు మాత్రం కొనసాగాయని పేర్కొంది. రాకెట్ల దాడిలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సహాయక బృందాలు తెలిపాయి.

ఆటోను ఢీకొన్న ట్రక్కు...11 మంది దుర్మరణం

హర్దోయి: ఉత్తరప్రదేశ్‌లోని హర్దోయి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మహిళలు, ముగ్గురు చిన్నారులు సహా 11 మంది మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. బిల్‌గ్రామ్- మాధవ్‌గంజ్ రహదారిపైని రోషన్‌పూర్ గ్రామంవద్ద బుధవారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. బైక్‌ను తప్పించేక్రమంలో ట్రక్కు ఆటోను ఢీకొన్నదని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఆటోలో పరిమితికి మించి 15 మంది ప్రయాణిస్తున్నారని, ఘటనలో ఆటోపూర్తిగా నుజ్జయిందని, డ్రైవర్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

ఇజ్రాయెల్‌లో నిరసనలు

- ప్రధాని నెతన్యాహూ రాజీనామా చేయాలని డిమాండ్
- బందీల విడుదలకు కొత్త రక్షణ మంత్రి ప్రాధాన్యత ఇవ్వాలని పట్టు

జెరుసలేం: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలెంట్‌ను తొలగించడంతో అక్కడ నిరసనలు వెల్లువెత్తాయి. వీధుల్లోకొచ్చిన నిరసనకారులు ప్రధాని నెతన్యాహు రాజీనామా చేయాలని, కొత్త రక్షణ మంత్రి బందీ ఒప్పందానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెతన్యాహు దేశం మొత్తాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. కొందరు ఆందోళనకారులు అయలోన్ హైవేపై నిప్పు పెట్టడంతో ఇరువైపులా రాకపోకలకు అంతరాయం కలిగింది. అక్టోబర్ 7న హమాస్ బందీలుగా తీసుకున్న వ్యక్తుల కుటుంబాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక బృందం కూడా గెలాంట్‌ను తొలగించడాన్ని ఖండించింది. తొలగింపును.. విడుదల ఒప్పందాన్ని పక్కకుపెట్టే ప్రయత్నాలకు కొనసాగింపుగా పేర్కొంది. రాబోయే రక్షణ మంత్రి యుద్ధం ముగింపుపై స్పష్టమైన ప్రకటన చేయాలని, అపహరణకు గురైన వారందరినీ తక్షణమే తిరిగి తీసుకురావడానికి సమగ్ర ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసింది.

రాజకీయ విభేదాలు...

ప్రధాని నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి గాలెంట్ మధ్య చాలాకాలంగా విభేదాలు ఉన్నాయి. న్యాయ వ్యవస్థను సమూలంగా మార్చే వివాదాస్పద ప్రణాళికలపై విభేదాలు రావడంతో నెతన్యాహు 2023 మార్చిలో తొలిసారిగా గాలెంట్‌ను తొలగించారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన రావడంతో తిరిగి నియమించారు. ఈ సంఘటన 'గాలెంట్ నైట్'గా ప్రసిద్ధి చెందింది. అయితే గాజాకు యుద్ధానంతర ప్రణాళిక సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ ఏడాది మేలో గాలెంట్ బహిరంగ అసహనం వ్యక్తం చేశారు. గాజాలో పౌర, సైనిక పాలనను చేపట్టే యోచన ఇజ్రాయెల్‌కు లేదని నెతన్యాహు బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు, ఇజ్రాయెల్ అల్ట్రా ఆర్థోడాక్స్ పౌరులను సైన్యంలో పనిచేయడం నుంచి మినహాయించే ప్రణాళికలపై గాలెంట్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి నెతన్యాహు స్పందిస్తూ ప్రత్యర్థి పాలస్తీనా గ్రూపులు హమాస్, ఫతాహ్‌లను ప్రస్తావిస్తూ.. హమస్తాన్‌ను ఫతాస్తాన్‌గా మార్చడానికి తాను సిద్ధంగా లేనని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరు నేతల మధ్య విశ్వాస సంక్షోభం తొలగింపు దాకా దారితీసిందని నెతన్యాహు చెప్పారు. ఇటీవలి నెలల్లో ఆయనపై తన విశ్వాసం క్షీణించిందని, అతని స్థానంలో విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ బాధ్యతలు తీసుకుంటారని వెల్లడించారు.



జెరుసలేంలోని నెతన్యాహూ ఇంటి వద్ద బారికేడ్లను దాటేందుకు నిరసనకారుల ప్రయత్నం

ఇజ్రాయెల్ భద్రత నా జీవిత లక్ష్యం– గాలెంట్

కాగా, తొలగింపు అనంతరం గాలెంట్ స్పందించారు. ఇజ్రాయెల్ భద్రత ఎప్పటికీ తన జీవిత లక్ష్యమని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మూడు అంశాలపై విభేదాల కారణంగానే తనను పదవి నుంచి తొలగించినట్లు మంగళవారం రాత్రి పూర్తి ప్రకటన విడుదల చేశారు. సైనిక సేవకు మినహాయింపులు ఉండకూడదని, పాఠాలు నేర్చుకోవాలంటే జాతీయ విచారణ అవసరమని, బందీలను వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా.. గాజాపై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు ప్రధాన మద్దతుదారు అమెరికాలో అధ్యక్ష ఎన్నికల రోజునే గాలెంట్‌ను తొలగిచండం చర్చనీయాంశమైంది. నెతన్యాహు కంటే గాలెంట్‌కు వైట్ హౌస్‌తో మంచి సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ రక్షణకు సంబంధించిన అన్ని విషయాల్లోనూ మంత్రి గాలెంట్ కీలక భాగస్వామిగా ఉన్నారని వైట్‌హౌస్ జాతీయ భద్రతా మండలి ప్రతినిధి ఒకరు తెలిపారు. సన్నిహిత భాగస్వాములుగా ఇజ్రాయెల్ తదుపరి రక్షణ మంత్రితో కలిసి పనిచేస్తామని చెప్పారు.

మహిళలకు మళ్లీ మొండిచెయ్యే

అందని ద్రాక్షగా అమెరికా అధ్యక్ష పీఠం

- 1872లో తొలిసారి ఓ మహిళ పోటీ
- 1968 బరిలో చార్లెన్ మిషెల్
- తొలి నల్లజాతి మహిళగా రికార్డు
- ప్రధాన పార్టీల నుంచి హిల్లరీయే
- 2016లో ట్రంప్ చేతిలోనే ఓటమి
- అత్యధిక ఓట్లు సాధించినా నిరాశే

అమెరికా అధ్యక్ష పదవిని అధిష్ఠించిన తొలి మహిళగా కమలా హారిస్ చరిత్ర సృష్టిస్తారన్న అంచనాలు తారుమారయ్యాయి. 2016 తర్వాత మరోసారి ఓ మహిళకు అత్యున్నత పీఠం త్రుటిలో చేజారింది. హారిస్ మాదిరిగానే 2016 అధ్యక్ష ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్ కూడా హోరీహోరీ తలపడ్డారు. అమెరికా చరిత్రలో ఒక ప్రధాన పార్టీ తరఫున అధ్యక్ష బరిలో దిగిన తొలి మహిళగా నిలిచారు. హిల్లరీ కూడా డెమొక్రటిక్ పార్టీ తరఫునే పోటీ చేయడం విశేషం. అప్పుడు కూడా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంపే. ఆయనతో డిబేట్లలో హిల్లరీ తడబడ్డా ఆద్యంతం గట్టి పోటీ ఇచ్చి చెమటలు పట్టించారు. అంతేగాక ఆ ఎన్నికల్లో పాపులర్ ఓట్ కూడా సాధించారు. అంటే దేశవ్యాప్తంగా పోలైన ఓట్లలో ఆమెకే ఎక్కువ పడ్డాయి. ట్రంప్ కంటే హిల్లరీ ఏకంగా 28 లక్షల పై చిలుకు అధిక ఓట్లు సాధించారు. కానీ ఎలక్టోరల్ కాలేజీ విధానం వల్ల ట్రంప్ చేతిలో 76 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అప్పట్లో డెమొక్రాట్ల రాష్ట్రాలుగా పేరుబడ్డ విస్కాన్సిన్, మిషిగన్, పెన్సిల్వేనియాల్లో ఓటమి కూడా హిల్లరీ కొంప ముంచింది. హిల్లరీ 2008లో కూడా డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం విఫలయత్నం చేశారు. భర్త బిల్ క్లింటన్ అమెరికా అధ్యక్షునిగా ఉన్న 1993–2001 మధ్య కాలంలో ఆమె ఫస్ట్ లేడీగా వ్యవహరించారు. ఆమెకు ముందు 1968లోనే చార్లెన్ మిషెల్ అనే మహిళ కమ్యూనిస్టు పార్టీ తరఫున అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. పెద్దగా పోటీ ఇవ్వలేకపోయినా ఈ ఘనత సాధించిన తొలి నల్లజాతి మహిళగా నిలిచిపోయారు. మిషెల్ పేరు కేవలం నాలుగు రాష్ట్రాల్లో మాత్రమే బ్యాలెట్ పత్రాలపై చోటుచేసుకుంది.

150 ఏళ్ల క్రితమే తొలి పోటీ

అమెరికా చరిత్రలో అధికారికంగా ఒక మహిళ అధ్యక్ష ఎన్నికల బరిలో దిగిన ఉదంతం 150 ఏళ్ల క్రితమే చోటుచేసుకుంది. ఆమె పేరు విక్టోరియా వుడ్‌హల్. 1872లో ఈక్వల్ రైట్స్ పార్టీ తరఫున ఆమె అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. మహిళలకు పురుషులతో సమాన హక్కుల కోసం ఉద్యమించిన నేతగా వుడ్‌హల్‌కు పేరుంది. అమెరికాలో మహిళలకు ఓటు హక్కే ఉండని రోజుల్లో ఆమె ఏకంగా అధ్యక్ష పదవికే పోటీపడటం సంచలనంగా నిలిచింది. అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే కనీసం 35 ఏళ్లు నిండి ఉండాలి. కానీ పోటీ చేసేనాటికి వుడ్‌హల్‌కు 33 ఏళ్లు మాత్రమే. ఎన్నికల్లో ఆమె ఒక్క ఎలక్టోరల్ ఓటు కూడా సాధించలేకపోయారు. తర్వాత 1884, 1888ల్లో బెల్వా ఆన్ లాక్‌వుడ్ అనే మహిళను ఈక్వల్ రైట్స్ పార్టీ అధ్యక్ష ఎన్నికల బరిలో దింపింది. తర్వాత చాలాకాలానికి 1964లో మార్గరెట్ చేజ్ స్మిత్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీ పడ్డారు. తద్వారా ఒక ప్రధాన పార్టీ అభ్యర్థిత్వ రేసులో దిగిన తొలి మహిళగా నిలిచారు. 1972లో షిర్లీ చిషోమ్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించారు. ఆ పార్టీ అధ్యక్ష అభ్యర్థి రేసులో నిలిచిన తొలి మహిళగా, తొలి నల్లజాతీయురాలిగా గుర్తింపు పొందారు. ఇక ఒక ప్రధాన పార్టీ తరఫున ఉపాధ్యక్ష పదవికి పోటీపడ్డ తొలి మహిళగా గెరాల్డిన్ ఫెరారో. ఆమె 1984లో డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి మాల్టర్ మాండలేకు రన్నింగ్‌మేట్‌గా వ్యవహరించారు. 2004లో సారా పాలిన్ రిపబ్లికన్ పార్టీ తరఫున ఆ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. ఆమె జాన్ మెక్కెయిన్‌కు రన్నింగ్‌మేట్‌గా వ్యవహరించారు. గత 30 ఏళ్లుగా పలు చిన్న పార్టీల తరఫున కూడా ఎందరో మహిళలు అధ్యక్ష రేసులో నిలిచారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

7 రాష్ట్రాల్లో అబార్షన్ హక్కుల విజయం

3 రాష్ట్రాల్లో ఓటమి

వాషింగ్టన్: అబార్షన్ హక్కులు ఏడు రాష్ట్రాల్లో విజయం సాధించారు. అత్యంత నిర్బంధ గర్భస్రావం నిషేధాన్ని రద్దు చేయడానికి మిస్సోరి ఓటర్లు మార్గం సుగమం చేశారు. అరిజోనా, కొలరాడో, మేరీల్యాండ్, మోంటానాలో అబార్షన్ హక్కుల సవరణలు కూడా ఆమోదం పొందాయి. నెవాడా ఓటర్లు ఒక సవరణను ఆమోదించారు. అది అమల్లోకి రావాలంటే వారు దానిని 2026లో మళ్లీ ఆమోదించాల్సి ఉంటుంది. ఫ్లోరిడా, నెబ్రాస్కా, సౌత్ డకోటా రాష్ట్రాల ఓటర్లు మాత్రం రాజ్యాంగ సవరణపై విముఖత వ్యక్తం చేశారు. అబార్షన్ నిషేధాన్ని రద్దు చేసిన రో వర్సెస్ వేడ్ తీర్పును అమెరికా సుప్రీంకోర్టు 2022లో కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో రిపబ్లికన్ల నియంత్రణలో ఉన్న చాలా రాష్ట్రాల్లో నిషేధాలు అమల్లోకి రావడానికి మార్గం సుగమం అయ్యింది. ప్రస్తుతం 13 రాష్ట్రాలు కొన్ని మినహాయింపులతో గర్భధారణ అన్ని దశలలో నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలు ఆరు వారాలు, మరికొన్ని నాలుగు వారాల తరువాత గర్భస్రావాన్ని నిషేధించాయి. అబార్షన్ రాష్ట్రాలకు వదిలేయాల్సిన అంశమని రిపబ్లికన్ అభ్యర్థిగా పదేపదే చెప్పిన ట్రంప్... ఇప్పుడు అధ్యక్షుడిగా కార్యనిర్వాహక చర్య ద్వారా అబార్షన్ హక్కులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

నిషేధాన్ని ఎత్తేసిన మిస్సోరీ..

ఏ దశలోనైనా గర్భస్రావానికి హక్కును కల్పిస్తూ, అబార్షన్‌పై నిషేధాన్ని ఎత్తివేసే మొదటి రాష్ట్రంగా మిస్సోరి నిలిచింది. గర్భస్రావం, జనన నియంత్రణ, గర్భధారణ చుట్టూ నిర్ణయాలు వ్యక్తిగతమైనవని, వాటిని రాజకీయాలు కాకుండా వ్యక్తులకే వదిలేయాలనే హక్కులకు ఓటేసి మిస్సోరియన్లు చరిత్రను సృష్టించారు.

మూడు రాష్ట్రాల్లో ఆంక్షలు

ఫ్లోరిడా, నెబ్రాస్కా, సౌత్ డకోటా రాష్ట్రాలు అబార్షన్‌పై నిషేధాన్ని సమర్థించాయి. అబార్షన్ వ్యతిరేకులు బ్యాలెట్ పద్ధతిలో విజయం సాధించారు. ఫలితంగా రిపబ్లికన్ గవర్నర్ రాన్ డిశాంటిస్‌కు రాజకీయ విజయం లభించింది. ఈ ఫలితం ఫ్లోరిడాలో, మొత్తం దేశానికి ఒక ముఖ్యమైన విజయమని జాతీయ గర్భస్రావ వ్యతిరేక గ్రూపు ఎస్బీఏ ప్రో-లైఫ్ అమెరికా అధ్యక్షుడు మార్జోరీ డాన్నెన్ఫెల్సర్ ప్రకటించారు. కొన్ని మినహాయింపులు మినహా గర్భస్రావంపై నిషేధం ఉన్న మరో రాష్ట్రమైన సౌత్ డకోటా సైతం అబార్షన్ హక్కులకు వ్యతిరేకంగా ఓటేసింది. అబార్షన్ హక్కులను కల్పించే రాజ్యాంగ సవరణను నెబ్రాస్కా ఓటర్లు తిరస్కరించారు.

ఆమోదం తెలిపిన ఏడు రాష్ట్రాలు..


ఇతర రాష్ట్రాలు అబార్షన్ హక్కుల చట్ట సవరణకు ఆమోదం తెలిపాయి. గర్భం దాల్చిన మొదటి 15 వారాల తర్వాత అబార్షన్‌ను నిషేధించే ప్రస్తుత చట్టాన్ని సవరణకు అరిజోనా ఆమోదం తెలిపింది. గర్భస్రావ హక్కులను ఇప్పటికే అనుమతించిన మేరీలాండ్‌లో ఈ ఫలితాలు పెద్ద తేడాను చూపవు. మిస్సోరిలో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. ఇక్కడ గర్భస్రావం ఇప్పటికే చట్టబద్ధమైనది. కొలరాడోలో 55% ఓటర్లు అబార్షన్ హక్కులకు మద్దతును ప్రకటించారు. గర్భస్రావం కోసం రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ నిధులను ఉపయోగించడాన్ని నిషేధించిన గత సవరణను కూడా ఇది రద్దు చేయనుంది. స్టేట్ మెడికేడ్, ప్రభుత్వ ఉద్యోగుల బీమా పథకాలు గర్భస్రావాన్ని కవర్ చేసే అవకాశాన్ని కూడా ఇది కల్పించనుంది. న్యూయార్క్ సమాన హక్కుల చట్టం కూడా ఆమోదం పొందింది. ఇందులో 'గర్భస్రావం'అనే పదం లేకపోయినా.. గర్భధారణ ఫలితాలు, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ, స్వయంప్రతిపత్తి ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. ఇది న్యూయార్క్ వాసులందరికీ గొప్ప విజయమని ఈక్వల్ రైట్స్ క్యాంపెయిన్ డైరెక్టర్ సాషా అహుజా ప్రకటించారు.

సంతకం రాక.. ఓట్లు చెల్లక

వాషింగ్టన్: మనకు ఒక కచ్చితమైన సంతకం అంటూ లేకపోతే ఎంత నష్టమో అమెరికా ఎన్నికలను చూసి తెలుసుకోవచ్చు. పోస్టు ద్వారా వచ్చిన చాలా ఓట్లు సంతకంలో తేడాల వల్ల చెల్లకుండాపోయాయి. సంతకం చేయడం రాకపోవడంతో ఓటు వేసినా అవి చెల్లలేదు. ప్రధానంగా యువ ఓటర్ల విషయంలో ఈ సమస్య ఎదురైంది. ఓటు-బై-మెయిల్ బ్యాలెట్‌లోని సంతకం, ఓటర్ రికార్డులోని సంతకం ఒకేలా ఉండాలి. ఎన్నికల అధికారులు రెండింటినీ సరిపోల్చుతారు. ధ్రువీకరణ తర్వాతే ఆ ఓటును లెక్కిస్తారు. ఒకవేళ ఏదైనా వ్యత్యాసం ఉన్నట్లు గుర్తిస్తే సదరు ఓటరుకు సమాచారం ఇస్తారు. సంతకాన్ని సరిచేసుకొనే అవకాశం కల్పిస్తారు. ఓటర్లు స్పందించపోవడంతో ఈసారి పెద్ద సంఖ్యలో ఓట్లు చెల్లలేదు. నెవడా రాష్ట్రంలోని క్లార్క్ కౌంటీలో 11,300, వాషో కౌంటీలో 1,800 ఓట్ల విషయంలో సంతకాలను మళ్లీ సరిదిద్దాల్సి వచ్చిందని ఎన్నికల అధికారి ఫ్రాన్సిస్కో అగిలార్ చెప్పారు. నేటి టెక్నాలజీ యుగంలో చేతితో రాయడం పెద్దగా అవసరం పడట్లేదు. అన్నీ కంప్యూటర్, ఫోన్‌లోనే టైప్ చేస్తున్నారు. సాధారణంగా సంతకాలను వంపు తిరిగిన అక్షరాల్లో(కర్సివ్) చేస్తారు. అమెరికా పాఠశాలల్లో ఇటీవలి కాలంలో కర్సివ్ చేతిరాత నేర్పించడం లేదు. దాంతో పిల్లలకు సంతకాలు చేయడం రావడం లేదని నిపుణులు అంటున్నారు.

సాక్షి ప్లస్ గురువారం । 7-11-2024

'భారతదేశ బిస్మార్క్' అని ఎవరిని పిలుస్తారు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ


మాదిరి ప్రశ్నలు

1. గాంధీ ఏ ఉద్యమం సందర్భంగా 'ఈ క్షణం నుంచి ప్రతి ఒక్కరు తమను తాము స్వతంత్రులుగా పరిగణించాలి. వ్యవహరించాలి' అని వ్యాఖ్యానించారు?
   1) ఖిలాఫత్ ఉద్యమం
   2) సహాయ నిరాకరణోద్యమం
   3) శాసనోల్లంఘనోద్యమం
   4) క్విట్ ఇండియా ఉద్యమం
2. హిందూ మహాసభను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1915 2) 1917 3) 1919 4) 1922
3. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) కాదంబినీ గంగూలీ - ఐఎన్‌సీ మొదటి మహిళా గ్రాడ్యుయేట్ ప్రతినిధి (కలకత్తా)
   2) దాదాభాయ్ నౌరోజీ–1866లో లండన్‌లో ఈస్టిండియా అసోసియేషన్ స్థాపన
   3) జవహర్‌లాల్ నెహ్రూ– 1929 లాహోర్ ఐఎన్‌సీకి అధ్యక్షుడు
   4) రవీంద్రనాథ్ ఠాగూర్–చౌరీచౌరా సంఘటనతో తన నైట్‌హుడ్ బిరుదు త్యజించాడు
4. విక్టోరియా మహారాణి ప్రకటనను లార్డ్ కానింగ్ ఎక్కడ నుంచి ప్రకటించాడు?
   1) అహ్మదాబాద్ 2) ఢిల్లీ
   3) అలహాబాద్ 4) లాహోర్
5. ఇల్బర్ట్ బిల్లు ఎప్పుడు రూపొందించారు?
   1) 1881 2) 1882 3) 1883 4) 1884
6. 'భారత జాతీయోద్యమానికి బైబిల్'గా దేన్ని పేర్కొంటారు?
   1) ఆనంద్ మఠ్ 2) గీతాంజలి
   3) భవానీ మందిర్ 4) బంధీ జీవన్
7. ఎల్ఫిన్‌స్టన్ కళాశాల(1834)ను ఎక్కడ స్థాపించారు?
   1) మద్రాస్ 2) కలకత్తా
   3) బొంబాయి 4) కటక్
8. జతపరచండి.
   జాబితా - I
   i) 1916 ii) 1913
   iii) 1922 iv) 1946
   v) 1928
   జాబితా - II
   ఎ) నెహ్రూ నివేదిక రూపకల్పన
   బి) రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు
   సి) గదర్ పార్టీ స్థాపన
   డి) లక్నో ఒప్పందం
   ఇ) చౌరీచౌరా సంఘటన
   1) i-ఇ, ii- డి, iii- సి, iv-బి,v-ఎ.
   2) i- సి, ii- ఎ, iii- డి, iv-ఇ,v-బి.
   3) i- డి, ii- సి, iii- ఇ, iv-బి,v-ఎ.
   4) i- ఎ, ii- బి, iii- సి, iv-డి,v-ఇ.
9. ఇల్బర్ట్ బిల్లు వివాద సమయంలో బ్రిటన్ ప్రధాని ఎవరు?
   1) పాలిమర్ స్టోన్ 2) గ్లాడ్‌స్టన్
   3) నైవేలీ చాంబర్లీన్ 4) డేవిడ్ లాయిడ్ జార్జి
10. జలియన్ వాలాబాగ్ దురంతంపై విచారణకు నియమించిన కమిటీ ఏది?
    1) సర్ మాక్ డొనాల్డ్ కమిటీ
    2) హంటర్ కమిటీ 3) ఫ్రేజర్ కమిటీ
    4) రివర్స్ స్ట్రాచీ కమిటీ
11. సహాయ నిరాకరణోద్యమాన్ని ఆమోదించిన నాగ్‌పూర్ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి (1920) అధ్యక్షుడు ఎవరు?
    1) లాలాలజపతిరాయ్
    2) సి. విజయ రాఘవాచారి
    3) మహాత్మా గాంధీ 4) చిత్తరంజన్ దాస్
12. సుభాష్ చంద్రబోస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కళాశాల ఏది?
    1) బెంగాల్ నేషనల్ కాలేజ్
    2) మదనపల్లి నేషనల్ కాలేజ్
    3) మచిలీపట్నం నేషనల్ కాలేజ్
    4) గుజరాత్ విద్యాపీఠ్
13. కింది వాటిలో సరైన జత ఏది?
    1) 1922 ఫిబ్రవరి 12 – సహాయ నిరాకరణోద్యమం నిలుపుదల
    2) 1911 డిసెంబర్ 11 – బ్రిటిష్ ఇండియా రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చడం
    3) 1928 ఫిబ్రవరి 3 – సైమన్ కమిషన్ బొంబాయిలో అడుగు పెట్టింది
    4) పైవన్నీ సరైనవే
14. జతపరచండి.
    జాబితా - I
    i) డా.బి.ఆర్. అంబేద్కర్
    ii) ఇ.వి. రామస్వామి నాయకర్
    iii) బాలగంగాధర తిలక్
    iv) స్వామి వివేకానంద
    v) కె.కె.మిత్రా
    జాబితా - II
    ఎ) ఉద్బోధన్ బి) సంజీవని
    సి) మరాఠీ డి) మూక్ నాయక్
    ఇ) కుడి అరసు
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి, v- ఇ
    2) i- డి, ii- ఇ, iii- సి, iv-ఎ, v- బి
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి, v- ఇ
    4) i- సి, ii- డి, iii- ఇ, iv-బి, v- ఎ
15. 'భారతదేశ బిస్మార్క్' అని ఎవరిని పిలుస్తారు?
    1) దాదాభాయ్ నౌరోజీ
    2) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
    3) గోపాలకృష్ణ గోఖలే
    4) లాలాలజపతి రాయ్
16. కాశ్మీర్‌ను స్వతంత్ర భారత్‌లో విలీనం చేసింది ఎవరు?
    1) హరిసింగ్ 2) మార్తాండ వర్మ
    3) రతన్‌సింగ్ 4) చైత్‌సింగ్
17. హైదరాబాద్‌లో జాయిన్ ఇండియా ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది?
    1) 1947 ఆగస్టు 7 2) 1946 సెప్టెంబర్ 6
    3) 1948 సెప్టెంబర్ 13 4) 1947 ఆగస్టు 16
18. జతపరచండి.
    జాబితా - I
    i) బ్రహ్మర్షి ii) మహర్షి
    iii) సరిహద్దు గాంధీ iv) రాజర్షి
    v) దేశబంధు
    జాబితా - II
    ఎ) పురుషోత్తందాస్ టాండన్
    బి) ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
    సి) చిత్తరంజన్ దాస్
    డి) రఘుపతి వెంకటరత్నం నాయుడు
    ఇ) బులుసు సాంబమూర్తి
    1) i- ఇ, ii- డి, iii- సి, iv-బి, v-ఎ.
    2) i- డి, ii- ఇ, iii- బి, iv-ఎ, v-సి.
    3) i- సి, ii- ఎ, iii- డి, iv-ఎ, v-బి.
    4) i- ఎ, ii- బి, iii- సి, iv-డి, v-ఇ.
19. 1954 ఏప్రిల్ 29న పంచశీల ఒప్పందం భారత్ చైనాల మధ్య ఏ ప్రాంతంలో జరిగింది?
    1) బీజింగ్ 2) పెకింగ్
    3) షాంగై 4) షాన్సీ
20. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి తెలుగువ్యక్తి?
    1) భోగరాజు పట్టాభి సీతారామయ్య
    2) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
    3) పి. ఆనందాచార్యులు
    4) ఆచార్య ఎన్.జి. రంగా
21. 1946 సెప్టెంబర్ 2న ఏర్పడిన నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో ఆర్థికమంత్రి ఎవరు?
    1) లియాఖత్ అలీ 2) సయ్యద్ జహీర్
    3) మహ్మద్ అలీ జిన్నా 4) రహ్మత్ అలీ చౌదరి
22. 'తీన్‌మూర్తి భవన్' ఎవరి నివాసం?
    1) జవహర్‌లాల్ నెహ్రూ
    2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
    3) చిత్తరంజన్ దాస్
    4) దాదాభాయ్ నౌరోజీ
23. మంత్రిత్రయ రాయబారం(1946) భారత్ లో పర్యటించిన కాలంలో అప్పటి వైస్రాయి ఎవరు?
    1) లార్డ్ లిన్‌లిత్ గో 2) లార్డ్ వెవేల్
    3) లార్డ్ విల్లింగ్‌టన్ 4) లార్డ్ మౌంట్ బాటెన్
24. భారత స్వాతంత్ర్య చట్టం ఎప్పుడు రాజ సమ్మతి పొందింది?
    1) 1947 ఆగస్టు 14 2) 1947 ఆగస్టు 15
    3) 1947 ఆగస్టు 6 4) 1947 జూలై 18
25. భారత్‌కు స్వాతంత్ర్యం లభించే బిల్లును బ్రిటిష్ పార్లమెంట్‌లో ఎప్పుడు ప్రవేశ పెట్టారు?
    1) 1947 జూలై 4 2) 1947 జూలై 14
    3) 1947 జూలై 16 4) 1947 జూలై 17
26. దీపావళి ప్రకటన చేసిన వైస్రాయ్?
    1) లార్డ్ రీడింగ్ 2) లార్డ్ ఇర్విన్
    3) లార్డ్ లిన్‌లిత్‌గో 4) లార్డ్ వెవేల్
27. గదర్ పార్టీ తొలి అధ్యక్షుడు ఎవరు?
    1) కర్తార్ సింగ్ శరభా 2) గులాబ్ కౌర్
    3) సోహన్ సింగ్ భక్నా 4) రాస్ బిహారీ బోస్
28. 'స్టాలిన్‌గ్రాడ్ ఆఫ్ ఇండియా' అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
    1) అహ్మదాబాద్ 2) బొంబాయి
    3) కాన్పూర్ 4) కలకత్తా
29. లీడర్ పత్రిక స్థాపకుడు ఎవరు?
    1) దర్శి చెంచయ్య 2) మదన్‌మోహన్ మాలవ్య
    3) లాలా హరదయాళ్ 4) మోతీలాల్ నెహ్రూ
30. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) మధుశాల– హరివంశరాయ్ బచ్చన్
    2) డిస్కవరీ ఆఫ్ ఇండియా– మోతీలాల్ నెహ్రూ
    3) సావిత్రి – అరవింద ఘోష్
    4) హింద్ స్వరాజ్ – ఎం.కె. గాంధీ
31. ఇండియన్ సివిల్ సర్వీస్‌కు ఎంపిక అయిన తొలి భారతీయుడు?
    1) దేవేంద్రనాథ్ ఠాగూర్
    2) సి. సుబ్రమణ్యం అయ్యర్
    3) సత్యేంద్రనాథ్ ఠాగూర్
    4) వి.పి. మీనన్
32. బాలశాస్త్రి జంబేకర్ స్థాపించిన పత్రిక ఏది?
    1) దర్పణ్ 2) అమృతబజార్
    3) సంవాద కౌముది 4) కేసరి
33. రాజకీయ సంస్కరణలు కావాలని ఉద్యమించిన తొలి భారతీయుడు?
    1) బంకించంద్ర ఛటర్జీ
    2) రాజా రామ్మోహన్ రాయ్
    3) ఆనందమోహన్ బోస్
    4) ఫిరోజ్ షా మెహతా
34. లార్డ్‌రిప్పన్ విద్యాకమిషనర్‌గా విలియం హంటర్‌ను ఎప్పుడు నియమించారు?
    1) 1880 2) 1881 3) 1882 4) 1883
35. 'స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియా'ను వ్యవస్థీకరించిన వైస్రాయి ఎవరు?
    1) లార్డ్ మేయో 2) లార్డ్ డఫ్రిన్
    3) లార్డ్ కానింగ్ 4) లార్డ్ వెవేల్
36. కింది వాటిలో సరైన జత ఏది?
    1) జెన్మిలు–మోప్లా ప్రాంత జమీందారులు
    2) పాబ్నా ఉద్యమం– తూర్పు బెంగాల్
    3) జనతా వారపత్రిక - బి.ఆర్. అంబేద్కర్
    4) పైవన్నీ సరైనవే
37. కేరళలో ప్రథమ ఆధునిక నవల 'ఇందులేఖ' రచయిత ఎవరు?
    1) చందర్ మీనన్ 2) ఎమ్.పద్మనాభ పిళ్లై
    3) కె.రామకృష్ణ పిళ్లై 4) సి.వి. రామన్ పిళ్లై
38. స్వరాజ్ అనే పదాన్ని తొలిసారి ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఉపయోగించారు?
    1) 1885 – బొంబాయి 2) 1886 – కలకత్తా
    3) 1906– కలకత్తా 4) 1907– సూరత్
39. జన్మభూమి (ఇంగ్లిష్) పత్రికాధినేత?
    1) కాశీనాథుని నాగేశ్వరరావు
    2) పి. ఆనందాచార్యులు
    3) భోగరాజు పట్టాభి సీతారామయ్య
    4) అయ్యదేవర కాళేశ్వరరావు
40. 1908 ఆలిండియా ముస్లిం లీగ్ మొదటి సమావేశానికి అధ్యక్షుడు ఎవరు?
    1) మహమ్మద్ అలీ జిన్నా
    2) సర్ సయ్యద్ అలీ ఇమాం
    3) మౌలానా అబుల్ కలాం ఆజాద్
    4) ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
41. కింది వారిలో రవీంద్రనాథ్ ఠాగూర్‌ను 'గురుదేవ్' అని తొలిసారి పిలిచిందెవరు?
    1) గోపాలకృష్ణ గోఖలే
    2) మహాత్మాగాంధీ 3) నేతాజీ బోస్
    4) జవహర్‌లాల్ నెహ్రూ
42. భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు గాంధీజీని జాతి నాయకుడిగా ఏ సమావేశంలో గుర్తించారు?
    1) 1916– లక్నో 2) 1920– నాగ్‌పూర్
    3) 1925–కాన్పూర్ 4) 1929 –లాహోర్
43. జతపరచండి.
    నినాదం
    i) డివైడ్ అండ్ క్విట్ ii) జైహింద్
    iii) బోధించు, సమీకరించు, పోరాడు
    iv) స్వరాజ్యం నా జన్మహక్కు
    v) జై జగత్
    ప్రముఖుడు
    ఎ) ఆచార్యా వినోభాబావే
    బి) లోకమాన్య తిలక్
    సి) మహమ్మద్ అలీ జిన్నా
    డి) డా.బి.ఆర్. అంబేద్కర్
    ఇ) నేతాజీ సుభాష్ చంద్రబోస్
    1) i-ఎ, ii- బి, iii- సి, iv-డి,v-ఇ.
    2) i- ఇ, ii- డి, iii- బి, iv-ఎ,v-సి.
    3) i- సి, ii- ఇ, iii- డి, iv-బి,v-ఎ.
    4) i- డి, ii- సి, iii- ఎ, iv-ఇ,v-బి.
44. కింది వాటిలో సరైన జత ఏది?
    1) భారత కోకిల – సరోజినీ నాయుడు
    2) క్విట్ ఇండియా ఉద్యమరాణి – అరుణా అసఫ్ అలీ
    3) ఇండియన్ జోన్ ఆఫ్ ఆర్క్ – ఝాన్సీ లక్ష్మీబాయి
    4) పైవన్నీ సరైనవే
45. మదన్ మోహన్ మాలవ్య ప్రపంచవ్యాప్తం చేసిన సూక్తి ఏది?
    1) సత్యమేవ జయతే
    2) సత్యం శివం సుందరం
    3) శీలేన శోభతే విద్య
    4) స్పర్ధయా వర్ధతే విద్య
46. భారత జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశానికి హాజరైన హైదరాబాద్ ముస్లిం నాయకుడు?
    1) సయ్యద్ బిల్‌గ్రామి 2) బద్రుద్దీన్ త్యాబ్జీ
    3) ముల్లా అబ్దుల్ ఖయ్యూం
    4) మౌల్వీ మహ్మద్ ముర్తజ్
47. 1948 ఆపరేషన్ పోలో కాలంలో నిజాం సైన్యాలకు ఎవరు నాయకత్వం వహించారు?
    1) ఎల్‌డ్రూస్ 2) విలియం పామర్
    3) లాయక్ అలీ 4) కాశీం రజ్వీ
48. 'జోడేఘాట్ జ్వాల' అని ఎవరిని పిలుస్తారు?
    1) దొడ్డి కొమరయ్య
    2) కొమురం భీం 3) రాంజీ గోండ్
    4) సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్
49. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను ఎప్పుడు స్థాపించారు?
    1) 1936 2) 1938 3) 1941 4) 1943
50. కింది వాటిలో సరైంది ఏది?
    1) సురవరం ప్రతాపరెడ్డి–గోల్కొండ పత్రిక
    2) షోయబుల్లాఖాన్ – ఇమ్రోజ్ పత్రిక
    3) ఆంధ్రపత్రిక–కాశీనాథుని నాగేశ్వరరావు
    4) పైవన్నీ సరైనవే
51. 'నీల్ దర్పణ్' గ్రంథకర్త ఎవరు?
    1) బంకించంద్ర ఛటర్జీ 2) దీనబంధు మిత్ర
    3) ముల్కరాజ్ ఆనంద్
    4) మున్షీప్రేమ్ చంద్
52. భారత్‌లో తొలి వితంతు వివాహం చేసుకున్న బెంగాల్ వాసి?
    1) శ్రీష్‌చంద్ర విద్యారత్న
    2) గౌతంఘోష్ 3) కృష్ణకుమార్ మిత్ర
    4) హరీష్ చంద్ర ముఖర్జీ
53. చివరి కాశ్మీర్ పాలకుడు హరిసింగ్ ఏ వంశానికి చెందినవారు?
    1) కార్కోట 2) డోగ్రా
    3) చౌహాన్ 4) సేన
54. మహా భారతాన్ని బెంగాలీలోకి అనువదించిందెవరు?
    1) శంభునాథ్ పండిట్ 2) మోతీలాల్ రాయ్
    3) కాళీ ప్రసన్న సింగ్
    4) శిశిర్ కుమార్ ఘోష్
55. భారతదేశపు ఛార్లెస్ డికెన్స్ అని కీర్తి పొందినవారు?
    1) ముల్కరాజ్ ఆనంద్ 2) ఆర్.కె.నారాయణ్
    3) మున్షీ ప్రేమ్‌చంద్ 4) దీనబంధు మిత్రా
56. 1893లో గాంధీజీ ఏ భారతీయ వ్యాపారవేత్తకు న్యాయసలహాదారుగా దక్షిణాఫ్రికా వెళ్లాడు?
    1) జమ్నాలాల్ బజాజ్ 2) దాదా అబ్దుల్లా
    3) రాజ్‌కుమార శుక్లా 4) ప్రమోద్ మిట్టర్
57. జె.ఎం.ఛటర్జీ స్థాపించిన సంస్థ ఏది?
    1) ఫ్రీ ఇండియా సొసైటీ
    2) భారత్ మాతా సొసైటీ
    3) అఖిలభారత హోంరూల్ లీగ్
    4) అనుశీలన్ సమితి

సమాధానాలు

1) 4	2) 1	3) 4	4) 3	5) 3
6) 1	7) 3	8) 3	9) 2	10) 2
11) 2	12) 1	13) 4	14) 2	15) 2
16) 1	17) 1	18) 2	19) 2	20) 3
21) 1	22) 1	23) 2	24) 4	25) 1
26) 2	27) 3	28) 1	29) 2	30) 2
31) 3	32) 1	33) 2	34) 3	35) 1
36) 4	37) 1	38) 3	39) 3	40) 2
41) 2	42) 2	43) 3	44) 4	45) 1
46) 3	47) 1	48) 2	49) 2	50) 4
51) 2	52) 1	53) 2	54) 3	55) 1
56) 2	57) 2			

ప్రపంచంలో మహిళలకు ఓటు హక్కు కల్పించిన తొలి దేశం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగ పరిషత్తు నిర్మాణం

1. భారతదేశంలోని రాజ్యాధికారానికి మూలం?
   1) ప్రభుత్వం 2) ప్రజలు
   3) సార్వభౌమాధికారం 4) భూభాగం
2. భారతీయులు స్వయంగా తమ రాజ్యాంగాన్ని తామే రూపొందించుకోవాలనే భావనను తొలిసారిగా 1934లో తన అభిప్రాయాన్ని తెలియజేసింది ఎవరు?
   1) ఎం.ఎన్. రాయ్ 2) గాంధీజీ
   3) అంబేద్కర్ 4) నెహ్రూ
3. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) 1942లో క్రిప్స్ కమిషన్ రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేస్తామని తొలిసారిగా ప్రతిపాదించింది
   బి) 1946లో కేబినెట్ కమిషన్ సిఫార్సు మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటైంది.
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) ఏదీకాదు
4. కింది వారిలో 1946లో కేబినెట్ కమిషన్ సభ్యులు కాని వారు ఎవరు?
   1) పెథిక్ లారెన్స్ 2) స్టాఫర్డ్ క్రిప్స్
   3) ఎ.వి. అలెగ్జాండర్ 4) లార్డ్ అట్లీ
5. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు సంబంధించి కింది మార్గదర్శక సూత్రాల్లో సరైంది ఏది?
   ఎ) రాజ్యాంగ పరిషత్తులో సభ్యుల ఎన్నిక పరోక్ష ఎన్నిక
   బి) ప్రతి పది లక్షల జనాభాకు ఒక రాజ్యాంగ పరిషత్తు సభ్యుడు ప్రాతినిధ్యం వహించాలి
   1) ఎ సరైంది 2) బి సరైంది
   3) ఎ, బి రెండూ సరైనవి కాదు
   4) ఎ, బి రెండూ సరైనవే
6. కింది వాటిలో రాజ్యాంగ పరిషత్తు నిర్మాణానికి సంబంధించి సరైంది?
   ఎ) రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు 1946 జూలై – ఆగస్టులో జరిగాయి
   బి) రాజ్యాంగ పరిషత్తు ప్రారంభంలో సభ్యుల సంఖ్య 389
   సి) 389 మందిలో బ్రిటిష్ పాలిత రాష్ట్రాల నుంచి 292 మంది
   డి) స్వదేశీ సంస్థానాల నుంచి – 93
   1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, సి
7. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ పరిషత్తులో సభ్యులకు సంబంధించి సరైంది ఏది?
   1) స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ పరిషత్తులో సభ్యుల సంఖ్య – 299
   2) బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికైనవారు – 229
   3) స్వదేశీ సంస్థానాల నుంచి ఎన్నికైనవారు–70
   4) పైవన్నీ సరైనవే
8. కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్‌కు బెంగాల్ నుంచి ఎంపికయ్యారు
   బి) దేశ విభజన ఫలితం అంబేద్కర్ తన ప్రాతినిధ్యాన్ని కోల్పోయారు
   సి) బాంబే రాష్ట్రం నుంచి రాజ్యాంగ పరిషత్‌కు అంబేద్కర్ నామినేట్ అయ్యారు
   డి) అంబేద్కర్ రాజ్యాంగ రచన కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు
   1) ఎ 2) సి, డి
   3) బి, డి 4) ఎ, బి, సి, డి
9. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) గాంధీజీని 'బాపూజీ' అని తొలిసారిగా నెహ్రూ సంబోధించారు
   బి) గాంధీజీని 'జాతిపిత' అని తొలిసారిగా సుభాష్ చంద్రబోస్ సంబోధించారు
   సి) గాంధీజీని 'మహాత్మ' అని రవీంద్రనాథ్ ఠాగూర్ సంబోధించారు
   డి) రవీంద్రనాథ్ ఠాగూర్‌ను గాంధీజీ 'గురుదేవ్' లేదా 'గురూజీ' అని పిలిచారు
   1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
   3) బి, సి 4) ఎ, సి, డి
10. కింది వారిలో రాజ్యాంగ పరిషత్తులో ఉన్న ప్రముఖ మహిళలు ఎవరు?
    1) శ్రీమతి సరోజినీ నాయుడు
    2) విజయలక్ష్మి పండిట్
    3) హంసా మెహతా 4) పైవారందరూ
11. రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికైన వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన వారిలో సరైన జత ఏది?
    జాబితా-I
    i) ఆంగ్లో ఇండియన్లు
    ii) పార్శీలు iii) సిక్కులు
    iv) అఖిల భారత షెడ్యూల్డ్ కులాలు
    జాబితా-II
    a) ఫ్రాంక్ ఆంథోని
    b) హెచ్.పి. మోడీ c) బల్‌దేవ్ సింగ్
    d) డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-b, ii-c, iii-d, iv-a
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-c, ii-b, iii-a, iv-d
12. రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబర్ 9న ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగింది.
    బి) మొదటి సమావేశానికి 211 మంది హాజరయ్యారు.
    సి) రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక అధ్యక్షుడిగా డాక్టర్ సచ్చిదానంద సిన్హాను ఎన్నుకున్నారు
    డి) ఫ్రాంక్ ఆంథోని ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు
    1) ఎ, బి 2) ఎ, డి
    3) బి, సి 4) ఎ, బి, సి, డి
13. 1946 డిసెంబర్ 11న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ను రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా ప్రతిపాదించిందెవరు?
    1) హెచ్.సి. ముఖర్జీ 2) వి.టి.కృష్ణమాచారి
    3) జె.బి. కృపలానీ 4) జవహర్‌లాల్ నెహ్రూ
14. రాజ్యాంగ పరిషత్ ముఖ్య సలహాదారు ఎవరు?
    1) బెనగల్ నరసింగ రావు
    2) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
    3) మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్
    4) ఫ్రాంక్ ఆంథోని
15. రాజ్యాంగ పరిషత్‌లో వివిధ అంశాల పరిశీలనకు మొత్తం ఎన్ని కమిటీలను ఏర్పాటు చేశారు?
    1) 11 2) 22 3) 33 4) 44
16. డ్రాఫ్టింగ్ కమిటీలో అధ్యక్షుడితో సహా మొత్తం సభ్యుల సంఖ్య ఎంత?
    1) 5 + 1 = 6 2) 6 + 1 = 7
    3) 1 + 7 = 8 4) 4 + 1 = 5
17. కింది వారిలో డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యులు కాని వారు ఎవరు?
    1) కృష్ణస్వామి అయ్యంగార్
    2) కె.ఎం.మున్షీ
    3) గోపాలస్వామి అయ్యంగార్
    4) గాంధీజీ
18. రాజ్యాంగ పరిషత్.. రాజ్యాంగ ముసాయిదాను ఎప్పుడు ఆమోదించింది?
    1) 1948 నవంబర్ 26
    2) 1949 నవంబర్ 26
    3) 1947 నవంబర్ 26
    4) 1950 నవంబర 26
19. రాజ్యాంగ రూపకల్పనకు పట్టిన సమయం?
    1) 2 సంవత్సరాల 10 నెలల 11 రోజులు
    2) 3 సంవత్సరాల 11 నెలల 18 రోజులు
    3) 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు
    4) 1 సంవత్సరం
20. భారత రాజ్యాంగ పరిషత్ 1950 జనవరి 24న జరిగిన చివరి సమావేశానికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య 284
    2) భారత గణతంత్ర ప్రథమ అధ్యక్షుడిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను పరిషత్ ఎన్నుకొంది
    3) జాతీయ గీతాన్ని, గేయాన్ని ఆమోదించింది
    4) పైవన్నీ సరైనవే
21. జతపరచండి.
    కమిటీలు:
    i) రాజ్యాంగ సారథ్య సంఘం
    ii) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
    iii) రాజ్యాంగ సలహా సంఘం
    iv) నిబంధనల కమిటీ
    అధ్యక్షుడు:
    a) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    b) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
    c) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
    d) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    1) i-b, ii-a, iii-c, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-a, ii-b, iii-c, iv-d
    4) i-c, ii-a, iii-d, iv-b
22. రాజ్యాంగ పరిషత్‌లో సబ్‌కమిటీలను జతపరచండి.
    జాబితా-I
    i) ప్రాథమిక హక్కుల ఉపసంఘం
    ii) ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ
    iii) మైనారిటీల సబ్ కమిటీలు
    iv) ప్రత్యేక ప్రాంతాల కమిటీ
    జాబితా-II
    a) జె.బి కృపలానీ
    b) గోపినాథ్ బోర్డోలాయ్
    c) హెచ్.సి. ముఖర్జీ d) ఎ.వి. టక్కర్
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-c, ii-a, iii-b, iv-d
    4) i-b, ii-c, iii-a, iv-d
23. రాజ్యాంగ పరిషత్ చిహ్నం ఏది?
    1) ఐరావతం 2) సింహం
    3) పులి 4) నెమలి
24. ఏ వ్యక్తిని రాజ్యాంగ పరిషత్‌కు స్నేహితుడు, మార్గదర్శిగా, తత్వవేత్తగా పేర్కొంటారు?
    1) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
    2) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
    3) నెహ్రూ 4) డాక్టర్ బి.ఎన్. రావు
25. 'భారత రాజ్యాంగం ఇతర రాజ్యాంగాలన్నింటినీ కొల్లగొట్టి రూపొందించిందిగా వర్ణిస్తే నేను గర్వపడతాను. ఎందుకంటే మంచి ఎక్కడున్నా గ్రహించడం తప్పేమీ కాదు' అని పేర్కొంది ఎవరు?
    1) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
    2) బాబూ రాజేంద్రప్రసాద్
    3) జవహర్‌లాల్ నెహ్రూ
    4) కె. ఎం. మున్షీ
26. భారత రాజ్యాంగాన్ని 'న్యాయవాదుల స్వర్గం, సుదీర్ఘమైంది,దివ్యమైంది'అని వర్ణించిందెవరు?
    1) సర్ ఐవర్ జెన్నింగ్
    2) గ్రాన్‌విల్ ఆస్టిన్
    3) విన్‌స్టన్ చర్చిల్ 4) ఎవరూ కాదు
27. రాజ్యాంగ రచనలో సమన్వయ పద్ధతి కంటే సర్దుబాటు పద్ధతికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నదెవరు?
    1) ఒ.పి. గోయల్ 2) జవహర్‌లాల్ నెహ్రూ
    3) రాజేంద్రప్రసాద్ 4) విన్‌స్టన్ చర్చిల్
28. భారత రాజ్యాంగానికి నకలుగా కింది ఏ చట్టాన్ని పేర్కొంటారు?
    1) 1919 చట్టం
    2) 1935 భారత ప్రభుత్వ చట్టం
    3) 1947 భారత స్వాతంత్ర్య చట్టం
    4) ఏదీకాదు
29. కింది వాటిలో భారత రాజ్యాంగంలో బ్రిటన్ రాజ్యాంగం నుంచి స్వీకరించని అంశం?
    1) పార్లమెంటరీ ప్రభుత్వ విధానం
    2) ఎన్నికల వ్యవస్థ, ఏక పౌరసత్వం
    3) సమన్యాయ పాలన
    4) రాష్ట్రపతి ఎన్నిక విధానం
30. అమెరికా రాజ్యాంగం నుంచి భారత రాజ్యాంగంలోకి స్వీకరించిన అంశాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి?
    ఎ) రాష్ట్రపతిని తొలగించే పద్ధతి మహాభియోగ తీర్మానం
    బి) న్యాయ సమీక్షాధికారం,ప్రాథమిక హక్కులు
    సి) రాజ్యాంగ ప్రవేశిక
    డి) లిఖిత రాజ్యాంగం
    1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
    3) సి, డి 4) బి, సి
31. జతపరచండి.
    జాబితా-I
    i) ఉమ్మడి జాబితా
    ii) రాజ్యాంగ సవరణ పద్ధతి
    iii) ప్రాథమిక విధులు
    iv) న్యాయ సమీక్ష
    జాబితా-II
    a) ఆస్ట్రేలియా b) దక్షిణాఫ్రికా
    c) రష్యా d) అమెరికా
    1) i-d, ii-c, iii-a, iv-b
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-a, ii-c, iii-d, iv-b
32. కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) భారత రాజ్యాంగంలోని ప్రారంభంలో 395 ఆర్టికల్స్, 8షెడ్యూళ్లు, 22 భాగాలు ఉన్నాయి
    బి) ప్రస్తుతం 12 షెడ్యూళ్లు ఉన్నాయి
    సి) ఐదో షెడ్యూల్‌లో షెడ్యూల్ ప్రాంతాల పరిపాలనా వివరాలు ఉన్నాయి
    డి) ఏడో షెడ్యూల్‌లో కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విభజన ఉంది
    1) ఎ మాత్రమే 2) డి మాత్రమే
    3) ఎ, బి, సి, డి 4) ఎ, బి
33. 8వ షెడ్యూల్‌కు సంబంధించి సరైంది?
    ఎ) గుర్తింపు పొందిన అధికార భాషల గురించి పేర్కొంటుంది
    బి) రాజ్యాంగం అమలు నాటికి గుర్తింపు భాషలు – 14
    సి) ప్రస్తుతం రాజ్యాంగం గుర్తించిన భాషలు– 22
    డి) 92వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గుర్తించిన భాషలు బోడో,డోంగ్రి,సంతాలి, మైథిలీ
    1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
    3) ఎ, సి 4) సి, డి
34. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సంబంధించిన షెడ్యూల్ ఏది?
    1) 1వ షెడ్యూల్ 2) 3వ షెడ్యూల్
    3) 7వ షెడ్యూల్ 4) 10వ షెడ్యూల్
35. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఏ ప్రధానమంత్రి కాలంలో అమల్లోకి వచ్చింది?
    1) జవహర్‌లాల్ నెహ్రూ
    2) పి.వి. నరసింహారావు
    3) రాజీవ్ గాంధీ 4) మన్మోహన్ సింగ్
36. భారత దేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించింది ఎవరు?
    1) పాల్ ఆఫ్ బీ 2) కె.సి. వేర్
    3) డి.ఎన్. బెనర్జీ 4) మోరిస్ జోన్స్
37. భారత రాజ్యాంగాన్ని 'సహకార సమాఖ్య' అని అభివర్ణించింది ఎవరు?
    1) గ్రాన్‌విల్ ఆస్టిన్, డి.ఎన్. బెనర్జీ
    2) పాల్ ఆఫ్ బీ
    3) కె.సి. వేర్ 4) ఐవర్ జెన్నింగ్స్

సమాధానాలు

1) 2	2) 1	3) 3	4) 4	5) 4
6) 2	7) 4	8) 4	9) 1	10) 4
11) 1	12) 4	13) 3	14) 1	15) 2
16) 2	17) 4	18) 2	19) 3	20) 4
21) 3	22) 1	23) 1	24) 4	25) 1
26) 1	27) 1	28) 2	29) 4	30) 1
31) 2	32) 3	33) 1	34) 4	35) 3
36) 2	37) 1			

'గేట్‌వే ఆఫ్ శ్రీనగర్' అని పిలిచే కనుమ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ



మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిని జతపరచండి?
 జాబితా-I జాబితా-II
 i) మాక్‌డోక్ a) పశ్చిమ బెంగాల్ డింపెప్ లోయ
 ii) సుబ్రాలోయ b) మేఘాలయ
 iii) కులులోయ c) జమ్మూ కశ్మీర్
 iv) కాలింపాంగ్ d) హిమాచల్ ప్రదేశ్
 1) i-c, ii-d, iii-b, iv-a
 2) i-d, ii-c, iii-b, iv-a
 3) i-b, ii-c, iii-d, iv-a
 4) i-d, ii-b, iii-a, iv-c
2. కింది వాటిని జతపరచండి.
 జాబితా-I
 i) కచార్ కొండలు ii) డాప్లా కొండలు
 iii) లుషాయి కొండలు iv) జయంతియా కొండలు
 జాబితా-II
 a) మేఘాలయ b) మిజోరాం
 c) అరుణాచల్ ప్రదేశ్ d) అసోం
 1) i-a, ii-c, iii-d, iv-b
 2) i-a, ii-b, iii-c, iv-d
 3) i-c, ii-a, iii-d, iv-b
 4) i-d, ii-c, iii-b, iv-a
3. కింది వాటిలో సరైంది ఏది?
 ఎ) జస్కార్ పర్వత శ్రేణి, కారకోరం పర్వత శ్రేణికి ఉత్తరంగా విస్తరించి ఉంది.
 బి) లడఖ్, జస్కార్ శ్రేణుల మధ్య సింధూనది ప్రవహిస్తోంది.
 సి) కారకోరం పర్వతశ్రేణి ట్రాన్స్ హిమాలయాల్లో ఒక భాగం
 1) ఎ, బి 2) బి, సి
 3) ఎ, సి 4) ఎ, బి, సి
4. కింది వాటిలో సరికానిది ఏది?
 1) 'కనుమ' అంటే రెండు కొండల మధ్య ఏర్పడే సహజ రహదారి
 2) అంతర్వేది అంటే రెండు నదుల మధ్య ఉన్న సారవంతమైన ప్రాంతం
 3) అనేక నదులకు జన్మస్థానమైన 'మానస సరోవరం' హిమాలయ పర్వత శ్రేణిలో ఉంది.
 4) 'డూన్‌లు' అంటే హిమాచల్, శివాలిక్ పర్వత శ్రేణుల మధ్య ఉన్న సన్నని సమదైర్ఘ్య లోయలు
5. నేపాల్ హిమాలయాలు ఏ రెండు నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
 1) కాళీ , తీస్తా నదులు 2) తీస్తా, సట్లెజ్ నదులు
 3) సట్లెజ్, కాళీ నదులు 4) తీస్తా, బ్రహ్మపుత్ర నదులు
6. కింది వాటిలో సరికానిది ఏది?
 1) హిమాలయాలు అతితరుణ ముడత పర్వతాలు
 2) ఇవి కేంబ్రియన్ మహాయుగంలో ఏర్పడ్డాయి.
 3) ఇవి ప్రపంచంలో ఎత్తైన పర్వత శ్రేణులు
 4) ఇవి సుమారు 5లక్షల చ.కి.మీ.ల వైశాల్యం కలిగి ఉన్నాయి.
7. కింది వాటిలో సరికాని జత ఏది?
 1) నామ్చాబర్వా- అరుణాచల్ ప్రదేశ్
 2) అన్నపూర్ణ - ఉత్తరాఖండ్
 3) నంగప్రభాత్ - జమ్మూ కశ్మీర్
 4) మకాలు - నేపాల్
8. కిందివాటిలో సరైంది ఏది?
 ఎ) శివాలిక్ పర్వత శ్రేణులు గ్రేటర్ హిమాలయాలకు దక్షిణంగా విస్తరించి ఉన్నాయి.
 బి) లెస్సర్ హిమాలయాలు బాహ్య హిమాలయాలకు ఉత్తరంగా విస్తరించి ఉన్నాయి.
 సి) శివాలిక్ హిమాలయాలు మయోసిన్ యుగంలో ఏర్పడ్డాయి.
 1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
 3) ఎ, బి 4) బి, సి
9. జతపరచండి.
 జాబితా-I
 i) కైలాస కొండలు ii) సులేమాన్ పర్వతాలు
 iii) కున్‌లున్ పర్వతాలు v) హిందుకుష్ పర్వతాలు
 జాబితా-II
 a) ఆఫ్ఘనిస్తాన్ b) చైనా
 c) పాకిస్తాన్ d) టిబెట్
 1) i-c, ii-d, iii-a, iv-b
 2) i-d, ii-a, iii-b, iv-c
 3) i-d, ii-c, iii-b, iv-a
 4) i-b, ii-c, iii-d, iv-a
10. 'ఆసియా ఖండానికి వెన్నెముక' అని ఏ పర్వత శ్రేణిని పిలుస్తారు?
 1) లడఖ్ శ్రేణి 2) జస్కార్ శ్రేణి
 3) కైలాస కొండలు 4) కారకోరం పర్వతశ్రేణి
11. కింది వాటిలో హిమాలయ పర్వత శ్రేణిలో లేని శిఖరం ఏది ?
 1) కాంచన గంగా 2) గాడ్విన్ ఆస్టిన్
 3) మకాలు 4) ధవళగిరి
12. కింది వాటిలో సరికానిది ఏది?
 1) 'గేట్ వే ఆఫ్ శ్రీనగర్' అని బనిహాల్ కనుమను పిలుస్తారు
 2) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రం 'సియాచిన్'
 3) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రెండో శిఖరం కాంచనగంగ
 4) భారతదేశంలో ఎత్తైన కనుమ ఖార్దుంగ్లా కనుమ
13. జతపరచండి.
 జాబితా-I
 i) నిథి కనుమ ii) షిప్కిలా కనుమ
 iii) జోజిలా iv) నాథులా
 జాబితా-II
 a) సిక్కిం b) ఉత్తరాఖండ్
 c) హిమాచల్ ప్రదేశ్ d) జమ్మూకశ్మీర్
 1) i-c, ii-d, iii-b, iv-a
 2) i-b, ii-c, iii-d, iv-a
 3) i-a, ii-b, iii-c, iv-d
 4) i-d, ii-c, iii-b, iv-a
14. షిప్కిలా కనుమ ద్వారా భారతదేశంలో ప్రవేశించే నది ఏది?
 1) సింధూనది 2) జీలం
 3) బ్రహ్మపుత్ర 4) సట్లెజ్
15. శివాలిక్ పర్వత శ్రేణులకు సంబంధించి సరైంది ఏది?
 ఎ) ఇవి దిగువ ప్లిస్టోసీన్ యుగంలో ఏర్పడ్డాయి.
 బి) ఇవి ఇసుక, గ్రావెల్ కంగ్లా మరేటి వంటి శిలలతో ఏర్పడ్డాయి.
 సి) ఈ పర్వత శ్రేణుల్లో శృంగాకారపు అడవులు విస్తరించి ఉన్నాయి.
 1) ఎ, బి 2) బి, సి
 3) ఎ, సి 4) ఎ, బి, సి
16. హిమాచల్ పర్వత శ్రేణులకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
 ఎ) ఇవి వేసవి విడిది కేంద్రాలకు ప్రసిద్ధి చెందాయి.
 బి) ఇవి గ్రానైట్, నీస్ వంటి శిలలతో ఏర్పడ్డాయి.
 సి) ఇవి సుమారు 14 మిలియన్ సంవత్సరాల కాలంలో ఏర్పడ్డాయి.
 డి) ఇవి హిమాద్రి శ్రేణులకు ఉత్తరంగా విస్తరించి ఉన్నాయి.
 1) ఎ, బి, సి 2) బి, సి, డి
 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
17. గంగా-సింధు మైదానం ఏయే దేశాల్లో విస్తరించి ఉంది?
 1) భారత్, బంగ్లాదేశ్ , మయన్మార్
 2) భారత్, బంగ్లాదేశ్ , పాకిస్తాన్
 3) భారత్, నేపాల్ , పాకిస్తాన్
 4) భారత్, పాకిస్తాన్ , చైనా
18. చోస్ అంటే ఏమిటి?
 1) చిత్తడి ప్రదేశం 2) నీటి గుంటలు
 3) బురద దిబ్బలు 4) ఇసుక దిబ్బలు
19. జతపరచండి.
 జాబితా-I
 i) బారిదోబ్ ii) ఛాజ్
 iii) రేచన iv) బిస్ట్
 జాబితా-II
 a) బియాస్- రావి నదుల మధ్య
 b) చీనాబ్- జీలం నదుల మధ్య
 c) రావి- చీనాబ్ నదుల మధ్య
 d) బియాస్- సట్లెజ్ నదుల మధ్య
 1) i-b, ii-c, iii-d, iv-a
 2) i-c, ii-d, iii-b, iv-a
 3) i-d, ii-c, iii-b, iv-a
 4) i-a, ii-b, iii-c, iv-d
20. కింది వాటిలో సరికానిది ఏది?
 1) త్రియాన్ అంటే కదిలే ఇసుక దిబ్బలు
 2) రన్స్ అంటే ఉప్పునీటి కయ్యలు
 3) రోహి అంటే సారవంతంకాని భూములు
 4) కోల్స్ అంటే బురద దిబ్బలు
21. ప్రస్తుతం ఉన్న హిమాలయాలు ఏ ఫలకలు ఢీకొట్టడం వల్ల ఏర్పడ్డాయి?
 1) ఆస్ట్రేలియా ఫలక, ఉత్తర అమెరికా ఫలక
 2) యురేషియా ఫలక, ఆఫ్రికా ఫలక
 3) యురేషియా ఫలక, ద్వీపకల్ప ఫలక
 4) ఆస్ట్రేలియా ఫలక, ద్వీపకల్ప ఫలక
22. 'కాయల్స్' ప్రధానంగా ఏ తీరంలో కనిపిస్తాయి?
 1) మలబారు తీరం 2) కోరమండల్ తీరం
 3) కొంకణ్ తీరం 4) వంగ తీరం
23. జతపరచండి.
 జాబితా-I
 i) చిల్కా సరస్సు ii) కొల్లేరు సరస్సు
 iii) అష్టముడి సరస్సు iv) వెంబనాడ్ సరస్సు
 జాబితా-II
 a) కేరళ మైదానం b) మలబార్ తీరం
 c) సర్కార్ తీరం d) ఉత్కళ తీరం
 1) i-c, ii-a, iii-d, iv-b
 2) i-d, ii-a, iii-b, iv-c
 3) i-b, ii-a, iii-d, iv-c
 4) i-d, ii-c, iii-b, iv-a
24. కిందివాటిలో పశ్చిమ కనుమలకు చెందనివి ఏవి?
 1) గాలి కొండలు 2) ఫళని కొండలు
 3) కార్డమమ్ కొండలు 4) ఇలైమలై కొండలు
25. కింది వాటిలో సరికాని జత ఏది?
 1) దూప్‌ఘర్ శిఖరం-సాత్పూరా పర్వతాలు
 2) అమరకంటక్ శిఖరం-వింధ్యాపర్వతాలు
 3) గురుశిఖర్- నీలగిరి పర్వతాలు
 4) అనైముడి - పశ్చిమ కనుమలు
26. కింది వాటిలో సరైంది ఏది?
 ఎ) ద్వీపకల్ప పీఠభూమి ప్రాక్- కేంబ్రియన్ కాలంలో ఏర్పడింది.
 బి) ఇది సుమారు 16లక్షల చ.కి.మీ విస్తరించి ఉంది.
 సి) ఇది భారతదేశంలో కెల్లా అతిపెద్ద భూస్వరూపం
 1) ఎ, బి 2) బి, సి
 3) ఎ, సి 4) ఎ, బి, సి
27. జతపరచండి.
 జాబితా-I
 i) భోరట్ పీఠభూమి ii) కథియవార్ పీఠభూమి
 iii) భాఘల్‌ఖండ్ పీఠభూమి iv) బస్తర్ పీఠభూమి
 జాబితా-II
 a) గుజరాత్ b) రాజస్తాన్
 c) ఛత్తీస్‌గఢ్ d) మధ్యప్రదేశ్
 1) i-c, ii-a, iii-d, iv-b
 2) i-b, ii-a, iii-c, iv-d
 3) i-d, ii-a, iii-c, iv-b
 4) i-b, ii-a, iii-d, iv-c
28. మాల్వా పీఠభూమిని, దక్కన్ పీఠభూమిని వేరుచేసే నది ఏది?
 1) మహానది 2) తపతి
 3) నర్మద 4) గోదావరి
29. కింది వాటిలో సరికానిది ఏది?
 1) మాల్వా పీఠభూమికి ఈశాన్యంగా రాజమహల్ కొండలు సరిహద్దుగా ఉన్నాయి.
 2) వింధ్యాపర్వతాలు, మాల్వా పీఠభూమికి దక్షిణ సరిహద్దుగా ఉన్నాయి.
 3) కర్బి ఆంగ్‌లాంగ్ పీఠభూమి మేఘాలయలో ఉంది.
 4) పరుష్‌నాథ్ శిఖరం అండమాన్ దీవుల్లో విస్తరించి ఉంది.
30. లావా పీఠభూమికి ఒక ఉదహరణ?
 1) మహారాష్ట్ర పీఠభూమి
 2) చోటా నాగపూర్ పీఠభూమి
 3) షిల్లాంగ్ 4) బుందేల్‌ఖండ్
31. సాత్పూరా పర్వత శ్రేణులు ఏ నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
 1) సోన్, నర్మదా 2) నర్మదా, గోదావరి
 3) గోదావరి, తపతి 4) తపతి, నర్మదా
32. జతపరచండి.
 జాబితా-I
 i) రాజ్‌పిప్లా కొండలు ii) మహాదేవ కొండలు
 iii) జవధి iv) అన్నామలై
 జాబితా-II
 a) కేరళ b) తమిళనాడు
 c) మహారాష్ట్ర d) మధ్యప్రదేశ్
 1) i-d, ii-c, iii-b, iv-a
 2) i-c, ii-d, iii-b, iv-a
 3) i-b, ii-c, iii-d, iv-a
 4) i-b, ii-d, iii-c, iv-a
33. కింది వాటిలో సరైంది ఏది?
 ఎ) ద్వీపకల్ప పీఠభూమిలో రెండో ఎత్తైన శిఖరం అనైముడి
 బి) నీలగిరి పర్వతాలలో ఎత్తైన శిఖరం దొడబెట్ట శిఖరం
 సి) వేసవి విడిది కేంద్రమైన ఉదక మండలం నీలగిరి పర్వతాల్లో ఉంది
 1) ఎ, బి 2) బి, సి
 3) ఎ, సి 4) ఎ, బి, సి
34. 'ఏనుగు ఎల్లమ్మ కొండలు' ఏ పర్వత శ్రేణుల్లో భాగంగా విస్తరించి ఉన్నాయి?
 1) పశ్చిమ కనుమలు 2) వింధ్యా పర్వతాలు
 3) తూర్పు కనుమలు 4) ఆరావళి పర్వతాలు
35. కింది వాటిని దక్షిణం నుంచి ఉత్తరానికి అమర్చండి?
 ఎ) పాల్‌ఘాట్ బి) బోర్‌ఘాట్
 సి) థాల్‌ఘాట్
 1) బి, సి, ఎ 2) బి, ఎ, సి
 3) ఎ, బి, సి 4) సి, ఎ, బి
36. జతపరచండి.
 జాబితా-I
 i) మహేంద్రగిరి కొండలు ii) సహ్యాద్రి పర్వతాలు
 iii) షెవరాయ్ పర్వతాలు iv) యాలకుల పర్వతాలు
 జాబితా-II
 a) ఒడిశా b) మహారాష్ట్ర
 c) తమిళనాడు d) కేరళ
 1) i-c, ii-a, iii-d, iv-b
 2) i-b, ii-a, iii-d, iv-c
 3) i-d, ii-a, iii-c, iv-b
 4) i-a, ii-b, iii-c, iv-d
37. కింది వాటిలో సరికానిది ఏది?
 1) పశ్చిమ కనుమలు సుమారు 1600 కి.మీ.ల పొడవున విస్తరించి ఉన్నాయి.
 2) భారతదేశంలో కెల్లా అతిపెద్ద భూస్వరూపం గంగా సింధూ మైదానం
 3) ద్వీపకల్ప పీఠభూమి వాలు తూర్పు దిశగా వాలి ఉంది
 4) ద్వీపకల్ప పీఠభూమి దేశంలో కెల్లా అతిపురాతనమైన భూస్వరూపం
38. అరకాన్‌యోమా పర్వతాలు ఏ దేశంలో విస్తరించి ఉన్నాయి?
 1) భారత్ 2) పాకిస్తాన్
 3) భూటాన్ 4) మయన్మార్
39. కింది వాటిని ఉత్తరం నుంచి దక్షిణానికి అమర్చండి?
 1) సాత్పురా పర్వతాలు, వింధ్య పర్వతాలు, ఆరావళి పర్వతాలు, నీలగిరి పర్వతాలు
 2) వింధ్య పర్వతాలు, సాత్పురా పర్వతాలు, ఆరావళి పర్వతాలు, నీలగిరి పర్వతాలు
 3) ఆరావళి పర్వతాలు, వింధ్య పర్వతాలు, సాత్పురా పర్వతాలు, నీలగిరి పర్వతాలు
 4) నీలగిరి పర్వతాలు, సాత్పుర పర్వతాలు, వింధ్య పర్వతాలు, ఆరావళి పర్వతాలు,
40. కింది వాటిలో సరికాని జత ఏది?
 1) జిందగాడ -పశ్చిమ కనుమలు
 2) జోగ్ జలపాతం- బాబాబుడాన్ కొండలు
 3) కలహట్టి జలపాతం- నీలగిరి పర్వతాలు
 4) కొడై కెనాల్ - ఫళని కొండలు
41. మనదేశంలో భౌగోళికంగా గంగా- సింధూ మైదానం ఎక్కడ విస్తరించి ఉంది?
 1) హిమాచల్ పర్వతాలకు ఉత్తరంగా
 2) శివాలిక్ పర్వతాలకు దక్షిణంగా
 3) ద్వీపకల్ప పీఠభూమికి దక్షిణంగా
 4) హిమాద్రి శ్రేణులకు ఉత్తరంగా

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 3	5) 1
6) 2	7) 2	8) 2	9) 3	10) 4
11) 2	12) 3	13) 2	14) 4	15) 1
16) 1	17) 2	18) 2	19) 4	20) 3
21) 3	22) 1	23) 4	24) 1	25) 3
26) 4	27) 4	28) 3	29) 4	30) 1
31) 4	32) 2	33) 2	34) 3	35) 3
36) 4	37) 2	38) 4	39) 3	40) 1
41) 2				

No healthier than do people exercising

BANK EXAMS

GENERAL ENGLISH



Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Halt an escalation of current tensions (1)/ and preventing mass atrocities from happening in Sudan again will require (2)/ cutting off the goods and services that combatants need (3)/ to perpetrate further violence. (4)/ No error (5)
2. Acquiring material wealth or rejecting its attractions (1)/ has often been (2)/ the base upon which writers (3)/ had developed interesting plots. (4)/ No error (5)
3. Science plays a significant role (1)/ in the origin of superhero stories precisely because (2)/ that stories are really an extension (3)/ of science fiction as a genre. (4)/ No error (5)
4. The article on the subject of Colombian drug lords (1)/ published in The Economist this morning neither alludes nor specifically describes (2)/ the methods that the police employ (3)/ in the fight against crime. (4)/ No error (5)
5. During the alumni meet, (1)/ the old students reflected (2)/ on the time (3)/ they have spent in college. (4)/ No error (5)

Directions (Q.No. 6- 8): Choose the set of words which are closest in meaning to the word provided.

6. Generic
 1) general, basic 2) cheap, vital
 3) fresh, pure 4) elderly, cheaply
 5) standard, novice
7. Educe
 1) demand, stipulate 2) elicit, extract
 3) ideal, idyllic 4) unlawful, illicit
 5) prohibit, proscribe
8. Appall
 1) delirious, rambling
 2) covered, exposed
 3) dismay, consternation
 4) confuse, scandalize
 5) perplex, doubt

Directions (Q.No.9- 10): Choose the set of words which are opposite in meaning from the five options given in each question.

9. 1) rotund, plump 2) brazen, defiant
 3) pique, soothe 4) peaked, ruddy
 5) nadir, apex
10. 1) supercilious, meek
 2) approbate, sanction
 3) demur, hesitate 4) fatuous, foolish
 5) quiescent, repose

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Foods that are rich in salt, likes potato chip, cheese and sauces contain high level of sodium levels that may lead to heart attacks and stroke.
 1) liked potato chip, cheese and sauces
 2) like potato chips, cheese and sauce
 3) like potato chips, cheese and sauces
 4) like potato chip, cheeses and sauce
 5) No correction required
12. Poor reading skills among students of inner-city schools have not resulted from failures in teaching but insufficiently supportive home environments.
 1) resulted not from failures in teaching but from
 2) resulted from failures not in teaching but
 3) resulted from failures not in teaching but have stemmed from
 4) resulted not from failures in teaching but have stemmed from
 5) No correction required
13. In a recent survey, *Physical Fitness Weekly* found that people exercising daily consider themselves no healthier than do people exercising three to five times a week.
 1) not any healthier than do people exercising
 2) not any healthier than do people who exercise
 3) no healthier than are people who are exercising
 4) not as healthy as are people who exercise
 5) No correction required
14. Many people discover a need for glasses in middle age, a consequence from sitting too close to the television screen for long periods of time.
 1) of sitting too close
 2) which resulted from sitting too close
 3) damaged from sitting too near
 4) damaged because they sat too close to
 5) No correction required
15. At one stage it appeared as if Indians will lost the match against Hongkong.
 1) will be losing the match
 2) will lost a match
 3) would lose the match
 4) would be losing the match
 5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Shortages of canned food in the British Army in 1917 led to the government issuing cigarettes and amphetamines to soldiers to suppress their appetites.
B) But by 1916, widespread boredom with cheap canned food amongst soldiers resulted in militaries purchasing better-quality food to improve morale and the complete meals in a can began to appear.
C) Demand for canned food skyrocketed during World War I, as military commanders sought vast quantities of cheap, high-calorie food to feed their millions of soldiers, which could be transported safely, survive trench conditions, and not spoil in transport.
D) After the war, companies that had supplied military canned food improved the quality of their goods for civilian sale.
E) Throughout the war, soldiers generally subsisted on low-quality canned foodstuffs, such as the British "Bully Beef" (cheap corned beef), pork and beans, canned sausages, and Maconochies Irish Stew.
F) In 1917, the French Army began issuing canned French cuisine, such as coq au vin, Beef Bourguignon and Vichyssoise while the Italian Army experimented with canned ravioli, spaghetti bolognese, Minestrone and Pasta e fagioli.

16. What is the FOURTH sentence after rearrangement?
 1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
 1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
 1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
 1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
 1) A 2) B 3) C
 4) D 5) F

Directions (Q.No. 21-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Residents can donate clothes, household items and other goods to the ____ store. The store then sells them and donates the amount to ____.
 1) Thrift, charities
 2) waft, aid 3) fluster, gifts
 4) heterogeneous, relievers
 5) assorted, donations
22. Everything about S. Russell Groves is just so, from his style of dress to his choice of words; nothing is ____.
 1) Lumber 2) superfluous
 3) garner 4) renovate
 5) encumber
23. The MLA was charged with criminal attempt to ____ a minor and criminal attempt to ____ the morals of a minor on Thursday.
 1) Entice, impair
 2) ambidextrous, blight
 3) ostentation, prejudice
 4) qualm, weaken 5) worse, impeach
24. In order to consistently prevail you must be agreeable, amenable, and ____. These characteristics make it possible to gain trust, show compromise, and ____ deals.
 1) Contrite, reform
 2) malleable, restructure
 3) frenetic, simplify
 4) impugned, adjust 5) remorseful, sort
25. There is a buzz about the sudden death of one of the artists, which cast a ____ on the opening ceremonies, ____, briefly.
 1) Attraction, though
 2) wither, although 3) pall, albeit
 4) gloom, notwithstanding
 5) shadow, almost

Directions (Q.No. 26-35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Cloud seeding is a type of weather modification that ____ (26) to change the amount or type of precipitation that falls from clouds by dispersing substances ____(27) the air that serve as cloud condensation or ice nuclei, which alter the microphysical processes within the cloud. The usual intent is to increase precipitation (rain or snow), but hail and fog suppression ____ (28) also widely practiced in airports, where harsh weather conditions are experienced. Cloud seeding over Kosciuszko National Park-a biosphere reserve-is problematic in that several rapid changes of environmental legislation ____ (29) made to enable the trial. Environmentalists are concerned ____ (30) the uptake of elemental silver in a highly sensitive environment affecting the pygmy possum ____(31) other species as well as recent high level algal blooms in ____(32) pristine glacial lakes. Research 50 years ____(33) and analysis by the former Snowy Mountains Authority led to the cessation of the cloud seeding program in the 1950s with non-definitive results. Formerly, cloud seeding was rejected in Australia on environmental grounds ____ (34) of concerns about the protected species, the pygmy possum. Since silver iodide and not elemental silver is the cloud seeding material, the claims of negative environmental impact are disputed ____ (35) peer-reviewed research as summarized by the international Weather Modification Association.

26. 1) aim 2) aimed 3) aims
 4) was aimed 5) is aimed
27. 1) into 2) in 3) on
 4) along 5) among
28. 1) has 2) was 3) are
 4) is 5) had
29. 1) was 2) were 3) being
 4) been 5) has been
30. 1) during 2) from 3) for
 4) about 5) into
31. 1) through 2) between 3) along
 4) of course 5) among
32. 1) ones 2) once 3) prior
 4) farmer 5) early
33. 1) ahead 2) after 3) former
 4) ago 5) pristine
34. 1) because 2) as 3) when
 4) while 5) though
35. 1) with 2) from 3) froth
 4) for 5) by

KEY

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 1	7) 2	8) 3	9) 3	10) 1
11) 3	12) 2	13) 5	14) 1	15) 3
16) 5	17) 2	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 1	24) 2	25) 3
26) 3	27) 1	28) 3	29) 2	30) 4
31) 5	32) 2	33) 4	34) 1	35) 5